అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

ఆదివారం 19-05-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 139 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు + వెబ్‌లో (సోపతి) వెల : 8.00

ఈసీ అనుమతిస్తే సరే.. లేకుంటే

మంత్రులతో ఢిల్లీకి

క్యాబినెట్ భేటీపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక నిర్ణయం

- అనుమతి కోసం రాత్రి వరకు నిరీక్షణ
- నిరాకరణతో మంత్రివర్గ సమావేశం రద్దు
- సోమవారం వరకు వేచిచూద్దాం...

రాష్ట్ర మంత్రి వర్గ సమావేశానికి సోమవారంలోగా ఈసీ అనుమతిస్తే ఓకే... లేదంటే ఢిల్లీకి వెళ్లి ఎన్నికల సంఘాన్ని కలవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో గత రెండు నెలలుగా రాష్ట్రంలో పేరుకుపోయిన సమస్యలపై శనివారం నిర్వహించ తలపెట్టిన క్యాబినెట్ భేటీకి ఈసీ అనుమతి నిరాకరించింది. ఈ నేపథ్యంలో సీఎం కీలక వ్యాఖ్యలు చేశారు. రెండు రోజుల క్రితమే మంత్రివర్గ సమావేశంపై నిర్ణయం తీసుకుని ఎన్నికల సంఘం అనుమతి కోరినప్పటికి శనివారం రాత్రి 7 గంటల వరకు ఈసీ నుంచి ఎలాంటి అనుమతి రాలేదు.

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర మంత్రి వర్గ సమావేశాన్ని రద్దు చేశారు. ఏ క్షణమైనా ఈసీ నుంచి అనుమతి వస్తుందని మంత్రులందరూ శనివారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు సచివాలయంలోనే వేచి చూశారు. ఆ పర్మిషన్ రాకపోవడంతో సీఎం, మంత్రులతో పాటు సీఎస్ వెనుదిరిగి వెళ్లారు. నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ ఈ నెల 27న ఉండటంతోనే ఎన్నికల సంఘం క్యాబినేట్ భేటీకి అనుమతి నిరాకరించినట్టు తెలుస్తోంది.

రైతులు, ఇతరుల్లో నిరాశ ....

రాష్ట్ర మంత్రివర్గ భేటీ రద్దు కావడంతో ఆ సమావేశంపై గంపెడాశలు పెట్టుకున్న రైతులు, ఇతర వర్గాలు నిరాశకు గురయ్యారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో సంక్షేమ పథకాలు ఆగిపోయాయనీ, క్షేత్ర స్థాయిలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ పలుమార్లు సర్కార్‌పై విమర్శలు గుప్పించింది. రాజకీయాలు పక్కన పెట్టి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేసింది. ఇచ్చిన మాట ప్రకారం ఆగస్టులోపు వెంటనే రూ.2లక్షల రైతు రుణమాఫీ చేయడంతో పాటు వారి సమస్యలను పరిష్కరించేందుకు క్యాబినెట్ సమావేశం ఏర్పాటు చేయాలని బీజేపీ నేతలు సీఎంను కలిసి విన్నవించారు. ఈ నేపథ్యంలో రైతు రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్లు, ఖరీఫ్ పంటల ప్రణాళికకు సంబంధించిన పలు కీలకమైన విషయాలపై ఈ భేటీలో చర్చించాలని ప్రభుత్వం ఎజెండా సిద్ధం చేసింది. అందుకు సంబంధించిన నిధుల సమీకరణతో పాటు విభజన చట్టంలో కొలిక్కిరాని సమస్యలపై చర్చించాలని సీఎం నిర్ణయించారు. రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం హైదరాబాద్ ఉమ్మడి రాజధాని గడువు సైతం ముగియనుంది. వివిధ కార్పొరేషన్లు, సంస్థల విభజన వ్యవహారం ఇరు రాష్ట్రాల మధ్య ఇంకా కొలిక్కి రాలేదు. విభజన చట్టం 9, 10వ షెడ్యూల్‌లలోని పలు అంశాలపై ఇరు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. ఉమ్మడి ఏపీలో దాదాపు 91 కార్పొరేషన్లుండగా, ఆర్టీసీ, ఎస్ఎఫ్‌సీ వంటి 23 కార్పొరేషన్ల ఆస్తుల పంపకం ఎటూ తేలలేదు. పదో షెడ్యూల్‌లో మొత్తం 142 సంస్థలుండగా, తెలుగు అకడమీ లాంటి 30 సంస్థలపై ఇరు రాష్ట్రాల మధ్య

...5లో



ఎన్డీఎస్ఏ రిపోర్టులో ఏముంది ?

5లో..

- సీఎం రేవంత్ ఆరా
- మరోసారి బ్యారేజీలు చూద్దాం



మోడీ కాకమ్మ కథలు

విజయానికి పది కారణాలంటూ మభ్యపెట్టే యత్నం

ఆ కట్టు కథలతోనే ఓట్ల అభ్యర్థన

సుదీర్ఘంగా సాగుతున్న సార్వత్రిక ఎన్నికల సమరం జూన్ 1వ తేదీతో ముగిసిపోతుంది. విజేతలెవరో, పరాజితులెవరో 4న తేలిపోతుంది. ప్రధాని నరేంద్ర మోడీ ప్రతి రోజూ పలు ఎన్నికల ప్రచార సభల్లో ప్రసంగిస్తూ బీజేపీకి ముచ్చటగా మూడోసారి ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థిస్తున్నారు. తమ పార్టీకి ఎందుకు ఓటేయాలో వివరిస్తూ పది కారణాలు చూపుతున్నారు. అయితే ఆయన చూపుతున్న కారణాల్లో వాస్తవమెంత అనేది పరిశీలిస్తే వాటిలో డొల్లతనం బయటపడుతుంది. ఆయన చెప్పేవన్నీ కాకమ్మ కథలేనని తేలిపోతుంది.

మరి నాటి సంగతేమిటి?

న్యూఢిల్లీ : దేశంలోని 80 కోట్ల మంది ప్రజలకు మరో ఐదు సంవత్సరాల పాటు నెలకు ఐదు కిలోల చొప్పున ఉచిత రేషన్ అందిస్తామని, కాబట్టి బీజేపీకి ఓటేయాలని మోడీ ప్రజలను కోరారు. ప్రధాని మాటల ప్రకారం దేశంలోని 140 కోట్ల మంది ప్రజల్లో 80 కోట్ల మంది...అంటే ప్రతి ఏడుగురిలో నలుగురు రోజుకు రెండు పూటలా తిండి లేక ఉచిత రేషన్‌పై ఆధారపడాల్సి వస్తోంది. రేషన్ పంపిణీని కొనసాగిస్తామని మాత్రమే మోడీ హామీ ఇచ్చారు కానీ కార్మికుల వేతనాల పెంపు, పంటలకు కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత, యువతకు ఉద్యోగాలు వంటి కీలక అంశాలపై ఎలాంటి ప్రకటనలు చేయలేదు.

ఈ సమస్యల మాటేమిటి?

భారత్‌ను ప్రపంచంలో మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుస్తానని మోడీ చెబుతున్నారు. అయితే మన దేశం ఇప్పటికే ఐదవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతోంది. కానీ అధిక ధరలు, నిరుద్యోగం కలవరపెడుతున్నాయి. ప్రభుత్వ రుణభారం పెరిగింది. ప్రైవేటు పెట్టుబడులు పెరగడం లేదు. కుటుంబ అప్పులు గరిష్ఠ స్థాయికి చేరుకోగా పొదుపు ఐదు దశాబ్దాల్లో కనిష్ఠ స్థాయికి దిగజారింది. రూపాయి మారకం విలువ పడిపోతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆర్థిక అసమానతలు పెరిగిపోయాయి. దేశంలో 21 మంది అత్యంత సంపన్నులైన వ్యక్తుల చేతిలో 70 కోట్ల పేద ప్రజల సంపద ఉంది.

చౌకీదార్ అంటే అదేనా?

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తుందని, రిజర్వేషన్లను తొలగించి ముస్లింలకు ఇస్తుందని, అందుకే బీజేపీకి ఓటు వేయాలని ప్రధాని కోరారు. దేశానికి చౌకీదార్‌గా ఉంటానని కూడా ఆయన

...13లో

కాంగ్రెస్ ఆ మాటే చెప్పలేదు

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రజల ఆస్తులు స్వాధీనం చేసుకొని ముస్లిం మైనారిటీలకు ఇస్తుందని, భారత క్రికెట్ జట్టును ముస్లింలతో నింపేస్తుందని, అందుకే బీజేపీకి ఓటేయాలని మోడీ అంటున్నారు. ఇవన్నీ కాకమ్మ కథలే. ప్రజల సంపదను పంపిణీ చేస్తానని కాంగ్రెస్ ఎక్కడా చెప్పలేదు. మతం, ప్రాంతం ఏదైనా భారతీయులందరూ ఒక్కటే. దేశంలో అందరికీ సమాన హక్కులు ఉంటాయి. రాజ్యాంగం అదే చెబుతోంది.



ఆస్తి కోసం తల్లీ, ఇద్దరు కూతుళ్ల హత్య

పరారీలో నిందితుడు

నవతెలంగాణ-తల్లాడ

ఖమ్మం జిల్లా తల్లాడ మండలం గోపాలపేట గ్రామంలో దారుణం జరిగింది. ఓ తండ్రి ఆస్తి కోసం కన్న తల్లిని, తన ఇద్దరు కూతుళ్లను కడతేర్చాడు. ఈ ఘటన శనివారం తెల్లవారుజామున జరిగింది. బంధువులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పిట్టల వెంకటేశ్వర్లుకు 11 ఏండ్ల కిందట దుర్గతో వివాహం జరిగింది. వీరికి నీరజ(10), ఝాన్సీ(6) ఇద్దరమ్మాయి లున్నారు. వెంకటేశ్వర్లు తల్లి పిచ్చమ్మ(60) కూడా వీరితోనే కలిసుంటారు. రెండేండ్ల కిందట దుర్గ చనిపోయింది. దుర్గను వెంకటేశ్వర్లే హత్య చేశాడని ఆరోపణలు ఉన్నాయి. అయినా.. మనమరాళ్ల

13లో..

ఎప్‌సెట్ టాపర్లు అబ్బాయిలే

- ఏపీ విద్యార్థులకే టాప్ ర్యాంకులు
- ఉత్తీర్ణతలో అమ్మాయిలదే ఆధిక్యం
- ఇంజినీరింగ్‌లో జ్యోతిరాధిత్య, అగ్రికల్చర్‌లో ప్రణీత ప్రథమం
- ఇంజినీరింగ్‌లో 74.98 శాతం, అగ్రికల్చర్‌లో 89.67 శాతం అర్హత
- ఫలితాలు విడుదల చేసిన విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం
- వారం రోజుల్లో ఇంజినీరింగ్ ప్రవేశాల షెడ్యూల్



ఇంజినీరింగ్ విభాగం: జ్యోతిరాధిత్య (1) గొల్లలేఖ హర్ష (2) రిషిశేఖర్ శుక్లా (3)

అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం: అలూర్ ప్రణీత (1) రాధాకృష్ణ (2) గడ్డం శ్రీవర్షిణీ (3)

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఎప్‌సెట్ (ఎంసెట్) రాతపరీక్షల ఫలితాలను విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం శనివారం హైదరా బాద్‌లోని జేఎన్టీయూలో విడుదల చేశారు. ఎప్‌సెట్ ఫలితాల్లో అబ్బాయిలే టాప్ ర్యాంకులను సాధించారు. టాప్ టెన్ ర్యాంకుల్లో ఇంజినీరింగ్ విభాగంలో తొమ్మిది మంది అబ్బాయిలు, ఒకరు అమ్మాయి, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో ఏడుగురు అబ్బాయి లుంటే, ముగ్గురు అమ్మాయిలు ఉన్నారు.

టాప్ ర్యాంకర్లలో ఏపీ విద్యార్థులు సత్తా చాటారు. ఇంజినీ రింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాల్లో ఏపీ, తెలంగాణ అభ్యర్థులు ఐదుగురు చొప్పున ర్యాంకులు సాధించారు. ఎప్‌సెట్ ఉత్తీర్ణతలో అమ్మాయిలు ఆధిక్యతను ప్రదర్శించారు. అటు ఇంజి నీరింగ్, ఇటు అగ్రికల్చర్, ఫార్మసీ విభాగా ల్లోనూ ఎక్కువ మంది అమ్మాయిలే అర్హత సాధించడం గమనార్హం. ఇంజినీరింగ్ విభాగానికి 2,54,750 మంది దరఖాస్తు చేస్తే, 2,40,618 మంది పరీక్ష రాశారు. వారిలో 1,80,424 (74.98 శాతం) మంది అర్హత సాధించారు. ఇందులో 1,03, 962 మంది అమ్మాయిలు దరఖాస్తు చేయగా, 97,902 మంది పరీక్షకు హాజరయ్యారు. వారిలో

...6లో

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో

కాంగ్రెస్‌కు మద్దతు

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నల్లగొండ, వరంగల్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి జరగనున్న శాసనమండలి ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతివ్వాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. ఈ మేరకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో లౌకిక విలువలు, ప్రజాస్వామ్యం కోసం ఇండియా కూటమి భాగస్వామి అయిన కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చామని గుర్తు చేశారు. అదేవిధంగా ఇప్పుడు కూడా బీజేపీని ఓడించటం కోసం ఇండియా కూటమిలో భాగస్వామి అయిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మద్దతు ప్రకటిస్తున్నామని తెలిపారు. పట్టభద్రులైన ఓటర్లు కాంగ్రెస్ అభ్యర్థికి ఓటేసి గెలిపించాలనీ, బీజేపీని ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు.



మామా అల్లుళ్ల అరెస్ట్

భూవివాదంలో మాజీమంత్రి, ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి

- జీడిమెట్ల డివిజన్‌లో రెండెకరాల భూమి తమదేనంటూ ఆందోళన..
- ఫెన్సింగ్ తొలగింపు
- ఇరు గ్రూపుల తగాదా

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జీడిమెట్ల డివిజన్‌లో భూ వివాదంలో మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సీహెచ్.మల్లారెడ్డి, ఆయన అల్లుడు, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని శనివారం పోలీసులు అరెస్టు చేశారు. ఆ భూమి తమదే నంటూ సుచిత్ర సర్కిల్ వద్ద వారు ఆందోళన చేపట్టి ఫెన్సింగ్‌లను తొలగించడంతో వివాదం

...13లో

నోట్లు..డ్రగ్స్..ఆభరణాలతో వల

గుజరాత్‌లో అత్యధిక ప్రలోభాలు

- ఎన్నికల ప్రచారాల్లో కరెన్సీ ప్రవాహం
- తనిఖీల్లో.. రూ.8,889 కోట్లు స్వాధీనం: ఈసీ



గుజరాత్‌లో అత్యధికం..

అత్యధికంగా గుజరాత్‌లో రూ.1,461.73 కోట్ల విలువైన ప్రలోభాలకు సంబంధించిన సొమ్మును స్వాధీనం చేసుకున్నట్టు ఈసీ నివేదికలో వెల్లడైంది. రాజస్థాన్‌లో రూ.1133.82 కోట్లు, పంజాబ్‌లో రూ.734.54 కోట్లు, రెండూ మూడు స్థానాల్లో ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లో చూసుకుంటే ఆంధ్రప్రదేశ్‌లో రూ.301.75 కోట్లు, తెలంగాణలో రూ.333.55 కోట్ల సొత్తు జప్తు చేసింది.

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలలో ఎన్నడూలేని విధంగా ఆయా పార్టీలు నోట్లు.. డ్రగ్స్.. ఆభరణాలను గుమ్మరించాయి. ఓటర్లను ఆకట్టుకునేందుకు దేశవ్యాప్తంగా పెద్దఎత్తున ప్రలోభాల పర్వం సాగుతున్నట్టు తెలుస్తోంది. సార్వత్రిక ఎన్నికల క్రమంలో నాలుగు విడతల్లో పోలింగ్ జరగ్గా.. ఇప్పటివరకు చేపట్టిన తనిఖీల్లో రూ.8,889 కోట్ల మేర విలువైన నగదు, మాదక ద్రవ్యాలు, ఇతర తాయిలాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎన్నికల సంఘం ప్రకటించింది. జప్తు చేసిన సొత్తులో మాదక ద్రవ్యాలదే 45 శాతం వాటా అని, రూ.3,958 కోట్ల మేర డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించింది. స్వాధీనం చేసుకున్న

...13లో



కిర్గిజ్‌లో మూకదాడులు

- ఆ దేశ రాజధానిలో విదేశీ విద్యార్థులే టార్గెట్
- అప్రమత్తంగా ఉండండి : భారత ఎంబసీ ఆదేశాలు

బిష్కేక్ : కిర్గిస్తాన్ రాజధాని బిష్కేక్‌లో విదేశీ విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని అల్లరి మూక హింసాత్మక చర్యలకు పాల్పడుతోందని వార్తలు వస్తున్న నేపథ్యంలో బిష్కేక్‌లో జరుగుతున్న సంఘటనల వివరాలను పేర్కొంటూ కిర్గిస్తాన్ అంతర్గత వ్యవహారాల శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ నెల 13వ తేదీన తెల్లవారుజాము 2గంటల సమయంలో బిష్కేక్‌లోని పిజారియా సమీపంలో కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు విదేశీ విద్యార్థులతో తలపడ్డారు. సిగరెట్లు కావాలని ఆ గ్రూపు అడగడం, ఆ ప్రాంతంలో పొగ తాగరాదంటూ విద్యా ర్థులు అనడంతో ఘర్షణ మొదలైంది. వారిలో

13లో..

మీ ఆఫీస్‌కు వస్తాం.. జైల్లో పెట్టండి

బీజేపీపై కేజ్రీవాల్ ఆగ్రహం



న్యూఢిల్లీ : ప్రతిపక్ష నేతలను అణగతొక్కేయడమే బీజేపీ లక్ష్యంగా పెట్టుకుందని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ విమర్శించారు. బీజేపీ బెదిరింపులకు ఆమ్ ఆద్మీ పార్టీ లొంగకపోవడంతో కక్ష సాధింపు చర్యలకు

...13లో

ముగిసిన ఐదో విడత ప్రచారం

- రేపే పోలింగ్
- 49 నియోజకవర్గాలు, 695 మంది అభ్యర్థులు
- రాహుల్‌గాంధీ, రాజ్‌నాథ్, స్మృతి ఇరానీ పోటీ



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభ ఎన్నికల ఐదో విడత ప్రచార పర్వం శనివారం సాయంత్రం 5 గంటలకు ముగిసింది. ఎనిమిది రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుండి 49 నియోజకవర్గాలకు రేపు (సోమవారం)

...3లో

నేడు పుచ్చలపల్లి సుందరయ్య 39వ స్మారకోపన్యాసం

ముఖ్య వక్తగా సుప్రీంకోర్టు అడ్వకేట్ డాక్టర్ ఎస్ మురళీధర్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కమ్యూనిస్టు అగ్ర నాయకుడు, తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, నిష్కళంక దేశభక్తుడు పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో స్మారకోపన్యాసాన్ని నిర్వహిస్తున్నారు. సాయంత్రం 5గంటలకు బాగ్‌లింగంపల్లిలోని ఎస్వీకేలో...

13లో

పెండింగ్ బిల్లులను చెల్లించాలి

- ఉప ముఖ్యమంత్రి భట్టికి టీఎన్జీవో నేతల వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ఉద్యోగులు, పెన్షనర్ల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలనీ, డీఏలను విడుదల చేయాలనీ, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని టీఎన్జీవో డిమాండ్ చేసింది. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కను శనివారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్, అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కె లక్ష్మణ్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ముజీబ్, నగరశాఖ ఉపాధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, హైదరాబాద్ ఉపాధ్యక్షుడు శంకర్ తదితరులు కలిసి వినతిపత్రం సమర్పించారు. త్వరలోనే ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామనీ, ఉద్యోగ సంఘాలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించి అన్ని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఉప ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని తెలిపారు.

కావాల్సింది ప్రశ్నించే గొంతుకలు

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాకేశ్‌రెడ్డికే ఓటేయండి : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇప్పుడు తెలంగాణకు కావాల్సింది అధికార స్వరాలు, ధిక్కార స్వరాలు కాదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతుకలే మనకు ఇప్పుడు కావాలని ఆయన సూచించారు, నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఈనెల 27న జరగబోతున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికే ఓటేసి గెలిపించాలని శనివారం 'ఎక్స్' వేదికగా పిలుపునిచ్చారు. యువకుడు, ఉన్నత విద్యావంతుడు, ప్రశ్నించేతత్వం, విషయ పరిజ్ఞానం ఉన్న రాకేశ్‌రెడ్డిని మండలికి పంపితే ఎమ్మెల్సీగా పట్టభద్రుల గొంతుకను చట్టసభల్లో వినిపిస్తారని పేర్కొన్నారు.

తడిసిన ధాన్యం మొత్తాన్ని కొనాలి

- బోయినపల్లి వినోద్‌కుమార్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అకాల వర్షాల వల్ల కల్లాల్లో, మార్కెట్ యార్డుల్లో తడిసిన ధాన్యం మొత్తాన్ని కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... అన్ని రకాల ధాన్యానికీ రూ.500 బోనస్‌ను ఇవ్వాలని కోరారు. రైతులు దుక్కి దున్నేటప్పుడే పెట్టుబడి సాయాన్ని అందించాలనీ, జూన్ మొదటి వారంలోనే ఎకరాకు రూ.7,500 ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

గ్లోబల్ టెండర్ల పేరిట అక్రమాలు : పెద్ది సుదర్శన్‌రెడ్డి

పౌర సరఫరాల శాఖలో గ్లోబల్ టెండర్ల పేరిట అక్రమాలు జరుగుతున్నాయని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... టెండర్లలో కాంగ్రెస్ నేతల చేతివాటం స్పష్టంగా కనబడుతోందని అన్నారు. పేరుకుపోయిన ధాన్యాన్ని వేలం వేయటానికి పిలిచిన టెండర్లు, వాటి తాలూకూ అక్రమాలతో సీఎంకు, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ప్రత్యక్ష సంబంధముందని ఆరోపించారు. మధ్యాహ్న భోజనానికి వాడే సన్నబియ్యం టెండర్లలోనూ అధికార పార్టీ నేతలు తమ చేతి వాటాన్ని ప్రదర్శించారని విమర్శించారు. ఈ రకంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.330 కోట్లను నష్టపోయిందని చెప్పారు. ఇందుకు సంబంధించి సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఫిర్యాదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

తడిచిన ప్రతి గింజనూ కొంటాం

- మంత్రి సీతక్క

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తడిచిన ప్రతీ గింజనూ రాష్ట్ర ప్రభుత్వం కొంటుందని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క వెల్లడించారు. అందువల్ల రైతులు ఆందోళన చెందవద్దని విజ్ఞప్తి చేశారు. గత మూడు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కల్లాల్లోని ప్రతి ధాన్యపు గింజను మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు.రాయబరేలీ ఎన్నికల ప్రచారంలో ఉన్న సీతక్క...శనివారం ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో కురుస్తున్న వర్షాల పరిస్థితులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు భరోసానిచ్చే విధంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకే కొనుగోలు చేయాలని సూచించారు. అలాగే ఇక నుంచి పంటలకు ప్రభుత్వమే బీమా ప్రీమియం చెల్లిస్తుందని పేర్కొన్నారు.

బిల్లులు చెల్లించే వరకు పనులు చెయ్యం

- జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్ల నిర్ణయం



నవతెలంగాణ-సిటీబ్యూరో

వెయ్యి కోట్ల పెండింగ్ బిల్లులు చెల్లించే వరకు పనులను నిలిపివే స్తున్నట్టు జీఎచ్ఎంసీ కాంట్రా క్టర్లు ప్రకటించారు. శనివారం హైదరాబా ద్‌లోని బల్దియా ప్రధాన కార్యాల యంలోని కాంట్రాక్టర్స్ యూనియన్ కార్యాలయం ముందు జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్లు ప్రత్యేకం గా సమావే శమయ్యారు. గురువారం అబిడ్స్‌లోని సర్కిల్-14 కార్యాల యంలో ఇరుగదిండ్ల రాము అనే కాంట్రాక్టర్ గుండెపోటు తో మృతిచెందిన విషయం తెలిసిందే. సంవత్సర కాలంగా పెండింగ్ బిల్లులు రాకపోవడంతోనే ఆర్థిక ఇబ్బందుల ఒత్తిడి కారణంగా రాము గుండెపోటుకు గురై మరణించాడని తోటి కాంట్రాక్టర్లు అభిప్రాయ పడ్డారు. ఈ క్రమంలోనే జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్లు పోరు బాటపట్టారు. ఈ ఏడాది మార్చి వరకు ఉన్న పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. బకాయిలు చెల్లిస్తేనే పనులు చేస్తామని, కొత్తగా వచ్చే ఏ పనులనూ చేపట్టబోమని తేల్చి చెప్పారు.

ఇప్పటికే పూర్తి చేసిన పనులకు సంబం ధించి 2023 ఏప్రిల్ నుంచి రూ.1,350 కోట్ల బిల్లులు రావాల్సి ఉందని, వాటిని వెంటనే ప్రభుత్వం రిలీజ్ చేయాలని జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్స్ అసోసి యేషన్ అధ్యక్షులు ఏ.రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.సురేందర్ సింగ్‌తోపాటు ప్రతినిధులు డిమాండ్ చేశారు. బల్దియా పెండింగ్ బిల్లులను చెల్లించకపో వడంతోనే కాంట్రాక్టర్లు అప్పులపాలవుతున్నారని, ఆ ఒత్తిడి తట్టుకో లేక గుండెపో టుకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త పనులకు టెండర్లు వేయొ ద్దని, ముఖ్యంగా మాన్సూన్ పనులకు టెండర్లు వేయొద్దని అసోసి యేషన్ నిర్ణయించింది. ఈ సమావేశంలో గ్రేటర్ హైదరాబాద్‌లోని జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్లు పెద్దఎత్తున పాల్గొన్నారు.

స్మృతి ఇరానీకి ఎదురుగాలి తప్పదా?

- బీజేపీకి ఓట్లు వేయబోమని క్షత్రియ సామాజిక వర్గం ప్రతిజ్ఞ



నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

ఉత్తరప్రదేశ్‌లోని అమేథీ లోక్‌సభకు సోమవారం పోలింగ్ జరగనుంది. ఐదో దశ పోలింగ్ జరగబోయే 14 నియోజకవర్గాల్లో అమేథీ ఒకటి. ఇక్కడ నుంచి బీజేపీ తరఫున కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ పోటీ చేయగా, ఇండియా ఫోరం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి కెఎల్ శర్మ పోటీ చేస్తున్నారు. అయితే గత ఎన్నికల్లో సునాయాసంగా గెలిచిన స్మృతి ఇరానీకి, ఈసారి ఎదురుగాలి తప్పదనిపిస్తోంది. లోక్‌సభ ఎన్నికల సమయంలో బీజేపీ పట్ల క్షత్రియ సామాజికవర్గం అసంతృప్తి వ్యక్తం చేయడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

బీజేపీ మహిళానేత స్మృతి ఇరానీపై వివిధ వర్గాలు ఆగ్రహంతో ఉన్నాయా? అంటే అవుననే సమాధానమే విశ్లేషకుల నుంచి వినిపిస్తోంది. అమేథీలో స్మృతి ఇరానీకి వ్యతిరేకంగా క్షత్రియ సామాజిక వర్గానికి చెందినవారు ఇటీవల పలు చోట్ల ఆందోళనలు చేపట్టారు. ఈసారి బీజేపీకి ఓటేయబోమని ప్రతిజ్ఞ కూడా చేశారు. ఇంతకీ వీరు స్మృతి ఇరానీపై ఎందుకు ఆగ్రహంతో ఉన్నారు?

కొంతకాలం క్రితం కాంగ్రెస్ నేత దీపక్‌సింగ్‌పై అక్రమంగా కేసు పెట్టడంపై వీరంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే బీజేపీలో తమ సామాజికవర్గానికి ప్రాధాన్యత తగ్గుతున్నదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కర్ణిసేన జాతీయ అధ్యక్షుడు మహిపాల్ సింగ్ మాట్లాడుతూ బీజేపీ లోక్‌సభ ఎన్నికల అభ్యర్థులు మహిళలను అవమానిస్తున్నారని, బీజేపీ అధినేత, అగ్రనాయకత్వం కూడా పెదవి విప్పడం లేదని అన్నారు. బీజేపీకి చెందిన ప్రతీ నాయకుడిని వ్యతిరేకిస్తామని, వారికి ఓటేయబోమని స్పష్టం చేశారు. మహిళలను గౌరవించని ఏ పార్టీనైనా వ్యతిరేకిస్తామన్నారు. దీనికి ఉదాహరణగా ఆయన మహా భారత కాలంలో ద్రౌపది అపహరణను ఉదహరిస్తూ.. ద్రౌపదిని అవమానించనప్పుడు కొంతమంది మౌనంగా కూర్చున్నారని, వారంతా ఆ తరువాత బాధపడాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ఈసారి దేశవ్యాప్తంగా రాజ్‌పుత్‌లు సమాజానికి చెందినవారెవరూ బీజేపీకి ఓటు వేయరని తెలిపారు. బీజేపీ రాజ్‌పుత్ వర్గాలను కూలీలుగా మార్చిందని ఆరోపించారు.

స్మృతి ఇరానీని ఉద్దేశించి మహిపాల్ సింగ్ మాట్లాడుతూ మహిళా ఎంపీగా మహిళల గౌరవం గురించి ఎప్పుడూ మాట్లాడలేదని, పార్లమెంట్‌లో మహిళల సమస్యలను లేవనెత్తలేదని, అలాంటప్పుడు మహిళల గౌరవ కోసం పోరాడుతున్నామని చెప్పే హక్కు ఆమెకు లేదన్నారు. యోగి ఆదిత్య నాథ్‌ను కట్టడి చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని, వసుంధరా రాజేను తొలగించారని, మధ్యప్రదేశ్ సీఎం పదవి నుంచి శివరాజ్‌సింగ్ చౌహాన్‌నూ తొలగించారని, హర్యానాలో మనోహర్‌లాల్ ఖట్టర్‌ను కూడా తొలగించారని, రమణ్‌సింగ్ పరిస్థితి ఏమిటో అందరికీ తెలిసిందేనన్నారు. బీజేపీలో క్షత్రియ సామాజిక వర్గం స్థాయి తగ్గుతోందని, బీజేపీకి మంచి చేసిన రాజ్‌నాథ్ సింగ్ ఆ పార్టీ పక్కన పెట్టిందని అన్నారు. బీజేపీలో క్షత్రియ సామాజికవర్గం స్థాయి తగ్గుతోందన డానికి ఇలాంటి ఉదాహరణలు చాలా ఉన్నాయన్నారు. అందుకే కర్ణిసేన సామాజిక వర్గం వారంతా బీజేపీని వ్యతిరేకిస్తున్నారని అన్నారు.



గౌహతిలో ఆహార పదార్థాలు, మందులు, ఇంధనం ఇతర వస్తువుల ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా సీపీఐ(ఎం) కార్యకర్తలు నిరసన

ముగిసిన ఐదో విడత ప్రచారం

(మొదటి పేజీ తరువాయి)

పోలింగ్ జరుగనుంది. మొత్తంగా 695 మంది అభ్యర్థులు ఉన్నారు. వీరిలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ, మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాతో సహా పలువురు ప్రముఖులున్నారు.

ఉత్తరప్రదేశ్‌లోని లక్నో లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ తరుపున రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పోటీ చేయగా, ఎస్పీ రవిదాస్ మెహ్రోత్రాను అభ్యర్థిగా నిలబెట్టింది. మంత్రిగా పనిచేసిన మెహ్రోత్రా ప్రస్తుతం లక్నో సెంట్రల్ అసెంబ్లీ స్థానం నుంచి ఎస్పీ ఎమ్మెల్యేగా ఉన్నారు. బీఎస్పీ తన అభ్యర్థిగా సర్వర్ మాలిక్‌ను ఎంపిక చేసింది. ఉత్తరప్రదేశ్‌లో అత్యంత చర్చనీయాంశమైన స్థానాల్లో రాయ్‌బరేలీ లోక్‌సభ స్థానం ఒకటి. 2019లో రాష్ట్రంలో కాంగ్రెస్ గెలిచిన ఏకైక సీటు ఇదే. అప్పుడు సోనియా గాంధీ ఇక్కడి నుంచి గెలిచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. ప్రస్తుతం కాంగ్రెస్ రాయ్ బరేలీ నుంచి రాహుల్ గాంధీని పోటీకి దింపింది. బీజేపీ దినేష్ ప్రతాప్ సింగ్‌ను అభ్యర్థిగా ప్రకటించింది. ఎమ్మెల్సీ దినేష్ ప్రతాప్ ప్రస్తుతం యోగి ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నారు. కేంద్ర మంత్రి, ప్రస్తుత అమేథీ ఎంపీ స్మృతి ఇరానీ మరోసారి ఇక్కడ నుంచి బీజేపీ టికెట్‌పై పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ తన అభ్యర్థిగా గాంధీ కుటుంబానికి సన్నిహితుడైన కెఎల్ శర్మను బరిలోకి దింపింది. బీఎస్పీ నాన్హే సింగ్ చౌహాన్‌ను తన అభ్యర్థిగా దింపింది.

బీహార్‌లోని హాజీపూర్ లోక్‌సభ స్థానం ఈ ఎన్నికల్లో అత్యంత ప్రజాదరణ పొందిన స్థానాల్లో ఒకటి. ఇక్కడి నుంచి ఎల్‌జేపీ (ఆర్)కు చెందిన చిరాగ్ పాశ్వాన్ ఎన్‌డీఏ నుంచి పోటీ చేస్తున్నారు. హాజీపూర్ స్థానం నుంచి శివచంద్ర రామ్‌కు ఆర్జేడీ టిక్కెట్టు ఇచ్చింది. శివచంద్ర ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేశారు.

కాశ్మీర్ లోయల్లోని పర్వతాలపై మంచు కురుస్తున్నప్పటికీ, ఇక్కడ రాజకీయ ఉష్ణోగ్రత వేడిగా ఉంది. కాశ్మీర్‌లోని బారాముల్లా స్థానంలో మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా పోటీ చేయడంతో ఈ స్థానం ప్రత్యేకత సంతరించుకుంది. మెహబూబా ముఫ్తీ పార్టీ పీడీపీ నుంచి ఫయాజ్ అహ్మద్‌తో ఒమర్ తలపడుతున్నారు.

ఉత్తరప్రదేశ్ (14)లో మోహన్‌లాల్‌గంజ్, లక్నో, రాయ్‌బరేలీ, అమేథీ, జలౌన్, ఝాన్సీ, హమీర్‌పూర్, బందా, ఫతేపూర్, కౌశంబి, బారాబంకి, ఫైజాబాద్, కైసర్‌గంజ్, గోండా స్థానాలకు పోలింగ్ జరగనుంది. మహారాష్ట్ర (13)లో ధూలే, దిండోరి, నాసిక్, పాల్ఘర్, భివాండి, కళ్యాణ్, థానే, ముంబై నార్త్, ముంబై నార్త్ - వెస్ట్, ముంబై నార్త్ - ఈస్ట్, ముంబై నార్త్ - సెంట్రల్, ముంబై సౌత్ - సెంట్రల్, ముంబై సౌత్ స్థానాలకు పోలింగ్ జరగనుంది. పశ్చిమ బెంగాల్ (7)లో బంగాన్, బరాక్‌పూర్, హౌరా, ఉలుబెరియా, శ్రీరాంపూర్, హుగ్లీ, ఆరంబాగ్ స్థానాలకు పోలింగ్ జరగనుంది. బీహార్ (5)లో సీతామర్హి, మధుబని, ముజఫర్‌పూర్, సరన్, హాజీపూర్ స్థానాలకు, ఒరిస్సా (5)లో బర్గర్, సుందర్‌ఘర్, బోలంగీర్, కంధమాల్, అస్కా స్థానాలకు పోలింగ్ జరగనుంది. జార?ండ్ (3)లో చత్రా, కోదర్మా హజారీబాగ్ స్థానాలకు, జమ్మూ కాశ్మీర్ (1)లో బారాముల్లా, లడఖ్ (1)లో లడఖ్ స్థానానికి పోలింగ్ జరగనుంది. మహారాష్ట్రలోని 48 నియోజకవర్గాలలో 13 స్థానాలకు ఈదశలో పోలింగ్ జరగనుంది. దీంతో రాష్ట్రంలో ఎన్నికలు ముగుస్తాయి. ఈ విడతతో జమ్మూ కాశ్మీర్‌తో పాటు లడఖ్ కేంద్రపాలిత ప్రాంతంలో కూడా ఓటింగ్ ముగియనుంది. ఇప్పటి వరకు నాలుగు దశల్లో లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ పూర్తైంది.

ఆసక్తికరంగా ఆ రెండు స్థానాలు

- అమేథీ, రాయబరేలీపైనే అందరి దృష్టి
- గాంధీ కుటుంబానికి కంచుకోటలుగా రెండు నియోజకవర్గాలు
- ఈ సారి పట్టు నిలుపుకుంటే బీజేపీకి వ్యతిరేక పవనాలు వీచినట్టే : రాజకీయ విశ్లేషకులు



రాహుల్ రాయబరేలీ నుంచి పోటీ చేస్తుండగా.. అమేథీ నుంచి ఇరానీపై గాంధీ కుటుంబానికి దగ్గరి వ్యక్తి అయిన కిషోరీ లాల్ శర్మ పోటీ చేస్తున్నారు. యూపీలో కాంగ్రెస్‌కు అతిపెద్ద మిత్రపక్షమైన సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) జాతీయ అధికార ప్రతినిధి అమీక్ జమీ మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో బీజేపీకి సవాలు విసురుతున్న కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి యూపీలోని 80 సీట్లలో 20 వరకు గెలుచుకోగలదని ఆయన జోస్యం చెప్పారు.

న్యూఢిల్లీ : దేశ రాజకీయాల్లో యూపీలోని రాయబరేలీ, అమేథీ లోక్‌సభ స్థానాలు ప్రత్యేకమైనవి. ఎందుకంటే.. ఆ రెండు స్థానాలు కాంగ్రెస్‌కు కంచుకోటలు. రాయబరేలీకి ఇందిరాగాంధీ, ఆమె భర్త, అలాగే సోనియా గాంధీలు ప్రాతినిథ్యం వహించారు. ఇక అమేథీ నుంచి రాజీవ్ గాంధీ, సోనియా, రాహుల్ గాంధీలు విజయం సాధిస్తూ వచ్చారు. గత లోక్‌సభ ఎన్నికల్లో అమేథీ నుంచి రాహుల్ గాంధీ ఓడిపోయినా.. రాయబరేలీ నుంచి మాత్రం కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ విజయం సాధించారు. ఇప్పుడు ఇదే రాయబరేలీని సోనియా గాంధీ ప్రస్తుతం రాహుల్ గాంధీ కోసం త్యజించారు. దీంతో రాయబరేలీ నుంచి రాహుల్ బరిలో నిలవటంతో ఈ స్థానం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. "2014లో కాంగ్రెస్ అధికారం కోల్పోయినప్పటికీ రాయబరేలీ, అమేథీ స్థానాలను మాత్రం గాంధీ కుటుంబం గెలవగలిగింది. అప్పటి వరకు ఈ రెండు నియోజకవర్గాలు గాంధీ కుటుంబానికి పర్యాయపదాలుగా ఉన్నాయి. భారత రాజకీయాలలో గాంధీ కుటుంబం 1947లో స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఎక్కువ కాలం పాటు దేశాన్ని పాలించింది. మూడు తరాల ప్రధానులు.. జవహర్‌లాల్ నెహ్రూ, అతని కుమార్తె ఇందిరా గాంధీ, మనవడు రాజీవ్ గాంధీలు ఉన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు, దాని నుంచి బయటికి వచ్చినప్పుడు.. అమేథీ, రాయబరేలీలు వేరు చేయబడ్డాయి. ఆ రెండు స్థానాలు చాలా వరకు ఆ కుటుంబానికి అండగా నిలిచాయి" అని రాజకీయ విశ్లేషకులు గుర్తు చేశారు. 2019లో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ అమేథీలో 55,000 ఓట్ల తేడాతో బీజేపీ అభ్యర్థి స్మృతి ఇరానీ చేతిలో ఓడి పోయారు. జాతీయ స్థాయిలో 2014లో సోనియాగాంధీ రాయబరేలీ స్థానాన్ని నిలుపుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అతిపెద్ద రాష్ట్రం యూపీలో గెలిచిన ఏకైక స్థానం ఇదే.

ఇప్పుడు.. ఐదేండ్ల తర్వాత బీజేపీ, కాంగ్రెస్ మధ్య పోరు.. మోడీ వర్సెస్ రాహుల్‌గా మారింది. రాహుల్ ఈసారి రాయబరేలీ నుంచి బరిలోకి దిగుతున్నారు. బీజేపీకి చెందిన స్మృతి ఇరానీ అమేథీ నుంచి మళ్లీ ఎన్నికకు ప్రయత్నిస్తున్నారు. ఒక్కొక్కరు ఒక్కో పార్టీ నుంచి గట్టి పోటీని ఎదుర్కోవాల్సి వస్తుందని భావిస్తున్నారు. అమేథీ, రాయబరేలీ స్థానాలకు మే 20న ఎన్నికలు జరగనున్నాయి. బీజేపీ రాయబరేలీని గెలుచుకుని అమేథీని నిలబెట్టుకుంటే.. అది యూపీ నుంచి గాంధీ కుటుంబాన్ని, కాంగ్రెస్‌ను సమర్థవంతంగా తుడిచిపెట్టినట్టవుతుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. దీనికి విరుద్ధంగా రెండు స్థానాల్లో కాంగ్రెస్ గెలిస్తే.. జాతీయంగా ఎవరు పాలించాలనేది తరచుగా నిర్ణయించే రాష్ట్రంలో బీజేపీ వ్యతిరేక ఊపుకు బీజం పడుతుందని వారు విశ్లేషిస్తున్నారు. అమేథీ, రాయ్ బరేలీ స్థానాలలో రాజకీయ గాలులు కాంగ్రెస్ వైపు వీస్తున్నాయనీ, ఇది మొత్తం రాష్ట్రాన్ని ప్రభావితం చేస్తుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. అలాగే దీని ప్రభావం దేశం మొత్తమ్మీదా పడి కాంగ్రెస్ పూర్వవైభవం పొందే అవకాశానికి దారి తీస్తుందని చెప్తున్నారు.

రాయ్‌బరేలీలో కాంగ్రెస్ కేవలం మూడుసార్లు మాత్రమే ఓడిపోయింది. 1975లో జాతీయ అత్యవసర పరిస్థితిని విధించినందుకు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ప్రజలు ఎదురు తిరిగారు. 1996, 1998లలో.. బీజేపీ జాతీయ స్థాయిలో పుంజుకున్నప్పుడు, కేంద్రంలో మొదటిసారి అధికారంలోకి వచ్చినప్పుడు.. ఇక్కడ నుంచి కాంగ్రెస్‌ను ఓడించింది.

రిజర్వేషన్లకు ప్రమాణం వెనుకబాటుతనమే

- అసోం సీఎం హిమంత బిస్వా శర్మకు చరిత్ర తెలియదు : సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

వెనుకబాటుతనానికే రిజర్వేషన్లు ఇచ్చారని, అదే రాజ్యాంగంలో పేర్కొన్నారని సీపీఐ(ఎం) ప్రధాన కార్యాదర్శి సీతారాం ఏచూరి అన్నారు. శనివారం నాడిక్కడ సీపీఐ(ఎం) కేంద్ర కార్యాలయంలో ఏచూరి మీడియాతో మాట్లాడారు. రిజర్వేషన్లపై అసోం సీఎం హిమంత బిస్వా శర్మ చేసిన ప్రకటనపై ఆయన స్పందించారు. "ఆయనకు దేశ చరిత్రపై అవగాహన లేదు. చరిత్రపై కొంచెమైనా పరిజ్ఞానం ఉండాలి. రాజ్యాంగం ఓబీసీలకు రిజర్వేషన్ గురించి మాట్లాడలేదు. మండల్ కమిషన్ ఓబీసీ విషయం గురించి చర్చించిన తర్వాతే ఓబీసీలకు వచ్చింది. ఆ విషయం వారికి తెలియదు. వారికి చరిత్ర గురించి తెలియదు. వారు సొంత చరిత్రను సృష్టిస్తున్నారు. రాజ్యాంగం గురించి తెలియకుండానే ముఖ్యమంత్రి అయిపోయారు. దయనీయ పరిస్థితి నెలకొంది. రిజర్వేషన్ల విషయానికొస్తే, రాజ్యాంగం చాలా స్పష్టంగా ఉంది. ఇది వెనుకబాటుకు రిజర్వేషన్లు. మత ప్రాతిపదికన రిజర్వేషన్లు కాదు. ఎస్సీ, ఎస్టీలకు వెనుకబడిన రిజర్వేషన్లు ఇచ్చారు. అంతేతప్ప హిందూ మతంలో భాగం వల్ల రిజర్వేషన్లు ఇవ్వలేదు. అదే వెనుకబాటుతనంతో ఉన్న హిందూ, ముస్లిం, క్రైస్తవ, సిక్కు, నాస్తికులకు కూడా రిజర్వేషన్లు ఇస్తారు. రిజర్వేషన్లకు ప్రమాణం వెనుకబాటుతనమే. వారికి (బీజేపీ) రాజ్యాంగం అర్థం కాదు. అందుకే 400 సీట్లు అడుగుతున్నారు. తద్వారా వారు ఈ రాజ్యాంగాన్ని తొలగించి, భారతదేశ సమాజానికి మనుస్మృతిని తమ ఆదేశంగా ఉంచుతారు. భవిష్యత్తులో ఫాసిస్ట్ నియంతత్వ పాలనలో ప్రజలు దీనిని తిరస్కరిస్తారు" అని అన్నారు.

వారణాసిలో 33 నామినేషన్ల తిరస్కరణ

- అవకతవకలు జరిగాయని అభ్యర్థుల ఆందోళన



వారణాసి : ప్రధాని నరేంద్ర మోడీ పోటీ చేస్తున్న వారణాసి లోక్‌సభ స్థానంలో 33 నామినేషన్లను రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు. నియోజకవర్గంలో మొత్తం 41 నామినేషన్లు దాఖలు కాగా మోడీ సహ ఏడుగురు అభ్యర్థుల నామినేషన్లను మాత్రమే ఆమోదించారు. 2014 ఎన్నికల్లో 42 మంది, 2019లో 26 మంది పోటీ చేయగా ఇప్పుడు కేవలం ఏడుగురు మాత్రమే రంగంలో నిలిచారు. అయితే నామినేషన్ల పరిశీలనలో అనేక అవకతవకలు చోటుచేసుకున్నాయని పలువురు అభ్యర్థులు ఆరోపించారు.



యూట్యూబర్ శ్యామ్‌రంగీలా నామినేషన్ తిరస్కరణకు గురైంది. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆయన ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. శ్యామ్‌రంగీలా సమర్పించిన అఫిడవిట్ అసంపూర్తిగా ఉన్నదని జిల్లా మెజిస్ట్రేట్ రాజలింగం కార్యాలయం వివరణ ఇచ్చింది. హర్‌ప్రీత్ సింగ్ నామినేషన్‌ను కూడా అధికారులు తిరస్కరించారు. ప్రమాణం చేయించాల్సిందిగా రిటర్నింగ్ అధికారిని మూడుసార్లు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిని మూడుసార్లు కోరినా వారు పట్టించుకోలేదని, చివరికి తన నామినేషన్‌ను తిరస్కరించారని ఆయన ఆరోపించారు. అసలు ఇది ఎన్నికే కాదని మరో అభ్యర్థి మండిపడ్డారు. ఆయన నామినేషన్ కూడా తిరస్కరణకు గురైంది. 'మాకు నామమాత్రంగా రేషన్ ఇస్తున్నారు. నోరు మూసుకుంటే మంచిదని చెబుతున్నారు. మాకు స్వేచ్ఛ అనేదే లేదు' అని ఆయన వాపోయారు.

ట్రెజరీ చలానా తీసుకోవడానికి మెజిస్ట్రేట్ కార్యాలయానికి వెళితే పెద్ద క్యూ ఉన్నదని, అందులో ఉన్న వారంతా బీజేపీ కార్యకర్తలేనని, ప్రక్రియ నెమ్మదిగా సాగేలా చేసేందుకే వారు క్యూలో నిలబడ్డారని మరో అభ్యర్థి తెలిపారు. ప్రధాని ఈ నెల 14న నామినేషన్ వేశారని, అప్పుడు అక్కడికి బీజేపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరుకున్నారని, వారు క్యూలోకి తమ స్నేహితులను పంపారని, దీంతో మొత్తం ప్రక్రియ నెమ్మదించిందని మరో అభ్యర్థి వివరించారు. ముందస్తు పథకం ప్రకారమే ఇదంతా జరిగిందని ఆరోపించారు. వీరందరి నామినేషన్లు తిరస్కరణకు గురవడం గమనార్హం.

ఐదో దశలోనూ అంతే

- ఎన్డీయే నుంచే ఎక్కువ మంది ఫిరాయింపుదారులు బరిలోకి
- 53 శాతం బీజేపీ నేతృత్వ కూటమి నుంచే
- మహారాష్ట్ర నుంచి అధికంగా ఏడుగురు
- శివసేన-షిండే వర్గం నుంచి ఏకంగా ఆరుగురు



న్యూఢిల్లీ : ఈ నెల 20న దేశంలో ఐదో దశ ఎన్నికలు జరగనున్నాయి. ఎప్పటిలాగే ఈ సారి కూడా ఫిరాయింపుదారులలో ఎక్కువ మంది ఎన్డీయే నుంచే బరిలో ఉన్నారు. 53 శాతం మంది ఫిరాయింపుదారులు ఈ కూటమి నుంచి పోటీలో ఉన్నారు. 8 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల(యూటీ)లో మొత్తం 49 స్థానాలకు ఈనెల 20న ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో 15 మంది ఫిరాయింపుదారులు పోటీ చేస్తున్నారు. వీరిలో ఎనిమిది మంది బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే నుంచి ఉన్నారు. ఇక ఇండియా కూటమి నుంచి ఐదుగురు, పశ్చిమ బెంగాల్‌లోని అధికార తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) నుంచి, ఒడిశాలోని అధికార బిజూ జనతా దళ్ (బీజేడీ) నుంచి ఒక్కొక్కరు చొప్పున ఫిరాయింపుదారులు పోటీలో ఉన్నారు.

ఐదో దశలో భాగంగా మహారాష్ట్రలో అత్యధికంగా ఫిరాయింపుదారులు ఉన్నారు. వీరిలో ఆరుగురు షిండే శిబిరంలో ఉన్నారు. వీరిలో ఇద్దరు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) సమన్ల తర్వాత పార్టీ మారినవారు కాగా ఒకరు లైంగిక వేధింపుల కేసులో నిందితుడు. ఏక్‌నాథ్ షిండే శివసేన శిబిరంలో లోక్‌సభ టిక్కెట్ పొందిన నలుగురు వివాదాస్పద ఫిరాయింపుదారుల గురించి చూస్తే ఆశ్చర్యం కలుగుతున్నది.

మీడియాలో కొరవడిన తటస్థత

పక్షపాతంతో వ్యవహరిస్తోంది

- అందుకే ప్రెస్‌మీట్లు పెట్టడం లేదు : ప్రధాని మోడీ ఆరోపణ
- బడా సంస్థలు బాకా ఊదుతున్నా కస్సుబుస్సు



న్యూఢిల్లీ : భారతీయ మీడియాలో 'తటస్థత కొరవడడం' వల్లే తాను పాత్రికేయుల సమావేశాలు నిర్వహించలేదని ప్రధాని నరేంద్ర మోడీ గురువారం నాడు సెలవిచ్చారు. ఇప్పుడు పాత్రికేయులు తమ అభిప్రాయాలు, భావాలనే ప్రచారం చేసుకుంటున్నారని ఆయన ఆరోపించారు. అయితే ఇక్కడ ప్రధాని ఒక విషయాన్ని మరిచారు. ప్రధాన స్రవంతి మీడియాలోని మెజారిటీ సంస్థలు మోడీకే బాకాలూదుతున్నాయనే విషయాన్ని ఆయన విస్మరించారు.

నేను పార్లమెంటుకు జవాబుదారీని. ఇవాళ పాత్రికేయులు తమ ప్రాధాన్యతలతో గుర్తింపు పొందారు. మీడియా ఇక ఎంత మాత్రం నిష్పాక్షిక సంస్థ కాబోదు' అని మోడీ వ్యాఖ్యానించారు. పార్లమెంటుకు తాను జవాబుదారీని అని చెబుతున్న ప్రధాని, సభలో ప్రతిపక్షాలు అడిగిన ప్రశ్నలకు ఎన్నడూ సమాధానాలు ఇవ్వలేదు. 'గోడీ మీడియా'లో భాగంగా భావించే ఆజ్‌తక్ హిందీ ఛానల్‌కు మోడీ ఇంటర్వ్యూ ఇస్తూ 'మీ విశ్వాసాలు ప్రజలకు తెలుసు. గతంలో మీడియాకు గుర్తింపు ఉండేది కాదు. ఎవరు రాస్తున్నారు, దాని భావాలేమిటి వంటి విషయాలను ఎవరూ పట్టించుకునే వారు కాదు. అయితే ఆ పరిస్థితి ఇకపై ఉండబోదు' అని చెప్పారు. రాజకీయాల్లో కొత్త సంస్కృతి అభివృద్ధి చెందిందని, ప్రభుత్వ పనితీరు కంటే మీడియా మేనేజ్‌మెంట్ చుట్టూనే అది తిరుగుతోందని అన్నారు. అయితే ఆ సంస్కృతి ఎలా, ఎందుకు వృద్ధి చెందిందో ఆయన వివరించలేదు.

మరో ఆంగ్ల పత్రికకు మోడీ ఇంటర్వ్యూ ఇస్తూ 'నేను అప్రజాస్వామిక వాదిని కాను. ప్రజాస్వామ్యం అంటే మీడియాలో ప్రచురితమయ్యే వార్త ఒక్కటే కాదు' అని ఎత్తిపొడిచారు. రిపోర్టర్స్ విత్ అవుట్ బోర్డర్స్ సంస్థ రెండు వారాల క్రితం పత్రికా స్వేచ్ఛ సూచికను విడుదల చేసింది. ఆ సూచికలో 176 దేశాల్లో భారత్ 159వ స్థానంలో నిలిచింది. అయినప్పటికీ భారతీయ మీడియా పక్షపాతంతో వ్యవహరిస్తోందని మోడీ ఆరోపించారు.

ఇవన్నీ ప్రభుత్వ బాకాలే

ఆంగ్ల న్యూస్ ఛానల్స్ అయిన టైమ్స్ నౌ, రిపబ్లిక్ టీవీ, ఇండియా టుడే, సీఎన్ఎన్ న్యూస్ 18, వియన్‌ను ప్రేక్షకులు ఎక్కువగా చూస్తుంటారు. వియన్, దాని సోదర సంస్థ జీ న్యూస్‌లకు సుభాష్ చంద్ర యజమాని. ఆయనకు బీజేపీతో సంబంధం ఉంది. 2016లో ఆయన హర్యానా నుండి స్వతంత్ర అభ్యర్థిగా రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఆయనకు బీజేపీ ఎమ్మెల్యేలు మద్దతు ఇచ్చారు. సీఎన్ఎన్ న్యూస్ 18 ఛానల్‌కు దేశంలోనే అత్యంత సంపన్నుడైన పారిశ్రామికవేత్త ముకేష్ అంబానీ అధిపతి. ఆయన ప్రధానికి సన్నిహిత మిత్రుడన్న విషయం తెలిసిందే.

సంచలనాలకు పెట్టింది పేరైన రిపబ్లిక్ టీవీ తరచుగా మతతత్వ భావాలను ప్రచారం చేస్తూ ఉంటుంది. రాజీవ్ చంద్రశేఖర్ సహ వ్యవస్థాపకుడుగా 2017లో ఇది ప్రారంభమైంది. అప్పుడు ఆయన రాజ్యసభలో స్వతంత్ర సభ్యుడు. బీజేపీతో రాజకీయ సంబంధాలు ఉన్నాయి. కేరళలో నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్‌కు వైస్ ఛైర్మన్‌గా వ్యవహరించారు. ఇప్పుడాయన బీజేపీ సభ్యుడు. నైపుణ్యాభివృద్ధి, ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి. ఈ ఛానల్‌కు రెండవ సహ వ్యవస్థాపకుడైన అర్నబ్ గోస్వామికి కూడా బీజేపీతో సంబంధాలు ఉన్నాయి. ఆయన తండ్రి 1990 ప్రాంతంలో బీజేపీలో చేరారు. గౌహతి స్థానం నుండి ఎన్నికల్లో పోటీ చేశారు. అనేక బడా మీడియా సంస్థలకు రెండు లేదా అంతకంటే ఎక్కువ భాగస్వామ్య సంస్థలు యజమానులుగా వ్యవహరిస్తున్నాయి. వాటిని ఇప్పటికీ వ్యవస్థాపక కుటుంబాలే నియంత్రిస్తున్నాయి. ఆ కుటుంబాలు మీడియాలోనే కాకుండా ఇతర రంగాలలో కూడా పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టాయి.

టైమ్స్ నౌ ఛానల్‌కు సాహూ జైన్ యజమాని. ఆయనకు బెన్నెట్, కోలెమన్ అండ్ కంపెనీ గ్రూపు కూడా ఉంది. తన యాంకర్లు నావికా కుమార్, రాహుల్ శివశంకర్ చేత తరచుగా ప్రభుత్వానికి అనుకూలంగా కథనాలు వండి వారిస్తూ ఉంటారు. ఇటీవలే కుమార్, టౌమ్స్ నౌకు చెందిన మరో యాంకర్ సుశాంత్ సిన్హాలకు మోడీ ఇంటర్వ్యూ ఇచ్చారు. ముస్లింలు ఆత్మపరిశీలన చేసుకోవాలని ఆయన ఆ సందర్భంగా హితవు పలికారు. భారతీయ మీడియా పక్షపాతపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించడానికి ముందు ఆయన గురువారం తన ఎదురుగా ఆజ్‌తక్‌కు చెందిన అంజనా ఓం కశ్యప్, శ్వేతా సింగ్, సుధీర్ చౌదరి, రాహుల్ కన్వల్‌ను కూర్చోబెట్టుకొని వారిని 'పిరికివారు'గా సంబోధించారు. అందుకు బదులుగా వారందరూ ఓ వెర్రినవ్వు నవ్వి ఊరుకున్నారు.

సుందర కామ్రేడువయా!



'ఎంతటి త్యాగమయా, ఎంతటి తేజమయా, ఎదలో నిలిచేవూ ఎన్నటికీ, సుందరయా మా సుందరయా!' అంటూ 1985లో ఆయన అమరుడయినపుడు గుండెనిండా పాడుకున్నాము. దాదాపు నాలుగు దశాబ్దాలు గడిచింది. ఆనాడెంత స్ఫూర్తినీ చైతన్యాన్ని అందించాడో, నేడు కూడా సుందరయ్య పేరు తలవగానే అంతే చైతన్యం ప్రేరణ ఆవహిస్తోంది. ఎందుకంటే ఒక కమ్యూనిస్టు ఎలా ఉండాలో, ఎలాంటి పాత్ర నిర్వహించాలో ఆయన జీవితం ఒక పాఠంలా ఇప్పటికీ బోధిస్తూనే ఉంటుంది. దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించిన వారిలో ముఖ్యుడే కాక, తెలుగు నేలపైన అశేష ప్రజలను అభ్యుదయ ఆలోచనల వైపునకు ప్రభావితం చేసిన ప్రజానాయకుడు ఆయన. ఒక శిఖర సమాన ప్రేరణాజీవితాన్ని, నిత్యచేతనా సంకేతమైన మహోన్నత వ్యక్తిత్వాన్ని తలచుకుంటేనే స్ఫూర్తి ప్రవాహమై నిండే రూపం సుందరయ్యంటే. అత్యంత మానవీయతకు నిలువెత్తు రూపంగా నిలిచాడు కాబట్టే, కమ్యూనిస్టు శ్రేణులకే కాక కమ్యూనిస్టు కాని జన సమూహాలకూ ఆదర్శంగా, గౌరవనీయంగా నిలిచాడు. కమ్యూనిస్టు ఉద్యమానికైతే, ఆయన ఆచరణ, ఆలోచన ఒక పాఠం లాంటిది. వర్ధంతి సందర్భంగా మళ్లీ మళ్లీ ఆయన్ని గుర్తు చేసుకోవడమంటే, నేటి మన కర్తవ్యాన్ని మరింత చైతన్యంతో నిర్వర్తించటమే. మనల్ని మనం ఒకసారి సరిచేసుకుని ముందుకు కదలటం. ఎందుకంటే నిబద్ధత, నిజాయితీ, అంకితభావం, పట్టుదల, కృషి ఆయనకు మారుపేర్లు.

ధనిక కుటుంబంలో పుట్టి పెరిగినా, జీవితాంతం వరకు కమ్యూనిస్టు ఆచరణతో ఉండటం ఆయన సొంతం. ఆశయంపై అచంచల విశ్వాసంతో, కోరి కోరి కష్టాలను ఎంచుకుని, తనకు తాను పరీక్ష పెట్టుకుంటూ, తీర్చుకుంటూ ఎదిగిన సమున్నత వ్యక్తిత్వం అది. కమ్యూనిస్టుగా మారడమంటే ఏమిటి? మానవత్వము మూర్తీభవించిన మనిషిలా మారటమే. స్వార్థం, ఆధిపత్యం, వివక్షతలు దరిచేరకుండా అశేష సమూహానికి ఆదర్శంగా నిలవడం. అందరినీ నడిపించడం. కమ్యూనిస్టు కీలక సంకేతమవడం. సుందరయ్యలో మనకు కనపడేది అదే. విద్యార్థి దశనుండే పరుల కోసం పాటుపడాలన్న ఆలోచనతో స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని, సామ్యవాద భావాలకు ప్రభావితుడై ఎరుపు దారులలో మెరుపులా వెలుగొందాడు. కమ్యూనిస్టు పని, స్పందన ఎలా ఉండాలి? ఉద్యమాలు, పోరాటాలే కాదు, ప్రజల తలలో నాలుకలా పనిచేయాలి. సామాన్యుల ప్రతి సమస్యలో పాలు పంచుకోవాలి. అందుకే దివిసీమ వరదల వేళ, కరువు కాటకాల్లో జనం కోసం స్వచ్ఛందంగా పనిచేశాడు. అంతేకాదు పేదలు చదువుకోవాలని రాత్రి బడినీ నడిపాడు. సామాన్య ప్రజలకోసం సరుకులు తెచ్చి చౌకగా అందించాడు. ఇంతేకాదు వైద్యమందించి ప్రజల మనిషిగా నిలిచాడు. ఆనాటికి ప్రబలంగా ఉన్న దళిత సమస్య పారదోలటం కోసం స్వయంగా కృషిచేశాడు. కులపీడనపై పోరాడాలన్న పిలుపును ఆచరణ ద్వారా ఆనాడే ఇచ్చాడు. వ్యవసాయ కార్మికుల కోసం దేశంలోనే మొట్టమొదటిసారిగా సంఘాన్ని నిర్మించడానికి పూనుకున్నాడు.లీల గారిని వివాహమాడి ఆదర్శంగా జీవించాడు. స్త్రీ సమానత్వాన్ని కోరుకున్నాడు.

దేశంలో విప్లవ సాధనకు మార్గాన్ని, వ్యూహాన్ని నిర్దేశించిన మహత్తర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో నాయకత్వం వహించి పోరాడిన యోధుడు సుందరయ్య. ఆనాటి ప్రజల పోరాటాల చరిత్రను నమోదుచేసి భవిష్యత్ తరాలకూ అందించాడు. మితవాద, అతివాద పోకడలు సరికావని, సరైన మార్క్సిస్టు సైద్ధాంతిక కృషిలో తనవంతు పాత్రను పోషించిన మేధో సంపన్నుడు, భౌతిక వాస్తవిక విశ్లేషణా సమర్థుడు. అంతేకాదు, పార్లమెంటులో ప్రతిపక్ష నాయకునిగా, శాసనసభ్యునిగా ప్రజాసమస్యల పట్ల లోతైన చర్చ చేసి, చట్టసభలను వర్గపోరాట క్షేత్రంగా ఎలా మలచుకోవాలో చూపిన నాయకుడు సుందరయ్య. నిరంతర అధ్యయనశీలిగా నదీ జలాలను ఎలా ఉపయోగంలోకి తేవాలో పరిశీలించి 'ఆంధ్రదేశంలో సమగ్రనీటి పథకం' అదించారు. గ్రామీణ పేదలకు భూ పంపకం చేసే మార్గాలనూ సమగ్రంగా సూచిం చాడు. తెలుగునేలను ప్రజారాజ్యంగా మార్చటానికి కావలసిన ప్రణాళికను 'విశాలాంధ్రలో ప్రజారాజ్యం'గా అందించాడు. సాంస్కృతిక కళారంగాలపై కూడా మంచి పట్టున్నవారు ఆయన. సాహిత్య విమర్శలో, భాషా దృక్పథంలో, కళారంగంలోనూ విశ్లేషణలు చేసిన రచయిత, విమర్శకుడు. కమ్యూనిస్టు సంబంధాలను కార్యకర్తలతోని కొనసాగాల్సిన అనుబంధాన్ని సుందరయ్య నుండి నేర్చుకోవాలి. క్రమశిక్షణకు, కార్యకర్తల శిక్షణకూ ఆయన చూపిన ప్రాధాన్యత మరువలేనిది.


కామ్రేడ్ సుందరయ్య గారి ఆశయపథం మనందరికీ శిరోధార్యం. ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా ఆయన నడిచిన దారిలో నిరంతరంగా కొనసాగటమే నిజమైన వారసత్వం. ఆయన పేరుతో వెలసిన విజ్ఞాన కేంద్రాలు నిత్య చైతన్య స్ఫూర్తిని అందిస్తూనే ఉన్నాయి. ప్రజాసాంస్కృతిక సేవా కార్యక్రమాలనూ సాగిస్తున్నాయి. ఇప్పటికీ నిండైన ప్రేరణ నింపుతున్న సార్థకమైన జీవితం ఆయనది. అందుకే కవి **"ఒకరో ఇద్దరో వారసులుంటే అది రక్త సంబంధం, లక్షలాది మంది నీ వారసులుంటే, అది కమ్యూనిస్టు సంబంధం"** అని ఆయన గురించి అనగలిగాడు. అలాంటి సంబంధాన్ని అందించిన సుందర కామ్రేడు, మన సుందరయ్యకు లాల్‌సలామ్!

సంపాదకీయం

సాయుధ రైతాంగ పోరాట నేపథ్యం వల్ల కొంతమంది సుందరయ్యను రైతు నాయకుడనుకుంటారు. ఆంధ్ర ప్రాంతంలో మొదట వ్యవసాయ కార్మికసంఘం ప్రారంభించింది ఆయనే. అంతేకాదు, తొలి కార్మికోద్యమ నేతలలో ఆయనొకరు. విప్లవోద్యమంలో పారిశ్రామిక కార్మికవర్గం, ప్రభుత్వరంగ పరిశ్రమల్లో కార్మికోద్యమం పాత్రను సరిగ్గా అంచనా వేశారు. అందుకే కొత్తగూడెంలో జరిగిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సిఐటియు 4వ మహాసభలో దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వరంగ పరిశ్రమలు, పారిశ్రామిక కార్మికులను సంఘటితం చేయకుండా కార్మికోద్యమం తన చారిత్రక పాత్ర నిర్వహించజాలదని నొక్కిచెప్పారు. కార్మికోద్యమంలో ఇప్పుడు ఆ లోటు స్పష్టంగా అనుభవంలోకి వచ్చింది. కార్మికుల సమస్యలు తమ పనిప్రదేశంలో మాత్రమే కాకుండా నివాస ప్రాంతాల్లో కూడా పట్టించుకోవాలని చెప్పారు.

సమాజంలో అభివృద్ధితో పాటు గుర్తింపు సమస్య కూడా ముందుకొచ్చింది. తాము చేస్తున్న కృషికి తగిన గుర్తింపు రావడంలేదని భావించేవారున్నారు. ముందువరసన నిలవటం, సోషల్ మీడియాలో, వేదికల మీద కనిపించడం కోసం తాపత్రయం ఇందుకే పెరుగుతున్నది. ప్రజా ప్రతినిధులయితే గుర్తింపు వస్తుందనే అభిప్రాయాలూ చూస్తున్నాము. కానీ గుర్తింపు కోసం ఏరోజూ ఆలోచించని కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య జీవితం దశాబ్దాలు గడిచినప్పటికీ ప్రజా ఉద్యమం మీద చెరగని ముద్ర వేసింది. ప్రజా ఉద్యమంలో పాత్రను బట్టి వచ్చే గుర్తింపు చిరస్థాయిగా నిలుస్తుందని చెప్పడానికి ఆయనే ఒక నిదర్శనం. మొదట్లోనే చెప్పుకున్నట్టు నాటి ప్రధాని ఇందిరా గాంధీ కూడా సుందరయ్య పేరు వినడంతోనే బయటికి వచ్చి మాట్లాడేంత గుర్తింపు ప్రజా ఉద్యమ నేపథ్యం నుంచే వచ్చింది కదా. సాయుధ రైతాంగ పోరాట యోధుడు కావటమే అందుకు కారణం కదా. ప్రజలే ఆయన కుటుంబం. పార్టీనే ఆయన జీవితం.

సుందరయ్య వర్తమానమే...



ఎస్. వీరయ్య



అది ప్రధానమంత్రి ఇందిరా గాంధీ నివాసం. పొద్దున్నే పుచ్చలపల్లి సుందరయ్య ఆమెతో మాట్లాడటం కోసం వెళ్లారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆయన ప్రయత్నం. సుందరయ్యగారు మాట్లాడాలనుకుంటున్నారని ఆమెకు సమాచారం పంపారు. "ఆయనకి ఎప్పుడు వీలవుతుందో చెప్పమను, తప్పకుండా కలుస్తాను" అని ఆ వార్తాహరునితో చెప్పారు. ఆ తర్వాత వచ్చింది సుందరయ్యే అనే విషయం తెలిసిన మరుక్షణం ఇందిరాగాంధీ బయటకువచ్చి ఆయనతో చర్చించారు. కాంగ్రెసు పార్టీకి, మార్క్సిస్టులకు మధ్య ఆనాటి ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర ఘర్షణ జరుగుతున్న కాలమది. అయినా ఆమె పుచ్చలపల్లి సుందరయ్య పేరు వినగానే అంతటి ప్రాధాన్యత నిచ్చారు. వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు కావటమే ఇందుకు కారణం.

ఈరోజు సుందరయ్య వర్ధంతి జరుపు కుంటున్నాము. సుందరయ్య బాట, సుందరయ్య స్ఫూర్తి గురించి మాట్లాడుకుంటున్నాము. వాటికి అర్థమేమిటి? అనేకమంది కమ్యూనిస్టుల వర్ధంతులలో సుందరయ్య వర్ధంతి కూడా ఒకటి అని చెప్పగలమా? సుందరయ్య వర్ధంతికి ఎందుకింత ప్రాధాన్యత? కొత్త తరం కమ్యూనిస్టులకిది ఆశ్చర్యకరమే. కాలం గడుస్తున్న కొద్దీ సాధారణంగా 'గతం' గత స్మృతులుగానే మిగిలిపోతాయి. కానీ సుందరయ్య ఈనాటికీ ప్రస్తుతమే. 'సుందరయ్య' ప్రాసంగికత (రిలవెన్స్) మరింత పెరిగింది. భారత కమ్యూనిస్టు ఉద్యమంలో ప్రజలతో మమేకం కావడం ఒక ప్రత్యేక అంశంగా ఇప్పుడు ముందుకొచ్చింది. జెండా ఏదైనా కమ్యూనిస్టులు లేదా వామపక్షవాదుల అందరి ఎజెండా ఇదే అయింది. అందుకే సుందరయ్య జీవితమే నేటి కమ్యూనిస్టులకు ఒక పాఠశాల. ప్రజలతో సంబంధాలంటే ఏమిటో సుందరయ్య జీవితాన్ని అధ్యయనం చేస్తే అర్థమవుతుంది. పేదలకు ఏ కష్టం వచ్చినా తాను చేయగలిగే సహాయం చేశారు. తన పరిధిలో లేకపోతే అధికారులు, పాలకుల దృష్టికి తెచ్చారు. అయినా పరిష్కారం కాకపోతే పోరుబాట పట్టారు. పేదలకు వైద్యం చేయటం, చవకగా సరుకులు అందించడం దగ్గరినుంచి చేయగలిగినదంతా చేశారు. సేవా తత్పరతకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు. కార్యకర్తల పట్ల అమితమైన శ్రద్ధ కనబరిచేవారు. సాయుధ రైతాంగ పోరాట విరమణ తర్వాత తాను స్వయంగా కలవగలిగినంతమంది కార్య కర్తలను కలిసే ప్రయత్నం చేశారు. ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నవారి అనుభవాలను సేకరించారు. ప్రజల కోసం ప్రాణా లర్పించిన యోధుల వివరాలు గ్రంధస్తం చేశారు. భూమికోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం సాగిన సాయుధ రైతాంగ పోరాటంతో పెనవేసుకున్నారు. కార్యాలయంలో కూర్చుని సూచనలు చేయడానికి పరిమితం కాలేదు. రేయింబవళ్లు, అడ వుల్లో, కొండల్లో, గుట్టల్లో వందల కిలోమీటర్లు కాలినడకన పోయి దళాల కష్టసుఖాలు తెలుసుకున్నారు. ప్రత్యక్షంగా సూచనలు అందించారు. ప్రజలతో, ప్రజా ఉద్యమాలతో మమేకం కావడానికి నిలువుటద్దమే సుందరయ్య జీవితం.

పురుషాధిక్యతను ప్రశ్నించటం తన కుటుంబం నుంచే ప్రారంభించారాయన. భార్యల పట్ల అగౌరవంగా ప్రవర్తించడాన్ని తీవ్రంగా పరిగణించేవారు. భార్య మీద చేయి చేసుకున్న పార్టీ సభ్యులకు పార్టీలో కొనసాగే అర్హత లేదని చెప్పేవారు. నాటికీ, నేటికీ దశాబ్దాలు గడిచాయి. సమాజంలో అనేక రంగాలలో మహిళల భాగస్వామ్యం పెరిగింది. సాధికారతా చైతన్యం పెరుగుతున్నది. పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధితో పాటు మహిళను వ్యాపార సరుకుగా చూసే ధోరణి పెరిగింది. వీటన్నింటితో పాటు సమాజంలో మహిళల మీద లైంగిక వేధింపులు, దాడులు కూడా పెరిగాయి. కమ్యూనిస్టు ఉద్యమానికి ఇవి కొత్త సవాళ్లు విసురుతున్నాయి. కులవివక్ష కూడా సమాజాన్ని ఆవహించిన ఒక పెద్ద జాడ్యం. సమాజాభివృద్ధి క్రమంలో దళితులు, గిరిజనులు, వెనకబడిన తరగతులనుంచి చదువుకున్నవారి సంఖ్య పెరిగింది. వివిధ రంగాలలో భాగస్వామ్యం కూడా పెరిగింది. సహజంగానే వివక్షను ప్రశ్నించేతత్వం కూడా పెరిగింది. తట్టుకోలేని కుల దురహంకార శక్తుల దాడులు పెరుగుతున్నాయి. ప్రజా పోరాటాలు పైచేయి అయినప్పుడు కుల, మత, ప్రాంతీయ విభేదాలకు అతీతంగా కష్ట జీవులు ఐక్యంగా పోరాడారు. సుందరయ్య నేతృత్వంలో సాగిన సాయుధ రైతాంగ పోరాట కాలంలో అను భవం కూడా ఇదే. సభలు, సమావేశాలకు హాజరయిన వారం దరికీ భోజనాలు వండి వార్చడంలో దళితులు కూడా భాగస్వాములే. గ్రామ రాజ్యాలలో కుల భేదం, లింగ భేదం పట్టింపులు లేవు. అందరూ సమానమే. కానీ సాయుధ పోరాట అనంతర కాలంలో క్రమంగా ప్రజా ఉద్యమాల మోతాదు తగ్గుతూ వచ్చింది. పెట్టుబడి ఆధిపత్యం పెరుగుతూ వచ్చింది. అందుకే కులము, కులవివక్ష కొనసాగుతూ వస్తున్నాయి. పైగా దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులకు చెందిన యువతలో ప్రశ్నించేతత్వం పెరిగినందువల్ల దురహంకారుల దాడులు కూడా పెరుగుతున్నాయి. సామాజిక సమస్యల పరిష్కారం కోసం కూడా వర్గ పోరాటం ఉధృతం కావలసిన ఆవశ్యకతను ఇవన్నీ రుజువు చేస్తున్నాయి. సుందరయ్య తన జీవితమంతా వర్గ దృక్పథానికి, వర్గ పోరాటానికీ అంకితమయ్యారు.

సమాజాభివృద్ధి క్రమంలో దళితులు, గిరిజనులు, వెనకబడిన తరగతులనుంచి చదువుకున్నవారి సంఖ్య పెరిగింది. వివిధ రంగాలలో భాగస్వామ్యం కూడా పెరిగింది. సహజంగానే వివక్షను ప్రశ్నించేతత్వం కూడా పెరిగింది. తట్టుకోలేని కుల దురహంకార శక్తుల దాడులు పెరుగుతున్నాయి. ప్రజా పోరాటాలు పైచేయి అయినప్పుడు కుల, మత, ప్రాంతీయ విభేదాలకు అతీతంగా కష్టజీవులు ఐక్యంగా పోరాడారు. సుందరయ్య నేతృత్వంలో సాగిన సాయుధ రైతాంగ పోరాట కాలంలో అనుభవం కూడా ఇదే. సభలు, సమావేశాలకు హాజరయిన వారందరికీ భోజనాలు వండి వార్చడంలో దళితులు కూడా భాగస్వాములే. గ్రామ రాజ్యాలలో కుల భేదం, లింగ భేదం పట్టింపులు లేవు. అందరూ సమానమే. కానీ సాయుధ పోరాట అనంతర కాలంలో క్రమంగా ప్రజా ఉద్యమాల మోతాదు తగ్గుతూ వచ్చింది. పెట్టుబడి ఆధిపత్యం పెరుగుతూ వచ్చింది.

అధ్యయనం ఆయన ప్రత్యేకత. సమాజాన్నీ, ఆర్థిక వ్యవస్థనూ లోతుగా అధ్యయనం చేసేవారు. సమాజ మార్పు కోసం సాగే వర్గ పోరాటంలో కార్మికవర్గ నాయకత్వ పాత్రను నొక్కి చెప్పారు. సాయుధ రైతాంగ పోరాట నేపథ్యం వల్ల కొంతమంది సుందరయ్యను రైతు నాయకుడనుకుంటారు. ఆంధ్ర ప్రాంతంలో మొదట వ్యవసాయ కార్మికసంఘం ప్రారంభించింది ఆయనే. అంతేకాదు, తొలి కార్మికోద్యమ నేతలలో ఆయనొకరు. విప్లవోద్యమంలో పారిశ్రామిక కార్మికవర్గం, ప్రభుత్వరంగ పరిశ్రమల్లో కార్మికోద్యమం పాత్రను సరిగ్గా అంచనా వేశారు. అందుకే కొత్తగూడెంలో జరిగిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సిఐటియు 4వ మహాసభలో దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వరంగ పరిశ్రమలు, పారిశ్రామిక కార్మికులను సంఘటితం చేయకుండా కార్మికోద్యమం తన చారిత్రక పాత్ర నిర్వహించజాలదని నొక్కిచెప్పారు. కార్మికోద్యమంలో ఇప్పుడు ఆ లోటు స్పష్టంగా అనుభవంలోకి వచ్చింది. కార్మికుల సమస్యలు తమ పనిప్రదేశంలో మాత్రమే కాకుండా నివాస ప్రాంతాల్లో కూడా పట్టించుకోవాలని చెప్పారు. కంపెనీలలో యూనియన్లు నిర్మించి వారి వేతనాలు, భత్యాలు, ఇతర సమస్యల పరిష్కారానికి మాత్రమే పరిమితం కావద్దన్నారు. కార్మికులు ఎక్కువ సమయం నివాస ప్రాంతంలోనే గడుపుతారు. వారు నివాస ప్రాంతంలో ఎదుర్కొనే పౌర సమస్యలు, శాంతిభద్రతలు, ఆర్థిక, సామాజిక సమస్యలపట్ల కూడా శ్రద్ధ వహించా లన్నారు. కమ్యూనిస్టు ఉద్యమం పని ప్రదేశంలోనే కాకుండా నివాస ప్రాంతాలలో కూడా ప్రజలతో మమేకం కావాలన్నారు. దాని ప్రాధాన్యత ఏమిటో ఇప్పుడు గమనిస్తున్నాము. క్షేత్ర స్థాయిలో లోతైన అధ్యయనం లేకుండా ఏ నిర్ణయమూ చేసేవారు కాదు. గ్రామాల్లో వ్యవసాయక సంబంధాలను నిర్దిష్టంగా అధ్యయనం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో సాగునీటి సమస్య లోతుల్లోకి వెళ్లారు.

నాటికీ, నేటికీ పట్టణ ప్రాంతాల్లోనే కాక గ్రామీణ ప్రాంతాలలో కూడా అనేక మార్పులు వచ్చాయి. మారుమూల అటవీ ప్రాంతాలకు కూడా వ్యాపార సంబంధాలు విస్తరిస్తున్నాయి. వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులను భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) మరోసారి అధ్యయనం చేసి అంచనా వేసింది. కానీ ప్రపంచీకరణ నేపథ్యంలో పెట్టుబడిదారీ సంబంధాలు మరింత వేగంగా విస్తరిస్తున్నాయి. మరోవైపు విశాలమైన భారతదేశం వైవిధ్యభరితం. నేటి ఆంధ్రప్రదేశ్‌లో గానీ, తెలంగాణలో గానీ అన్ని ప్రాంతాలూ ఒకేరకంగా లేవు. ఉద్యమ కార్యకర్తలు తాము పనిచేస్తున్న పరిధిలోని గ్రామాల్లో ఎవరికి వారు నిర్దిష్టమైన అధ్యయనం చేయవలసిందే. ఇప్పటికే జరిగిన అధ్యయనాలను లోతుగా అర్థం చేసుకుంటూనే తాము స్వయంగా దిగబడి స్థానిక పరిస్థితులను అధ్యయనం చేయాలి.

సమాజంలో అభివృద్ధితో పాటు గుర్తింపు సమస్య కూడా ముందుకొచ్చింది. తాము చేస్తున్న కృషికి తగిన గుర్తింపు రావడంలేదని భావించేవారున్నారు. ముందువరసన నిలవటం, సోషల్ మీడియాలో, వేదికల మీద కనిపించడం కోసం తాపత్రయం ఇందుకే పెరుగుతున్నది. ప్రజా ప్రతినిధులయితే గుర్తింపు వస్తుందనే అభిప్రాయాలూ చూస్తున్నాము. కానీ గుర్తింపు కోసం ఏరోజూ ఆలోచించని కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య జీవితం దశాబ్దాలు గడిచినప్పటికీ ప్రజా ఉద్యమం మీద చెరగని ముద్ర వేసింది. ప్రజా ఉద్యమంలో పాత్రను బట్టి వచ్చే గుర్తింపు చిరస్థాయిగా నిలుస్తుందని చెప్పడానికి ఆయనే ఒక నిదర్శనం. మొదట్లోనే చెప్పుకున్నట్టు నాటి ప్రధాని ఇందిరాగాంధీ కూడా సుందరయ్య పేరు వినడంతోనే బయటికి వచ్చి మాట్లాడేంత గుర్తింపు ప్రజా ఉద్యమ నేపథ్యం నుంచే వచ్చింది కదా. సాయుధ రైతాంగ పోరాట యోధుడు కావటమే అందుకు కారణం కదా. ప్రజలే ఆయన కుటుంబం. పార్టీనే ఆయన జీవితం. నిరంతరం సేవా కార్యక్రమాలు, ప్రజా పోరాటాలు, ప్రజాసంఘాలు, పార్టీ నిర్మాణం చుట్టూనే ఆయన ఆలోచనలు. తన గురించి తాను ఎప్పుడూ ఆలోచించలేదు. 'మన' గురించి, ప్రజలందరి గురించి మాత్రమే పని చేసారాయన. అందుకే ఆయన స్ఫూర్తి ప్రదాత. అదే సుందరయ్య మార్గం. ■

మోడీ ఆఖరి ఆక్రోశాల అర్థమేంటి?



తెలకపల్లి రవి


"జానపద కథల్లో శక్తులన్నీ కలసి ఎవరికో పట్టం కట్టాలని చూసినట్టు భారత దేశంలో, పాలక వ్యవస్థలన్నీ కలసి నరేంద్ర మోడీ బీజేపీ ప్రభుత్వాన్ని మూడోసారి ప్రతిష్టించడానికి పథకాలు వేస్తున్నాయి. ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించవలసిన ప్రజలను మానసికంగా సిద్ధం చేయాలనుకుంటున్నాయి. ఇప్పుడు ఆయన మూడోసారి అధికారంలోకి రావడం అసాధ్యమని తెలిసినా అదే మోత సాగించడంలో పరమార్థం అదే. ఎలాగూ గెలిచే మోడీని ఎదుర్కోవడం వృథా అని నూరిపోయడం అందులో భాగమే. తెలుగునాట సీనియర్ మాజీ ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు నాయుడు కూడా అదే తరహాలో మోడీని మోయడం అనివార్యమని నమ్ముతూ ఆ ప్రచారానికి ఊతమిస్తున్నారు. గత పదేండ్ల నుంచి మోడీకే వత్తాసునిస్తున్న ముఖ్యమంత్రి జగన్ కూడా బీజేపీ జోలికి పోకుండా తన వంతు సహాయం అందిస్తున్నారు. జాతీయ మీడియా దాదాపుగా మోడియాగా మారిపోగా తెలుగు మీడియా కూడా ప్రాంతీయంగా తమకు నచ్చిన వారికి మద్దతిస్తూ జాతీయ స్థాయిలో బీజేపీకి అనుకూలమైన రాగాలే వినిపిస్తున్నది. ఏతావాతా బీజేపీ హ్యాట్రిక్ విజయం గురించి వారికన్నా ఎక్కువగా ఈ శక్తులు ప్రచారం చేస్తున్నాయి. వామపక్షాలు గానీ, బీజేపీ ఎన్‌డిఎకు వ్యతిరేకంగా ఏర్పాటైన 'ఇండియా' దండగమారి ప్రయత్నమనీ, వామపక్షాలు ఏదో సైద్ధాంతికంగా వ్యతిరేకించడం తప్ప చేయగలిగింది లేదనీ అహోరాత్రులు అపహాస్యం చేస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలుగా పోరాడటం సహజంగా జరుగుతుందనే కనీస ప్రజాస్వామిక సంప్రదాయాన్ని కూడా భరించలేకపోతున్నాయి. నిజంగానే ఇది చాలా విడ్డూరమైన పరిస్థితి. 'మోడీ బిల్డప్‌నే మోయడం అవసరమా?' శీర్షికతో ఇదే కాలమ్‌లో మొన్న ఏప్రిల్ 5న వ్యాసం ఇదీ. ఇప్పుడొక్కసారి వెనక్కు తిరిగిచూస్తే ఎవరో ఏదో అనడం కాదు. ఆ మోడీనే తనను తాను సమర్థించుకోలేక సతమతమవుతున్న స్థితి. ఏపీ, తెలంగాణలలో పోలింగ్ ముగిసిపోయింది గనక ప్రజల తీర్పు లెక్కింపు జరిగేలోగా కండ్లముందు నడుస్తున్న చరిత్ర సూటిగానే చెప్పుకోవచ్చు.

ఎవరైనా అనుకున్నారా?

హిందూ, ముస్లిం మధ్య తేడా చూపితే నేను ప్రజా జీవితానికి అనర్హుడవుతాను' అని మోడీ మీడియా ముందు వాపోతారనీ, అటూ ఇటూ తిప్పి మాట్లాడతారనీ ఎవరైనా అనుకున్నారా? బహుశా చెప్పినా చాలా మంది నమ్మి ఉండేవారు కారేమో! 2002 గుజరాత్ మారణహోమంపై మీడియా ప్రశ్నలు దాటేయడమేగాక చర్చ నుంచి లేచిపోయిన మోడీ ఇప్పుడు తనే ఆ ప్రస్తావన తెచ్చి మరీ మాట్లాడుతున్నారు. గోద్రా అల్లర్లకు తనను బాధ్యుడుగా చిత్రించడం చాలా బాధ కలిగించినందువల్లనే అలా చేశానని ప్రకటిస్తున్నారు. నిజానికి వాటిని గోద్రా అల్లర్లు అనడం సంఘ్‌పరివార్, బడా మీడియా కలసి చేసిన కుట్ర. గోద్రాలో రైలుబోగీ దగ్ధం, కొంతమంది భక్తులు మరణించడం అందరినీ కలచివేసింది. తర్వాత అంతకు కొన్ని వేల రెట్లు భయానకమైన హత్యాకాండ, మహిళలపై, పిల్లలపై హింస కొనసాగింది. మోడీ ముఖ్యమంత్రి కాగా ఆయన సహాయకుడుగా హోంశాఖ చూసిన వ్యక్తి అమిత్ షా. ఆ పరిస్థితి చక్కదిద్దకపోగా ఆ మారణకాండ మంటలు చల్లారక ముందే ముందస్తు ఎన్నికల కోసం వెంటబడి మళ్లీ గద్దెక్కి కూర్చున్న నేపథ్యం మోడీది. నేరుగా అంబానీలే ఆయన్ను గుజరాత్‌లో పుట్టిన అపర గాంధీగా ఆకాశానికెత్తారు. గుజరాత్‌లో గాంధీ, ధీరూభాయ్ అంబానీ, మోడీ పుట్టారని అనిల్ అంబానీ కీర్తించినప్పుడే ఆయన కార్పొరేట్ ముద్దుబిడ్డ అని తేలిపోయింది. భారత ప్రధాని కాలేకపోయినా భారతరత్నతో సరిపెట్టుకోవలసి వచ్చిన అద్వానీ ఎన్నికల్లో దేశాన్ని ఆకర్షించలేకపోతున్నారని అప్పటికే అర్థమైపోయింది. 2004లో యుపిఎ అధికారంలోకి వచ్చిన కొద్ది కాలానికే ఆయన పాకిస్తాన్‌లో జిన్నాను పొగిడారనే పేరిట అద్వానీపై చర్య తీసుకుని పక్కన పెట్టారు. అయినా ఆ తర్వాత ఎలాగూ నెగ్గలేని 2009 ఎన్నికల్లో తనను ప్రధాని అభ్యర్థిగా ప్రకటించి ఒక తంతు ముగించారు. ఇక రామ రథయాత్రీకుని రాజకీయ పాత్ర చాలదని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ గుర్తించిన పిదపనే మోడీని రంగంలోకి దింపారు. నాగపూర్-ముంబాయి లింకుతో జరిగిన పని ఇది.

చంద్రబాబు గతం, జగన్ ప్రస్తుతం

ఇక్కడ చంద్రబాబు లింకు కూడా చెప్పుకోవలసి వుంటుంది. బలం లేకున్నా మాయాజాలంతో మొదటిసారి ఈ దేశ ప్రధాని పదవి చేపట్టి 13 రోజులకే దిగిపోయిన వాజ్‌పేయి 1998లో 13 నెలలు కొనసాగి మళ్లీ తిరిగి రాగలిగారంటే చంద్రబాబు, టీడీపీ ఇచ్చిన మద్దతే తొలి కారణం. ఎందుకంటే 1990లో అద్వానీ రథయాత్ర తర్వాత ఎన్టీఆర్ బీజేపీతో తెగతెంపులు చేసుకున్నారు. అంతకు ముందు వారికి కేటాయించిన సీట్లు కూడా వామపక్షాలతోనే పంచుకున్నారు. 1994 ఎన్నికల్లో ఉభయ కమ్యూనిస్టులకు కలసి 34 స్థానాలు వచ్చాయి. తను నిలదొక్కుకోవడానికి మొదట్లో వామపక్షాల మద్దతుపైనే ఆధారపడిన చంద్రబాబు 1998 ఎన్నికల తర్వాత హఠాత్తుగా ప్లేటుమార్చి అటు దూకారు. ప్రాంతీయ పార్టీలు బీజేపీతో చేతులు కలపడం అప్పుడే మొదలైంది. 2004లో ఘోర పరాజయం పాలైన తర్వాత 2009లో మారానని ప్రకటించి మళ్లీ 2014లో అటే అడుగులు వేశారు. మోడీకి సారీలు చెప్పి మరీ పొత్తు కుదుర్చుకున్నారు. ఇదేదో జగన్ దుర్మార్గాలను ఎదుర్కొనడం కోసమే చంద్రబాబు బీజేపీతో కలిశారని సమర్థించే కొందరు మిత్రులు తెలుసుకోవలసిన ఇటీవలి చరిత్ర ఇది. కచ్చితంగా చెప్పాలంటే 1999-2024 మధ్య ఆరుసార్లు జరిగిన వివిధ ఎన్నికల్లో కేవలం 2009 ప్రత్యేక పరిస్థితులలో మాత్రమే వామపక్షాలు టీడీపీతో కలసి పోటీ చేశాయి. ఇక జగన్ వైసీపీ విషయానికొస్తే కాంగ్రెస్‌తో విడగొట్టుకుని ప్రాంతీయ పార్టీగా ఏర్పడిన తర్వాత ఆయన బీజేపీకే దగ్గరగా వున్నారు. పాలక పార్టీల ఎన్నికల రాజకీయాలలో తన ఓటు బ్యాంకు బీజేపీతో నేరుగా పొత్తు పెట్టుకుంటే నిలవదని ఆయనకు తెలుసు. అలాగే హిందూత్వ రాజకీయాలతో దేశాన్ని పాలించే బీజేపీకి కూడా అది కుదిరే పని కాదు. అందుకే ఎన్నికలలో మాత్రం వేరుగా పోటీ చేస్తూ ముందూ వెనకా కలిసే వ్యవహరిస్తుంటారు. కనుక చంద్రబాబు, జగన్ ఇద్దరికీ కామన్ పాయింట్ ఇదే. పొత్తు పార్టీలు, తొత్తు పార్టీలూ అని సీపీఐ(ఎం) అంటున్న మాట ఇదే. దేశంలో ఎక్కడికన్నా ఏపీలోనే బీజేపీకి ఎక్కువ సీట్లు వుంటాయని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ ఎప్పుడూ అంటుంటారందుకే.



తాత్కాలిక మనుగడ కోసం కోరి ధృతరాష్ట్ర కౌగిలి ఆశ్రయించిన తెలుగు రాష్ట్రాల నేతలు, వారి పనుపున బీజేపీ భజనగీతాలు పాడిన తెలుగు మీడియాధిపతులు ఇప్పుడైనా కళ్లు తెరుస్తారా? జాతీయ మీడియాలో కొందరైనా దీన్ని గుర్తిస్తుంటే అంతర్జాతీయ మీడియా మోడీ బీజేపీల సర్కస్‌లను సూటిగానే బహిర్గత పరుస్తున్నది. మోడీపై విదేశీ మీడియా కుట్రలంటూ గగ్గోలు కూడా మొదలైంది. ప్రగతిశీల శిబిరానికి దగ్గరగా వున్నా మోడీ మోతలో ఊగిసలాడిన మీడియా వర్గాలు కూడా కొంత సవరించుకుంటున్నాయి. ఆఖరుకు మోడీనే ముస్లింల విషయంలో సంజాయిషీ ఇచ్చినట్టు నటించాల్సి వచ్చింది. అదానీ పేరు కూడా ప్రస్తావించాల్సి వచ్చింది. కొంతమంది తొందరపాటుతో దీనిపై సూత్రీకరణలు మొదలెట్టారు గానీ అదీ తొందరపాటే. మోడీ మాటల్లో నిజాయితీ ఎంత మాత్రం లేదు.

ఏపీ, తెలంగాణలకు అన్యాయం

చంద్రబాబు వెంటబడి బీజేపీతో పొత్తు పెట్టుకున్నా తర్వాత ఉమ్మడి ప్రణాళిక కూడా లేకుండా ప్రచారంలో ఎన్ని పిల్లిమొగ్గలు వేశారో, జెండాలు వద్దంటూ స్థానికంగా టీడీపీ కార్యకర్తలు పక్కన పెట్టించారో చూశాం. ముస్లిం రిజర్వేషన్ల విషయంలో ఈ తేడా మరీ బాహాటంగా కనిపించింది. ఆ రిజర్వేషన్లు తొలగిస్తామని మోడీ, అమిత్ షాలు పదేపదే ప్రకటించడమే గాక సవాళ్లు విసురుతుంటే నేను కాపాడతానని జగన్ గట్టిగా చెప్పవలసి వచ్చింది. చంద్రబాబు కూడా అదే చెప్పినా బీజేపీతో కలవడం వల్ల మైనార్టీ వర్గాలలో కొంత సందేహం తప్పలేదు. పైగా అది ఆయన పార్టీ అభిప్రాయమే గానీ మాకు సంబంధం లేదని అమిత్ షా ఒకటికి రెండుసార్లు స్పష్టం చేశారు. న్యూస్ లాండ్రీ శ్రీనివాసన్ మోడీపై, బీజేపీ మత రాజకీయాలపై, చంద్రబాబు పిల్లిమొగ్గల గురించి, నిరంకుశ పోకడలపై ప్రశ్నలు వేస్తే జవాబు ఇవ్వలేక తంటాలు పడ్డారు. ఇక జగన్ కూడా 'ఆ ఒక్కటి దక్క' అన్నట్టే మాట్లాడారు. ఆగర్భ శత్రువుల్లా పోట్లాడుకునే ఈ ఇద్దరూ రాహుల్ గాంధీ మోడీ కన్నా మెరుగని తామెప్పుడూ చెప్పలేదని ఒకటికి రెండు సార్లు వివరణ ఇచ్చుకున్నారు. చంద్రబాబు అయితే మోడీ క్రియాశీల నాయకత్వం కింద ఎన్‌డిఎ ఏర్పడినట్టు ఉమ్మడి ప్రకటనలో పదేపదే ప్రకటించారు. తన విజన్ 2020 పక్కన పెట్టిన మోడీని విజనరీ నాయకుడని కీర్తించారు. మోడీ ఇద్దరు నేతలతోనూ ఆడాల్సిన రాజకీయ క్రీడే ఆడారు. జగన్ పేరు ప్రస్తావించకుండా వైసీపీని, రాష్ట్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం ద్వారా టీడీపీకి కాస్త ఊరట కలిగించారు. వాస్తవానికి వారిద్దరి మీద, తద్వారా ఏపీ మీద కూడా పెత్తనం చేయడమే మోడీ విధానం లక్ష్యం. ఉత్తరాదిన వచ్చే స్థానాలు తగ్గుతూ దక్షిణాన అసలే ఠికాణా లేదు గనక వీరిని ముందుంచుకుని పబ్బం గడుపుకోవాలన్న ప్రయాస మాత్రమే. ఇంత బాహాటంగా కనిపించకపోయినా తెలంగాణలోనూ కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్య బీజేపీ రాజకీయం సాగిస్తున్నది. బీఆర్ఎస్ కాంగ్రెస్‌లో కలసిపో తుందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తమ పార్టీలోకి వచ్చే స్తాడని. ఆగస్టు సంక్షోభం తప్పదనీ రకరకాల మాటలతో రాజకీయ టక్కుటమార విద్యలు ప్రదర్శిస్తున్నారు బీజేపీ నేతలు. జూన్ 2న విభజన చట్టం గడువు ముగిసిపోతుంటే ఇప్పటికీ ఏదీ ఒక కొలిక్కిరాని పరిస్థితి. తాజాగా రేవంత్‌రెడ్డి ఏపీభవనాలు వంటివి స్వాధీనం చేసుకోవాలని, అన్ని అంశాలు పరిష్కరించాలని అన్నట్టు వార్తలొచ్చాయి. కానీ ఓట్ల లెక్కింపు జూన్ నాలుగు గనక ఏపీలోనూ, కేంద్రంలోనూ ఏం జరిగేది ఆ తర్వాతనే చూడగలం.

సడలిన విశ్వాసం సంకేతాలు

తాత్కాలిక మనుగడ కోసం కోరి ధృతరాష్ట్ర కౌగిలి ఆశ్రయించిన తెలుగు రాష్ట్రాల నేతలు, వారి పనుపున బీజేపీ భజనగీతాలు పాడిన తెలుగు మీడియాధిపతులు ఇప్పుడైనా కళ్లు తెరుస్తారా? జాతీయ మీడియాలో కొందరైనా దీన్ని గుర్తిస్తుంటే అంతర్జాతీయ మీడియా మోడీ బీజేపీల సర్కస్‌లను సూటిగానే బహిర్గత పరుస్తున్నది. మోడీపై విదేశీ మీడియా కుట్రలంటూ గగ్గోలు కూడా మొదలైంది. ప్రగతిశీల శిబిరానికి దగ్గరగా వున్నా మోడీ మోతలో ఊగిసలాడిన మీడియా వర్గాలు కూడా కొంత సవరించుకుంటున్నాయి. ఆఖరుకు మోడీనే ముస్లింల విషయంలో సంజాయిషీ ఇచ్చినట్టు నటించాల్సి వచ్చింది. అదానీ పేరు కూడా ప్రస్తావించాల్సి వచ్చింది. కొంతమంది తొందరపాటుతో దీనిపై సూత్రీకరణలు మొదలెట్టారు గానీ అదీ తొందరపాటే. మోడీ మాటల్లో నిజాయితీ ఎంత మాత్రంలేదు. అయినా వారణాసిలో నామినేషన్ సందర్భంగా రాజ్యాంగంపై ఆయన చేసిన ప్రమాణ స్వీకారానికి అటూ ఇటు పవన్ కళ్యాణ్, చంద్రబాబు హాజరు వేయించుకుని రావడం ఇందుకు నిదర్శనం. ఎవరికీ మెజార్టీ రాకూడదనేది తమ ఆకాంక్ష అని వైసీపీ అంటున్నా మొగ్గు మోడీ వైపేనన్నది నిస్సందేహం. ఇప్పటికే 70 శాతం భారతీయులు ఓటేసే ప్రక్రియ పూర్తయింది. మిగిలిన చోట్లనైనా బీజేపీ ఆధిక్యత నిలుస్తుందా అనేది సందేహ స్పదంగా వుంది. అయినా మోడీనే మోయడానికి వీరు సిద్ధం కావడం ఆశ్చర్యకరం. తెలుగు రాష్ట్రాల కీలక నేతల అవకాశవాదాలు ఎలా వున్నా దేశ ప్రజలూ రాష్ట్ర ప్రజలూ కూడా మత రాజకీయాలను, నిరంకుశ పోకడలనూ ఆమోదించడం లేదనేది స్పష్టం. జూన్ నాలుగున గానీ దీని పూర్తి సన్నివేశం అర్థం కాదు. అది కూడా అనిశ్చితినే తెస్తుందా? అనే ప్రశ్న కూడా వుండనే వుంటుంది. ■

ఎప్‌సెట్ ఫలితాల్లో శ్రీచైతన్య విజయభేరి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ఎప్‌సెట్ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థులు విజయభేరి మోగించారు. ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాల్లో రాష్ట్రస్థాయి ప్రథమ ర్యాంకులను సాధించి సత్తాచాటారు. ఈ మేరకు శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంజినీరింగ్‌లో ప్రథమ ర్యాంకుతోపాటు టాప్ టెన్‌లోపు నాలుగు ర్యాంకులు, వందలోపు 51 ర్యాంకులను తమ విద్యార్థులే సాధించారని తెలిపారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో ప్రథమ ర్యాంకుతోపాటు టాప్ పదిలోపు ఏడు ర్యాంకులు, వందలోపు 59 ర్యాంకులను శ్రీచైతన్య విద్యార్థులే పొందారని వివరించారు. ఇంజినీరింగ్, మెడిల్ విభాగాల్లో మొదటి ర్యాంకులతో రికార్డు సృష్టించామని పేర్కొన్నారు. ఇంజినీరింగ్‌లో సతివాడ జ్యోతిరాదిత్య మొదటి ర్యాంకు, గొల్లలేఖ హర్షా రెండో ర్యాంకు, పుట్టి కుషల్ కుమార్ ఆరో ర్యాంకు, ధనుకొండ శ్రీనిధి పదో ర్యాంకు సాధించారని వివరించారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో ఆలూర్ ప్రణీత మొదటి ర్యాంకు, గడ్డం శ్రీవర్షిణి మూడో ర్యాంకు, మహమ్మద్ అజాన్‌సాద్ ఆరో ర్యాంకు, వడ్లపూడి ముఖేష్ చౌదరి ఏడో ర్యాంకు, జెన్ని భార్గవ్ సుమంత్ ఎనిమిదో ర్యాంకు, జయశెట్టి ఆదిత్య తొమ్మిదో ర్యాంకు, పూల దివ్యతేజ పదో ర్యాంకు పొందారని తెలిపారు. ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాల్లో శ్రీచైతన్యకు పోటీలేదని విద్యార్థులు నిరూపించారని పేర్కొన్నారు. వరుసగా ఏడుసార్లు మొదటి ర్యాంకులను సాధించి ర్యాంకుల సునామీ సృష్టించామని తెలిపారు.

ఎన్డీఎస్ఏ రిపోర్టులో ఏముంది ?

- సీఎం రేవంత్ ఆరా
- మరోసారి మేడిగడ్డతోపాటు సుందిళ్ల బ్యారేజీల ప్రత్యక్ష పరిశీలన : అధికారులకు సీఎం ఆదేశం
- క్యాబినెట్‌లోనూ చర్చిస్తామని వ్యాఖ్య

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టుపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్డీఎస్ఏ) ఇచ్చిన మధ్యంతర నివేదికపై ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆరా తీశారు. ఆ నివేదికలో ఎలాంటి ఏమేం సిఫారసులున్నాయి? వాటిపై ప్రభుత్వం ఏమేం చర్యలు తీసుకోవాలనే దానిపై తీసుకోవా ల్సిన తదుపరి చర్యలపై మంత్రులు, ఉన్నతాధికారులతో ఆయన చర్చించారు. శనివారం సాయంత్రం సచివాలయంలో భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో ఇదే అంశంపై చర్చలు జరిపారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, జూపల్లి కష్ణారావు, కొండా సురేఖ, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.



కాళేశ్వరం ప్రాజెక్టులో అత్యంత కీలకమైన మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీలు కుంగిపోవటం తో తాత్కాలికంగా చేపట్టాల్సిన మరమ్మతులు, పునరుద్ధరణ చర్యలపై ఇటీవల ఎన్డీఎస్ఏ రాష్ట్ర ప్రభుత్వానికి మధ్యంతర నివేదిక ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ నివేదికలో ఉన్న ముఖ్యమైన అంశాలు, సిఫారసులన్నింటినీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సీఎం రేవంత్‌తోపాటు మంత్రు లకు వివరించారు. 2019లోనే బ్యారేజీలకు ప్రమాదం ఉన్నట్టు ఎన్డీఎస్ఏ నివేదిక తేల్చిందనీ, రిపేర్లు, పునరుద్ధరణ చర్యలు చేపట్టినా ప్రాజెక్టుకు ముప్పు ఉండబోదని చెప్పలేమంటూ ఎన్డీఎస్ఏ ఆ నివేదికలో స్పష్టం చేసిందని గుర్తు చేశారు. మరో నెల రోజుల్లో వర్షాకాలం ప్రారంభమవుతున్నందున ఈలోగానే తీసుకోవాల్సిన చర్యలపైనా రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో చర్చించాల్సి ఉంటుందని ఈసందర్భంగా సీఎం అన్నారు. మరమ్మతులు చేయాలా ? ప్రత్యామ్నాయాలు ఏమైనా ఉన్నాయా ? మరింత నష్టం జరగకుండా ఎలాంటి చర్యలు చేపట్టాలనేది సాగునీటిపారుదల, ఆయకట్టు శాఖ అధికారులతో కలిసి నిర్ణయించాల్సి ఉంటుందని చెప్పారు. నిజానికి శనివారం రాష్ట్ర క్యాబినెట్ భేటీ జరగకపోవడంతో ఈ కీలకమైన అంశాలపై చర్చించలేకపోయామని తెలిపారు. త్వరలోనే మేడిగడ్డ, సుందిళ్ల, అక్కడి పంప్‌హౌస్‌లను క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాల్సి ఉంటుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.

ఈసీ అనుమతిస్తే సరే.. లేకుంటే మంత్రులతో ఢిల్లీకి

(మొదటిపేజీ తరువాయి)

భిన్నాభిప్రాయా లున్నాయి. విభజన చట్టం ప్రకారం పదేండ్లు ముగిసిన నేపథ్యంలో వీటి స్వాధీనానికి తీసుకోవాల్సిన చర్యలు, అనంతరం ఎదురయ్యే పరిస్థితులపై క్యాబినెట్‌లో చర్చించాలని భావించారు. కుంగిపోయిన మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల మరమ్మతులకు సంబంధించి నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇటీవలే మధ్యంతర నివేదికను సమర్పిం చింది.

ఆ నివేదికలోని సిఫారసులు, తదుపరి చేపట్టాల్సిన కార్యా చరణపై ఈ సమావేశంలో చర్చించి మంత్రి వర్గ సమావేశంలో తగు నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం భావించింది. అయితే మంత్రి వర్గ సమా వేశానికి ఈసీ అనుమతి నిరాకరించడంతో సీఎం స్వయంగా రంగంలోకి దిగి ఢిల్లీకి వెలుతామంటూ ప్రకటించడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

క్రిమి సంహారకాలు, రసాయనాల అధిక వాడకంపై కేంద్రానికి సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ : పంటలు, ఆహార పదార్థాలపై క్రిమి సంహారక మందులు, ఇతర రసాయనాలు అధికంగా వాడడం వల్ల దేశవ్యాప్తంగా మరణాలు అధికంగా సంభవి స్తున్నాయని పేర్కొంటూ దాఖలైన పిటిషన్‌పై స్పందించాల్సిందిగా సుప్రీం కోర్టు కేంద్రానికి, పలు శాఖలకు నోటీసులు పంపింది. ఈ పిటిషన్‌కు స్పందించి, సమా ధానాలు పంపాల్సిందిగా కోరుతూ కేంద్ర ప్రభుత్వంతో పాటూ వ్యవసాయ శాఖ, భారత్ ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఎఐ) తదితరులకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని బెంచ్ నోటీసులు పంపింది.

ఎప్‌సెట్ ఫలితాల్లో నారాయణ సంచలన విజయం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ఎప్‌సెట్ ఫలితాల్లో నారాయణ విద్యార్థులు సంచలన విజయం సాధించారు. రాష్ట్రస్థాయిలో 4,5,7,8, 12 వంటి అత్యుత్తమ ర్యాంకులను సాధించి ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు నారాయణ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ పి సింధూర నారాయణ, డైరెక్టర్ పి శరణి నారాయణ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంజినీరింగ్ విభాగంలో 4,7,8,12,19, 20, 22, 23, 25, 27, 37, 40, 43, 45, 46, 50 ర్యాంకులను సాధించారని తెలిపారు. వందలోపు 16 ర్యాంకులు నారాయణ విద్యార్థులే సాధించారని పేర్కొన్నారు. అగ్రి, ఫార్మా విభాగంలో వందలోపు 50 ర్యాంకులు పొందారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా నారాయణ తప్ప ఇతర ఏ విద్యాసంస్థ ఈ స్థాయి ర్యాంకులను సాధించలేదని వివరించారు. టాప్ ర్యాంకులు సాధించడమే లక్ష్యంగా విద్యాప్రణాళిక రూపొందించడం ద్వారానే ఈ విజయం సాధ్యమైందని తెలిపారు.

స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి

- బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాంయాదవ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాంయాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేదంటే బీసీలంతా ఏకమై ఉద్యమాలు చేపడతారని హెచ్చరించారు. శనివారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం పేరుతో అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధిపొందిందనీ, కుల గణన ఎప్పటిలోగా పూర్తి చేస్తారో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రణాళికలో భాగంగా కామారెడ్డి విజయభేరి బహిరంగసభలో బీసీ డిక్లరేషన్‌ను ఆ పార్టీ ప్రకటించిందని గుర్తు చేశారు. ఆ డిక్లరేషన్ ప్రకారం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే కులగణన చేపట్టి, బీసీలకు 42శాతం రిజర్వేషన్లను కల్పించిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నిలను నిర్వహిస్తామని వాగ్దానం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. బడ్జెట్‌లో బీసీలకు రూ. లక్ష కోట్లు కేటాయిస్తామనీ,ఎంబీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేస్తామని వాగ్దానం చేసిందన్నారు. కానీ..వాటి గురించి కాంగ్రెస్ ఇప్పుడు సన్నాయి నొక్కులు నొక్కుతున్నదని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఉద్దేశపూర్వకంగానే బీసీలను విస్మరిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు కోసం బీసీ జనసభ ఆధ్వర్యంలో దశలవారీ పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ నెల 22న జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు,సదస్సులు, రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. 25న అధికారులకు వినతి పత్రాలు సమర్పిస్తామనీ, వచ్చేనెల 8న చలో ఇందిపార్కు కార్యక్రమానికి పిలుపునిస్తున్నామని చెప్పారు. 15న సచివాలయాన్ని ముట్టడి చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాగేందర్, సూర్య, మేకల కృష్ణ, సంతోష్, మధు, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

డిస్కంల పేర్లు మార్పు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ రాష్ట్ర దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎస్పీడీసీఎల్) పేరు మారింది. టీఎస్ స్థానంలో టీజీగా మారుస్తూ కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల పేర్లను టీఎస్ స్థానంలో టీజీగా మార్చాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు ఇచ్చారు. దానిలో భాగంగా టీఎస్ఎస్పీడీసీఎల్ పేరును టీజీఎస్పీడీసీఎల్‌గా మారుస్తూ ఆ సంస్థ సీఎమ్‌డీ ముషారఫ్ ఫారూఖీ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. డిస్కం పేరును సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్‌గా మార్చారు.

సంస్థ లోగోలో కూడా సవరణలు చేసి, కొత్త లోగోను విడుదల చేశారు. అలాగే తెలంగాణ రాష్ట్ర ఉత్తర ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎన్పీడీసీఎల్) పేరును కూడా మారుస్తూ ఆ సంస్థ సీఎమ్‌డీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ (టీజీఎన్పీడీసీఎల్)గా పేరు మార్చారు. ఈ మేరకు ఆ కంపెనీ లోగోలోనూ మార్పులు చేశారు.

ఉద్యోగాలిప్పిస్తామంటూ మోసం

- లక్షల్లో వసూలు
- బాధితులను నమ్మించేందుకు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు
- పాత నేరస్తుడు అరెస్ట్

నవతెలంగాణ-సిటీబ్యూరో

దక్షిణ మధ్య రైల్వే, ఆదాయపు పన్ను శాఖల్లో బ్యాక్‌లాగ్ ఉద్యోగాలిపిస్తానంటూ అమాయకులను మోసం చేసి లక్షలు దండుకున్న పాత నేరస్తున్ని నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. డీసీపీ ఎస్.రష్మీ పెరుమాళ్ శనివారం వివరాలు వెల్లడించారు.. ఏపీ తెనాలికి చెందిన సూర్యదేవర అనిల్‌కుమార్ హైదరాబాద్ యాప్రాల్‌లో నివాసముంటున్నాడు. సులువుగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడితే తక్కువ సమయంలో పెద్దఎత్తున డబ్బులు వస్తాయని పథకం వేశాడు. వివిధ గ్రూపులు, తెలిసిన వారు, స్నేహితుల ఫోన్ నెంబర్లతో ఓ వాట్సాప్ గ్రూప్ సృష్టించాడు. దాని ద్వారా అమాయకులను ఎంచుకుని టార్గెట్ చేసేవాడు. వారితో చాటింగ్ చేసి దక్షిణ మధ్యరైల్వే, పాట్నాలోని ఆదాయపు పన్ను శాఖల్లో పెద్దఎత్తున ఇన్‌స్పెక్టర్ ర్యాంక్, టీటీఈ తదితర బ్యాక్‌లాగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని నమ్మించాడు. నవీన్‌కుమార్ అనే వ్యక్తితో కలిసి ఒక్కో ఉద్యోగానికి రూ.5 నుంచి 10లక్షలు డిమాండ్ చేసేవాడు. డబ్బులిచ్చిన వారికి సూర్యదేవర అనిల్ కుమార్ నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ కాపీలు ఇచ్చేవాడు. ఆరు నెలల ట్రైనింగ్ పేరుతో మరికొంత డబ్బులు దండుకునేవాడు. ఇదే తరహాలో నగరానికి చెందిన హుస్సేన్ అనే వ్యక్తిని టార్గెట్ చేసిన నిందితుడు.. వాట్సాప్ గ్రూప్‌లో చేర్చాడు. రైల్వే శాఖలో 'టీటీఈ' ఉద్యోగం ఇప్పిస్తానని రూ.10లక్షలు డిమాండ్ చేశాడు. డబ్బులు తీసుకున్న నిందితుడు.. బాధితున్ని పాట్నాకు పిలిపించి సికింద్రాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వేలో 'టీటీఈ'గా ఉద్యోగం వచ్చిందని నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్‌ను అందించాడు. నవీన్ కుమార్ అనే టీటీఈ వద్ద ఆరు నెలలపాటు ట్రైనింగ్ చేయాలని చెప్పాడు. దాంతో బాధితుడు సికింద్రాబాద్‌కు చేరుకుని నవీన్ కుమార్‌ను సంప్రదించడంతో అతను అదనపు డబ్బులు డిమాండ్ చేశాడు.

అనుమానం వచ్చిన బాధితుడు గోపాలపురం పోలీసులను ఆశ్రయించాడు. డీసీపీ రష్మీ పెరుమాళ్ ఆదేశాలతో నిందితుడిని అరెస్టు చేసి విచారించడంతో అతనిపై పలు కేసులున్నాయని తేలింది. ఉద్యోగ, వ్యాపార అవకాశాలు కల్పిస్తామని చెప్పే వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని డీసీపీ సూచించారు.

ఎప్‌సెట్ టాపర్లు అబ్బాయిలే

(మొదటిపేజీ తరువాయి)

74,262 (75.85 శాతం) మంది ఉత్తీర్ణత పొందారు. 1,50,788 మంది అబ్బాయిలు దరఖాస్తు చేస్తే, 1,42,716 మంది పరీక్ష రాశారు. వారిలో 1,06,162 (74.39 శాతం) మంది అర్హత పొందారు. అంటే ఇంజినీరింగ్ విభాగంలో అబ్బాయిల కంటే అమ్మాయిలు 1.46 శాతం మంది అధికంగా ఉత్తీర్ణులయ్యారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి 1,00,432 మంది దరఖాస్తు చేయగా, 91,633 మంది పరీక్ష రాశారు.

వారిలో 82,163 (89.67 శాతం) మంది అర్హత సాధించారు. ఇందులో 73,377 మంది అమ్మాయిలు దరఖాస్తు చేస్తే, 66,969 మంది పరీక్షకు హాజరయ్యారు. వారిలో 60,395 (90.18 శాతం) మంది అర్హత పొందారు. 27,055 మంది అబ్బాయిలు దరఖాస్తు చేయగా, 24,664 మంది పరీక్షకు హాజరయ్యారు. వారిలో 21,768 (88.26 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. అంటే అబ్బాయిల కంటే అమ్మాయిలు 1.92 శాతం మంది అధికంగా అర్హత పొందారు. గతేడాదితో ఇంజినీరింగ్‌లో 80.34 శాతం, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో 86.31 శాతం ఉత్తీర్ణత నమోదైంది. గతేడాది కంటే ఈ ఏడాది ఇంజినీరింగ్‌లో 5.36 శాతం తక్కువ ఉత్తీర్ణత వచ్చింది. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో గతేడాది కంటే 3.36 శాతం అధికంగా ఉత్తీర్ణత నమోదైంది.

ఆన్‌లైన్‌లో బీ కేటగిరీ సీట్ల భర్తీని పరిశీలిస్తాం : బుర్రా వెంకటేశం

రాష్ట్రంలో ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు సంబంధించి వారం రోజుల్లో కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేస్తామని విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం చెప్పారు. అనుబంధ గుర్తింపు ప్రక్రియ కొనసాగుతున్నదని అన్నారు.

కౌన్సెలింగ్ షెడ్యూల్ వచ్చే నాటికి కాలేజీలకు అనుబంధ గుర్తింపు ప్రక్రియను పూర్తి చేస్తామన్నారు. బీ కేటగిరీ సీట్ల భర్తీపై సమీక్ష నిర్వహిస్తామని చెప్పారు. నీట్ తరహాలో యాజమాన్య కోటా సీట్లను ఆన్‌లైన్‌లో భర్తీ చేసే అంశాన్ని పరిశీలిస్తామని అన్నారు.

తల్లిదండ్రులు, విద్యార్థుల్లో ఉండే ఆసక్తి వల్లే ప్రయివేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో సీఎస్ఈ సీట్లు ముందే భర్తీ అవుతున్నాయని వివరించారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఆన్‌లైన్‌లో ధ్రువపత్రాల పరిశీలన చేపడతామన్నారు.

పదో తరగతి విద్యార్థులకు పర్మినెంట్ నెంబర్ ఇస్తున్నామని చెప్పారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఆన్‌లైన్‌లోనే వస్తున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి, వైస్ చైర్మెన్లు వి వెంకటరమణ, ఎస్‌కే మహమూద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, జేఎన్టీయూ హైదరాబాద్ వీసీ కట్టా నర్సింహారెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, ఎప్‌సెట్ కన్వీనర్ బి డీన్‌కుమార్, కోకన్వీనర్ కె విజయకుమార్‌రెడ్డి, కోఆర్డినేటర్లు ఎస్ తారా కళ్యాణి, ఎస్ దర్గాకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎప్‌సెట్ ఫలితాల వివరాలు

విభాగం	ఇంజనీరింగ్			అగ్రికల్చర్, ఫార్మసీ		
	అబ్బాయిలు	అమ్మాయిలు	మొత్తం	అబ్బాయిలు	అమ్మాయిలు	మొత్తం
దరఖాస్తు	1,50,788	1,03,962	2,54,750	27,055	73,377	1,00,432
హాజరు	1,42,716	97,902	2,40,618	24,664	66,969	91,633
అర్హత	1,06,162	74,262	1,80,424	21,768	60,395	82,163
శాతం	74.39	75.85	74.98	88.26	90.18	89.67

కేటగిరీల వారీగా ఎప్‌సెట్ ఫలితాలు

కేటగిరీ	ఇంజనీరింగ్				అగ్రికల్చర్, ఫార్మసీ			
	దరఖాస్తు	హాజరు	అర్హత	శాతం	దరఖాస్తు	హాజరు	అర్హత	శాతం
బీసీ-ఏ	20,292	19,192	12,436	64.79	7,451	6,789	5,449	80.26
బీసీ-బీ	50,458	48,382	33,715	69.68	14,258	13,140	10,989	83.63
బీసీ-సీ	1,350	1,248	874	70.03	828	731	643	87.96
బీసీ-డీ	51,205	48,757	32,818	67.30	16,666	15,336	12,149	79.22
బీసీ-ఈ	13,731	13,160	8,3337	63.35	11,520	10,762	9,179	85.29
ఓసీ	75,329	70,021	52,386	74.81	12,450	11,173	10,052	89.97
ఎస్సీ	27,447	25,730	25,730	100	24,239	21,927	21,927	100
ఎస్టీ	14,938	14,128	14,128	100	13,020	11,775	11,775	100
మొత్తం	2,54,750	2,40,618	1,80,424	74.98	1,00,432	91,633	82,163	89.67

ఎప్‌సెట్ టాప్ ర్యాంకుల వివరాలు

ఇంజనీరింగ్ విభాగం

ర్యాంకు	పేరు	మార్కులు	జిల్లా
1	సతివాడ జ్యోతిరాధిత్య	155.634463	శ్రీకాకుళం, ఏపీ
2	గొల్లలేఖ హర్ష	152.086111	కర్నూల్, ఏపీ
3	రిషి శేఖర్ శుక్లా	150.669242	సికింద్రాబాద్, తెలంగాణ
4	భోగలపల్లి సందేశ్	149.590553	హైదరాబాద్, తెలంగాణ
5	సాయి యశ్వంత్‌రెడ్డి	145.645063	కర్నూల్, ఏపీ
6	పుట్టి కుషాల్ కుమార్	142.825195	అనంతపూర్, ఏపీ
7	హుందేకర్ విదిత్	142.57798	రంగారెడ్డి, తెలంగాణ
8	రోషన్ సాయి పబ్బ	141.827389	హైదరాబాద్, ఏపీ
9	కొంతం మణితేజ	141.455249	వరంగల్, తెలంగాణ
10	ధనుకొండ శ్రీనిధి	141.005319	విజయనగరం, ఏపీ

అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం

ర్యాంకు	పేరు	మార్కులు	జిల్లా
1	అలూర్ ప్రణీత	146.444924	అన్నమయ్య, ఏపీ
2	నగుదాసరి రాధాకృష్ణ	145.423552	విజయనగరం, ఏపీ
3	గడ్డం శ్రీ వర్షిణి	145.255026	వరంగల్, తెలంగాణ
4	సాకేత్ రాఘవ్	145.101468	చిత్తూర్, ఏపీ
5	రేపాల సాయి వివేక్	144.622632	హైదరాబాద్, తెలంగాణ
6	మహమ్మద్ అజాన్ సాద్	144.612226	మేడ్చల్ , తెలంగాణ
7	ముకేశ్ చౌదరి	143.519596	తిరుపతి, ఏపీ
8	జెన్ని భార్గవ్ సుమంత్	143.508047	మేడ్చల్ , తెలంగాణ
9	జయసెట్టి ఆదిత్య	142.993808	హైదరాబాద్, తెలంగాణ
10	పూల దివ్యతేజ	141.011392	శ్రీసత్యసాయి, ఏపీ

రేపటినుంచి ఆన్‌లైన్‌లో టెట్ రాతపరీక్షలు

- 2,86,386 మంది దరఖాస్తు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) రాతపరీక్షలు ఆన్‌లైన్‌లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) విధానంలో సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. వచ్చేనెల రెండో తేదీ వరకు అవి జరుగుతాయి. ఈనెల 20, 21, 22, 24, 28, 29 తేదీల్లో పేపర్-2, ఈనెల 30, 31, వచ్చేనెల ఒకటి, రెండో తేదీన పేపర్-1 రాతపరీక్షలను నిర్వహిస్తారు. వచ్చేనెల ఒకటో తేదీన పేపర్-2 మ్యాథ్స్, సైన్స్ అభ్యర్థులకు మైనర్ మీడియంలో రాతపరీక్ష ఉంటుంది. సోమవారం నుంచి ప్రారంభమయ్యే రాతపరీక్షలకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. కరాష్ట్రవ్యాప్తంగా టెట్‌కు 2,86,386 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. వారిలో పేపర్-1కు 99,958 మంది, పేపర్-2కు 1,86,428 మంది ఉన్నారు.

15 నిమిషాల ముందే గేట్లు మూసివేత

ఈనెల 20 నుంచి వచ్చేనెల రెండో తేదీ వరకు ఆన్‌లైన్‌లో టెట్ పరీక్షలను విద్యాశాఖ అధికారులు నిర్వహిస్తారు. ప్రతిరోజూ ఉదయం తొమ్మిది నుంచి 11.30 గంటల వరకు మొదటి విడత, మధ్యాహ్నం రెండు నుంచి 4.30 గంటల వరకు రెండో విడతలో పరీక్షలు జరుగుతాయి. పరీక్ష ప్రారంభానికి 15 నిమిషాల ముందే పరీక్షా కేంద్రం గేట్‌ను మూసివేస్తారు. అంటే ఉదయం విడతకు 8.45 గంటలకు, మధ్యాహ్నం విడతకు 1.45 గంటలకే గేట్‌ను అధికారులు మూసివేస్తారు. బయోమెట్రిక్ విధానం అమల్లో ఉన్నందున అభ్యర్థులను పరీక్ష ప్రారంభానికి గంటన్నర ముందు నుంచే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌తోపాటు బ్లాక్/బ్లూ బాల్ పాయింట్ పెన్ను, ఫొటో గుర్తింపు కార్డును వెంటతెచ్చుకోవాలని అధికారులు సూచించారు. కాలిక్యులేటర్లు, లాగరిథమ్ టేబుళ్లు, పేజర్, సెల్‌ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించబోమని అధికారులు స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బుల్లిపెట్టెలో బూచి

- అడుగడుగునా నిఘా
- ప్రత్యామ్నాయాలకోసం వెతుకులాట



న్యూఢిల్లీ : ప్రభుత్వ అధికారులు పలువురు సాధారణ ఫోన్‌కాల్ కన్నా వాట్సప్ కాల్‌లో మాట్లాడటానికి ప్రాధాన్యత ఇవ్వడం గమనించే ఉంటారు. దీనికి కారణం భయం...నిఘా భయం! తమ ఫోన్లను ఎవరో వింటున్నారన్న భయం! ఆ వినేది ఎవరో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు కదా! మన రాష్ట్రంలోనే కాదు, దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో .. ముఖ్యంగా బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఇదే స్థితి నెలకొంది! నరేంద్రమోడీ నేతృత్వంలో బిజెపి ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత గత పదేళ్ల కాలంలో మొబైల్ ఫోన్లు నియంతృత్వ సాధనాలుగా ఎలా మారిపోయాయో వివరిస్తూ 'ది వైర్' ఒక కథనాన్ని ప్రచురించింది. ఈ కథనం ప్రకారం దేశ వ్యాప్తంగా నూతన సాంకేతికతను ప్రభుత్వమే పెద్ద ఎత్తున దుర్వినియోగం చేస్తోంది. ప్రజా ఉద్యమకారులు, అభ్యుదయ శక్తులు, నిష్పాక్షికంగా వ్యవహరించే పాత్రికేయులు, రాజకీయంగా గిట్టని వారు చివరకు అధికార యంత్రాంగంలో స్వతంత్రంగా వ్యవహరించే వారు ఇలా వివిధ తరగతులకు చెందిన వారు ప్రభుత్వ లక్ష్యాలుగా మారిపోతున్నారు.

ఇజ్రాయిల్ స్పైవేర్ పెగాసెస్‌తో ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలు, లాయర్లు, జర్నలిస్టుల ఫోన్‌లను ట్యాప్ చేయడం దీనికో పెద్ద నిదర్శనం. ఈ సంఘటన దేశ వ్యాప్తంగా కలకలం రేపిన విషయం తెలిసిందే. ప్రజాస్వామ్య దేశంలో చోటుచేసుకున్న ఈ సర్కారీ నిఘా అంతర్జాతీయంగానూ చర్చనీయాంశమైంది. ఈ స్పైవేర్ విక్రయించే ఎన్ఎస్ఓ గ్రూపు తాము ప్రభుత్వాలకు, ప్రభుత్వ సంస్థలకు మాత్రమే దీనిని విక్రయిస్తామని చెప్పిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించి సుప్రీంకోర్టులో దాఖలైన కేసులో జాతీయ భద్రత దృష్ట్యా అన్ని వివరాలను వెల్లడించలేమని కేంద్ర ప్రభుత్వం ధర్మాసనానికి విన్నవించింది. ఒకవైపు ప్రభుత్వమే ట్యాపింగ్ చేస్తూ, మరోవైపు జాతీయభద్రతను ముసుగుగా తెచ్చుకోవడమేమిటని పౌరసమాజం అడిగిన ప్రశ్నకు నరేంద్రమోడీ ప్రభుత్వం నుండి ఇంతవరకు సమాధానం లేదు. కొన్ని సంవత్సరాల క్రితం యాపిల్ ఫోన్ల సంస్థ పలువురి ఫోన్లు ట్యాపింగ్‌కు గురవుతున్నాయంటూ మెసేజ్‌లు పంపిన సంగతి తెలిసిందే. ఈ సంస్థ నుండి ఈ తరహా హెచ్చరికలు అందిన వారిలో రాజకీయనేతలు, జర్నలిస్టులు, లాయర్లు ఉన్నారు. కొద్దిరోజుల క్రితమే జైలులో ఉన్న ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఫోన్ ట్యాప్ చేయడానికి ప్రయత్నం జరిగిందని, దానిని తామే అడ్డుకున్నామని యాపిల్ సంస్థ ప్రకటించింది. ఇలా ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ సాధనాల్లోకి జొరబడటం, తమకు కావాల్సిన సమాచారాన్ని సేకరించడం, లేదా సృష్టించి తప్పుడు కేసులు పెట్టడం కూడా ఈ కాలంలో సాధారణ అంశంగా మారింది. భీమా కోరెగావ్ కేసులు దీనికి పెద్ద ఉదాహరణ. కేసులేమైనప్పటికీ ఎలక్ట్రానిక్ పరికరాలను ముఖ్యంగా సెల్ ఫోన్లను పోలీస్ అధికారులు స్వాధీనం చేసుకుంటున్న సంగతి తెలిసిందే. ఇలా ఫోన్లను స్వాధీనం చేసుకుంటున్న సంఘటనలు కూడా ఇటీవలే పెరిగాయి. 2022లో 'ది వైర్ జర్నలిస్టు'లపై పరువు నష్టం కేసు దాఖలైంది. దీనికి సంబంధించి 2023లో ఒక రోజు తెల్లవారు జామున 60కి పైగా ప్రాంతాల్లో దాడులు చేసి జర్నలిస్టుల నుండి ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. న్యూస్ క్లిక్ విషయంలో 250కిపైగా ఫోన్లను ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు. వాటి ఆధారంగా తప్పుడు కేసులు పెట్టడానికి ప్రయత్నించారు.

ఫోన్‌లలోకి ప్రభుత్వం..!

సెల్‌ఫోన్ల వినియోగం అత్యంత సాధారణమైన ప్రస్తుత రోజుల్లో సాధారణ ప్రజల ఫోన్లలోకి కూడా ప్రభుత్వం ప్రవేశిస్తోంది. ఆధార్, మొబైల్ లింకేజి ద్వారా ఇప్పటికే ఈ తరహా సమాచారం ప్రభుత్వానికి చేరింది. డిజిలాకర్, డిజియాత్ర వంటి యాప్‌ల నుండి కూడా ప్రభుత్వం ప్రజల సమాచారాన్ని సేకరిస్తోంది. ఈ క్రమంలో సెల్‌ఫోన్లు వాడే ప్రతి ఒక్కరూ ప్రభుత్వ నిఘా పరిధిలోకి వచ్చేశారన్న అభిప్రాయాన్ని టెక్ నిపుణులు వ్యక్తం చేస్తున్నారు. అంటే, ప్రతి ఒక్కరిపైనా తప్పుడు కేసుల కత్తి వేలాడుతున్నట్టే!

విభజించి పాలిస్తున్న ప్రధాని మోడీ

- కాంగ్రెస్ చీఫ్ ఖర్గే విమర్శలు



ముంబయి : తన ఎన్నికల ప్రసంగాల ద్వారా ప్రధాని నరేంద్ర మోడీ ప్రజలను రెచ్చగొడుతున్నారని, సమాజాన్ని చీలుస్తున్నారని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే విమర్శించారు. మోడీకి ముందు ప్రధానులు ఎవరూ కూడా ఇలా ప్రజలను రెచ్చగొట్టలేదన్నారు. ప్రధాని ప్రజాస్వామ్యం గురించి మాట్లాడతారు కానీ దాని సూత్రాలను అమలు చేయరని ఖర్గే వ్యాఖ్యానించారు. ఐదవ, తుది విడత పోలింగ్ నేపథ్యంలో ఖర్గేతోపాటు ఇండియా బ్లాక్ నేతలు పలువురు మహారాష్ట్రలో ఎన్నికల సభల్లో పాల్గొన్నారు. ఇండియా బ్లాక్ అధికారంలోకి వస్తే 370వ అధికరణని తిరిగి తీసుకువస్తుందని మోడీ పదే పదే చెబుతుండడంపై మీడియా ప్రశ్నించగా, మోడీకి తాను జవాబుదారీ కాదన్నారు. మేనిఫెస్టోలో ఏం హామీ ఇచ్చామో అదే చేస్తామన్నారు. వెళ్ళిన చోటల్లా ప్రజలను విభజించి పాలించడమే పద్ధతిగా పెట్టుకున్నారంటూ మోడీని విమర్శించారు. అధికారంలోకి వస్తే అయోధ్యలో ఆలయంపై బుల్డోజరు ఎక్కిస్తుందని మోడీ చేసిన వ్యాఖ్యలపై ప్రశ్నించగా తమవి బుల్డోజరు రాజకీయాలు కావని ఖర్గే స్పష్టం చేశారు.

'శ్రమ దోపిడీ' ఆదాయాలు!





పార్ట్ 2

3. 'లాభం' ఎలా వస్తుంది? : ఇది, 'పెట్టుబడి' అనే మాటతో పాటు బైల్దేరింది! ఒక వ్యక్తి, కొంత డబ్బుని ఖర్చు పెట్టి, కొన్ని వస్తువుల్ని తయారు చేయించడానికి పనివాళ్ళని జీతాలతో కుదుర్చుకుని, కొత్త వస్తువులు తయారైన తర్వాత, వాటిని వేరే పని వాళ్ళతో అమ్మించి, ఆ వస్తువులకు ఎంత విలువ వుంటుందో, ఆ విలువని బట్టి డబ్బు తీసుకుంటాడు. ఆ డబ్బులో కొంత భాగం 'లాభం' అనేది! మొదట చెప్పుకున్న 3 దోపిడీ ఆదాయాలలో, 'లాభం'ని తెలుసుకోవడం అతి ముఖ్యం! అదేమిటంటే, తయారైన కొత్త వస్తువు కోసం జరిగిన శ్రమల విలువలన్నీ కలిసి, కొత్త వస్తువుకి, మొత్తం విలువ అవుతుంది. ఆ కొత్త వస్తువుని అమ్మినప్పుడు, దాని విలువకి బదులు డబ్బు వస్తుంది! ఆ డబ్బు అంతా, శ్రమల విలువే కదా? ఆ విలువలో లాభం వుండడం అంటే, అందులో 'లాభం' ఎలా వుంటుంది? ఎలా వుంటుందో చూడాలి! తయారైన వస్తువు విలువలో లాభం ఉండడం తప్పెలా అవుతుంది? లాభాన్ని కూడా తప్పు అనడం ఎలాగ? లాభం కూడా తప్పుడు ఆదాయమేనా?-అని ప్రశ్నలు! అవును! లాభం కూడా తప్పుడు ఆదాయమే! దాన్ని గురించి వినాలి మరి!

ఒక కొత్త వస్తువుని అమ్మినప్పుడు, దానికి వున్న విలువని బట్టే డబ్బు వస్తుందనేది నిజమే! ఆ వస్తువు (ఏ వస్తువు అయినా) తయారవడానికి అవసరమైన శ్రమ అనే దానిలో, మొదట ముడి వస్తువుల 'పాత శ్రమ' కొంతా, ఆ ముడి వస్తువుల మీద జరిగిన 'కొత్త శ్రమ' కొంతా, జరిగితేనే ఆ వస్తువు తయారవుతుంది కదా? ఆ పాతా, కొత్తా శ్రమల కోసం, కొంత డబ్బు ఖర్చయితే, దాని పేరు, 'పెట్టుబడి'! పెట్టుబడి పెట్టిన మనిషి పేరు 'పెట్టుబడిదారుడు'! ఆ పెట్టుబడిదారుడు, కొత్త వస్తువు తయారవడానికి అవసరం అయ్యే ముడి వస్తువులన్నిటిని, (అంటే, మొదట కావలసిన ఉత్పత్తి సాధనాల్ని) అంతకు ముందే వేరే చోట నించి 10 రూపాయల డబ్బుతో కొనేసి తెచ్చాడు.

తర్వాత, అతడి పనిస్థలంలో జరిగేది, కొత్త వస్తువు తయారీ కోసం జరిగే 'కొత్త శ్రమ'! ఈ కొత్త శ్రమ కోసం, కుట్టు మిషను వంటి ఏవైనా మిషన్లు వుంటే, అవి అప్పటికే తయారై వున్న ఉత్పత్తి సాధనాల కిందకే వస్తాయి. జీతం శ్రామికుడు చేసిన కొత్త శ్రమ విలువని 90 అనుకుందాం.

పెట్టుబడిదారుడు, కొత్త వస్తువుల తయారీ కోసం, మొదట (1) ఉత్పత్తి సాధనాల్ని కొని తెస్తాడు. (2) కొత్త వస్తువుని తయారు చేసే శ్రామికులకి జీతం కోసం ఇచ్చేది రెండో ఖర్చు! - ఈ 2 ఖర్చులతో, కొత్త వస్తువు తయారవుతుందా? - కొత్త శ్రమ చేసిన శ్రామికుడి శ్రమ విలువని 90 అనుకున్నాం కదా? అతనికి జీతంగా ఇచ్చింది 60 అనుకుందాం. అంటే, అతనికి వెళ్ళనిది ఎంత?

చేసిన పని విలువ- 90.
పనిమనిషికి జీతం- 60.
పనిమనిషికి అందనిది-30.

వస్తువుని తయారు చేయించే యజమానికి, తను, పనిమనిషికి జీతంగా తక్కువగా ఇచ్చాననీ, అతను చేసిన పనికి ఎక్కువ విలువ వుంటుందనీ, తెలుస్తుందా? ఇప్పుడైతే అన్నీ తెలిసే వుంటాయి. 'పెట్టుబడిదారీ విధానం' ప్రారంభమైన మొదటి కాలంలో అయితే, ఇప్పుడు తెలిసిందంతా తెలిసి వుండదు.కొత్త వస్తువుకి ఏర్పడే 'ధర' సంగతి ఏమిటి?-అదే చూడాలి. వస్తువుని అమ్మడానికి ధరని యజమానే నిర్ణయిస్తాడు. వస్తువు కోసం 2 ఖర్చులే చేశాను కదా - అని, సాధనాల 10+జీతం 60 అని తెలుసు. తనకి, ఆ 70తో పాటు తప్పకుండా 'లాభం' కూడా కొంత రావాలి అనుకుంటాడు! ఈ ఉదాహరణలో, కొత్త వస్తువు ధరని యజమాని 100గా నిర్ణయించాడనుకుందాం! వస్తువు అలాగే అమ్ముడైంది.

వస్తువు ధర - 100
జరిగిన ఖర్చు- 70
ధరలో మిగులు - 30.

ఇది ఒక వస్తువు వల్ల లాభం! లాభంగా 30 చాలనుకున్నాడని కాదు. ఇతర పెట్టుబడిదార్ల లాభం రేట్లని చూసి, దాదాపుగా ఈ లాభంతో సంతఅప్తి పడతాడు. వస్తువు అమ్మకం 10 నిమిషాల్లో జరిగితే, 10 నిమిషాల్లో వచ్చే లాభం అది! ఇక రోజంతా, వారం అంతా, నెల అంతా, నిత్యం, అమ్మకాలు జరుగుతూ లాభాలు వస్తూ వుంటే?

తార్కికమైన ఆర్థిక శాస్త్ర లెక్క ప్రకారం, ఏ వస్తువు అయినా, దానికి వున్న అసలు విలువకే అమ్మకం అవుతుందని భావించాలి! ఇలా గాక, సప్లై-డిమాండ్ల వల్ల కొన్ని వస్తువులు అసలు విలువలతో గాక, కొంత పెద్ద ధరలతో గానీ, చిన్న ధరలతో గానీ అమ్ముడైనా, మొత్తంగా చూసినప్పుడు, సరుకుల ధరలు, వాటి విలువలతో సమానంగానే వుంటాయి.

ఈ ఉదాహరణలో, ఒక వస్తువు ధర 100 అయితే, అది, దాని విలువని బట్టి! ఆ వస్తువు తయారీకి జరిగిన శ్రమల్ని బట్టి ఏర్పడిన ధరే! అయితే, సాధనాల పాత శ్రమ విలువ 10, కొత్త శ్రమ కోసం జీతం విలువ 60. రెండూ కలిసి 70 విలువ గల శ్రమ మాత్రమే జరిగింది కదా? 100 శ్రమ లేకుండా 100 ధరతో అమ్మకం ఎలా జరిగింది? తార్కిక ఆర్థిక శాస్త్రం లెక్కే అయితే, ఈ 70 ఖర్చుతో అదే ధర అవ్వాలి కదా? అది నిజమే. కానీ, ఆ వస్తువు కోసం జరిగిన శ్రమ 70 మాత్రమే కాదు.

100 శ్రమ జరిగిందనే అనుకోవాలి. ఇది, ఎలా తెలుస్తుంది? లాభంగా అయిన 30 కూడా శ్రమే కదా? వస్తువు 100కి అమ్మకం అయితే, ఆ వస్తువు ధర, దాని శ్రమ విలువని బట్టే అలా ఏర్పడింది. 100 ధర నిజమైన శ్రమ విలువ అయితే, ఆ విలువ ఎలా వచ్చి వుంటుంది? ఆ వస్తువు తయారవడానికి, అంత విలువగల శ్రమ జరిగివుంటుందనే అవగాహనకు రావాలి! ఈ ఉదాహరణలో, సాధనాల వల్ల అయితే, 10కన్నా ఎక్కువ విలువ రాదు. ఇక రెండో అంశం. కొత్త శ్రమ చేసిన శ్రామికుడి శ్రమ! ఈ శ్రమకి 60 జీతం అందితే, ఆ కొత్త శ్రమ విలువని 60గా మాత్రమే గాక, దానికన్నా ఎక్కువ విలువే వుందని అనుకోవాలి! ఈ అనుకోవడం, వస్తువు యజమాని చెయ్యడు! తార్కికంగా, నిజాయితీగా ఆర్థిక విషయాల్ని చర్చించే ఆలోచనాపరులు చెయ్యాలి. చివరికి తేలేది యేమిటి? కొత్త శ్రమ చేసిన శ్రామికుడి శ్రమకి 60 విలువ అబద్ధం! అయితే, ఎంత ఉండి వుంటుంది? పెట్టుబడిదారుడికి ఒక వస్తువు వల్ల, లాభంగా వచ్చిన 30 ఎలా, ఎటువేపు నించి వచ్చింది అవుతుందో చూడాలి! శ్రామికుడి శ్రమకి వున్న విలువలోనించి, అతడికి 'జీతం'గా వెళ్ళింది తక్కువనీ, అతడి శ్రమకి నిజంగా వున్న విలువక్మజీతం 60+యజమానికి వెళ్ళిన లాభం 30క్మ90. అంటే, కొత్త శ్రమ చేసిన శ్రామికుడి శ్రమ విలువ 90 అన్నమాట! 90లో నించి, అతడికి జీతంగా 60 అందితే, అందనిది 30. ఇదే లాభం. **(మార్క్స్: "పెట్టుబడి లాక్కునే లాభం ఎక్కడినించి వస్తుంది అంటే, వాస్తవానికి, తను ఏమీ చెల్లించని దేన్నో ఒక దాన్ని అమ్ముకోవడం ద్వారా మాత్రమే.")** ఈ సంగతి శ్రామికుడికి బత్తిగా తెలీదు.

పెట్టుబడిదారుడికి అయితే, తన గత లాభాల అనుభవాలతో అలా ఊహించి, ఆ ధర పెట్టి వుండవచ్చు. ఒక వేళ అతను, ఆ ధరని 100గా గాక 120గా పెడితే? అలాంటి వేరే ధరలే వైరుధ్యాలు లేకుండా అమ్ముడవుతూ వుంటే? అప్పుడు, కొత్త శ్రమ చేసిన శ్రామికుడి శ్రమ విలువని 90గా గాక, ఇంకో 20ని కలిపి, 110గా భావించాలి! అప్పుడు, సాధనాల 10+శ్రామికుడి శ్రమ విలువ 110క్మ120. ఇది, పెట్టుబడిదారుడు పెట్టిన ధర.

అప్పుడు కూడా, శ్రామికుడి జీతం 60 గానే వుంటే, అతనికి అందని విలువని లెక్కగట్టవచ్చు! అసలు, వేరే లెక్కలెందుకు? 'లాభం'గా పెట్టుబడిదారుడు ప్రకటించుకునేదే, శ్రామికుడికి అందనిదే అవుతుంది కదా? శ్రామికుడికి అందని విలువని, 'అదనపు విలువ' అనాలి! 'అదనం' అంటే, 'జీతం' కన్నా అదనంగా వున్న విలువ! పెట్టుబడిదారుడు, తన వస్తువుల ధరల్ని అన్యాయంగా పెంచితే, డబ్బుని లాగుతూ వుంటే, అప్పుడు శ్రామికుల అదనపు విలువలు పెరిగిపోయినట్టే!

'లాభం' అనేది కూడా తప్పుడు ఆదాయమే- అని, ఇప్పటికి తెలిసిందా?

వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- భారత లోక్ దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పుల్లూరి వెంకట రాజేశ్వరరావు



నవతెలంగాణ-హిమాయత్ నగర్

వడగండ్ల వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని భారత లోక్ దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పుల్లూరి వెంకట రాజేశ్వరరావు ఒక ప్రకటనలో కోరారు. వర్షాల కారణంగా చేతికి వచ్చిన వరి పంట కల్లాల్లో తడిసి ముద్దయిందని, పలు రకాల పండ్ల తోటలు నెలకొరిగాయని, మామిడి కాయలు నెలరాలాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వడగండ్ల వర్షాల కారణంగా పండ్ల తోటల రైతులు తీవ్రంగా నష్టపోయారని, ప్రభుత్వం పంట నష్టం అంచనా వేసి నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు ఉచితంగా ఎరువులు, సబ్సిడీ అందించాలని, రైతు రుణమాఫీ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నేడు ఎస్‌వీకేలో ఉచిత వైద్య శిబిరం

- సీనియర్ ఫ్యామిలీ ఫిజీషియన్ డాక్టర్ శ్రీనివాస్

నవతెలంగాణ-ముషీరాబాద్

బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించనున్న ఉచిత వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ ఫ్యామిలీ ఫిజీషియన్ డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. శనివారం వారు మాట్లాడుతూ ప్రపంచ ఫ్యామిలీ డాక్టర్‌ల దినోత్సవం సందర్భంగా ఎస్‌వీకేలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ ఆరోగ్య శిబిరంలో షుగర్ వ్యాధి, బీపీ, స్కానింగ్ టెస్టులు నిర్వహిస్తామన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సాదూరమ్ కంటి ఆస్పత్రి వారిచే కంటి పరీక్షలు జరుగుతాయని, చిన్నపిల్లల ఆరోగ్యానికి సంబంధించిన పరీక్షలు, లక్ష్మీ దాస్ డయాగ్నొస్టిక్ సెంటర్ వారి రక్త పరీక్షలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ ఆరోగ్య శిబిరానికి ప్రముఖ కంటి వైద్యులు డాక్టర్ కులశేఖర్, చిన్నపిల్లల వైద్యులు నిలోఫర్ ఆస్పత్రి నుంచి కేవీఎస్ నారాయణ, ఫ్యామిలీ ఫిజీషియన్ శ్రీ వర్ధన్, సుధీర్ అందుబాటులో ఉంటారన్నారు.

పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్ పాలసీ అమలు చేయాలి

- సీఐడీఐ నేషనల్ చైర్మెన్ ఎర్రతోట రాజశేఖర్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ఎన్నికల కోడ్ ముగియగానే రాష్ట్ర ప్రభుత్వం పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్ పాలసీ అమలు చేయాలని కన్ఫడరేషన్ ఆఫ్ ఇండియాన్ దళిత్ ఇండస్ట్రీ (సీఐడీఐ) నేషనల్ చైర్మెన్ ఎర్రతోట రాజశేఖర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. గత పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు సబ్సిడీలు ఇవ్వకుండా అణిచివేసిందని ఆయన ఆరోపించారు. ఈ మేరకు శనివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్ఎస్ఎమ్ఈడీ చట్టాన్ని గత ప్రభుత్వం ఉల్లంఘించి దళిత ఆదివాసీ పారిశ్రామికవేత్తల అభివృద్ధిని అడ్డుకుందని ఆరోపించారు. తొమ్మిదేళ్లలో ఎమ్ఎస్ఎమ్ఈడీ చట్టం ద్వారా దళిత పారిశ్రామికవేత్తలకు తెలంగాణ రాష్ట్రంలో రూ.20 వేల కోట్ల నిధులు కేటాయించాల్సి ఉండగా కేవలం రూ.412 కోట్లు మాత్రమే కేటాయించి తమకు తీవ్ర ద్రోహం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు దక్కాల్సిన నిధులు గత పాలకులు వారికి అనుకూలంగా ఉన్న వారికి కేటాయించారని మండిపడ్డారు. కొత్తగా ఏర్పడిన రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల కోడ్ ముగియగానే గత 10 ఏళ్లుగా అన్యాయానికి గురైన దళిత ఆదివాసీ పారిశ్రామికవేత్తలకు పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్ పాలసీ అమలు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సీఐడీఐ ప్రతినిధులు ప్రశాంత్, లక్ష్మణ్, తిరుపతయ్య, ధరణి తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- పుత్లిబౌలి విద్యుత్ సెక్షన్ ఏఈ ప్రణవింద్



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

గత రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పుత్లిబౌలి విద్యుత్ సెక్షన్ ఏఈ ప్రణవింద్ అన్నారు. శనివారం పుత్లిబౌలిలోని విద్యుత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. గత రెండు మూడు రోజుల కురుస్తున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చెట్టుకొమ్మలు విరిగి విద్యుత్ వైర్లపై పడడంతో ఎప్పటికప్పుడు వాటిని తొలగించి విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూస్తున్నామన్నారు. పుత్లిబౌలి విద్యుత్ సెక్షన్ పరిధిలో 13 వేల ఐదు వందల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని తెలిపారు. విద్యుత్ అధికారులు, సిబ్బంది 24 గంటలపాటు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తున్నామన్నారు. విద్యుత్ వినియోగ దారులు సకాలంలో తమ విద్యుత్ పెండింగ్ బిల్లులను చెల్లించాలని సూచించారు. విద్యుత్ సమస్యలు తలెత్తుతే 9490619834, 9490619835 ఈ నెంబర్లను సంప్రదించాలని విద్యుత్ వినియోగదారులకు సూచించారు.

'అధికారుల నిర్లక్ష్యం వల్ల ఇబ్బందులు పడుతున్న టెట్ అభ్యర్థులు'

నవతెలంగాణ-హిమాయత్ నగర్

టెట్ (టీచర్ ఎలిజిబుల్ టెస్ట్) పరీక్ష కేంద్రాల కేటాయింపులో విద్యా శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల టెట్ అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ఈ విషయంపై విద్యా శాఖ అధికారులు, ప్రభుత్వం వెంటనే పునరాలోచన చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మణికంఠ రెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అభ్యర్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించి అభ్యర్థులు పెట్టుకున్న మొదటి ఆప్షన్ ప్రాధాన్యత ఇవ్వకుండా చిట్ట చివరి ఆప్షన్ కు అవకాశం ఇచ్చారని, దీని వల్ల అభ్యర్థులు వందలాది కిలో మీటర్ల ప్రయాణం చేసి పరీక్ష రాయాలంటే అభ్యర్థులపై తీవ్ర ఒత్తిడి పడే అవకాశం ఉందని, ఇది వరకే టెట్ పరీక్ష ఫీజు భారీగా పెంచారని ఇప్పుడు పరీక్ష కేంద్రాల కేటాయింపులు అభ్యర్థులు అత్యధికంగా ఎంచుకున్న సొంత జిల్లా కాకుండా వేరే చోట కేటాయిస్తూ అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని వారు ఆరోపించారు.

'ఉస్మానియా' మార్చురిలో 2 నెలలుగా మృతదేహం



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన అబిడ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అబిడ్స్ ఎస్ఐ సుమన్ తెలిపిన వివరాల ప్రకారం.. రెండు నెలల క్రితం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో తిలక్ రోడ్డు దర్పన్ షాపు ఎదురుగా ఫుట్ పాత్‌పై గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు గుర్తించారు. ఆ శవాన్ని ఉస్మానియా ఆస్పత్రికి మార్చురీకి తరలించినట్టు తెలిపారు. రెండు నెలలుగా ఉస్మానియా మార్చురీలోనే మృతదేహం ఉన్నట్టు చెప్పారు. ఇప్పటికైనా ఆ మృతుని సంబంధీకులు ఉంటే వెంటనే అబిడ్స్ పోలీసులను సంప్రదించాలన్నారు. మిగతా వివరాల కోసం ఫోన్ నెం. 8712660114ను సంప్రదించవచ్చని చెప్పారు.

'జూన్ 9న ప్రపంచ పెరిక కుల ఉచిత వధూవరుల పరిచయ వేదిక'

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

జూన్ 9న ఆదివారం మధ్యాహ్నం 1:30 గంటల నుంచి సాయంత్రం 5:30 వరకు హైదరాబాద్, బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 25వ ప్రపంచ పెరిక కుల ఉచిత వధూవరుల పరిచయ వేదికను నిర్వహిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర పెరిక కుల సంఘం అధ్యక్షులు మద్దా లింగయ్య, కన్వీనర్ సుంకరి ఆనంద్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఉచిత వధూవరుల పరిచయ వేదికలో పెళ్లీడుకొచ్చిన పిల్లలతో సహా వారి తల్లిదండ్రులు పాల్గొని, వారి అభిరుచులకు అనుగుణంగా తగిన జోడిని ఎంచుకుంటారని వారు ఆశించారు. పెళ్లీడుకొచ్చిన పిల్లలతో వచ్చిన వారికే ఈ వేదికపై మొదటి ప్రాధాన్యత, మెరుగైన ఉపయోగం ఉంటుందన్నారు. పెండ్లిళ్ల వ్యాపారులకు ప్రవేశం లేదన్నారు. ఈ వేదికల ద్వారా ఇప్పటి వరకు సుమారు 6 వేల పైబడి పెండ్లిళ్ల జరగడం గొప్ప విశేషమని వారు పేర్కొన్నారు. కోకాపేట పెరిక కుల ఆత్మగౌరవ భవన నిర్మాణ కమిటీ చైర్మన్ గటిక విజయ్ కుమార్, తెలంగాణ రాష్ట్ర పెరిక కుల కో.ఆ.సొసైటీ అధ్యక్షులు అందే శ్రీనివాస రావు, తెలంగాణ పెరిక కుల సంక్షేమ సేవా సమితి ప్రధాన కార్యదర్శి వలిశెట్టి లక్ష్మీ శేఖర్, రాష్ట్ర పెరిక కుల సంఘం ప్రధాన కార్యదర్శి భూసాని శ్రీనివాస్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు బత్తిని పరమేష్, మహిళా విభాగం అధ్యక్షురాలు కందుల సంధ్యారాణి, యువజన విభాగం అధ్యక్షులు దాసరి జయప్రకాష్ ల సహకారంతో ఈ ఉచిత వధూవరుల పరిచయ వేదికను నిర్వహిస్తున్నామని వారు తెలిపారు.

బుక్ చేసిన 24 గంటల్లో ట్యాంకర్ డెలివరీ..!

- జలమండలి ఎండీ ప్రత్యేక దృష్టి
- సత్ఫలితాలిచ్చిన వ్యూహాలు





నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ మహానగరంలో వేసవిలో ఏర్పడ్డ డిమాండ్‌ను అధిగమించి వినియోగదారులు ట్యాంకర్ బుక్ చేసుకున్న 24 గంటల్లో ట్యాంకర్ డెలివరీ చేసే స్థాయికి జలమండలి చేరుకుంది. గతేడాది వర్షాలు లేకపోవడంతో హైదరాబాద్‌లో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. దీంతో వేసవి ప్రారంభం కాకముందే ఫిబ్రవరి నెల నుంచే నీటికి డిమాండ్ ఏర్పడింది. బోర్లపై ఆధారపడే వారు జలమండలిపై ఆధారపడ్డారు. ఈ క్రమంలోనే జలమండలి సరఫరా చేసే ట్యాంకర్లను భారీగా బుక్ చేసుకున్నారు.

30 వేలకుపైగా నగరవాసులు ట్యాంకర్లపై ఆధారం

నగరంలో దాదాపు 30 వేలకుపైగా ప్రజలు పూర్తిగా ట్యాంకర్లపైనే ఆధారపడిన పరిస్థితి ఉంది. దాంతో రోజు రోజుకీ డిమాండ్ విపరీతంగా పెరిగిపోవడంతో 2, 3 రోజులకు ఒకసారి ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా చేసే స్థితికి వచ్చింది. ఆలస్యం కారణంగా ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వినియోగదారుల నుంచి వచ్చిన డిమాండ్‌తో జల మండలి అప్రమత్తమైంది. ఇదిలా వుండగా ప్రత్యేక దష్టి సారించిన సీఎం రేవంత్ రెడ్డి జలమండలి ఉన్నతాధికారులతో పలుసార్లు సమీక్షలు నిర్వహించి 24 గంటల్లోపు ట్యాంకర్ డెలివరీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మరోవైపు జలమం డలి ఎండీ సుదర్శన్ రెడ్డి పరిస్థితిపై నిరంతరం పర్యవేక్షించారు. క్షేత్ర స్థాయి సిబ్బందితో పాటు జల మండలి ఉన్నతాధికారులతో వరుస సమీక్షలు నిర్వహించి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. ఆయా ప్రాంతాల జీఎంలు, సీజీఎంలతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సూచనలు సలహాలను అందించారు. ప్రత్యేక వ్యూహాలు అమలు చేశారు. ఏక కాలంలో రివ్యూలు, ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన ఎండీ క్షేత్రస్థాయిలో సిబ్బంది విధుల్లో నిమగ్నమయ్యే విధంగా చేశారు. అంతేకాకుండా సీసీ కెమెరాల ద్వారా ఆన్ లైన్ మానిటరింగ్ చేశారు. ఫలితంగా పరిస్థితి అదుపులోకి వచ్చి, ట్యాంకర్ బుక్ చేసిన 24 గంటల్లోగా డెలివరీ చేసే స్థితికి జలమండలి చేరుకుంది. వినియోగదారులకు ఏ సమయా నికల్లా ట్యాంక్ వస్తుందో తెలిసుకునే విధంగా 'జీయో ట్యాగింగ్' సిస్టమ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు.

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద అప్రమత్తంగా ఉండాలి

- హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఆర్‌ఓ, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత పరిశీలన



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ వద్ద ఉన్న భద్రతా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఆర్‌ఓ, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. శనివారం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లోని కమలా నెహ్రూ పాలిటెక్నిక్ కళాశాలలో భద్రపరిచిన చార్మినార్ అసెంబ్లీ సెగ్మెంట్‌కు సంబంధించిన ఈవీఎంలను, స్ట్రాంగ్ రూమ్ ల వద్ద పోలీసు భద్రతను, సీసీ కెమెరాల పనితీరును, పోలీస్ సిబ్బంది విధుల నిర్వహణను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రత కట్టుదిట్టంగా ఉండాలని, స్ట్రాంగ్ రూమ్‌లో ఉన్న ఈవీఎంలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఆర్‌ఓ, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అకాలవర్షాలకు ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

- బీఆర్ఎస్ నాయకులు ఆశిష్ కుమార్ యాదవ్



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

గత మూడు నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆశిష్ కుమార్ యాదవ్ అన్నారు. శనివారం అబిడ్స్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... గోషామహల్ నియోజకవర్గంలోని గత రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షం వల్ల మూసీ పరివాహక ప్రాంతం నివసిస్తున్న ప్రజలు, లోతట్టు ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇండ్లు కూలిన, ప్రజలు అత్యవసర నెంబర్లను సంప్రదించాలన్నారు. జీహెచ్ఎంసీ అండ్ డిఆర్ఎఫ్ ఫోన్ నెంబర్ 040-211 11111, గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఆఫీస్ నెంబర్ 954221 6666 నెంబర్లను సంప్రదిస్తే వెంటనే సహాయం అందిస్తారని చెప్పారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

ఈవీఎంలను టాంపరింగ్ చేసి గెలవడానికి బీజేపీ కుట్రలు

- దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్ ఆరోపణ



నవతెలంగాణ-హిమాయత్ నగర్

ఈవీఎంలను టాంపరింగ్ చేసి గెలవడానికి ప్రధాని నరేంద్రమోడీ బీజేపీ సర్కార్ కుట్రలు పన్నుతుందని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్ ఆరోపించారు. శనివారం హిమాయత్ నగర్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకూ వివిధ రాష్ట్రాలలో జరిగిన సాధారణ 2024 ఎన్నికల్లో బీజేపీ, ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించుకోవడానికి స్ట్రాంగ్ రూమ్ ల్లో ఉన్న ఈవీఎం మిషన్లలో ఓటర్లు ఇచ్చిన తీర్పును తారుమారు చేయడానికి బీజేపీ, కేంద్రంలోని మోడీ, అమిత్ షా సర్కార్ కుట్రకు పాల్పడిందని ఆరోపించారు. ఈవీఎంలను టాంపరింగ్ చేయడం ద్వారా మరొకసారి బీజేపీ ఎంపీ స్థానాలను గెలిపిం చుకోవడం కోసం ఆ దిశగా తీవ్రంగా ప్రయత్నం ప్రారంభించారని విమర్శించారు. ఎన్నికల్లో ఈవీఎం మిషన్లను ఉపయోగించవద్దని, దేశ ప్రజలు ఎంత మొత్తు కున్న ఈసీఐ పట్టించుకోలేదన్నారు. ఈ విషయంపై సుప్రీంకోర్టు ఆఫ్ ఇండియా సైతం చేతులు ఎత్తేసిందన్నారు. ఇలాంటి పరిస్థితిల్లో కూడా సుప్రీంకోర్టు జోక్యం చేసుకోలేదన్నారు. ఇలాంటి దయనీయమైన పరిస్థితుల్లో ఇండియా రాజ్యాంగం పరిరక్షణ, ఎన్నికల ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడానికి దేశ పౌరులంతా సమయాత్తం కావాలని, ఆధునిక మనువాదులు, ఆర్ఎస్ఎస్ మాఫియా చర్యలను ఎదుర్కోవాలని ఆయన సూచించారు. బీజేపీ చెప్పినట్లు 400 ఎంపీ సీట్లు సంపాదించుకోవడం వల్ల అంబేద్కర్ సమతా రాజ్యాంగాన్ని రద్దు చేసి దాని స్థానంలో మను వైదిక మాఫియా ఫాసిస్ట్ రాజ్యాంగాన్ని తీసుకు రావడానికి శతవిధాల బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఫాసిస్ట్ చర్యలకు పాల్పడు తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పార్టీ కరీంనగర్ పార్లమెంట్ ఇంచార్జ్ మాతంగి హనుమయ్య, నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి గోలి నరేష్, గోషామహల్ ఇంచార్జ్ ఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఎలాంటి ఇబ్బందులుండొద్దు



నవతెలంగాణ-ధూల్‌పేట్

పరస్పర సమన్వయ సహకారంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులుండొదని అన్ని విభాగాల అధికారులు ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు స్పందిస్తూ తమ దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని నగర ట్రాఫిక్ డీసీపీ -3 ఆర్. వెంకటేశ్వర్లు, జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జాయింట్ కమిషనర్ ఏ. శైలజలు అధికారులను ఆదేశించారు. చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టీ. వెంకన్న ఆదేశాల మేరకు శనివారం చాంద్రాయణగుట్ట నర్కిపూల్ బాగ్ లోని జోనల్ కార్యాలయంలో ట్రాఫిక్, శాంతిభద్రతలు, ఇంజనీరింగ్, ప్రాజెక్ట్, అర్బన్ బయోడై వర్సిటీ, విద్యుత్, జలమండలి, వెటర్నరీ, ఆరోగ్యం, పారిశుధ్యం, టౌన్ ప్లానింగ్, ఎలక్ట్రికల్ వీధి దీపాలు, ఆర్‌టీసీ విభాగల అధికారులతో సమన్వయ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన అన్ని విభాగాల అధికారులు నిత్యం స్థానికంగా నెలకొంటున్న పలు సమస్యలను వివరించారు. ముఖ్యంగా ప్రధానమైన రోడ్లలో వర్షం నీటి సమస్యపై అధికారులు జాయింట్ కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. రానున్న వర్షాకాలంలో వరదనీరు సమస్యలు రాకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. సమావేశంలో తమ దృష్టికి వచ్చిన సమస్యలన్నిటిని ఆయా విభాగాల అధికారులు నిర్లక్ష్యం వహించకుండా వెంటనే చేపట్టాలని ఆదేశించారు. వారు మాట్లాడుతూ... పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ప్రధాన రోడ్లలో కొనసాగుతున్న నిర్మాణ పనులను సంబంధిత విభాగాల అధికారులు సమన్వయంతో సకాలంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఆయా ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించి వరద నీరు రోడ్లపై నిలవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రానున్న వర్షాకాలంలో సమస్యలు రాకుండా ముందుగానే రోడ్లపై ఉన్న చెట్ల కొమ్మలను తొలగించి. నాలా డ్రయినేజీ పూడికతీత పనులను వెంటనే పూర్తిస్థాయిలో చేపట్టాలన్నారు. అన్ని విభాగాల అధికారులు ఏ సమస్య వచ్చినా పరస్పర సహకారంతో సమస్యని పరిష్కరించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో చాంద్రాయణ గుట్ట, సంతోష్ నగర్, ఫలక్ నుమా, రాజేంద్రనగర్ సర్కిల్ డీప్యూటీ కమిషనర్లు సురేందర్, శివకుమార్, శ్రీనివాస్ రెడ్డి, రవికుమార్, డిప్యూటీ కమిషనర్ (ఎస్ డబ్ల్యూ యం) రాజేష్ కుమార్, ప్రాజెక్ట్స్ ఎస్ ఈ దత్తుపంత్, ఎస్ ఈ (నిర్వహణ) మహేశ్వర్ రెడ్డి, టౌన్ ప్లానింగ్ జోనల్ సిటీ ప్లానర్ శ్యామ్ కుమార్, వెటర్నరీ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్, ట్రాఫిక్ విభాగం ఏసీపీలు చంద్రశేఖర్, బాలాజీ, లక్ష్మణ్, టీఎస్ఎస్‌పీడీసీఎల్ చార్మినార్ డిఈ లింగయ్య, జలమండలి జీఎం ఖాదర్ మొయినుద్దీన్, మలేరియా ఎస్ ఈ శ్రీనివాసులు,ఈ ఈ లు సన్నావుద్దీన్, హరి కిషోర్, నరేందర్ గౌడ్, ఏకంబరం, టౌన్ ప్లానింగ్ ఏసీపీలు అబ్దుల్ ఖాదర్, విఠల్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు, డీఈ లు, తదితరులు పాల్గొన్నారు.



శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి సందర్భంగా దూద్ బౌలి వాసవి భవనంలో అధ్యక్షురాలు దోరేటి పద్మజ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మా శెట్టి రాధిక, బుస లోక పావని, రత్నమాల, రాణి, చండికాంబ, చంద్రకళ, భాగ్య, అరుణ, విష్ణు, ప్రియ, పద్మ, సంధ్య, వాణి, బస్తీ వాసులు 108 మంది కుంకుమార్చనలలో పాల్గొన్నారు. నవతెలంగాణ-ధూల్‌పేట్

ప్రయివేట్ ఆస్పత్రులలో ఎస్‌పీహెచ్‌ఓ తనిఖీలు

- వైద్యశాఖ నిబంధనలు పాటించని ప్రయివేట్ ఆస్పత్రులపై కఠిన చర్యలు
- పానీపూర క్లస్టర్ ఎస్‌పీహెచ్‌ఓ డాక్టర్ మల్లీశ్వరి



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

వైద్య ఆరోగ్యశాఖ నిబంధనలను ప్రయివేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు పాటించాలని పాణిపుర క్లస్టర్ ఎస్‌పిహెచ్‌ఓ డాక్టర్ మల్లీశ్వరి అన్నారు. శనివారం హైదరాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ డీఎంహెచ్‌ఓ ఆదేశాలతో పానీపూర క్లస్టర్ పరిధిలోని ప్రయివేట్ ఆస్పత్రులు బేగంబజార్ దీప ఆసుపత్రి, కిషోర్ చంద్రన్ ఐ ఆసుపత్రి, మచ్చి మార్కెట్ వద్ద ఉన్న చందన నర్సింగ్ హోమ్, మెడ్ కేర్ ఆస్పత్రి, మిడ్ లైఫ్ ఆస్పత్రి, పురానాపూల్ లైఫ్ స్ప్రింగ్ మెటర్నిటీ ఆస్పత్రులను తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రయివేట్ ఆస్పత్రులకు తెలంగాణ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ ఉండాలన్నారు. లేనిపక్షంలో ఆ ఆస్పత్రుల యాజమాన్యంపై, వైద్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆస్పత్రుల వారు వారి సెంటర్లలో వసూలు చేస్తున్న ఫీజుల వివరాలను తప్పనిసరిగా తెలుగు, ఇంగ్లీష్ భాషలో రిసెప్షన్ నందు బోర్డులు ఏర్పాటు చేయాలనీ ఆదేశించారు. రోగుల నుండి అధిక ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆసుపత్రులలో పరిశుభ్రత, సౌకర్యాలు అందించే విషయంలో ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. వైద్యులు వారి రిజిస్ట్రేషన్ నంబర్లు, వారి వారి విద్యార్హతలు కూడా రిసెప్షన్ వద్ద ఏర్పాటు చేసిన బోర్డుపై ప్రదర్శించాలని ఆస్పత్రి యాజమాన్యాలకు సూచించారు. ప్రతి ఆస్పత్రి, నర్సింగ్ హోమ్ లలో అధిక ఫీజులు వసూలు చేయాలన ఆశతో అనవసరంగా సి-సెక్షన్ కాన్పులు చేస్తే వైద్య అధికారులు చర్యలు తీసుకుంటామన్నారు. అనవసరంగా సి-సెక్షన్ చేసిన ఆస్పత్రులపై చట్టపరంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు మాత్రమే వైద్యం అందించాలన్నారు. రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు లేకుండా అర్హత లేని డాక్టర్లు వైద్యం చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి ఆసుపత్రి వారు వచ్చిన జబ్బుల గురుంచి పేషెంట్లకు తప్పనిసరిగా వారికీ అర్థమయ్యే భాషలో వివరించాలని, జబ్బుకు అయ్యే ఖర్చులని కూడా ముందుగానే పేషెంట్‌కు వివరించాలని సూచించారు. ఆస్పత్రులకు ఫైర్ సేఫ్టీ ఉండాలని తెలిపారు. వైద్య శాఖ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని ప్రయివేట్ ఆస్పత్రుల యజమానులకు సూచించారు. ఈ తనిఖీలలో బేగంబజార్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అరవింద్, కార్వాన్ టు ఇన్‌చార్జీ, మహారాజ్ గంజ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రామ్ చందర్, పానీపూర క్లస్టర్ డిఓ శివ, కార్వాన్ టు ఎఎన్ఎం రూపారాణి, ఫైర్ ఆఫీసర్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న బీజేపీ

- సీఐటీయు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.జయ లక్ష్మి



నవతెలంగాణ-ధూల్‌పేట్

ప్రజలను బీజేపీ మోసం చేస్తున్నదని సీఐటీయు తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి. జయ లక్ష్మి అన్నారు. సీఐటీయు హైదరాబాద్ సౌత్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు సంతోష్ నగర్ ఆఫీస్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని సౌత్ జిల్లా కార్యదర్శి ఎం. శ్రావణ్ కుమార్‌తో కలిసి మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వచిన్నపటి నుండి కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ కార్మిక వర్గాన్ని కష్టలోకి నేటేశారన్నారు. ధరలు నియంత్రించడంలో బీజేపీ విఫలమైందని ఆరోపించారు. కార్మికులను కష్టాల్లో పడేసి బడా కార్పొరేట్, పెట్టుబడదారీ వర్గంకి ఊడిగం చేస్తుందని తెలిపారు. కావున బీజేపీ ప్రభుత్వని వ్యతిరేకిస్తూకార్మిక వర్గం ముక్త కంఠంతో నినదించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ తరగతులకు ఎం. మీనా ప్రిన్సిపాల్ గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు ఎస్. కిషన్, కె. జంగయ్య, కోటయ్య, కృష్ణ, సోమన్న, స్వామి, చెన్నయ్య, సాయిలు, ఆశా వర్కర్స్‌లు తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా నగర్‌లో పత్తి కుమార్ పర్యటన



నవతెలంగాణ-కాప్రా

కాప్రా డివిజన్ పరిధిలోని సాయి బాబా నగర్ కాలనీలో ప్రజల సమస్యలను తెలుసుకోడానికి మేడ్చల్ జిల్లా దళిత విభాగం అధ్యక్షులు, కాంటెస్టెడ్ కార్పొరేటర్ పత్తి కుమార్ శనివారం పర్యటించారు. కాలనీలో స్ట్రీట్ లైట్స్, నీటి సమస్యలు ఉన్నాయని కాలనీవాసులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబధిత అధికారులకు ఫోన్ ద్వారా సూచించారు. ఆయన వెంట కాప్రా డివిజన్ ఓబీసీ అధ్యక్షుడు జగదీష్ ముదిరాజ్, మురళీ, సుమన్, షాబుద్దీన్, సునీల్, నరేష్, సతీష్, తదితరులున్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ గౌతమ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మెన్ ఎం.మహేందర్ రెడ్డి శనివారం హైదరాబాద్ నుంచి కమిషన్ సభ్యులతో కలిసి గ్రూప్ -1 ప్రిలిమినరీ పరీక్ష ఏర్పాట్లపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జూన్ 9వ తేదీన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి పకడ్బందీగా నిర్వహించాలని ఈ సందర్భంగా ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య, డీఆర్వో హరిప్రియ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వాసవీ మిత్రమండలి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ



నవతెలంగాణ-కాప్రా

వాసవీ మిత్రమండలి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆధ్వర్యంలో వైశాఖ శుద్ధ దశమి శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి జయంతిని పురస్కరించుకొని ఈసీఐఎల్ క్రాస్ రోడ్డు సాయిబాబా దేవాలయం ఆవరణలో పులిహెూర, మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పెద్ది నాగరాజు గుప్తా, ప్రధాన కార్యదర్శి రెబెల్లి శ్రీనివాస్ గుప్తా, కోశాధికారి రాముని తిరుమలేశ్ గుప్తా, కార్యనిర్వాహక కార్యదర్శి గంప కృష్ణ గుప్తా, ఉపాధ్యక్షులు చెన్నచక్రపాణి గుప్తా, ఏచూరి నాగేశ్వరరావు గుప్తా, తాటి శ్రీనివాస్‌గుప్తా, నంగునూరు అశోక్ గుప్తా, కార్యదర్శులు బాచేల్లి నవీన్ గుప్తా, చందా సంతోష్ గుప్తా, మిరియాల అరుణ్ గుప్తా, ఉప్పల్ ఆంజనేయులు గుప్తా, యేనిశెట్టి రమేష్ గుప్తా, రాయి కంటి వేణుగుప్తా, పెద్ది శ్రీనివాస్ గుప్తా, బిల్డే భగవాన్ గుప్తా, ఉప్పల శ్రీనివాస్ గుప్తా, దిడిగం కైలాసం గుప్తా, గందే మల్లేశం గుప్తా, రాజూరి జగదీష్ గుప్తా, బల్లి శ్రీధర్ గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాసవీ మాత జయంతి ఉత్సవాలు



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ గడి మైసమ్మ తల్లి దేవాలయంలో ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం వాసవీ మాత జయంతి ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహిళలు అమ్మవారికి ప్రత్యేక అభిషేకలు, సహస్ర అర్చన, సామూహిక కుంకుమార్చన వంటి కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య కులస్తులు మాట్లాడుతూ.. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకి, భక్త జనులకు అభయ ప్రదాయిని వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి జయంతి ఉత్సవాలను నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.

త్యాగానికి నిదర్శనం వాసవీ కన్యకాపరమేశ్వరి



- మేయర్ శాంతి కోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్
- ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జయంతి వేడుకలు

నవతెలంగాణ-జవహర్‌నగర్

స్త్రీలలోని అనురాగానికి, త్యాగ గుణానికి, నిలువెత్తు నిదర్శనం వాసవీ కన్యకా పరమేశ్వరి అని జవహర్ నగర్ మేయర్ దొంతగాని శాంతి కోటేశ్ గౌడ్, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్‌లు అన్నారు. శనివారం జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీరామ్ నగర్ కాలనీలో ఆర్య వైశ్య సంఘం కార్యాలయంలో శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథులుగా మేయర్ శాంతి, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్, కార్పొరేటర్లు బల్లి రోజా శ్రీనివాస్, మునిగాల సతీష్ కుమార్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ధర్మాన్ని నిలిపేందుకు, స్త్రీల గౌరవాన్ని కాపాడేందుకు, వైశ్యుల ఔదార్యాన్ని ప్రపంచానికి చాటేందుకు కలియుగంలో జన్మించిన ఆది పరాశక్తి ఆర్యమహాదేవి అవతారం అని అన్నారు. ఆర్యవైశ్యులు వాసవీ మాతను కులదేవతగా పూజిస్తారని, అందుచేతనే ప్రముఖ దేవాలయాల దగ్గర వాసవీ అన్నదాన ట్రస్టులు ఏర్పాటు చేసి అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు చిరంజీ రవీందర్ గుప్తా, గౌరిశెట్టి భద్రేష్ గుప్తా, పైడి రమేష్ గుప్తా, గట్టు చంద్రశేఖర్ గుప్తా, దొంతగాని కోటేష్ గౌడ్, నంగునూరి అశోక్, కోట సంతోష్ కుమార్, కారింగుల రాజు, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ,మైసమ్మ తల్లి వార్షికోత్సవం



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలోని పూడూరు గ్రామంలో శనివారం శ్రీశివ్వంపేట పోచమ్మ-మైసమ్మ తల్లి వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవార్లను గ్రామ పురోహితులు జగం శివప్రసాద్ ఆధ్వర్యంలో అలంకరించారు. ఉదయం నుంచే భక్తులు పెద్ద ఎత్తున గ్రామ పరిధిలోని శ్రీకట్ట మైసమ్మ, దుర్గమ్మ ముత్యాలమ్మ, పోచమ్మ-మైసమ్మ తల్లి ఆలయాల్లో వేపాకు నీటితో ప్రదక్షణలు చేశారు. సాకలు, పరమాన్నం నైవేద్యంగా పెట్టి, కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు పోచమ్మ ఆలయం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తుపాకులు కృష్ణ, సార రామలింగం, శేఖర్‌రెడ్డి, పుట్నాల నర్సింహ, తాళ్ల జనార్ధన్ రెడ్డి, మండల సురేష్ గౌడ్, నర్సింహ చారి, గ్రామస్తులు మల్లెల కృష్ణ, తిరుపతి, దేవేందర్, ప్రభాకర్, మల్లికార్జున్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

నవతెలంగాణ-రంగారెడ్డి డెస్క్

మహిళ అదృశ్యమైన ఘటన శేరిలింగంపల్లి గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా నెక్కొండ గ్రామానికి చెందిన పైండ్ల లక్ష్మి భర్త వీరయ్యలు శ్రీరామ్‌నగర్ కాలనీ, ఏబ్లాక్‌లో వాచ్‌మెన్ గా పనులు చేస్తూ నివసిస్తు న్నారు. కాగా ఈ నెల 5వ తేదీన లక్ష్మి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి ఇంతవరకు తిరిగి రాలేదు. ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించక పోవ డంతో గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వర్షంతో రోడ్లన్నీ బురదమయం



- ఇబ్బందుల్లో శ్రీలక్ష్మీ నరసింహ కాలనీ వాసులు
- ఎన్నికల హామీలను నెరవేర్చాలి
- డ్రయినేజీ, కరెంట్ స్తంభాలను ఏర్పాటు చేయాలని డిమాండ్

నవతెలంగాణ-జవహర్ నగర్

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని లక్ష్మీ నరసింహ కాలనీ ప్రజలు కోరుతున్నారు. శనివారం జవహర్ నగర్ పరిధిలో సాయంత్రం ఈదురు గాలులతో కురిసిన వర్షానికి శ్రీలక్ష్మీ నరసింహ స్వామీ కాలనీలో రోడ్లపై నీరు చేరడంతో రోడ్లన్నీ బురదమయంగా మారాయి. ప్రజలంతా రాత్రి సమయాల్లో భయపడుకుంటూ నిద్రపోవాల్సి వస్తుందనీ, తమ కాలనీలో రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రయినేజీతో పాటు కరెంట్ కూడా సరిగా లేదని పేర్కొన్నారు. గత ఎన్నికల ముందు ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, స్థానిక కార్పొరేటర్ కారింగుల నిహారిక గౌడ్‌లు రోడ్లు వేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఇప్పటి వరకు ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదని, ఇప్పుడు కురిసే చిన్నపాటి వర్షాలకే కాలనీ అంతా బురదమయం అవుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇండ్లల్లో నుంచి బయటకు వచ్చే పరిస్థితి లేదని వాపోయారు. పూర్తిస్థాయి వర్షం కాలం వస్తే తమ పరిస్థితి అధ్వానంగా ఉంటుందని పేర్కొన్నారు. నాయకులు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రయినేజీ, కరెంట్ స్తంభాలను ఏర్పాటు చేయాలని శ్రీలక్ష్మీ నరసింహ స్వామీ కాలనీ ప్రజలు కోరుతున్నారు.



ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో స్థలాలను కొని మోసపోవద్దు

- తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకట్ గోపాల్



నవతెలంగాణ-శామీర్‌పేట

తూంకుంట పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో స్థలాలు కొనుగోలు చేసి మోసపోవద్దని తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకట్ గోపాల్ ప్రజలకు సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ..చెరువు కబ్జాకు గురవుతుందని పలువురు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో కలిసి పెద్ద చెరువును సందర్శించి ఎఫ్‌టీఎల్ గుర్తించి హద్దురాళ్లను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఎఫ్‌టీఎల్ నుంచి 30 మీటర్లలోపు ఎలాంటి అక్రమ నిర్మాణాలు ఉన్నా వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎఫ్‌టీఎల్ నుంచి 30 మీటర్ల వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదన్నారు. కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు మాయ మాటలు చెప్పి ఎఫ్‌టీఎల్ భూమిని విక్రయించి మోసం చేయాలని చూస్తున్నారని, ప్రజలు వాళ్లను నమ్మొద్దని సూచించారు. చెరువు సమీపంలో స్థలాలు కొనుగోలు చేసేవారు సంబంధిత అధికారులను తెలుసుకున్న తర్వాతనే కొనాలని తెలిపారు. స్థలం తక్కువ ధరకు వస్తుందని కొనుగోలు చేసి మోసపోవద్దన్నారు. బఫర్ జోన్‌లో ఎలాంటి అక్రమ నిర్మాణాలు చేపట్టినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

3ఎం విధానంతో రక్తపోటు నియంత్రణ

- సీనియర్ కన్సల్టెంట్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ సుధీర్ దావాలా
- వరల్డ్ హైపర్ టెన్షన్ డే సందర్భంగా వైద్యుల సూచనలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రాణాంతకమైన అధిక రక్తపోటును మెరుగైన జీవన విధానాలు, ఆహారపు అలవాట్లతో కట్టడి చేయడానికి అవకాశం ఉందని రమేష్ న్యూరో కేర్ హాస్పిటల్ కన్సల్టెంట్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ సుధీర్ దావాలా తెలిపారు. నగరంలోని ఆర్ఎన్‌సీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో సుధీర్ దావాలా హైపర్ టెన్షన్ నియంత్రణకు పలు సూచనలు చేశారు. 3ఎం విధానం ద్వారా ఎంతటి రక్తపోటునైనా నియంత్రించడానికి అవకాశం ఉందని తెలిపారు. మెజర్, మెయింటెయిన్, మేనేజ్ (3ఎం) పద్ధతుల ద్వారా గుండెను పది కాలాలు కాపాడుకునే అవకాశం ఉందన్నారు. అధిక రక్తపోటు-ఒత్తిడిని సమర్థవంతంగా నిర్వహించడం కోసం మందులను వినియోగిస్తూనే, పర్యవేక్షణ, చికిత్సను సర్దుబాటు చేసుకోవడం ద్వారా గుండె ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా లక్షల మందిని కబళిస్తున్న హైపర్ టెన్షన్ వైద్య పరిభాషలో సైలెంట్ కిల్లర్‌గా పేర్కొంటారని తెలిపారు. ఊహించని ముప్పుతో భయంకరమైన పరిణామాలకు దారి తీస్తుందన్నారు. ఇంతటి ప్రమాదకరమైన వ్యాధిని నివారించడానికి సమర్థవంతమైన ఆరోగ్య, వైద్య విధానాలను అనుసరించాలని స్పష్టం చేశారు. ప్రపంచ హైపటైటీస్ డే సందర్భంగా పలు సూచనలు చేశారు. రక్తపోటు పర్యవేక్షణ చాలా ముఖ్యమైందన్నారు. నాణ్యమైన బీపీ మానీటర్లను ఉపయోగించాలనీ, నెలవారీ రక్తపోటును పర్యవేక్షించుకోవాలని సూచించారు.

నాలుగు డీఏల్లో ఒక డీఏ విడుదల చేయాలి



- ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కకు టీఎన్జీవో నేతల వినతి

నవతెలంగాణ- సిటీబ్యూరో

నాలుగు డీఏల్లో ఒక డీఏ విడుదల చేయాలని కోరుతూ ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కకు టీఎన్జీవో నేతలు వినతి పత్రం అందజేశారు. ఉప ముఖ్యమంత్రిని శనివారం టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ అధ్యక్షులు మారం జగదీశ్వర్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎం. హుస్సేని (ముజీబ్), కేంద్ర సంఘ నాయకులు కస్తూరి వెంకట్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్, నగరశాఖ ఉపాధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, హైదరాబాద్ ఉపాధ్యక్షుడు శంకర్ కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యోగులకు రావాల్సిన నాలుగు డీఏ బకాయిల్లో ఒక డీఏ విడుదల చేయాలని, పీఆర్సీ, హెల్త్ కార్డ్, సీపీఎస్ రద్దు, ఇతర ముఖ్య అంశాలపై చర్చించారు. దీనిపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించారని, అతి త్వరలో ఉద్యోగుల అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారని వారు తెలిపారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్

- రోడ్డు మధ్యలో నుంచి తొలగించి మరో చోట ఏర్పాటు చేయాలి
- పాదాచారులు, వాహనదారులు, కాలనీ వాసుల వినతి



నవతెలంగాణ-సిటీబ్యూరో

నేరేడ్‌మెట్ డివిజన్ పరిధిలోని ఒకటో రోడ్డు నెంబర్ మధుర నగర్‌లో రోడ్డు మధ్యలో ఉన్న ట్రాన్స్ ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. రోడ్డుకు అడ్డంగా ఉండడంతో వాహనదారులు ఈ మార్గంలో రాకపోకలు సాగించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ వెళ్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డుపై ఉండడంతో పాదాచారులు ఇక్కడి నుంచి నడచి వెళ్లాలంటే జంకుతున్నారు. ఎప్పుడు షాక్ కొడుతోందోని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదకరంగా మారిన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌ను ఇక్కడి నుంచి తొలగించి, ప్రజలకు ఇబ్బంది లేకుండా మరో ప్రదేశంలో ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, పాదాచారులు, వాహన దారులు కోరుతున్నారు.

వైభవంగా బాలాజీ వేంకటేశ్వర స్వామి కల్యాణం



నవతెలంగాణ-శామీర్‌పేట

మేడ్చల్ నియోజకవర్గం మూడు చింతలపల్లి మండలం కేశవరం గ్రామ పరిధిలోని శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం స్వామి వారి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. ఈ కల్యాణ మహోత్సవానికి గ్రామ పెద్దల ఆహ్వానం మేరకు కాంగ్రెస్ టీపీసీసీ ఉపాధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి తదితరులు హాజరై స్వామివారి కల్యాణాన్ని తిలకించి, దేవతా మూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంసీపల్లి వైస్ ఎంపీపీ మంద శ్రీనివాస్ రెడ్డి, స్థానిక ఎంపీటీసీ గోనే హనుమంత రెడ్డి, మాజీ సర్పంచ్ బొమ్మలపల్లి నర్సింలు యాదవ్, అలయ కమిటీ ప్రతినిధులు, ఏబ్లాక్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, శామీర్‌పేట మండల అధ్యక్షుడు శంకర్ గౌడ్, నాయకులు మహేందర్ రెడ్డి, దోసకాయల వెంకటేష్, వంగ లక్ష్మారెడ్డి, జెర్రిపోతుల నర్సింహులు, మాజీ ఉపసర్పంచ్ వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ప్రవేశాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-శంషాబాద్

2024-25 విద్యా సంవత్స రానికిగాను శంషాబాద్‌లోని ప్రభు త్వ డిగ్రీ కళాశాల రాజేంద్రనగర్‌లో బీఏసీ బీఎస్సీ (హెచ్ఈవీ హెచ్ ఈసీఎ ఎక్స్ట్రా) బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ లైఫ్ సైన్సెస్ (బీఎస్సీ బీఎస్సీస్), బీఎస్సీ ఫిజికల్ సైన్సెస్ (ఎంపీసీ, ఎంపీసీ ఎక్స్ట్రా), కోర్సులలో అడ్మిషన్లు 06-05-2024 నుండి ప్రారంభమైనవి అని తెలి సిన విషయమే. కాబట్టి పై కోర్సులలో చేరు విద్యార్థులకు దోస్త్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకొని వెబ్ ఆప్షన్స్ ద్వారా తమ కళాశాలను, కోర్సును 20-05-2024 నుండి 30-05-2024 వరకు ఎంచుకోగలరని ప్రిన్సి పాల్ డాఎం. హిమబిందు తెలియజేశారు. తమ కళాశాలలో విద్యా ర్థుల కోసం ఉచితదోస్త్ రిజిస్ట్రేషన్ సౌకర్యం ఉందని తెలిపారు. దోస్త్ రిజిస్ట్రే షన్ కోసం కావలసిన సర్టిఫికెట్స్1) ఎస్-ఎస్‌సీ మెమో2) ఇంటర్మీడి యట్ మెమో (షార్ట్ ఆర్ ఆన్‌లైన్ మెమో)3) బోనఫైడ్ 6 తరగతి నుంచి ఇంటర్ వరకు4) కుల ధ్రువీకరణ పత్రం5) (01-04-2024) వార్షిక ఆదాయ ధ్రువీకరణ పత్రం6) ఫోన్ నెంబర్‌తో కూడిన ఆధార్ కార్డ్, 7) పాస్ పోర్ట్ సైజ్ ఫోటో కావలెను. అడ్మిషన్లకు సంబధించిన వివ రాల కోసం కళాశాలలో (శంషాబాద్‌లోని జెడ్‌పిహెచ్ఎస్ ప్రాంగణంలో) సం ప్రదించగలరు. ఫోన్‌నెంబర్: 9441956233, 9494812040, 7032713785.

శిల్పారామంలో ముగిసిన సమ్మర్ ఆర్ట్ క్యాంప్



నవతెలంగాణ-రంగారెడ్డి డెస్క్

మాదాపూర్‌లోని శిల్పారామం లో సమ్మర్ ఆర్ట్ క్యాంపు ముగింపు ఉత్సవం ఎత్నిక్ హాల్‌లో నిర్వహించారు. 15 రోజుల నుండి శిల్పా రామం ఆర్టిసన్స్ మధుబని పెయింటింగ్, మట్టి తో కుండలు చేయడం, పెన్సిల్ స్కెచ్, మండల పెయింటింగ్, లిప్పన్ ఆర్ట్ గవ్వలతో బొమ్మలు చేయడం, ట్రైబల్ పెయింటింగ్ వాటిలో పిల్లలకి పెద్దలకి శిక్షణ ఇచ్చారు. దాదాపుగా 92 మంది నేర్చుకున్నారని వారందరికీ శిల్పారామం స్పెషల్ ఆఫీసర్ కిషన్ రావు ముఖ్యాతిథిగా విచ్చేసి వారు నేర్చుకొని తయారు చేసిన పెయింటింగ్స్ బొమ్మ లను తిలకించి అందరికి ప్రశంసాపత్రాలను ఇచ్చి ప్రోత్సహించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగం గా కలర్స్ అఫ్ డాన్స్ కుమారి ఎన్ఎస్ ఎల్ ప్రవీ ణ గారి శిష్యబృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఎంతగానో అలరించింది. అంబ పరాకు, పూర్వరం గం, వినాయక కౌతం, ఝుమ్ ఝుమ్ తన న, తాం డవ నృత్య కరి, నమశివాయతే , ఆనంద నర్తన గణ పతిమ్, చేరి యశోదకు, అచ్యుతం కేశ వం, హిం దువుల అంశాలను అక్షిత, అలి వేణి, శివాలక్ష్మి, శాన్వి, అనన్య, కళ్యాణి, లావణ్య, ఆశ్రీత, శ్రీపాద, సహస్ర, మోక్షిత, జాహ్నవి మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు.

తీవ్ర గాయాలతో వ్యక్తి అనుమానాస్పద మృతి



మృతుడి (ఫైల్)

నవతెలంగాణ-అల్వాల్

తీవ్ర గాయాలతో వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన అల్వాల్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్వాల్‌లోని ఇందిరానగర్‌లో అన్వర్ మీర్జా (45) అనే వ్యక్తి తన భార్య సమీనా ముగ్గురు పిల్లలతో కలిసి తన సొంత ఇంటిలో నివాసం ఉంటున్నాడు. అన్వర్ మీర్జా 20 సంవత్సరాల క్రితం మధ్యప్రదేశ్ నుంచి వచ్చి ఇందిరా నగర్‌లో స్థిరపడ్డాడు. ఇతడు క్యాటరింగ్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన భార్య సమీనా తన ముగ్గురు పిల్లలతో కలిసి మధ్యప్రదేశ్‌లో తన బంధువులు చనిపోగా 20 రోజుల క్రితం మధ్యప్రదేశ్ వెళ్లింది. శుక్రవారం రాత్రి 8 గంటల నుంచి సమీనా తన భర్త అన్వర్ మీర్జాకు పలుమార్లు ఫోన్ చేసినా ఫోన్ లిఫ్ట్ చేయక పోవడంతో అనుమానం వచ్చి తమ ఇంట్లో అద్దెకు ఉంటున్న వ్యక్తికి ఫోన్ చేసి తన భర్త ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని వెళ్లి చూడాలని కోరింది. దాంతో అతను ఇంట్లోకి వెళ్లి చూడగా బెడ్ రూమ్‌లో అన్వర్ మీర్జా మృతదేహాన్ని చూసి అతను సమీనాకు వీడియో కాల్ చేసి ఇక్కడి పరిస్థితిని ఆమెకు వివరించాడు. దాంతో సమీనా బోయిన్‌పల్లిలో నివాసం ఉండే మృతుడి సోదరుడు మునబ్బర్ ఖాన్‌కు ఫోన్ చేసి విషయం చెప్పింది. వెంటనే మునబ్బర్ ఖాన్ ఇందిరా నగర్ చేరుకుని బెడ్ రూమ్‌లో తన తమ్ముడు అన్వర్ మీర్జా తీవ్రగాయాలతో మరణించాడని మృతుడి భార్య సమీనాకు తెలిపాడు. ఆ గదిలో మందు బాటిళ్లను గమ నించి పార్టీ చేసుకున్న అనంతరం తన తమ్ముడిని ఎవరో కొట్టి చంపారని మునబ్బర్ ఖాన్ అల్వాల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు సంఘ టన స్థలానికి చేరుకొని, మృతుడి శవాన్ని పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించారు. తలపై బలమైన గాయం కావడంతో మరణించాడని పోస్టుమార్టంలో నివేదికలో నిర్ధారణ అయింది. పోస్టమార్టం అనంతరం పోలీసులు మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. పోలీసులు అనుమానస్పద మృతిగా కేసును నమోదు చేసుకున్న దర్యాప్తు ప్రారంభించారు.

శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలకు ఆహ్వానం



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, గాజులరామారం డివిజన్ పరిధిలోని సూపర్ మ్యాక్స్ పరిశ్రమ సమీపంలో గల శ్రీ నల్లగుట్ట లక్ష్మీనరసింహస్వామి జయంతి ఉత్సవాలు పురస్కరించుకొని శనివారం ఆలయ కమిటీ నిర్వాహకులు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలం గౌడ్‌ను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు అముర ఇంద్రసేన గుప్తా, యాదగిరి, నర్సింహా రెడ్డి, సురేష్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలం గౌడ్ వివాహ వార్షికోత్సవం సందర్భంగా శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలువురు నాయకులు, కార్యకర్తలు అభిమానులు ఆయన నివాసం వద్ద కలిసి, వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి ఉత్సవాలు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

వైశ్య కులస్తుల ఆరాధ్య దైవమైన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి ఉత్సవాలు పురస్కరించుకొని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని జగద్గిరిగుట్ట, గాజులరామారం, చింతల్ డివిజన్ పరిధిలోని ఆర్యవైశ్య సంఘుల, వాసవి మాత ఆలయ కమిటీల ఆధ్వర్యంలో శనివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. గాజులరామారం డివిజన్‌లో గల పలు ప్రాంతాల్లోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో నిర్వహించిన జయంతి వేడుకలకు ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మెన్ కాల్వ సుజాత, గాజులరామారం కార్పొరేటర్, గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు రావుల శేషగిరిలు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు తదితర నాయకులు పాల్గొన్నారు.

జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలో...

జగద్గిరిగుట్ట శ్రీవారి ఆలయ ప్రాంగణంలో గల శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి దేవాలయంలో ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాటు చేసిన జయంతి వేడుకలకు, అనంతరం జగద్గిరిగుట్ట చివరి బస్ స్టాప్ లోపల గల ఆర్యవైశ్య సంఘం భవనంలో సంఘం సభ్యులు ఏర్పాటు చేసిన వేడుకలకు స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్, శశికళ దంపతులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. మేడ్చల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు పార్థీ ప్రకాష్ గుప్తా, దేవాలయ చైర్మెన్ రేగురి ప్రవీణ్ గుప్తా, అధ్యక్షులు ఉప్పల రమేష్ గుప్తా, వైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి తేరాల శ్రీనివాస్ గుప్తా, సభ్యులు యాదా నరేంద్ర గుప్తా, కృష్ణమూర్తి గుప్తా, కైలాసం గుప్తా, సురేష్ గుప్తా, గుప్తా, వైశ్య కులస్తుల పాల్గొన్నారు.



24 నుంచి జూన్ 3వరకు ఇంటర్ సప్లమెంటర్ పరీక్షలు



- పకడ్బందీగా నిర్వహించాలి అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఈ నెల 24 నుంచి జూన్ 3వ తేదీ వరకు జరిగే ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అన్నారు. శనివారం తన ఛాంబర్‌లో అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సప్లమెంటరీ పరీక్షలను సంబంధిత అధికారులు సమన్వయం చేసుకుంటూ పని చేయాలన్నారు. జిల్లాలో 50,443 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నారనీ, వీరి కోసం జిల్లా పరిధిలో 89 సెంటర్లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మొదటి సంవత్సరంలో 36,940 మంది, ద్వితీయ సంవత్సరంలో 13,503 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్టు తెలిపారు. ఈ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సంవత్సరం, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు. పరీక్షా కేంద్రాలకు నిరంతరం విద్యుత్ సరఫరా చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు వంటి వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని డీఎంఅండ్‌హెచ్‌ఓకి ఆదేశించారు. పరీక్షా కేంద్రాలకు ప్రతిరోజూ తాగునీటి ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. ప్రతి పరీక్ష కేంద్రానికికో చీఫ్ సూపరింటెండెంట్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పరీక్షా కేంద్రాలకు సమీపంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో ఇంటర్మీడియట్ బోర్డు అధికారి కిషన్, ఏసీపీ చంద్రకుమార్, సత్యనారాయణ, విద్యుత్ శాఖ అధికారి సతీష్, పోస్టల్ అధికారి సంపత్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వరద నీటి సమస్యను పరిష్కరిస్తాం



- కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్

నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధి మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలోని ఫిష్ మార్కెట్ డౌన్‌లో నిన్న మొన్న కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయని దీనికి శాశ్వత పరిష్కారం చూపాల్సిందిగా స్థానిక ప్రజలు కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన కార్పొరేటర్ శనివారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ గతంలో ఉన్న బ్రిడ్జి లోతట్టు ప్రాంతం కావడం వల్ల నాలా వరద నీరు వచ్చి స్థానిక పరిసర ప్రాంతాలలోని ఇండ్లలోకి చేరుతోం దన్నారు. గతంలో వేసిన బ్రిడ్జి వల్ల వరద నీరు నాలా వరద నీరు లోపలికి రాకుండా ఆపగలిగామని తెలిపారు. అదేవిధంగా ఇక్కడ అతి త్వరలో రోడ్డు ఎత్తు పెంచి నీళ్ల నిలవకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కుక్కల రాజేశ్వర్ రావు, మురళి ముదిరాజ్, అశోక్ గౌడ్, సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

సాయి నాథుని 25వ ఆలయ వార్షికోత్సవం



- పాల్గొన్న కార్పొరేటర్ మాజీ సురేష్ రెడ్డి

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

సుభాష్ నగర్ 130 డివిజన్ పరిధిలోని శనివారం అపురూప కాలనీలో శ్రీ సద్గురు సాయినాథుని 25వ ఆలయ వార్షికోత్సవం, సుభాష్ నగర్‌లోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సుభాష్ నగర్, సూరారం కాలనీలలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి సందర్భంగా... ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతీ ఒక్కరు భక్తి భావాన్ని పెంపొందించు కోవాలని సూచించారు.



బాలానగర్ మైక్రోస్మాల్ స్కేల్ ఇండస్ట్రీ నూతన కార్యవర్గం అధ్యక్షుడిగా అంబటి సునీల్ కుమార్



నవతెలంగాణ-బాలానగర్

పారిశ్రామిక వాడలోని బాలానగర్ మైక్రోస్మాల్ ఇండస్ట్రియల్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం సాయినగర్‌లోని సాయిబాబా ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. గత రెండున్నర సంవత్సరాలుగా పదిమంది సభ్యులు గల పాత బృందం బాలానగర్ మైక్రో స్మాల్ స్కేల్ ఇండస్ట్రీ ఎలాంటి అభివృద్ధికి నోచుకోకుండా సభ్యులకు సహాయంగా ఉండకుండా కనీసం ఎలాంటి సమావేశాలు నిర్వహించకుండా.. ఆ సంస్థ అభివృద్ధికి తోడ్పడకుండా వారి స్వలాభం కోసమే పని చేస్తూ బాలానగర్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రీని ఒకరకంగా స్తబ్దతకు గురి చేశారని విమర్శలు వచ్చాయి. ఇది గమనించిన మిగతా సభ్యులు సమావేశానికి హాజరు కావాలని అందరినీ ఆహ్వానించారు. ఈ మేరకు ఎవరు హాజరు కాకపోవడంతో రెండు సంవత్సరాలైనందున పాతబాడీని బైలాస్ ప్రకారం రద్దుచేసి నూతన బాడీని ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని సభ్యులు కోరారు. వెంటనే బాడీని రద్దు చేసిన తర్వాత బైలాస్ ప్రకారం జనరల్ బాడీ సభ్యులు ముందుగా అధ్యక్షుడి ఎన్నికకు సభ్యులు ఆమోదించారు. సభ్యులు అందరు ఏకగ్రీవంగా ఎన్నుకోవడంలో ముందుగా ఎన్వీ రత్నం, గోపీనాథ్, బత్తుల శ్రీనివాస్ ప్రెసిడెంట్‌గా అంబటి సునీల్ కుమార్‌ను ప్రపోజ్ చేశారు. దీంతో సభ్యులందరూ తమ అంగీకారాన్ని తెలిపారు. ఈ మేరకు బాలానగర్ మైక్రో స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ అధ్యక్షుడుగా పారిశ్రామికవేత్త అంబటి సునీల్ కుమార్‌ను నియమించారు. అనంతరం ప్రధాన కార్యదర్శిగా బీబీవీ బాలాజీని, ట్రెజరర్‌గా భాస్కర్ రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదేవిధంగా ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా రాధాకృష్ణ, సత్యనారాయణ, ఎన్వీ రత్నం, బత్తుల శ్రీనివాస్, మోతిలాల్, అమరేశ్వర్ రావు తదితరులను సభ్యులుగా కొనసాగనున్నారు.

ఈ సందర్భంగా మైక్రో స్మాల్ స్కేల్ ఇండస్ట్రీ అధ్యక్ష అంబటి సునీల్ కుమార్ మాట్లాడుతూ ఇది తమ కుటుంబమని, ఫేస్ వన్ కింద 60 ఎకరాల భూమి శాంక్షన్ అయ్యిందని, దాన్ని అర్హులైన వారికి మొదటి విడతగా ఇవ్వనున్నట్టు తెలిపారు. అనంతరం సెకండ్ ఫేస్‌లో మిగతా వారికి అందర్నీ అకామిడేట్ చేయడం జరుగుతుందని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వా మొదటి ప్రాజెక్టు కింద ఈ 60 ఎకరాల ప్రాజెక్టును ఎన్నికల కోడ్ ముగియగానే చేపడతామని సునీల్ తెలిపారు. మైక్రో స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ మొత్తం సభ్యుల సంఖ్య 1600 కుటుంబాలు ఉండగా అందులో లైఫ్ 126 సభ్యులకు గాను 60 ఎకరాల స్థలాన్ని కేటాయించడం జరిగిందన్నారు. బాలానగర్ మైక్రో స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ కింద కొత్త సభ్యులు నిరభ్యంతరంగా ఫతేనగర్ ఉన్న కార్యాలయా నికి వచ్చి, సంబంధించిన పత్రాలతో సభ్యత్వ నమోదు చేసుకోవాలని అంబటి సునీల్ కుమార్ కోరారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనా మహెూత్సవాలు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆల్విన్ కాలని డివిజన్ పరిధిలోని శ్రీ నల్లపోచమ్మ దేవాలయంలో నిర్వహించిన, శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆరాధన మహెూత్సవాలకు శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్, స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రత్యేక పూజా, అన్న సమారాధన కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ మహెూత్సవాలు మానేపల్లి గోపిచారి, బండోజు నరసింహ చారి, ఎ.ఎస్.ఆర్ రమేష్ చారి, కమ్మరి రామకృష్ణ చారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, అనిల్ రెడ్డి, సందీప్ ముదిరాజ్, వెంకట్ నాయక్, షౌకత్ అలీ మున్నా, నవీన్ రెడ్డి, అనిల్ యాదవ్, నాగేషగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

శ్రీ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామివారి 33వ వార్షికోత్సవనికి ముఖ్య అతిథులుగా సూరారం 129 డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యూత్ విభాగం అధ్యక్షులు సోమేశ్ యాదవ్ పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయకమిటీ సభ్యులు ఏర్పాటు చేసినటువంటి అన్నదాన కార్యక్రమంలో పాల్గోన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నరసింహ, శ్రీనివాస్, కృష్ణ, లింగం, కిరణ్ కుమార్, సురేష్, వసంత కుమార్, శివ పాల్గొన్నారు.

చలం మ్యూజింగ్స్ సాహిత్యంలో నూతన ప్రయోగం



నవతెలంగాణ-కల్చరల్

చలం మ్యూజింగ్స్ నాటి సాహిత్యంలో నూతన ప్రయోగం అని ప్రముఖ సాహితీ వేత్తలు పేర్కొన్నారు. రవీంద్ర భారతిలోని సమావేశ మందిరంలో చలం భావన నిర్వహణలో జీవ జలం చలం శీర్షికన సాహితీ సభ జరిగింది. ప్రముఖ సాహితవేత్తలు డాక్టర్ కత్యాయని విద్మహే డాక్టర్ సి.మణాళినిలు చలం మ్యూజింగ్స్ వస్తు రూపాలు అంశంపై ప్రసంగించారు. చలం మ్యూజింగ్స్ సాహిత్యంలో అయన సమగ్ర వ్యక్తిత్వం ద్యోతక మవుతుంద న్నారు. చైతన్య ప్రవంతి లా ఆయనలో పలు అంశాలపై చెలరేగిన ఆలోచనా ధార పాఠకులలో ఆలోచనలు రేపుతుందన్నారు. స్త్రీ, పురుష సంబంధాలు జీవన తాత్వికత, సామ్యవాదం వంటి గంభీర విషయలే కాక సినిమాలు అంధ విశ్వాసాలు పై కూడా వ్యంగంగా చర్చించారు. మెర్సీ మార్గరెట్, జ్వాలిత, నిహారిక, ఇనంపూడి శ్రీ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు. సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ, ప్రముఖ కవి నందిని సిధారెడ్డి హాజరైన సభకు సంస్థ నిర్వాహకుడు డాక్టర్ నాళేశ్వరం శంకరం స్వాగతం పలికారు.

21న నట దర్శక దిగ్గజాలకు స్వర నివాళి

నవతెలంగాణ-కల్చరల్

శ్రుతి లయ ఆర్ట్స్ అకాడమీ సీల్ వెల్ కార్పొరేషన్ ఆర్ఆర్ ఫౌండేషన్ నిర్వహణలో శ్రీ భారతి మ్యూజిక్ అకాడమీ అభినందనలతో నట దిగ్గజాలు ఎన్‌టీఆర్, ఏఎన్ఆర్, కృష్ణ, దర్శకుడు దాసరి నారాయణరావులకు స్వర నివాళి గా వారి చిత్రాలలోని పాటలను ప్రముఖ గాయని ఆమని గాయకుడు చింతలపాటి సురేష్‌లతో శిరీష, మంజుల, గాయత్రి, సుభాష్ రాజన్ తదితరులు పాల్గొంటారు. రవీంద్ర భారతి ప్రధాన వేదికపై ఈ నెల 21న జరిగే కార్యక్రమంలో గానం చేస్తారని బండారు సుబ్బారావు, ఆమని చింతలపాటి సురేష్ తెలిపారు. శనివారం పత్రికా విలేకరులతో వారు మాట్లాడుతూ 21న జరిగే సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొంటారని పేర్కొన్నారు. విఖ్యాత నటుడు కృష్ణ స్మారక జీవన సాఫల్య పురస్కారం ప్రముఖ నటుడు మురళీ మోహన్‌కు, విఖ్యాత దర్శకుడు దాసరి పురస్కారం ప్రముఖ దర్శకుడు రేలంగి నరసింహారావుకు, విఖ్యాత నటుడు ఏఎన్ఆర్ స్మారక యువ స్ఫూర్తి పురస్కారం బొమ్మకు మురళికి బహుకరిస్తారని తెలిపారు. కోలేటి దామోదర్ పోలీస్ ఉన్నతాధికారి జితేందర్ రెడ్డి, మేడిడీ వేంకటేశ్వర రావు, రామ కృష్ణ, కళ రఫీ, శ్రీనివాస్, భోగరాజు, తదితరులు అతిథులుగా పాల్గొంటారన్నారు.



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, సుభాష్ నగర్ 130 డివిజన్ పరిధిలోని పాక్స్ సాగర్ వద్ద గల ఆలయంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాత జయంతి ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని... సమాజంలోని ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చు కోవాలని కొలన్ హన్మంత్ రెడ్డి అన్నారు. ఆయనతో పాటు ప్రెసిడెంట్ శ్రీధర్ రెడ్డి, నాగిరెడ్డి, తులసి, జగదీశ్, రాహుల్, బాలాజీ, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి

● నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



నవతెలంగాణ-బంజారా హిల్స్

నగరంలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఆదేశించారు. శనివారం జోనల్ కమిషనర్లు సెక్షన్ ఇంజినీరింగ్ అధికారులు(ఎస్సీ)లతో ఆమె టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. వాటర్ లాగింగ్ ప్రాంతాల్లో నాలల దగ్గర ఎప్పటికప్పుడు పరిశీలించి ప్రజలకు వరద వల్ల ఎలాంటి ఇబ్బందులూ తలెత్తా కుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇప్పటి వరకు అన్ని జోన్‌లలో పరిస్థితి నియంత్రణలో ఉందని జోనల్ కమిషనర్లకు తెలిపారు. వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

5 యూనివర్సిటీలకు వీసీలుగా బీసీలను నియమించాలి

● లింగంగౌడ్ జాజుల



నవతెలంగాణ-ఓయూ

రాష్ట్రంలోని 10 యూనివర్సిటీలకు రాష్ట్ర ప్రభుత్వం నూతన వీసీలుగా ఏర్పాటు చేస్తున్న సందర్భంగా సామాజిక న్యాయం పాటించి జనాభాలో 55 శాతానికి పైగా ఉన్న బీసీలను ఐదు యూనివర్సిటీలకు వీసీలుగా నియమించాలని కోరుతూ శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి లేఖ రాసినట్టు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ బీసీలకు ఎమ్మెల్యే, ఎంపీ టికెట్ల విషయంలో కాంగ్రెస్ తీవ్ర అన్యాయం చేసిందని ఇప్పటికైనా అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సామాజిక న్యాయం పాటించి నీతి, నిజాయితీ కలిగిన వారిని వీసీలుగా నియమించి విశ్వవిద్యాలయాల ప్రతిష్ఠను కాపాడాలన్నారు. బంధుప్రీతి,రాజకీయ అండదండలు ఉన్న వారిని గాకుండా ఉన్నత విలువలు గలవారిని నియమించాలన్నారు. జేఎన్టీయూహెచ్ వీసీగా బీసీలకు అవకాశం కల్పించాలి

బెస్ట్ అవైలబుల్ స్కూల్‌లో దరఖాస్తులకు ఆహ్వానం

● జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి పి.యాదయ్య



నవతెలంగాణ-సిటీబ్యూరో

2024-25 సంవత్సరంలో బెస్ట్ అవైలబుల్ స్కూల్(డే స్కాలర్) పాఠశాలల యందు ఒకటవ తరగతిలో ప్రవేశంకోసం ఐదు నుంచి ఆరు సంవత్సరాల లోపు వయస్సు గల షెడ్యూల్ కులాల బాల, బాలికల నుంచి శనివారం నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు హైదరాబాద్ జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి పి యాదయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు హైదరాబాద్ వాస్తవ్యులై, నివాస సర్టిఫికెట్ మీ సేవ ద్వారా పొంది ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంతాల వారికి అభ్యర్థి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.1,50,000 లోపు ఉండాలని, పట్టణ ప్రాంతాల వారికి రూ.2,00,000/- లోపు ఉండాలని పేర్కొ న్నారు. ఒక్క కుటుంబం నుండి ఒక విద్యార్థికి మాత్రమే బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం కింద అవకాశం ఉంటుందన్నారు. ఇక విద్యార్థి వయస్సు 31.5.2024 నాటికి ఐదు నుండి ఆరు సంవత్సరాలు కలిగి ఉండాలని తెలిపారు. కులము, ఆదాయ ధ్రువ పత్రాలు మీసేవ ద్వారా పొంది ఉండాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తు ఫారములు హైదరాబాద్‌లో జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో నేరుగా తేదీ 7.06. 2024 సాయంత్రం 5.00 లోపు అందజేయాలన్నారు. ఆ తరువాత వచ్చిన దరఖాస్తులు స్వీకరించబడవని ఆయన తెలిపారు. తేదీ 11. 6.2024న విద్యార్థుల ఎంపికపై డ్రా తీయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

హరిసింగ్ రత్నావత్‌కు ఓయూ డాక్టరేట్



నవతెలంగాణ-ఓయూ

సూర్యాపేట జిల్లా చివ్వెముల మండలం ఎంజీ నగర్ తండాకు చెందిన కమలమ్మ లక్ష్మా నాయక్‌ల కుమారుడు రత్నవత్ హరిసింగ్‌కు ఓయూ డాక్టరేట్ దక్కింది. ప్రతిష్టాత్మక ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల డిపార్ట్మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సబ్జెక్టులో సీనియర్ ప్రొ. డాక్టర్ విబి నరసింహ పర్యవేక్షణలో (గైడ్ షిప్) లో "నెట్వర్క్ ఇన్ట్రూషన్ డిటెక్షన్ ఇన్ హనీ పాట్ ఫ్రేమ్ వర్క్ యూజింగ్ ఏ.ఐ మోడల్స్" అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని పూర్తి చేసినందుకు గాను ఓయూ పరీక్షల విభాగం ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సంద ర్భంగా హరిసింగ్ రత్నావత్ మాట్లాడుతూ పేద గిరిజన కుటుంబం నుంచి ఉన్నత చదువే లక్ష్యంగా ఓయూకు వచ్చినట్టు తెలిపారు. గతంలో ఎంసీఏ చేసిన విద్యార్థులకు ఇంజనీరింగ్ కళాశాలలో పీహెచ్డీ ప్రవేశాలు లేవు. దాంతో ఎంసీఏ విద్యార్థులకు సైతం ఇంజనీరింగ్ కళాశాలలో పిహెచ్డీలు ఇవ్వాలని హరిసింగ్ పోరాటం మొదలుపెట్టారు.. ఐటీ విభాగంలో ఆయనతోనే పీహెచ్డీ అడ్మిషన్స్ ప్రారంభం కావడం విశేషం. ఆయన పోరాటంతో పలువురు విద్యార్థులు ఐటీ సబ్జెక్ట్ లో పీహెచ్డీ అడ్మిషన్లు పొందారు. దీనికి తనకు ఎంతో గర్వంగా ఉందని ఆయన చెబుతున్నారు. తాను ఈ పీహెచ్డీ డాక్టరేట్ పొంద డానికి సహకరిం చిన ఓయూ ప్రొఫెసర్స్ , గైడ్ ప్రొ.వి బి నరసింహతోపాటు ప్రో.వెంకట దాస్, రాంబాబు,శ్రీనివాస రావు, ప్రొ. సుజాత, తల్లిదండ్రులకు , జీవిత సహ చరి సుహాసిని, తన మిత్రులు శ్రీనివాస్,రాకేష్, విద్యార్థి నాయకులు డా. బట్టు. శ్రీహరి,డా.ఎల్చల దత్తాత్రేయ డా.ప్రేమ్‌లకు హరిసింగ్ ధన్యవా దాలు తెలి పా రు. హరిసింగ్ ను ఓయూ ప్రొఫెసర్లు, విద్యార్థి నేతలు ఘనంగా సన్మానిం చారు. ఎంజీ నగర్ తండా నుంచి మెదటి పీహెచ్డీ పూర్తి చేసిన వ్యక్తిగా ఆయన రికార్డ్ సృష్టించారు. హరిసింగ్ రాష్ట్ర ఉద్యమంలో తీవ్ర కృషి చేశారు.

ఓయూ వీసీగా దళితున్ని నియమించాలి

● అంసా ఓయూ అధ్యక్షులు నామ సైదులు



నవతెలంగాణ-ఓయూ

ఓయూ వీసీ పదవిని దళిత సామాజిక వర్గానికి చెందిన వారికి కేటాయించాలని అంసా ఓయూ అధ్యక్షులు నామ సైదులు డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ 100 ఏండ్ల చరిత్ర కలిగిన ఉస్మానియా యూనివర్సిటీలో దళిత సామాజిక వర్గాలకు ఇంతవరకు వీసీ పదవీ అందరిని ద్రాక్షగా ఉందన్నారు. మిగతా సామాజిక వర్గాలకు వీసీలుగా పాలక ప్రభుత్వాలు అవకాశం కల్పించాయని తెలిపారు. ఈసారి కాంగ్రెస్ ప్రభుత్వం దళితులకు ఓయూ వీసీ పదవీ కేటాయించాలని కోరారు.



ఓయూ టేబుల్ బుక్ విడుదల

నవతెలంగాణ-ఓయూ

ఓయూ కాఫీ టేబుల్ బుక్‌ను ఓయూ వీసీ ప్రొ. రవిందర్ యాదవ్ శనివారం ఓయూ రిజిస్ట్రార్ ప్రో.పి.లక్ష్మీ నారాయణతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రొ. రవిందర్ మాట్లాడుతూ ఓయూ సమగ్ర ప్రగతిని కాఫీ టేబుల్ బుక్ ద్వారా అందించామని తెలిపారు. 108 ఏండ్ల ఓయూకు చిహ్నంగా 108 పేజీలతో రూపొందించిన ఈ పుస్తకం ఓయూ ముఖ చిత్రాన్ని అందిస్తుందని ఆకాంక్షించారు. ఎన్ఏఏసీ తనిఖీ కోసం సమగ్ర డాక్యుమెంట్ గానూ ఉపయోగపడుతుందని అన్నారు. విశ్రాంత ప్రొఫెసర్ స్టీవెన్ సన్ నేతృత్వంలోని బృందం రూపొందించిన ఈ పుస్తకంలో ఓయూ పునాది రాయి వేసింది మొదలు నేటి వరకు సాధించిన ప్రగతిని పొందుపరి చామన్నారు. ఇందుకోసం ప్రొఫెసర్ స్టీవెన్ సన్ అందించిన సహకారాన్ని కొనియాడారు. భవిష్యత్తులో పుస్తకాన్ని మెరుగుపరచడానికి నిర్మాణాత్మక సూచనలను అందించా ల్సిందిగా ఆహ్వానించారు. ఓయూ సాధించిన విజయాలను ప్రదర్శించటానికి కాఫీ టేబుల్ బుక్ బెంచ్ మార్క్ గా నిలుస్తుందని రిజిస్ట్రార్ ప్రొ. పి. లక్ష్మీనారాయణ ఉద్ఘాటిం చారు. కాఫీ టేబుల్ బుక్ రూపకల్పనలో సహకరించిన ప్రతి ఒక్కరికీ కమిటీ చైర్మెన్, ఓఎస్డీ ప్రొ. బి. రెడ్యానాయక్ కృతజ్ఞతలు తెలిపారు. విశ్వవిద్యాలయ సమగ్ర చరిత్ర, విజయాలకు సంబంధించిన సమాచారాన్ని ఆయా విభాగాలు సత్వరమే అందించాయని ప్రొ. స్టీవెన్ సన్ గుర్తు చేశారు.సెనేట్ హాల్‌లో జరిగిన కాఫీ టేబుల్ బుక్ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్, డైరెక్టర్లు, డీన్లు, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

23న అన్నమయ్య కీర్తనల ప్రవచకుడు వెంకట్ రచనల ఆవిష్కరణ

నవతెలంగాణ-కల్చరల్

ఈ నెల 23న రవీంద్ర భారతి ప్రధాన వేదిక పై శ్రీ రామ సాంస్కృతిక సేవా సంస్థ నిర్వహణలో అన్నమయ్య కీర్తనల ప్రవచన కర్త వెంకట్ గరికపాటి రచించిన తాళ్ళపాక పెద తిరుమలాచార్య కీర్తనల వ్యాఖ్యానం ' మాధవ పద మయూఖ ' గ్రంథం అన్నమయ్య విరచిత ఆంజనేయ సంకీర్తన కు వ్యాఖ్యానం సమీరి సంకీర్తనల సమీరం గ్రంథం ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిం చను న్నారు. ఈ మేరకు సంస్థ నిర్వాహకుడు గొర్తి చంద్ర శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా సివిల్ సర్వీస్ విశ్రాంత ఉన్నతాధికారి డాక్టర్ కె వి రమణ పాల్గొని గ్రంథాలను ఆవిష్కరిస్తారు. సాహితీవేత్త సుధామ అధ్యక్షత వహిస్తారు. స్టేట్ బ్యాంక్ స్టాఫ్ కాలేజీ డైరెక్టర్ ప్రకాష్ చంద్ర బరోడ్, సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ, నటుడు తనికెళ్ల భరణి అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. రామా చారి శిష్య బందం చే శ్రీ రామాంజనేయ రమ్య గీతిక పేరిట గాన గోష్ఠి వెంకట్ వ్యాఖ్యానంలో ఉంటుందన్నారు.

గర్భాశయ కణుతులతో జాగ్రత్త

● అపోలో క్రెడిల్, చిల్డ్రన్స్ హాస్పిటల్ - కన్సల్టెంట్ ప్రసూతి వైద్యులు, గైనకాలజిస్ట్, ల్యాప్ సర్జన్ డాక్టర్ హారిక బోనం



నవతెలంగాణ-బంజారాహిల్స్

గర్భాశయ కణుతులతో జాగ్రత్తగా ఉండాలని అపోలో క్రెడిల్, చిల్డ్రన్స్ హాస్పిటల్ - కన్సల్టెం ట్ ప్రసూతి వైద్యులు, గైనకాలజిస్ట్, ల్యాప్ సర్జన్ డాక్టర్ హారిక బోనం అన్నారు. శనివారం నవతెలంగాణతో ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడారు. స్త్రీకి ఆరోగ్యమే మూలధనమని, గర్భాశయం కండరాల కణాలలో పెరిగే క్యాన్సర్ కాని కణుతులను ఫైబ్రాయిడ్లు అంటారనీ ఇవి గర్భాశయం,గర్భాశయం చుట్టూ అభివృద్ధి చెందుతాయనీ కండరాలు, పీచు కణజాలంతో తయార వుతాయనీ ఆమె తెలిపారు. వీటిని గర్భాశయ మయోమాస్ లేదా లియోమియోమాస్ని పిలుస్తారని చెప్పారు. 60 నుంచి 70 శాతం స్త్రీలలో తమ జీవితకాలంలో లేదా 50 ఏండ్ల వయస్సులో ఈ ఫైబ్రాయిడ్లు డెవలప్ అవుతాయన్నారు.అయితే, సగం మందికి ఎటువంటి లక్షణాలు ఉండవని, మన దేశంలో గర్భాశయాన్ని తొలగించడానికి ఉన్న ప్రధాన కారణాలలో గర్భాశయ ఫైబ్రాయిడ్ కూడా ఒకటన్నారు. ఫైబ్రాయిడ్ పరి మాణం ఎంఎంఎస్ నుంచి 20 నుంచి 30 సెంటీమీటర్ వరకు ఉండవచ్చు అని అవి గర్భం లైనింగ్‌లో, గోడ లోపల, గర్భం బయటి పొరలో లేదా విశాలమైన స్నాయువులో ఉంటాయనీ పరిమాణం,స్థానం,పెరుగుదల వేగాన్ని బట్టి అనేక లక్షణాలతో ఉంటాయన్నారు.

ఇవి లక్షణాలు...

- పీరియడ్స్ సమయంలో ఎక్కువగా రక్తస్రావం
- పీరియడ్స్ సమయంలో లేదా
- పీరియడ్స్ మధ్యలో కడుపు నొప్పి
- నడుము నొప్పి
- తరచూ మూత్ర విసర్జన
- మల విసర్జనలో ఇబ్బంది.
- సెక్స్ సమయంలో నొప్పి లేదా అసౌకర్యం
- క్రమరహిత ఋతు రక్తస్రావం
- అరుదైన సందర్భాల్లో గర్భం ధరించడంలోనూ ఇబ్బందిని కలిగిస్తుందన్నారు.

ఫైబ్రాయిడ్లు ఎందుకు అభివృద్ధి చెందుతాయి?

కచ్చితమైన కారణం తెలియదు.కానీ అవి అండాశయాల ద్వారా ఉత్పత్తి చేయబడిన స్త్రీ పునరుత్పత్తి హార్మోన్ అయిన ఈస్ట్రోజెన్ అనే హార్మోన్‌తో ముడిపడి ఉంటాయన్నారు.16 నుంచి 50 సంవత్సరాల పునరుత్పత్తి వయస్సులో ఈస్ట్రోజెన్ స్థాయిలు అత్యధికంగా ఉంటాయనీ ఫైబ్రాయిడ్లు కూడా ఉంటాయన్నారు.మెనోపాజ్ తర్వాత ఈస్ట్రోజెన్ స్థాయిలు తక్కువగా ఉన్నప్పుడు అవి తగ్గిపోతాయన్నారు.అధిక బరువు/ఊబకాయం ఉన్నవారిలో తరచూ సంభవిస్తాయని కూడా భావించబడుతుందనీ ఎందుకంటే,అధిక బరువు శరీరంలో ఈస్ట్రోజెన్ స్థాయిని పెంచుతుందని తెలిపారు. ఆఫ్రికన్ కరేబియన్ మూలానికి చెందిన మహిళల్లో ఫైబ్రాయిడ్లు తరచూ అభివృద్ధి చెందుతాయని భావిస్తున్నారు. జన్యుపరమైన కారణం కూడా ఉందని అధ్యయనాలు సూచిస్తున్నాయన్నారు.

ఎవరికి చికిత్స అవసరం?

ఏవైనా లక్షణాలు లేకపోతే పర్వాలేదు. రోజువారీ కార్యకలాపాలను గణనీయంగా ప్రభావితం చేయని చిన్న చిన్న లక్షణాలు ఉంటే చికిత్స అవసరం లేదు. మెనోపాజ్ తర్వాత ఫైబ్రాయిడ్లు తరచూ తగ్గిపోయి లక్షణాలు క్రమంగా అదృశ్యమవుతాయని హారిక తెలిపారు.

ఫైబ్రాయిడ్లకు చికిత్స, ఎంపికలు ఏమిటి?

చికిత్స అనేది వయస్సు మీద ఆధారపడి ఉంటుంది. లక్షణాలు, తీవ్రత, ఫైబ్రాయిడ్ల స్థానం, సంఖ్య, పరిమాణం, సంతానోత్పత్తి ఆందోళనలు, గతంలో చికిత్సలు, రోగి ప్రతిస్పందన వీటన్నిటిపైన ఆధారపడి ఉంటుందన్నారు.

ఒకటో లైన్ వైద్యం..

ఇది హార్మోనులు లేదా హార్మోన్లు కాకపోవచ్చనీ ఇది రక్తస్రావం తగ్గిస్తుంది/ ఫైబ్రాయిడ్‌లను తగ్గిస్తుందన్నారు. ఇది విఫలమైతే తదుపరి నాన్-సర్జికల్, సర్జికల్ ఎంపిక చేసుకోవాలి. నాన్-సర్జికల్ ఎంపికలో మిరెనా, యుటెరైన్ ఆర్టరీ ఎంబోలైజేషన్, ఎంఆర్ఐ గైడెడ్ ప్రొసీజర్స్ ఉన్నాయన్నారు.

మిరెనా - ఒక చిన్న 'టీ' ఆకారపు ప్లాస్టిక్ పరికరం ఇది గర్భాశయం లోపల ప్రొజెస్టెరాన్ హార్మోన్‌ను నెమ్మదిగా విడుదల చేస్తుందన్నారు.ఇది క్రమంగా ఫైబ్రాయిడ్ పరిమాణాన్ని తగ్గిస్తుందనీ రోగకి ఉపశమనాన్ని ఇస్తుంది. మిరెనా కూడా ఒక గర్భనిరోధక పద్ధతిగా వ్యవహరించే ప్రయోజనాన్ని కలిగి ఉందనీ సైడ్ ఎఫెక్ట్ సక్రమంగా రక్తస్రావం, మచ్చలు, 1/3 వంతు వరకు స్పందించకపోవచ్చు. శస్త్రచికిత్స అవసరం కావచ్చని తెలిపారు.

యుటెరైన్ ఆర్టరీ ఎంబోలైజేషన్ (యూఏఈ) అనేది శస్త్రచికిత్సకు ప్రత్యామ్నాయం,పెద్ద ఫైబ్రాయిడ్లు ఉన్న మహిళలకు సిఫార్సు చేయవచ్చన్నారు. ఫోకస్డ్ అల్ట్రాసౌండ్ లేదా పెర్క్యుటేనియస్ లేజర్ అబ్లేషన్ వంటి ఎంఆర్ఐ గైడెడ్ విధానాలు ఫైబ్రాయిడ్‌లకు చికిత్స చేయడానికి కొత్త పద్ధతులు, దీర్ఘకాలిక ప్రయోజనాలు, నష్టాలు తెలియవన్నారు.

శస్త్రచికిత్స ఎంపికలు ఏమిటి?

లక్షణాలు తీవ్రంగా ఉన్నా, వైద్య నిర్వహణకు స్పందించకున్నా శస్త్రచికిత్సను పరిగణనలోకి తీసుకోవచ్చు. ఫైబ్రాయిడ్స్ కోసం చేసే రెండు ప్రధాన రకాల శస్త్రచికిత్సలన్నారు.

1) మైయోమెక్టమీ - ఫైబ్రాయిడ్‌ను తొలగించి, గర్భాశయాన్ని కుట్టించే ప్రక్రియ

2) గర్భాశయ శస్త్రచికిత్స - గర్భాన్ని తొలగించడం

ఏది అనేది మహిళల వయస్సు, ఇతర అంశాలపై ఆధారపడి ఉంటుందని, ఫైబ్రాయిడ్ల సంఖ్య, పరిమాణం, ఇతర వైద్య సమస్యలను దృష్టిలో పెట్టుకొని కౌన్సిలింగ్ తరువాత మహిళలు ఎంపిక చేసుకోవచ్చన్నారు. శస్త్రచికిత్స కీహోల్ పద్ధతి (లాపరోస్కోపీ) ద్వారా ఏదైనా ప్రక్రియ చేయవచ్చన్నారు.ఇది సంప్రదాయ ఓపెన్ సర్జరీ కంటే చాలా ప్రయోజనాలను కలిగి ఉంటుందన్నారు.

ప్రెగ్నెన్సీలో ఫైబ్రాయిడ్స్ వల్ల ఏమైనా సమస్యలు వస్తాయా?

గర్భధారణ సమయంలో ఫైబ్రాయిడ్స్ ఉన్న స్త్రీలు గర్భధారణ సమయంలో కడుపు నొప్పిని అనుభవించవచ్చన్నారు.

మెట్రో రైలు వేళల్లో మార్పు లేదు

● హైదరాబాద్ మెట్రో రైలు అధికారులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ మెట్రో రైల్ సర్వీస్ వేళల పొడిగింపునకు సంబంధించి ఇటీవల వచ్చిన వార్తలను ఎల్అండ్‌టీ మెట్రో రైల్ (హైదరాబాద్) లిమిటెడ్ అధికారులు తోసిపుచ్చారు. ఈ మేరకు శనివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. మెట్రో రాకపోకల వేళలకు సంబంధించి ఎలాంటి మార్పు చేయలేదని, ప్రతీరోజు యథావిధిగానే ఉదయం 6గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు మెట్రో రైళ్లు నడుస్తాయని స్పష్టం చేశారు. అయితే ప్రతి శుక్రవారం రాత్రి 11. 45 గంటల వరకు, ప్రతి సోమవారం ఉదయం 5.30 గంటల నుంచే రైళ్ల రాకపోకలపై పరిశీలన మాత్రమే జరిగిందని, ఇంకా ఆ వేళలపై ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం ట్రయల్ ప్రాతిపదికన తాము అన్ని శుక్రవారాలు, సోమవారాల్లో మాత్రమే సర్వీస్ వేళలను పొడిగిస్తుంటామన్నారు.

శుక్రవారం రోజున చివరి రైలు రాత్రి 11 గం.లకు బదులుగా రాత్రి 11.45 నిమిషాలకు బయల్దేరుతుందని, తద్వారా 45 నిమిషాల పాటు అదనపు సర్వీసు అందించినట్టవుతుందని చెప్పారు. సోమవారం మొదటి రైలు ఉదయం 6 గంటలకు కాకుండా ఉదయం 5.30 గంటలకు బయల్దేరుతుందని పేర్కొన్నారు. తద్వారా అదనంగా 30 నిమిషాల సర్వీసు అందించినట్టవుతుందన్నారు. ఇది ట్రయల్ ప్రాతిపదికన మాత్రమేనని.. ట్రాక్, రైళ్ల మెయింటెనెన్స్ షెడ్యూల్‌ను సర్దుబాటు చేసేందుకు గల అవకాశాలను పరిశీలించిన మీదట, అలాగే డిమాండ్‌ను బట్టి తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. వేళల విషయంలో ఎటువంటి గందరగోళానికి గురికావద్దన్నారు.

జూన్ 6 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా మాదిగ జన సభలు



● డా.పిడమర్తి రవి

నవతెలంగాణ-బంజారాహిల్స్

జూన్ 4 తరువాత మొట్ట మొదటి పార్లమెంట్ సమావేశంలోనే మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించి చట్టం బద్ధత చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతూ తెలంగాణ వ్యాప్తంగా మాదిగ జన సభలు నిర్వహిస్తామని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ మాదిగ జేఏసీ వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి తెలిపారు. శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో 14 మాదిగ సంఘాల ఐక్య కార్యాచరణ సంఘాల ఆధ్వర్యంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాతో రాష్ట్ర తొలి ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్,మాదిగ జే.ఏ.సి.వ్యవస్థాపకులు డా.పిడమర్తి.రవి మాట్లాడుడారు. ఇటీవల పార్లమెంట్ ఎన్నికల అన్ని సభలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేసే బాధ్యత తానే తీసుకుంటానని మాదిగలకు న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారనీ తెలిపారు. మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలంటూ మొదటి పార్లమెంట్ సమావేశాల్లోనే చట్టం బద్ధత చేయటానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు.

ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే జూన్ 6 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా మాదిగ జన సభలు నిర్వహిస్తామని ప్రకటించారు. ఉమ్మడి రిజర్వేషన్ ఆధారంగా వర్గీకరణ చేస్తే మాదిగలకు తీవ్ర నష్టం కలుగుతుందని, 12 శాతం రిజర్వేషన్ మాదిగలకు కేటాయించాలన్నారు. పెరిగిన జనాభాకు అనుకూలంగా రిజర్వేషన్ ఫలాలు అందాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టబోయే కుల గణన ఆధారంగా ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంటు లేదా సుప్రీంకోర్టు తీర్పుతో వచ్చిన వెంటనే రాష్ట్రంలో మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాదిగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు డా.బొల్లికొండ.వీరేందర్, మాదిగ రాజకీయ వేదిక రాష్ట్ర అధ్యక్షులు వక్కలగడ్డ.చంద్రశేఖర్,తే. రాష్ట్ర దండు బచ్చలి కూర.బాలరాజు, తే.మాదిగ సంక్షేమ సంఘం గడ్డె. యాదన్న తే. దళిత బహుజన సంఘం గజ్జెల.మల్లిఖార్జున్, తెలంగాణ దళిత సంఘం కనకం వంశీ,ఎంహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మైసా.ఉపేందర్, ఎం.ఆర్. పి.యస్. ఎల్లేష్, నిరుద్యోగ జే.ఏ.సి. వట్టే.యాదయ్య,టీఎస్ఎఫ్ బోరెళ్ళి సురేష్ ,మాదిగ జే.ఏ.సి.రాష్ట్ర జనరల్ సెక్రటరీ మోదుగు.జోగారావు,మాదిగ జే.ఏ.సి.రాష్ట్ర ప్రచార కార్యదర్శి సిద్దెల.తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

ఆభరణాలతో అందం రెట్టింపు : రాశీఖన్నా



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఆభరణాలు అందాన్ని మరింత పెంచుతాయయనీ, మగువల అందాన్ని రెట్టింపు చేస్తాయని ప్రముఖ సినీనటి రాశి ఖన్నా అన్నారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్ 2 లోని లుంబినీ జ్యువెల్ మాల్‌లో ఉన్న మంగత్రయి నీరజ్ ఆధ్వర్యంలో శనివారం "వీనస్ - ద గాడెస్ ఆఫ్ ఎమరాల్డ్" పేరుతో ప్రత్యేక కలెక్షన్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాశి ఖన్నా అక్కడ ఏర్పాటు చేసిన పలు ఆభరణాలను ధరించి సందడి చేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. మన సంప్రదాయాలకు ఆధునికతను మేళవిస్తూ ఇక్కడ రూపొందించిన ఆభరణాలు తనకింతగానో నచ్చాయన్నారు. ప్రతి మగువ ఆభరణాలను ధరించడానికి ఇష్టపడుతుందని, అలాగే తనకు కూడా ఆభరణాలు ధరించడం ఇష్టమేనని అన్నారు. అయితే సందర్భానుసారంగా తన అలంకరణ ఉంటుందన్నారు. డిజైనర్ నయన్ గుప్తా రూపొందించిన ఈ ఆభరణాలు ప్రత్యేక రీతిని కలిగి ఉన్నాయన్నారు. మగువల, యువత మనసును ఇవి ఖచ్చితంగా దోచుకుంటాయన్నారు. నయన్ గుప్తా మాట్లాడుతూ.. మగువల ఆలోచనలను ప్రతిబింబించేలా ఈ ఆభరణాలను రూపొందించినట్టు తెలిపారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో భాగంగా పలువురు మోడల్స్ నగలను ధరించి హొయలు పోయారు.

సీపీఎంబీ పుస్తకావిష్కరణ



నవతెలంగాణ-ఓయూ

ప్రపంచ వ్యాప్తంగా వేగంగా విస్తరిస్తున్నా క్యాన్సర్ మహమ్మారిపై విస్తృత పరిశోధనలు చేస్తున్న ఓయూలోని సెంటర్ ఫర్ ప్లాంట్ మాలిక్యూలర్ బయాలజీ (సీపీఎంబీ) పుస్తకావిష్కరణ చేశారు. అనేక మంది పరిశోధకులతో కలిసి సీపీఎంబీ డైరెక్టర్ డాక్టర్ రామకృష్ణ కంచ రచించిన బయోమెడికల్ యాస్పెక్ట్స్ ఆఫ్ సాలిడ్ క్యాన్సర్స్ అనే పుస్తకాన్ని ఓయూ వీసీ ప్రో. రవిందర్, రిజిస్ట్రార్ ప్రో. పి. లక్ష్మీనారాయణలు ఆవిష్కరించారు. ఈ పుస్తక సంపాదకులు, సీపీఎంబీ డైరెక్టర్ డాక్టర్ రామకృష్ణ కంచ మాట్లాడుతూ హైదరాబాద్‌లోని జీవ శాస్త్రవేత్తలు, వైద్యులు, పరిశోధక విద్యార్థుల నెట్ వర్కింగ్‌తో ఈ ప్రయత్నం చేశామన్నారు. ఎపిడెమియాలజీ, ప్రమాద కారకాలు, రోగనిర్ధారణ, వర్గీకరణ, జన్యుశాస్త్రం, చికిత్స, ప్రస్తుత సవాళ్లు వంటి క్యాన్సర్‌కు సంబంధించిన వివిధ అంశాలను ఈ పుస్తకంలో పొందుపరిచామని తెలిపారు. పుస్తక రూపకల్పన మొదలు పుస్తకావిష్కరణ వరకు జరిగిన ప్రయాణాన్ని పంచుకున్నారు. జీవశాస్త్రవేత్తలు, వైద్యులకు వివిధ క్యాన్సర్‌లపై ప్రాథమిక, అధునాతన శాస్త్రీయ సమాచారాన్ని అందించడానికి ఈ పుస్తకం ఉపయోగపడు తుందని డాక్టర్ కంచ చెప్పారు. మెడికల్, లైఫ్ సైన్సెస్ విద్యార్థులకు బిగినర్స్ గైడ్‌గా ఉపయోగపడుతుందని ఆకాంక్షించారు. యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్, ఎంఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్, రెనోవా సౌమ్య హాస్పిటల్, ఐసీఎంఆర్- ఎన్ఐఎన్, ఏఐజీ హాస్పిటల్, అపోలో హాస్పిటల్, అమోర్ హాస్పిటల్, కిమ్స్ ంటి సంస్థలు కలిసి కాన్సర్ కారకాలు, చికిత్స, సవాళ్లపై సమగ్ర పుస్తకాన్ని తీసుకురావటం పట్ల ఓయూ వీసీ ఆనందం వ్యక్తం చేశారు. ప్రతిష్టాత్మక స్ప్రింగర్ పబ్లిషర్స్ ఈ పుస్తకాన్ని అచ్చువేయటం ఓయూకు గర్వకారణమని చెప్పారు. అన్ని విభాగాల సహకారంతో సమాజంలోని విభిన్న సవాళ్లను పరిష్కరించే దిశగా పరిశోధనలు జరగాలని , అందుకే ఓయూలో ల్యాబ్ టూ ల్యాంట్ అనే విధానాన్ని తెచ్చా మని గుర్తు చేశారు. కాన్సర్ మహమ్మారికి శాశ్వత పరిష్కారం దిశగా పరిశోధనలు జరగా లని రిజిస్ట్రార్ ప్రో. పి. లక్ష్మీనారాయణ అన్నారు. పుస్తకం చదివే వరకు 26 రకాల కాన్సర్లు ఉంటాయనే విషయం తెలియదన్నారు. సామాన్యులకు సైతం కాన్సర్లు, చికిత్స పట్ల అవగాహన కల్పించేందుకు ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు, ఆంకాలజిస్టులు పాల్గొని పెరుగుతున్న క్యాన్సర్ భారాన్ని పరిష్కరించడానికి ఇలాంటి పుస్తకాలు అవసరమని అభిప్రాయపడ్డారు.

'రవీందర్ నాయక్ ఆశయాలను కొనసాగిద్దాం'



నవతెలంగాణ-ఓయూ

గిరిజన హక్కులనేత, మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఓయూ కేంద్రంగా క్రియాశీలకంగా పనిచేసిన డాక్టర్ రవీందర్ నాయక్ 5వ వర్ధంతి సంస్మరణ సభను శనివారం ఓయూ ఆర్ట్స్ కళాశాల పొలిటికల్ సైన్స్ సెమినార్ హాల్ లో విద్యార్థి ఉద్యమకారులు ప్రొఫెసర్లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులు అర్పిస్తూ రవీందర్ నాయక్ ఉద్యమంలో పోషించిన పాత్ర గురించి సహచర విద్యార్థి ఉద్యమకారులు గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ మారుమూల తండా నుంచి డాక్టరేట్‌గా ఎదిగిన రవీందర్ నాయక్‌ను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థి హక్కుల కోసం, గిరిజన హక్కుల కోసం రాబోయే రోజుల్లో విద్యార్థులు పోరాడాలని పిలుపునిచ్చారు. మలిదశ ఉద్యమంలో ఓయూ కేంద్రంగా జరిగిన చలో అసెంబ్లీ, రాస్తారోకోలు, నిరాహార దీక్షల్లో కీలకంగా రవీందర్ నాయక్ పనిచేశారని తెలిపారు. గిరిజన రిజర్వేషన్ పెంపు, గిరిజనుల సమస్యలపై నిరంతరం పోరాడే తత్వం ఉన్న రవీందర్ నాయక్ సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొ. చంద్రు నాయక్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఓయూ జేఏసీ చైర్మెన్ డా. కరాటే రాజు నాయక్, బీజేపీ రాష్ట్ర నాయకులు డా. నెహ్రూ నాయక్, జనసేన రాష్ట్ర నాయకులు డా. సంపత్ నాయక్, గిరిజన శక్తి వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్బు నాయక్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డా. వెంకటేష్ చౌహాన్, సేవాలాల్ జెడ్పిటిసి సంజీవ్ నాయక్, బిఆర్ఎస్ నాయకులు డా. దత్తాత్రేయ, డా. రాజారాం నాయక్, యువ పారిశ్రామికవేత్త విష్ణు, గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షులు శరత్ నాయక్, గిరిజన శక్తి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్, గిరిజన శక్తి రాష్ట్ర చీఫ్ కోఆర్డినేటర్ రమేష్ రాథోడ్, ఎల్ ఎస్ ఓ రాష్ట్ర అధ్యక్షులు అశోక్ నాయక్, ఎల్ ఎస్ ఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయేందర్, అసోసియేట్ ఇంగ్లీష్ ప్రొఫెసర్ ప్రేమ్ వెంకటేష్, లింగ, జైపాల్, ప్రకాష్, మహేష్, జగదీష్ , పాల్గొన్నారు.

మాదిగలను వీసీలుగా నియమించాలి



● ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి శేఖర్

నవతెలంగాణ-ఓయూ

తెలంగాణలో అత్యధిక జనాభా కలిగిన మాదిగ సామాజిక వర్గానికి చెందిన ప్రొఫెసర్లను రెండు యూనివర్సిటీలకు వీసీలుగా నియమించాలని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ కోరారు. శనివారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణంలో ఎంఎస్ఎఫ్ ముఖ్యుల సమావేశం ఎంఎస్ఎఫ్ ఓయూ అధ్యక్షులు మంద రాజు మాదిగ అధ్యక్షతన జరగగా ముఖ్య అతిథిగా. కొమ్ము శేఖర్ మాదిగ పాల్గొని మాట్లాడారు. ఉస్మానియా యూనివర్సిటీ లేదా జేఎన్‌టీయూ వీసీ పదవిని మాదిగలకు కేటాయించాలని, అలాగే ఉన్నత విద్యామండలి చైర్మెన్‌గా మాదిగలను నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ నాయకులు గుండాల రవితేజ మాదిగ,బొల్లికొండ వేణు మాదిగ, కోల హరీష్ మాదిగ,సంతోష,రవి,ప్రదీప్,రమేష్ మాదిగ, నవీన్ మాదిగ,రామకృష్ణ మాదిగ,సైదులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
HMDA
ఆదివారం | మే 19, 2024 | www.navatelangana.com

ప్రభుత్వ పాఠశాలలో కమిన్స్ సందడి





నవతెలంగాణ-సిటీబ్యూరో

ఐపీఎల్ సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్, ఆస్ట్రేలియా క్రికెటర్ ప్యాట్ కమిన్స్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో క్రికెట్ ఆడి సందడి చేశారు. చంపాపేట డివిజన్ కర్మాన్‌ఘాట్‌లోని జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన బూట్ క్యాంపు కార్యక్రమానికి విచ్చేసిన కమ్మిన్స్ విద్యార్థులతో కలిసి క్రికెట్ ఆడారు. విద్యార్థులు భవిష్యత్‌లో నిర్వహించాల్సిన ప్రాజెక్టులను ఎలా తయారు చేసుకోవాలో తెలిపారు. ఈ సందర్భంగా కమిన్స్‌కు ఓ విద్యార్థిని రాఖీ కట్టడం విశేషం

టీఎస్ స్థానంలో టీజీ తక్షణమే అమలు

- హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



నవతెలంగాణ-సిటీబ్యూరో

టీఎస్ స్థానంలో టీజీ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో హైదరాబాద్ జిల్లాలోని అన్ని శాఖల ఉన్నత అధికారులు తక్షణమే రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులను అమలు చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు తెలంగాణ రాష్ట్ర అబ్రియేషన్స్ సూచించే 'టీఎస్' స్థానంలో టీజీని వినియోగిం చేందుకు కేంద్రం అనుమతిస్తూ గెజిట్ జారీ చేసిన దృష్ట్యా తెలం గాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి శు క్రవారం ఉత్తర్వులు వెలుపడ్డాయని పేర్కొన్నారు.

జిల్లాలో ఇకపై అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలు, ఏజెన్సీలు, పబ్లిక్ సెక్టార్ యూనిట్లు, ఏజెన్సీలు, స్వయం ప్రతిపత్తి గల సంస్థలు, కార్పొరేషన్లు,వెబ్‌సైట్‌లు, ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లు.. ఏదైనా ఇతర అధికారిక కమ్యూనికేషన్లు సైతం తెలంగాణ కోడ్ ను టీఎస్ బదులుగా టీజీ ని వాడాలని కలెక్టర్ కోరారు. లెటర్ హెడ్లు, రిపోర్టులు, నోటిఫికేషన్లు, అధికారిక వెబ్ సైట్లు, ఆన్‌లైన్ ఫ్లాట్ ఫార్మ్స్, పాలసీ పేపర్లు, జీవోలు, ఇతర అధికారిక కమ్యూనికేషన్లన్నింటి పై టీఎస్ స్థానంలో టీజీ గా మార్చాలని పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖలు ద్వారా నిర్వహించే ఉత్తర, ప్రత్యుత్త రాలలో టీఎస్‌కు బదులుగా టీజీని ముద్రించాలని ఆయన సూచించారు. ఈ మేరకు తీసుకున్న చర్యలపై ఈ నెల 25వ తేదీలోపు అన్ని శాఖల జిల్లా అధికారులు తగిన నివేదికలు పంపాలని, ఆ నివేదికలు క్రోడీకరించి ప్రభుత్వానికి పంపనున్నట్లు

టెన్నిస్ అండర్ - 14

విజేత వనపర్తి బాలిక సాన్వీ రెడ్డి

- భారత దేశం తరపున పాల్గొన్న సాన్వీ రెడ్డి
- సాన్వీరెడ్డిని శాలువాతో సన్మానించి అభినందించిన రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ డాక్టర్ జీ చిన్నారెడ్డి



నవతెలంగాణ-సిటీబ్యూరో

టెన్నిస్ అండర్ - 14 సింగిల్స్, డబుల్స్ లో ఆసియన్ విజేతగా భారత దేశం తరపున ఆడిన వనపర్తి మండలం చిన్నగుంటపల్లి గ్రామానికి చెందిన వీ. సాన్వీ రెడ్డి నిలిచారు. టెన్నిస్ లో భారత దేశం గౌరవాన్ని ఆసియన్ స్థాయిలో నిలబెట్టింది. సాన్వీ రెడ్డి. టెన్నిస్ ఆసియన్ స్థాయి పోటీలు బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో ఈనెల 13 నుంచి 17 వ తేదీ వరకు జరిగాయి. 17 న జరిగిన టెన్నిస్ టోర్నమెంట్ ఫైనల్స్ సింగిల్స్ లో బంగ్లాదేశ్ దేశానికి చెందిన సుమేరా అఖ్తర్ పై 7-6, 6-2 తేడాతో భారత దేశ టెన్నిస్ క్రీడాకారిణి సాన్వీ రెడ్డి విజయం సాధించారు. డబుల్స్ ఫైనల్స్ లో భారత దేశ జోడి సాన్వీ రెడ్డి, నయీమ హుస్సేన్ బంగ్లాదేశ్ దేశ జోడి హైదర్ హుమేర, సుమేర అఖ్తర్ పై 7-5, 6-2 స్కోర్ తో విజయం సాధించారు. సాన్వీ రెడ్డి సోదరుడు తనీష్ రెడ్డి టెన్నిస్ అండర్ -14 ఆసియన్ స్థాయి పోటీల్లో క్వార్టర్ ఫైనల్స్ వరకు చేరారు.

బంగ్లాదేశ్ నుంచి శనివారం హైదరాబాద్ కు చేరుకున్న సాన్వీ రెడ్డిని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ డాక్టర్ జీ చిన్నారెడ్డి, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు డాక్టర్ జీ ఆదిత్య రెడ్డి శాలువాతో సన్మానించి అభినందించారు. భవిష్య త్తులో మరిన్ని విజయాలు సాధించి భారత దేశం, తెలంగాణ రాష్ట్రం, పాలమూరు - వనపర్తి జిల్లా పేరు ప్రఖ్యాతులు ప్రపంచానికి చాటి చెప్పాలని చిన్నారెడ్డి ఆకాంక్షించారు. సాన్వీ రెడ్డి , తనీష్ రెడ్డి తల్లిదండ్రులు వీ. చైతన్య రెడ్డి, సౌమ్యాలకు చిన్నారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.





ఉపాధి కూలీల పొట్టగొట్టే నిబంధనలు రద్దు చేయాలి

- వ్యకాస రాష్ట్ర కార్యదర్శి వెంకట్‌రాములు
- ఇబ్రహీంపట్నం మండలం ముకునూర్‌లో పర్యటన
- కూలీల సమస్యల అడిగి తెలుసుకున్న బృందం

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రతినిధి

ఉపాధిహామీ కూలీల పొట్టగొట్టే నిబంధనలను రద్దు చేయాలని వ్యకాస రాష్ట్ర కార్యదర్శి వెంకట్‌రా ములు డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నం మండలం ముకునూర్ గ్రామంలో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలను వ్యకాస బృందం కలిసింది. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పని ప్రదేశంలో ఉదయం, సాయంత్రం ఫొటోలు అప్లోడ్ చేస్తేనే వేతనాలు చెల్లిస్తామని నేషనల్ మొబైల్ మోనిటరింగ్ సిస్టమ్ యాప్‌ను తెచ్చిందన్నారు. బ్యాంకు అకౌంట్, జాబ్ కార్డు, అధార్ కార్డు నెంబర్లను లింకు చేసిన వారికే ఆన్‌లైన్‌లో వేతనాలు చెల్లిస్తామనడం విడ్డూరంగా ఉందని చెప్పారు. డ్రోన్ యంత్రంతో పని చేసే కూలీల ఫొటోలు తీయాలని కేంద్ర ప్రభుత్వం నిబంధనలు తెచ్చి పెట్టిందని ఆందోళన వ్యక్తం చేశారు. మరో వైపు రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ పనులకు అనుసంధానం చేస్తామని ప్రక టించిందని చెప్పారు. క్యూబిక్ మీటర్ల కొలతల పేరుతో ప్రభుత్వం నిర్ణయించిన వేతనం రూ.272 కూడా పడ కుండా చేస్తున్నారన్నారు. వీటిని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. తాగునీటి బిల్లులు, సమ్మర్ అలవె న్సు, గడ్డపార సానబిల్లు కలిపినా రోజుకు రూ.80-140 వేతనాలు పడటం లేదన్నారు. కొత్తగా జాబ్ కా ర్డుల జారీని నిలిపివేశారన్నారు. వాచర్లకు ఇచ్చే పని, వే తనాలు గ్రామ పంచాయతీల దయపై ఆధార పడా ల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. క్యూబిక్ మీటర్ కొలతలతో సంబంధం లేకుండా రోజు కూలి రూ.300 చెల్లించాలన్నారు. పట్టణాలకు పనులు విస్తరించాలన్నా రు. పని చూపని దగ్గర నిరుద్యోగ భృతి చెల్లించాల న్నారు. వారం వారం వేతనాలు చెల్లించాలన్నారు. మేట్లను కొనసాగించాలని కోరారు. ఎఫ్ఏల జీతాలు పెంచాలన్నారు. ఉపాధి పనిని 200 రోజులకు రోజు కూలి రూ. 600లకు పెంచాలన్నారు. తాగటానికి నీ రు, నీడకు టెంటు, మెడికల్ కిట్టు ఇవ్వాలని కోరారు. ప్రమాద బీమా రూ.5 లక్షలు, చనిపోతే రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. ఫ్రీగా వైద్యం అన్ని ఆ స్పత్రుల్లో అందించాలన్నారు. భార్య భర్తలకు తట్ట, పలుగు, పార, కొడవలి, గొడ్డలివ్వాలని, పనిముట్ల సానకు, లోకల్ ఆటో ఛార్జీలు చెల్లించాలన్నారు. మోడీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తరువాత మహాత్మగాంధీ జాతీ య గ్రామీణ ఉపాధిహామీ పనిని ఎత్తేయడానికి అనేక కుట్రలు పన్నుతుందన్నారు. బడ్జెట్‌లో భారీగా కోత విధించిందని చెప్పారు. కొన్ని జిల్లాలకు మాత్రమే పనిని చూపాలని ప్రణాళికలు తెస్తుందన్నారు. కొత్త నిబం ధనలు పేరుతో కూలీల సంఖ్యను, పనిదినాలను, వేత నాలను తగ్గించాలని తీవ్ర ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. మార్చి నెల నుంచి జూన్ నెల వరకు సమ్మర్ అలవెన్సు, వడదెబ్బ తగలకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, దెబ్బలు తగిలితే ప్రాథమిక చికిత్సకు మెడికల్ కిట్, పని ప్రదేశంలో అందుబాటులో ఉంచాలన్నారు. అందు కో సం వ్యకాస ఆధ్వర్యంలో ఉద్యమాలు ఉధృతం చేస్తా మని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యకాస జిల్లా కార్య దర్శి కె.జగన్, జిల్లా ఉపాధ్యక్షులు సీహెచ్ జంగయ్య, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.జగన్ తదితరులున్నారు.

కాంగ్రెస్ ఖాతాలోకి 'నార్సింగి'



- నార్సింగిలో నెగ్గిన అవిశ్వాసం
- మెజార్టీ సభ్యులు హాజరుతో చైర్‌పర్సన్, వైస్ చైర్మెన్ పదవుల ఔట్
- హస్తగతం చేసుకోవడంలో జ్ఞానేశ్వర్, జైపాల్‌రెడ్డి, అశోక్‌యాదవ్ కీలక పాత్ర
- తగ్గుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ గ్రాఫ్
- రాజేంద్రనగర్ ఆర్డీఓ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో అవిశ్వాస సభ

నవతెలంగాణ-గండిపేట్

నార్సింగి మున్సిపాలిటీలో చైర్‌పర్సన్, వైస్ చైర్మెన్‌లపై పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశాలతో శనివారం రాజేంద్రనగర్ ఆర్డీఓ వెంకట్‌రెడ్డి సమక్షంలో అవిశ్వాస తీర్మాన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి 12 మంది కౌన్సి లర్లు, ఇతర పార్టీలకు చెందిన ఇద్దరు కౌన్సిలర్లు సమావేశానికి హాజరయ్యారు. 4 బీఆర్ఎస్ కౌన్సిలర్లు సమావేశానికి దూరంగా ఉన్నారు. మెజార్టీ సభ్యులు హా జరై చైర్‌పర్సన్, వైస్ చైర్మెన్‌కు వ్యతిరేకంగా ఓట్లు వే యడంతో అవిశ్వాసం నెగ్గింది. బీఆర్ఎస్ చైర్‌పర్సన్ దా ర్గుపల్లి రేఖాయాదగిరి, వైస్ చైర్మెన్ గొర్ల వెంకటేష్‌యా దవ్ వారి పదవులను కోల్పోయారు. అవిశ్వాసం నెగ్గిన ట్లు ఆర్డీఓ వెంకట్‌రెడ్డి ప్రకటించారు. దాంతో నార్సింగి మున్సిపాలిటీ కాంగ్రెస్ ఖాతాలోకి చేరింది.

కొత్తగా కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి రావడంతో మున్సిపాలిటీల్లో అవిశ్వాసాల జోరు సాగుతోంది. ఇం దులో భాగంగానే నార్సింగిలో కూడా కౌన్సిలర్లు అవిశ్వా సం పెట్టారు. శనివారం నిర్వహించిన సమావేశంలో అవిశ్వాసం నెగ్గింది. మున్సిపాలిటీ హస్తగతం కావ డంతో ఆ పార్టీ కౌన్సిలర్లు ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్మెన్‌ల పేర్లను అమోదించారు. ఛైర్‌పర్సన్‌గా మంచిరేవుల గ్రామానికి చెందిన మైలారం నాగపూర్ణశ్రీనివాస్, వైస్ ఛైర్మెన్‌గా విజయ్ బాబును ఎన్నుకునే అవకాశం ఉంది. జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం మరోసారి సమావేశాన్ని ఏర్పాటు చేసి ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్మెన్ల ఎంపిక చేస్తామని ఆర్డీఓ వెంకట్‌రెడ్డి తెలిపారు. అయితే నార్సింగి మున్సి పాలిటీ కాంగ్రెస్ ఖాతాలోకి రావడానికి రాష్ట్ర పాడిపరిశ్రమ అభివృద్ధి సంస్థ చైర్మెన్ బొర్రా జ్ఞానేశ్వర్, టీపీసీసీ అధికార ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షులు క్యాతం అశోక్‌యాదవ్ కీలక పాత్ర పోషించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నార్సింగి మున్సిపాలిటీలో అవిశ్వాసం పెట్టి, చైర్‌పర్సన్, వైస్ ఛైర్మెన్లను గద్దె దించినట్టు తెలిపారు. కాంగ్రెస్ ప్రభు త్వంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతామని తెలి పారు. త్వరలోనే ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్మెన్లను ఎన్నుకుం టామని తెలిపారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అడ్రస్ గల్లంతు చేస్తామన్నారు. బండ్లగూడ, నార్సింగి మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్‌ను లేకుండా చేశా మన్నారు. ఈ నెల 24న బండ్లగూడ కార్పొరేషన్ మేయ ర్‌ను ఎన్నుకుంటామన్నారు. శంషాబాద్ మండలం, మున్సిపాలిటీలను సైతం త్వరలోనే కైవసం చేసుకుంటా మని తెలిపారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని నార్సింగి, బండ్లగూడ, మణికొండ మున్సిపాలిటీల్లో కాం గ్రెస్ జెండాను ఎగరేస్తామన్నారు. ఈవిజయం వెనుక ప్రతి కార్యకర్తా శ్రమ ఉందన్నారు. త్వరలోనే బీఆర్ఎస్ కో-ఆప్షన్ సభ్యులను తొలగించి కాంగ్రెస్ కార్యకర్తలకు అవకాశం కల్పిస్తామన్నారు. నాగపూర్ణ శ్రీనివాస్ మా ట్లాడుతూ... త్వరలోనే కాంగ్రెస్ తరపున పాలక వర్గం ఏర్పాటు అవుతుందన్నారు. అందరి సహకారంతో కలిసి పని చేస్తామన్నారు. అందరి కౌన్సిలర్లను కలుపుకుని నార్సింగి మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ కౌన్సిలర్ పత్తి శ్రీకాంత్‌రావ్, మద్దతుదారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో మళ్లీ వర్షం

- చెరువును తలపించిన విజయవాడ హైవే

హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో శనివారం మళ్లీ వర్షం కురిసింది. ఈ వర్షానికి వనస్థలిపురంలోని చింతల్‌కుంట వద్ద జాతీయ రహదారిపై భారీగా నీరు చేరి చెరువును తలిపించింది. దీంతో పనామా-ఎల్బీనగర్ మధ్య వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.ఇక గచ్చిబౌలి, మాదాపూర్ చందానగర్, మియాపూర్, కూకట్ పల్లి, కేపీహెచ్‌బీ శేర్లింగంపల్లి, ఎల్బీనగర్, ఓయూ, తార్నాక, హబ్సిగూడ,నాచారం, మల్లాపూర్, వనస్థలిపురం, హయత్ నగర్, బషీర్ బాగ్, హిమాయత్ నగర్, అబిడ్స్, నాంపల్లిలలో వాన పడింది. భారీ వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. హైదరాబాద్‌లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జీహెచ్‌ఎంసీ మేయర్ విజయలక్ష్మీ ఆదేశించారు.





వేసవి కావడంతో నగరంలో మట్టి కుండలకు చాలా డిమాండ్ ఏర్పడింది. మట్టి కుండలలో నీరు తాగడానికి చాలా మంది ఇష్టపడుతున్నారు. దాంతో మార్కెట్లోకి రకర కాల కుండలు వచ్చాయి. ఈ నేపథ్యంలో నగరంలో ఓ కుండల షాప్ వద్ద కనిపించిన కుండలు.

నవతెలంగాణ-హైదరాబాద్

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఎల్బీనగర్ - మహేశ్వరం
ఆదివారం | మే 19, 2024 | www.navatelangana.com

ఈటలను కలిసిన కార్పొరేటర్ చింతల



నవతెలంగాణ -నాగోల్

మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను మేడ్చల్ లోని ఆయన నివాసంలో నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ-సురేందర్ యాదవ్‌లు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన వివరాలపై చర్చించారు. వారి వెంట బీజేపీ నాయకులు పంగా శ్యామ్, పాల్వాయి సంజీవరెడ్డి, డప్పు రాజు, కేశిరెడ్డి పద్మ రెడ్డి, వస్పారి మల్లేష్, దినేష్, రాముగౌడ్, మనోజ్, ప్రీతం రెడ్డి, అనిల్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బాలుడు అదృశ్యం



నవతెలంగాణ - చైతన్యపురి

బాలుడు అదృశ్యమైన ఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ..సరూర్‌నగర్ ఆర్బీఐ కాలనీలో నివాసం ఉండే ఎం. కార్తీక్ (7) ఈనెల 17వ తేదీన ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. అతని ఆచూకి కోసం స్నేహితులు, ఇరుగుపొరుగు వారిని సంప్రదించినా ఫలితం లేకపోవడంతో తండ్రి చైతన్యపురి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ఎవరికైనా సమాచారం తెలిసి ఉంటే కార్తీక్ తండ్రి 9000765759, చైతన్యపురి పోలీస్ స్టేషన్ 8712662358 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు.

బాలాపూర్ తహసీల్దార్ కార్యాలయాన్ని తరలించొద్దు

అఖిలపక్ష నాయకుల డిమాండ్



నవతెలంగాణ - బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాలాపూర్ గ్రామంలో ఉన్న తహసీల్దార్ కార్యాలయాన్ని బడంగ్‌పేట్‌కు తరలిస్తే సహించేది లేదని బాలాపూర్ అఖిల పక్షం నాయకులు డిమాండ్ చేశారు. మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ గ్రామంలో అఖిలపక్షం ఆధ్వర్యంలో బీ.జే.ఆర్. భవనంలో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అఖిలపక్షం నాయకులు మాట్లాడుతూ బాలాపూర్ గ్రామం అంటేనే ప్రపంచంలోనే పేరు ప్రతిష్టలు పొందిన గ్రామమని అన్నారు. కానీ ప్రస్తుతం బాలాపూర్ గ్రామం పేరుతో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు.. బాలాపూర్ వైద్య ఆరోగ్య కేంద్రం, బాలాపూర్ పోలీస్ స్టేషన్, బాలాపూర్ మండల రెవెన్యూ కార్యాలయం ఉన్నాయని, బాలాపూర్ గ్రామానికి మంజూరైన బాలాపూర్ వైద్య, ఆరోగ్య కేంద్రాన్ని మీర్‌పేట్‌కు, బాలాపూర్ పోలీస్ స్టేషన్‌ను మల్లాపూర్ గ్రామానికి తరలించారని అన్నారు. ప్రస్తుతం బాలాపూర్ గ్రామంలో కొనసాగుతున్న మండల రెవెన్యూ కార్యాలయాన్ని బడంపేట్ గ్రామానికి తరలించే ప్రయత్నం స్థానిక బాలాపూర్ మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధుల అండదండలతో అధికారులు చేస్తున్నారని ఆరోపించారు. బాలాపూర్ రెవెన్యూ కార్యాలయం తరలిస్తుంటే బాలాపూర్ కార్పొరేటర్లు మాట్లాడకపోవడం అవమానకరమన్నారు. ఈ విషయంపై ప్రజాప్రతినిధులు బాలాపూర్ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజా ప్రతినిధులు స్పందించని యెడల బాలాపూర్ అఖిలపక్షం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

సర్వే చేయకుండా ప్రభుత్వ స్థలం లేదనడం విడ్డూరం..

బాలాపూర్ గ్రామంలో ప్రభుత్వ స్థలాలు ఎన్నో ఉన్నాయి కానీ.. మండల రెవెన్యూ అధికారులు సర్వే చేయకుండా గ్రామంలో ప్రభుత్వ స్థలం లేదని అనడం విడ్డూరమన్నారు. బాలాపూర్ గ్రామంలో అధికారులు వచ్చి సర్వే చేస్తామంటే బాలాపూర్ అఖిలపక్షం ఎప్పుడు సహకరిస్తుందన్నారు. బాలాపూర్ మండల రెవెన్యూ కార్యాలయ కొత్త భవన నిర్మాణం కోసం బాలాపూర్ గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సుమారు 800 నుండి 1000 గజాల స్థలం, అదే విధంగా పాత ట్యాంకు వద్ద 74 సర్వే నంబర్ ఏ.ఆర్.సీ.ఐ.వెనుక భాగంలో దాదాపు 3000 గజాలు ఉంటుందని, బాలాపూర్ గ్రామంలోనే కొనసాగించాలని కోరారు. ఈ విషయంపై మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇంచార్జి కేఎల్ఆర్‌లు వెంటనే స్పందించాలని కోరారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి బొర్ర రవి, భారతీయ జనతా పార్టీ నాయకులు గడ్డం వెంకటేష్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కొప్పుల రాజు, తిమ్మని గిరీష, కాంగ్రెస్ నాయకులు నీరుడి శ్రీరాములు, మేకల సంజీవ, నాయకులు ఉమేష్, శ్రీధర్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి జలమయమైన రోడ్లు



కేబీఆర్ ఫంక్షన్ హాల్ నుండి వచ్చే నీటిని ఆపాలి : ప్రెస్ కాలనీ వాసి నవీన్ యాదవ్

ఎంఈ రెడ్డి, కేబీఆర్‌లలో నుండి వచ్చే నీటితో వీకర్ సెక్షన్, ప్రెస్ కాలనీలలో నీరు నిలిచిపోయింది. దీంతో లోతట్టు కాలనీలు మునిగిపోతున్నాయి. అధికారులు స్పందించి కేబీఆర్ ఫంక్షన్ హాల్ నుండి వచ్చే నీటిని ఆపాలి.



నవతెలంగాణ - హయత్‌నగర్

గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మన్సూరాబాద్‌లో ఉన్న డబుల్ బెడ్ రూం ఇండ్ల నుండి బండ్ల గూడకు వెళ్లే దారిలో కల్వర్టు వద్ద వర్షపు నీరు నిలిచింది. మన్సూరాబాద్‌లోని ఆయిల్ మిల్, ప్రెస్ కాలనీ, వీకర్ సెక్షన్ కాలనీ, పాత మన్సూరాబాద్, పుల్లా రెడ్డి స్వీట్ షాప్, సాయి నగర్‌లో, బంజారా కాలనీ, శుష్మ థియేటర్ వద్ద ప్రధాన రహదారులపై వర్షపు నీరు నిల్వకుండా మాన్ సూన్, జీ హెచ్ ఎంసీ టీం అధికారులు ఇకనైనా అప్రమత్తంగా ఉండాలని కాలనీ వాసులు, వాహన దారులు కోరుతున్నారు.



నవతెలంగాణ - నాగోల్

శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి నాగోల్ డివిజన్ లోని పలు కాలనీల రోడ్లన్నీ జలమయం అయ్యాయి. ముఖ్యంగా జైపూర్ కాలనీ, సాయి నగర్, ఆనంద్ నగర్ తదితర కాలనీల రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. రాబోయే వర్షాకాలం దృష్ట్యా సంబంధిత అధికారులు, పాలకులు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.





నవతెలంగాణ- వనస్థలిపురం

నేడు సాయంత్రం కురిసిన వర్షానికి చింతలకుంట చెక్ పోస్ట్ వద్ద ట్రాఫిక్ జామ్ అయ్యింది. బస్సు టైర్లు మునిగేంతవరకు వర్షపు నీరు చేరుకుంది. దీనికి పరిష్కార మార్గం లేదా? కొద్దిపాటి వర్షానికి జాతీయ రహదారిపై వర్షపు నీరు నడుము లోతు నీరు ప్రవహిస్తుంది. వాహనదారులు, పాదాచారులు నానా ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని లేనియెడల ప్రజల ఆగ్రహానికి గురి కాక తప్పదు.

నవతెలంగాణ - బడంగ్ పేట్

మహేశ్వరం నియోజక వర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న గుర్రంగూడ గ్రామంలో కొద్ది పాటి వర్షానికే ప్రధాన రహదారిపై నీరు నిలిచి చెరువులా తలపిస్తుంది. దీంతో వాహన దారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు స్పందించి.. రోడ్డు నిర్మాణ పనులను చేపట్టాలని స్థానిక కార్పొరేటర్ దడిగ శంకర్ కోరారు.





వర్షాకాల ప్రణాళికకు సిద్ధం కావాలి

జలమండలి ఎండీ సుదర్శన్ రెడ్డి

నవతెలంగాణ - సిటీబ్యూరో

వర్షాకాల ప్రణాళికకు సన్నద్ధం కావాలని అధికారులను జలమండలి ఎండీ సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. వర్షాకాల ప్రణాళిక సన్నద్ధతపై ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో ఉన్నతాధికారులతో శనివారం ఎండీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ అనుకున్నదాని కంటే ముందే రుతుపవనాలు వచ్చే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపన నేపథ్యంలో అందుకు తగ్గట్లుగా అధికారులు అప్రమత్తం కావాలని సూచించారు. తాగునీటి సరఫరా, మురుగు నీటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. క్షేత్ర స్థాయిలో పనిచేసే సిబ్బందికి భద్రత సామగ్రి, రెయిన్ కోట్స్ సరిపడా ఉన్నాయో లేదో చూసుకోవాలన్నారు. ఒక వేళ సామగ్రి అవసరం అయితే ఉన్నతాధికారులకు ముందస్తు సమాచారం అందించాలన్నారు. ఎయిర్ టెక్ యంత్రాలు, సిల్ట్ కార్ట్ వాహనాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. వచ్చే వారం నుంచే క్షేత్ర స్థాయిలో పర్యటించాలన్నారు. వర్షాలు ప్రారంభం కాకముందే అన్ని పరిస్థితుల్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ బాబు, డైరెక్టర్ ఆపరేషన్స్-1 అజ్మీరా కృష్ణ, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, టెక్నికల్ డైరెక్టర్ రవి కుమార్, డైరెక్టర్ ఆపరేషన్స్- 2 స్వామి, సీజీఎంలు, జీఎంలు పాల్గొన్నారు.



'మదర్ విజయ' పాలను ఆదరించాలి

• నార్ముల్ మదర్ డెయిరీ సంస్థ చైర్మన్ శ్రీకర్ రెడ్డి

నవతెలంగాణ - హయత్ నగర్

నార్ముల్ మదర్ డెయిరీ నుండి 'మదర్ విజయ' పేరుతో మార్కెట్లోకి ప్రవేశ పెడుతున్న నూతన వేరియంట్ పాల ప్యాకెట్‌ను ఆదరించాలని సంస్థ చైర్మన్ శ్రీకర్ రెడ్డి వినియోగదారులను కోరారు. హయత్ నగర్‌లోని సంస్థ కార్యాలయంలో 'మదర్ విజయ' ప్యాకెట్ పాలను శనివారం డైరెక్టర్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతుల సంక్షేమం, వినియోగదారుల నమ్మకం రెండు కళ్లుగా పనిచేస్తున్నామని తెలిపారు. మార్కెట్లో పోటీ నేపథ్యంలో వేరు వేరు వేరియంట్‌ల పాలను ప్యాకింగ్ చేస్తున్నామన్నారు. రైతుల నుండి సేకరించిన నాణ్యమైన పాలను తక్కువ సమయంలో వినియోగదారులకు అందిస్తున్నామని తెలిపారు. వినియోగదారులు మదర్ విజయ పాలను కొనుగోలు చేసి సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు జలందర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, జయశ్రీ ఉప్పల వెంకట్ రెడ్డి, సంస్థ ఎండీ బి.కృష్ణ, డీజీఎంలు దివాకర్, శివకుమార్, ఏజీఎం జీవీఎస్ రెడ్డి, ఏవో గఫార్ తదితరులు పాల్గొన్నారు.



మహిళ మెడలోంచి బంగారు గొలుసు చోరీ

నవతెలంగాణ - హయత్‌నగర్

తన భర్తతో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ మహిళ మెడలోంచి గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు 4 తులాల బంగారు గొలుసును లాక్కుపోయారు. ఈ ఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్ మెట్ మండలంలోని బ్రాహ్మణ పల్లి గ్రామంలో నివాసం ఉంటున్న జెల్లా లక్ష్మమ్మ తన భర్తతో కలిసి వారాంతపు సంతలో కూరగాయలు అమ్మడానికి హయత్ నగర్‌లోని శాంతి నగర్‌కు ఈ నెల 17న వెళ్లింది. తిరిగి తన భర్తతో ద్విచక్ర వాహనంపై వస్తున్న క్రమంలో బ్రాహ్మణ పల్లి పౌల్ట్రీ ఫామ్ వద్దకు రాగానే ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వెనుక నుండి వచ్చి ఆమె మెడలో ఉన్న 4 తులాల బంగారు గొలుసును లాక్కుని పారిపోతుండగా అదుపుతప్పి లక్ష్మమ్మ కింద పడిపోయింది. దీంతో ఆమె తలకు బలమైన గాయాలు అయ్యాయి. వెంటనే బాధితులు హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

'ఓవర్ లోడ్‌తో వాహనాలు నడిపితే కఠిన చర్యలు'

నవతెలంగాణ - తుర్కయంజాల్

ఓవర్ లోడ్‌తో వాహనాలు పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని ఇబ్రహీంపట్నం ఆర్టీవో సుభాష్ చంద్రారెడ్డి హెచ్చరించారు. సుభాష్ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఆర్టీఏ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఓవర్ లోడుతో వెళ్తున్న 13 వాహనాలను ఏఎంవీఐ ఉపాసిని, ఆర్టీవో అధికారులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆర్టీవో సుభాష్ చంద్రారెడ్డి మాట్లాడుతూ వాహనాలు ఓవర్ లోడ్‌తో పట్టుబడితే సీజ్ చేయడంతో పాటు భారీ జరిమానా విధిస్తామని హెచ్చరించారు. వాహన పరిమితికి మించి లోడ్ వేయొద్దని, రోడ్డు సేఫ్టీ పాటించాలని సూచించారు. రోడ్లపై వాహనాలు నడిపేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని కోరారు.



కందర్ శ్రైన్ ఐ సీనియర్ సెకండరీ స్కూల్


పరీక్షా ఫలితాల్లో విజయకేతనం



నవతెలంగాణ - సిటీబ్యూరో

సీబీఎస్సీ పరీక్షా ఫలితాల్లో టెన్త్, ఇంటర్మీడియట్ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని చైర్మన్ ఈ మల్లారెడ్డి, ప్రిన్సిపాల్ రత్నారెడ్డి దయాకర్ రెడ్డి, సతీష్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదో తరగతి పరీక్షా ఫలితాలలో 500 మార్కుల గాను మేఘనా రెడ్డి 475, మహేశ్వరి 472, బి . యువన్ చంద్ర సేన 468, టీ. విశ్వతేజ 467, సి. విగ్నేష్ 466, బి. గాయత్రి 462, నది ఆఫ్రిన్ 460, తుమ్మోజు మనీష్ 459, పుత్తూరు శ్రీకర్ 457, క్రాంతి తేజశ్రీ 453, బీరెల్లి లాస్య 452, ఆర్. లౌకిక్ రెడ్డి 451, డి. వరుణ్ తేజ్ 450 మార్కులు సాధించినట్టు వివరించారు.

సీనియర్ సెకండరీ పరీక్షా ఫలితాల్లో 500 మార్కుల గాను కె. రిత్విక్ రెడ్డి 447 ఎంపీసీ, ఎన్. అబ్బాస్ 429 ఎంపీసీ, చర్లపల్లి దివ్య 415 బైపీసీ, మట్ట శివమణి గౌడ్ 412 ఎంపీసీ, కోటగిరి హర్షిని 412 ఎంపీసీ, ఏ.భూపతి కుమార్ రెడ్డి 410 ఎంపీసీ, బి. శ్రీ శ్రావణి 409 ఎంపీసీ, శశాంక్ రెడ్డి 406 ఎంపీసీ, ఈ. ప్రణయ్ 402 ఎంపీసీ, ఆర్. హర్షిని రెడ్డి 401 ఎంపీసీ ఫలితాలు సాధించారని పేర్కొన్నారు. మా స్కూల్ నందు చదువుతోపాటుగా పిల్లలకు మారుతున్న కాలానుగుణంగా ఎటువంటి మానసిక ఒత్తిడి లేకుండా విద్యార్థులకు విద్యను బోధించినట్టు తెలిపారు. ఓరియంటేషన్ ప్రోగ్రామ్స్, ఇంటిగ్రేటెడ్ కర్కులం ఎంతో అనుభవం ఉన్న ఫ్యాకల్టీ, లాబరేటరీస్ , వ్యాల్యూ ఎడ్యుకేషన్, విత్ సాఫ్ట్ అండ్ స్పీచ్ స్కిల్స్, స్పోర్ట్స్ గేమ్స్ అండ్ ఫిట్నెస్, పీరియడిక్ వర్క్ షాప్ మరియు ఐఐటి, నీట్ ఫౌండేషన్, ఆల్ ఒలంపియాడ్స్ అంశాలలో చదువు నేర్పుతున్నట్టు వివరించారు. ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరిచి, ఉత్తమ ఫలితాలు సాధించడానికి అవసరమైన సలహాలు, సూచనలు చేస్తూ వారి విజయానికి బాటలు వేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి



నవతెలంగాణ- నాగోల్

గడ్డి అన్నారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ వేడుకలకు రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాసగుప్త ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఎంఎల్ఆర్ గుప్తా, పబ్బ బాలయ్య, ఎన్టీఆర్ కృష్ణ, ఉపేందర్, ప్రవీణ్, నరేష్, ఎల్వి కుమార్, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, సభ్యులు ,ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

నవతెలంగాణ- బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా.. శివ నారాయణపురం కాశీబుగ్గ దేవాలయంలో సామూహిక కుంకుమార్చన కార్యక్రమంలో నిర్వహించడం హర్షనీయమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. అనంతరం దేవాలయంలో మేయర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాలాపూర్ మండల అధ్యక్షులు నాళ్ల శ్రీనివాస్ గుప్తా, బడంగ్ పేట అధ్యక్షుడు తొణుపునూరి శ్రీనివాస్ గుప్త, కార్యవర్గ సభ్యులు రామూర్తి గుప్త, వెంకటేశ్వర్లు గుప్త, వీర బ్రహ్మ వెంకటేశ్వరగుప్త, ఆర్య వైశ్యలు, వివిధ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.





నవతెలంగాణ-హయత్ నగర్

వాసవి మాత జయంతి సందర్భంగా.. మన్సూరాబాద్ డివిజన్ వాసవి క్లబ్ అధ్యక్షులు మొరిశెట్టి సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో జడ్జెస్ కాలనీ ఫేస్ 1 కమ్యూనిటీ హాల్లో శనివారం అమ్మవారి పూజా కార్యక్రమం నిర్వహించారు. తర్వాత తపస్వి నాట్యమండలి ద్వారా నృత్య ప్రదర్శన నిర్వహించారు. అనంతరం వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ అంజిబాబు, సెక్రెటరీ భాస్కర్, లింగమయ్య , విశ్వనాథం, అరవింద్, వెంకటరమణ, నాంపల్లి రమణ, రాజీవ్ కుమార్, అనిల్, వెంపటి గోపి, అత్తలూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి చదువుకు 'ఉప్పల' ఆర్థిక సాయం



నవతెలంగాణ- నాగోల్

ఆర్థిక స్తోమత లేక కళాశాల ఫీజు కట్టలేని ఓ పేద విద్యార్థికి శనివారం రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస గుప్తా ఆర్థిక సాయం అందజేసి, విద్యార్థి చదువుకు బాసటగా నిలిచారు. రంగారెడ్డి జిల్లా సన్ సిటీకి చెందిన విద్యార్థి భరత్ కుమార్.. హైదరాబాద్ నగరంలోని జాగృతి కళాశాలలో బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ సందర్భగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ పేద విద్యార్థుల చదువుకు ఆర్థిక సహాయం అందజేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ కోశాధికారి నరేష్ గుప్త, విద్యార్థి తల్లి సునీత తదితరులు పాల్గొన్నారు.

కళా శ్రామికులకు అపురూప పురస్కారాలు

కళాకారులు.. సాహితీవేత్తలు.. సంఘశ్రేయోభిలాషులు.. క్రీడాకురులు... వీరంతా తమ విశ్రాంతినీ, వినోదాన్ని త్యాగం చేసి ఆ సమయాన్నంతా తమ అభిరుచికి అనుకూలంగా వుండే ఆయా రంగాలకు కేటాయించినపుడు వారు తమకు ఇష్టమైన రంగంలో పేరు తెచ్చుకోగలుగుతారు. అలా అనుదినం శ్రమించి ఏదో ఒక రంగంలో రాణించిన నిరంతర శ్రామికులు వీరు. తమలోని కళకు ఎప్పటికప్పుడు మెరుగులు దిద్దుకుంటూ, ఆయా కళల్లో పేరు ప్రఖ్యాతులు ఆర్జించి, తమలోని విద్యను మరికొందరికి అందిస్తూ, నయనానందాన్నీ, మనో వికాసాన్నీ, సాంత్వననీ అందిస్తున్న మహిళా కళాకారులనూ, సేవా మూర్తులనూ గుర్తించి సత్కరించాలన్న సంకల్పంతో ప్రముఖ విద్యా, సాహితీవేత్త, కళా ప్రేమికురాలైన **డా.అమృతలత** ప్రతి ఏడాది మాతృదినోత్సవం సందర్భంగా అపురూప అవార్డులు అందిస్తున్నారు. అటువంటి అపురూపమైన అవార్డులు ఈ రోజు అందుకోబోతున్న వారి చిరుపరిచయాలు నేటి మానవిలో....

నిరంతర శ్రామికులు వీరు



కళలన్నీ ఎంతో శ్రమ, సమయం, సంయమనం, ధనం, ఓపికలతో కూడు కున్నవి. అయినా అలాంటి వెరవక, వారిని అడుగడుగునా ప్రోత్సహించే తల్లిదండ్రులు, గురువులు, సోదరులు, స్నేహితులు, జీవత భాగస్వాములు, చివరకు వారికి పుట్టిన బిడ్డలు కూడా సహకరించినపుడు మాత్రమే వారు ఆయా రంగాల్లో రాణించగలుగుతారు. కళారూ పాలేవీ కర్మాగారాల్లో తయార య్యేవి గానీ, పరిశోధనా సంస్థల్లో వెలువడేవి గానీ, విత్తనాలు చల్లితే పొలాల్లో పండేవి గానీ కావు. వాటంతటవే పుట్టేవి కూడా కావు. తన అనుభవాల్లోనో, భావాల్లోనో, అనుభూతుల్లోనో, ఆలోచన ల్లోనో నిరం తరం తపించి, జ్వలించి, లయించిన మనిషి తన హృదయాన్నీ, మేధస్సు నూ రంగరించి ఒక తపస్సులా సృష్టించినవే లలిత కళలు. అలా నిరంతరం కళల కోసం తపించే విశ్రాంతి ఎరుగని నిరంతర శ్రామికులు వీరు. అలాంటి వారిని సంత్కరించాలనే ఉద్దేశంతో ఈ అపురూప అవార్డులు ప్రారంభించాం. ఈ ఏటితో ఈ పండుగ పద్నాలుగేండ్లు పూర్తి చేసుకుందని చెప్ప డానికి సంతోషిస్తున్నా ను. ఈ ప్రయాణంలో సహకరించిన, సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ హృదయ పూర్వక ధన్యవాదాలు.

– డా. అమృతలత

కవిత్వం



వేవనపల్లి వీణావాణి... వృత్తిలోనూ, ప్రవృత్తిలోనూ నిబద్ధత కలిగిన కవయిత్రి, రచయిత్రి. చిన్న వయసు నుండే చదువుపట్ల ఆమెకున్న శ్రద్ధాసక్తులు, కుతూహలం మూలంగా అధ్యయనం, పరిశీలన, వాస్తవిక దృష్టికోణం దిశగా వృత్తిపరంగా, ప్రవృత్తి పరంగా ఆమె అడుగులు లోకహితార్థమై పయనించాయి. జోగులాంబ సర్కిల్‌కు అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్‌గా, నారాయణపేట జిల్లా అటవీశాఖ అధికారిగా అదరపు బాధ్యతలు చూస్తున్నారు. కవయిత్రిగా, రచయిత్రిగా, కాలమ్ రైటర్‌గా, పర్యావరణ సాహిత్య కారిణిగా గుర్తింపు పొందారు.

షార్ట్ ఫిల్మ్స్



అంజనీ యలమంచిలి... కేవలం సమాజ సేవే కాదు సాహిత్యమన్నా ఎంతో ప్రేమ ఈమెకు. తనకు నచ్చిన పుస్తకాలు కొని వాటిని పదిమందికి ఇచ్చి వారితో చదివించడం, అందమైన పదబంధాలతో చక్కటి పుస్తక సమీక్షలు చేయడం, వ్యాసాలు రాయడం అవి అంతర్జాల పత్రికలలో ప్రచురితం కావడం ఆమె సాహితీ ప్రియత్వానికి, కార్యదీక్షకి నిదర్శనం. స్త్రీలపై, చిన్నపిల్లలపై జరిగే దౌర్జన్యాల గురించి విన్నప్పుడల్లా ఆమె మనసు రగిలిపోయేది. అలాంటివన్నీ నిర్మూలించడానికి తానేమి చేయగలను అనే ఆలోచన నుండి ఎవీఎం క్రియేషన్స్ బానర్‌లో 2016 నుండి లఘుచిత్రాలు తీస్తున్నారు.

సినీ విశ్లేషణ



శివలక్ష్మి... అరవై ఏండ్ల కిందట గుంటూరు జిల్లా రేపల్లె తాలుకా భట్టిప్రోలు గ్రామంలో పుట్టారు. పీజీ చదువుతున్న రోజుల్లోనే నాటికలు, డ్రామాలు, సినిమాలపై మక్కువ పెంచుకున్నారు. హైదరాబాద్ ఫిల్మ్‌క్లబ్ ఉద్యమంలో వుంటూ కొన్ని రోజులు ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా కూడా పని చేయడంతో అసలు సినిమా అంటే ఏమిటో ఆమెకు అర్థమై మనం చూస్తున్న సినిమాలు మన జీవితాలకు సంబంధించినవి కావని తెలుసుకున్నారు. తర్వాత ప్రత్యామ్నాయ సినిమా పట్ల అపూరూపమైన అభిరుచి పెంచుకున్న ఈమె సినీ విశ్లేషణ విభాగంలో పురస్కారం అందుకోబోతున్నారు.

సాహిత్యం..వైద్యం



డా.కె.వికృష్ణకుమారి... ఈ ఏడాది అమృతలత జీవనసాఫల్య పురస్కారం అందుకోబోతున్నారు. వైద్యురాలు, రచయిత్రి, సంఘసేవకురాలు అయిన ఈమె తెనాలిలో డా.కాజా వెంకట జగన్నాథరావు, సత్యవతి దంపతులకు జన్మించారు. తెనాలిలో పాఠశాల విద్యను పూర్తి చేసి కాకినాడలోని రంగరాయ మెడికల్ కాలేజీలో వైద్య విద్య అభ్యసించారు. తర్వాత తెనాలి, గుంటూరు, హైదరాబాద్ కింగ్‌కోటి గవర్నమెంట్ హాస్పిటల్స్‌లో వైద్యసేవలు అందించి పదవీ విరమణ చేశారు. హైస్కూల్లో చదువుతున్నపుడే రచనా రంగంలోకి అడుగుపెట్టారు. వృత్తిరీత్యా వైద్యురాలు అయినా ఆమె ప్రవృత్తి మాత్రం రచనా వ్యాసంగం.

సంగీతం-గజల్



జ్యోతిర్మయి మళ్ళ... బీఎస్సీ మాథమాటిక్స్, హిందీ సాహిత్యరత్న పట్టాలతో పాటు కర్ణాటక సంగీతంలో డిప్లమా పొంది, చెన్నై ఆలిండియా రేడియోలో డి గ్రేడ్ లలిత సంగీత గాయనిగా పని చేశారు. ఉర్దూ భాషకి సంబంధించిన ఈ గజల్ ప్రక్రియను దాశరథి, సినారెలు తెలుగు వారికి రుచి చూపిస్తే దాన్ని అందిపుచుకుని ప్రచారంలోకి తీసుకొస్తున్న సాహితీవత్తలో ఈమె తొలివరుసలో ఉంటారు. గత పదిహేనేండ్లలో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వందకు పైగా గజల్ కచేరీలు చేసిన మొదటి మహిళ ఈమె. ప్రముఖ గజల్ కవయిత్రి బైరి ఇందిర జ్ఞాపకార్థం ఈ ఏడాది అపురూప పురస్కారం అందుకోబోతున్నారు.

సాహిత్య విమర్శ...



ప్రొ.సి.హెచ్. సుశీలమ్మ.. గుంటూరు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో లెక్చరర్‌గా బాధ్యతలు చేపట్టి ఒంగోలు, చేబ్రోలులో ప్రిన్సిపాల్‌గా పని చేసి పదవీవిరమణ చేశారు. ఎన్నో అంతర్జాతీయ, జాతీయ సదస్సుల్లో పత్ర సమర్పణలు చేసిన ఆమె రాష్ట్ర మహిళా కమిషన్ ఏర్పాటుచేసిన పలు సదస్సుల్లో రిసోర్స్ పర్సన్‌గానూ, జాతీయ మహిళా కమిషన్ ఏర్పాటు చేసిన న్యూఢిల్లీ సదస్సులోనూ, ఆకాశవాణి దూరదర్శన్ ఏర్పాటుచేసిన ఎన్నో కార్యక్రమాల్లో పాల్గొనడమే కాక ప్రభుత్వ, ప్రభుత్వే తర సంస్థల్లో రిసోర్స్ పర్సన్‌గా సాహితీ సదస్సులో అనర్గళంగా ప్రసంగించగల ఈమె ఈ ఏడాది సాహిత్య విమర్శకు పురస్కారం అందుకోబోతున్నారు.

అంతర్జాల పత్రిక సంపాదకత్వం



డా.కొండపల్లి నీహారిణి... నిత్య చైతన్యశీలి. తెలుగు భాషాభిమానంతో, సాహిత్యా భినివేశంతో రచనలు ప్రారంభించి ఇప్పటి వరకు పద్నా లుగు పుస్తకాలు రచించారు. అటు కుటుంబాన్నీ, ఇటు సాహిత్యాన్నీ, సమన్వయం పరచుకుంటూ కవయిత్రిగా, రచయిత్రిగా, విమర్శకురాలిగా, సంపాదకురాలిగా, వక్తగా వైవిధ్యభరితమైన పాత్రల్లో తనదైన ముద్రతో సాహితీ స్థానాన్ని పదిల పరచుకొని ఎందరో మహిళలకు మార్గదర్శకురాలిగా నిలుస్తూ అపురూప పురస్కారం అందుకోబోతున్నారు.

పద్య రచన



నందూరి సుందరీ నాగమణి... ఆధునిక కాలంలో వచన కవిత్వం ఎంతగా రాజ్యమేలుతున్నా వీటితో పాటు పద్య రచనలు చేస్తూ ప్రాచీన సంప్రదాయ కవిత్వాన్ని బతికిస్తున్న కవులూ ఉన్నారు. అలాంటి వారిలో హృద్యంగా పద్యం చెపుతూ, సాహితీ పూదోటలో పద్యపారిజాతాలు విరబూయిస్తోన్న కవయిత్రిగా ఉన్న ఆమె పద్య రచనలో అపురూప పురస్కారం అందుకోబోతున్నారు.

నృత్యం



గీత హజారే... ఆంగికం, ఆహార్యం, అభినయాలతో పాటూ భావ రాగతాళ యుక్తమైన సంగీతంతో కూడిన సమాహార కళ నాట్యం. అందుకే నాట్యకళ లలితకళల్లో ఓ ప్రత్యేకతని చాటుకుంది. అలాంటి నాట్యంపై మక్కువతో బాల్యంలోనే నాట్యాన్ని అభ్యసించి నేడు నాట్యాచారిణిగా తన సేవలను అందిస్తున్నారు. జాతీయ స్థాయిలో స్వర్ణపతకం, నాట్య మయూరి బిరుదు, నాట్యగురు, మల్టీ టాలెంటెడ్ ఉమన్ అవార్డులు అందుకున్నారు.

కథారచన...



జి.ఎస్ లక్ష్మి... తన తండ్రి పిడమర్తి సుబ్బయ్యశాస్త్రి ప్రోత్సాహంతో సాహితీ ప్రస్థానం మొదలుపెట్టారు. భర్త ప్రొఫెసర్ గరిమెళ్ళ విశ్వనాథం చదువునీ, సంగీతాన్ని ప్రోత్సహించడంతో సోషియాలజీలో ఎమ్.ఎ, సంగీతంలో డిప్లొమా, కంప్యూటర్ కోర్సు ఎం.ఎస్.ఆఫీస్ చెయ్యగలిగారు. చక్కని సంభాషణలను కథలుగా మలచి రక్తి కట్టించడం ఈమెలోని ప్రత్యేకం. ఇప్పటి వరకు సుమారు 150 కథలు రచించిన ఆమె కథారచన విభాగంలో అపురూప పురస్కారం అందుకోబోతున్నారు.

వైద్యం..సాహిత్యం



డా.అలూరి విజయలక్ష్మి... కృష్ణాజిల్లా ఆత్కూరులో గూడపాటి వరలక్ష్మి, రామ కోటయ్య దంపతులకు జన్మించారు. ఎస్.ఎస్.ఎల్.సిలో కృష్ణా జిల్లా ఫస్ట్ ర్యాంకర్‌గా, ఎం.ఎస్.లో పాట్నా యూనివర్సిటీ టాపర్‌గా, ఆంధ్రా మెడికల్ కాలేజీ మహిళా స్పోర్ట్స్ ఛాంపియన్‌గా, టెన్నీకాయిట్ ఛాంపియన్‌గా నిలిచి ఎంతో మంది మహిళలకు స్ఫూర్తిదాతగా ఎదిగారు. కాకినాడ విజయలక్ష్మి నర్సింగ్ హోమ్‌లో 43 ఏండ్లపాటు ఇరవై రెండు వేల ప్రసవాలు చేసిన ఘనత ఆమెది. ఈ విజయలక్ష్మి హోం వైద్య, మహిళా ఉద్యమ, కళా, సామాజిక చేతన, స్వచ్ఛంద సేవ, రాజకీయ సదస్సులకు వేదిగా ఒక స్ఫూర్తివంతమైన భూమికను పోషించింది. ప్రతి మొదటి ఆదివారం హోమ్‌లో పేద మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు, మందుల పంపిణీ జరిగాయి. వైద్యురాలిగానే కాక రచయిత్రిగా కూడా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. మహిళలు, పిల్లల ఆరోగ్యం గురించి ఎన్నో పుస్తకాలు రచించిన ఘనత ఈమెది. చంద్రు సబ్బాయమ్మ రోటరీ స్త్రీల వృద్ధాశ్రమం వ్యవస్థాపకురాలిగా, మహర్షి సాంబమూర్తి వికలాంగ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల సహ వ్యవస్థాపకులుగా వికలాంగ బాలికల విద్య, వైద్యం కోసం కృషి చేసిన విజయలక్ష్మి ఈ ఏడాది అమృతలత జీవన సాఫల్య పురస్కారం అందుకోబోతున్నారు.

రంగస్థలం



సావేరి దుర్గాభవాని... పదిహేనేండ్ల పాటు ఉపాధ్యాయినిగా, రెండేండ్లు ఇంగ్లీష్, ఎకనామిక్స్ లెక్చరర్‌గా విధులు నిర్వహించిన భవాని తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషలలో విశేషాధ్యయనం చేసిన విద్యావంతురాలు. సంగీత కుటుంబం నుండి వచ్చిన ఆమె 28 ఏండ్ల కిందట సి.నా.రె సూచన మేరకు ఆమెకు ఇష్టమైన సావేరీ రాగం పేర సావేరి కల్చరల్ అసోషియేషన్ సంస్థని స్థాపిం చారు. దీని ద్వారా ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తూ, మరెన్నో నాటకాలను ప్రదర్శిస్తూ సంగీత సాంస్కృ తిక రంగాల ప్రేక్షకులను అలరించిన ఆమె రంగ స్థల విభాగంలో పురస్కారం అందుకోబోతున్నారు.

సామాజిక సేవ



ప్రొ.సమతా రోష్ని... తల్లిదండ్రుల నిరాడంబరత, సేవాగుణం, అన్యాయాన్ని సహించనితనం, ప్రశ్నించే గుణం, కళాత్మకత, దేశవిదేశాల రచనల ఆకళింపు అన్నీ కలిసి సమతారోష్ని వ్యక్తిత్వానికి బలమైన పునాది. ఆంధ్రా మెడికల్ కాలేజీలో చేరి తొమ్మిది నెలల తర్వాత హాస్టల్ ఫీజు కట్టలేక చదువు మానుకొని, కమ్యూనిస్టు పార్టీ సహ కారంతో మాస్కో పీపుల్స్ యూనివర్సిటీలో వైద్య విద్య పూర్తి చేశారు. స్వదేశానికి తిరిగి వచ్చి పలు పి.హెచ్.సీల్లో సేవ చేస్తూ బలమైన ముద్ర వేసి అనేక ప్రమోషన్లు పొంది సామాజిక సేవా రంగంలో పురస్కారం అందుకోబోతున్నారు.

జర్నలిజం-ఎలక్ట్రానిక్ మీడియా



ప్రేమమాలిని... హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో పాఠశాల విద్యను పూర్తి చేసి, ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని సెయింట్ ఆన్స్ కాలేజీ నుండి కామర్స్ డిగ్రీని అందుకున్నారు. సీనియర్ పాత్రికేయులు, రచయిత వనం జ్వాలానరసింహారావు కూతురిగా తండ్రి వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న ప్రేమ ఎంతో ఇష్టంతో జర్నలిజాన్ని తన జీవన మార్గంగా ఎంచుకున్నారు. కొంతకాలం వివిధ వాణిజ్య ప్రకటనా సంస్థల్లో మీడియా అడ్వర్టయిజింగ్‌లో, జపా 4 ఎఫ్.ఎంలో పని చేశారు. తర్వాత టీవీ9లో అడుగుపెట్టి టీవీ ఛానల్స్‌లో కొత్తతరం జర్నలిజానికి శ్రీకారం చుట్టారు. అనంతరం టీవీ5లో చేశారు. తనకున్న అనుభవంతో మిహిర క్రియేటివ్స్ పేరుతో ఓ నిర్మాణ సంస్థను ప్రారంభించారు. ప్రముఖులను ఇంటర్వ్యూలు చేయడంలో ఈమెకు ఈమే సాటి. జర్నలిజం బోధనా రంగంలోకి కూడా అడుగుపెట్టారు.

ఆస్తి కోసం తల్లీ, ఇద్దరు కూతుళ్ల హత్య

(మొదటిపేజీ తరువాయి)

మనమరాళ్ల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని దుర్గ కుటుంబ సభ్యులు అతనిపై కేసు పెట్టలేదు. అతని పేరుపై ఉన్న ఎకరం వ్యవసాయ భూమి, ఇంటి విషయమై గ్రామంలో పంచాయితీ పెట్టించి తల్లి, ఇద్దరు పిల్లల పేరున రాయించారు. 20 గుంటలు తల్లి పిచ్చమ్మపైన, పెద్ద కుమార్తె నీరజపైన 10 గుంటలు, చిన్నమ్మాయి ఝాన్సీ పేరుపైన 10 గుంటల భూమి, డబుల్ బెడ్ రూమ్ ఇంటిని పిల్లలిద్దరిపైన రాయించారు. అయితే వెంకటేశ్వర్లు భార్య చనిపోయిన తరువాత ఓ మహిళతో వివాహేతర సంబంధం ఏర్పరచుకొని ఆమెతో సహజీవనం చేస్తూ వేరే చోట ఉంటున్నాడు. పిల్లలు నానమ్మ వద్ద ఉంటున్నారు.

హత్యకు కారణం..

తల్లి, కూతుళ్ల పేరుపై ఉన్న భూమిని విక్రయించేందుకు వెంకటేశ్వర్లు రెండుసార్లు ప్రయత్నించాడు. గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు అడ్డు చెప్పడంతో కక్ష పెంచుకున్నాడు. ఎలాగైనా ముగ్గురిని అడ్డు తొలగించుకోవాలనే ఉద్దేశంతో శనివారం తెల్లవారుజామున ముగ్గురిని గొంతు పిసికి హత్య చేసి పారిపోయాడు. ఉదయం ఇంటి నుంచి ఎవరూ బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన ఇరుగుపొరుగు వారు వెళ్లి చూడటంతో విషయం వెలుగులోకి వచ్చింది. గ్రామ పెద్దలు పోలీసులకు సమాచారం అందించారు. వైరా ఏసీపీ రెహమాన్, సీఐ ఎన్.సాగర్ సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. ప్రశాంతంగా ఉండే గ్రామం మూడు హత్యలతో ఉలిక్కిపడింది.

అయితే, శుక్రవారం రాత్రి తాను వస్తున్నానంటూ వెంకటేశ్వర్లు తల్లికి ఫోన్ చేసినట్టు సమాచారం. తండ్రి ఇంటికి వస్తున్నాడని ఇద్దరు పిల్లలు ఆనందం వ్యక్తం చేశారని ఇరుగుపొరుగు వారు తెలిపారు. ఇలా జరుగుతుందని ఊహించలేదని స్థానికులు వాపోయారు. వెంకటేశ్వర్లును కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు పోలీస్ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

మీ ఆఫీస్‌కు వస్తాం.. జైల్లో పెట్టండి : కేజ్రీవాల్

(మొదటిపేజీ తరువాయి)

పాల్పడుతోందని, అయినా భయపడేది లేదని స్పష్టం చేశారు. ఆప్ రాజ్యసభ సభ్యురాలు, ఢిల్లీ మాజీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ స్వాతి మాలివాల్‌పై దాడి కేసులో తన పిఎ బిబవ్ కుమార్‌ను ఢిల్లీ పోలీసులు శనివారం అరెస్ట్ చేసిన అనంతరం కేజ్రీవాల్ తన ఎక్స్ ఖాతాలో ఒక వీడియోను పోస్టు చేశారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు తమ పార్టీ ముఖ్య నేతలందరినీ తీసుకుని ఢిల్లీలోని బిజెపి ప్రధాన కార్యాలయానికి వస్తానని, అక్కడ మీకు కావాల్సిన వాళ్లను అరెస్ట్ చేసి జైల్లో పెట్టవచ్చని కేజ్రీవాల్ సవాల్ చేశారు. బిజెపి ఇప్పటికే మనీశ్ సిసోడియాను, సంజయ్ సింగ్‌ను జైల్లో పెట్టిందని, ఇప్పుడు తన పిఎను కూడా అరెస్ట్ చేసిందని ఆయన అన్నారు. రాఘవ్ చద్దా లండన్ నుంచి వస్తున్నాడని వాళ్లే చెబుతున్నారని, తనను కూడా వీళ్లు జైల్లో పెడతారని చెప్పారు. ఆప్ నేతలు సౌరభ్ భరద్వాజ్‌ను, అతిషిని కూడా జైల్లో పెడతామని చెబుతున్నారని కేజ్రీవాల్ వెల్లడించారు. కేంద్రం ఇలా తమ వెంట పడుతుండటం ఆశ్చర్యంగా ఉందన్నారు. 'బిజెపి చేయలేని విధంగా ఢిల్లీలో నాణ్యమైన విద్యను అందించడమే మేం చేసిన తప్పు. నగర పౌరుల కోసం మొహల్లా క్లినిక్‌లు ఏర్పాటు చేసి మంచి వైద్యం, మందులు అందించడమే మేం చేసిన తప్పు. బిజెపి అలా చేయలేదు. అందుకే మొహల్లా క్లినిక్‌లను బంద్ చేయాలని చూస్తోంది' అని కేజ్రీవాల్ విమర్శించారు.

స్వాతి చెప్పేవన్నీ అసత్యాలే.. : అతిషి

స్వాతిమలివాల్ తనపై జరిగిన దాడి కేసులో చెప్పేవన్నీ అసత్యాలేనని ఆప్ మంత్రి అతిషి అన్నారు. స్వాతిపై అవినీతి ఆరోపణలు ఉన్నాయని, వాటి నుంచి తప్పించుకోవడానికే స్వాతి బిజెపితో కుమ్మక్కై బిభవ్ కుమార్ తనపై దాడి చేశారని ఆరోపిస్తున్నారని అతిషి మండిపడ్డారు. కేజ్రీవాల్ ఇంట్లో రికార్డయిన సిసిటివి ఫుటేజ్ వీడియోను శనివారం ఆప్ బయటపెట్టింది. ఈ వీడియోపై ఆప్ మంత్రి అతిషి శనివారం మీడియాతో మాట్లాడుతూ.. 'సిసిటివి ఫుటేజీ ప్రకారం.. స్వాతి ఎఫ్ఐఆర్‌లో చేర్చిన ఆరోపణలు అన్నీ అసత్యాలే. ఇంకా ఆమెనే పోలీసుల్ని బెదిరించడం వీడియోలో కనిపిస్తోంది. బిభవ్ కుమార్‌ని సైతం ఆమె తీవ్రంగా దూషించారు. కేజ్రీవాల్ నివాసం నుంచి ఆమె బయటకు వచ్చేటప్పుడు ఎటువంటి గాయాలు లేకుండా బయటకు వెళ్తున్నట్లు కనిపిస్తుంది.' అని తెలిపారు.

మోడీ కాకమ్మ కథలు

(మొదటిపేజీ తరువాయి)

చెప్పుకొచ్చారు. స్వాతంత్ర్యానంతరం గడచిన 75 సంవత్సరాల కాలంలో కాంగ్రెస్ 55 సంవత్సరాలు దేశాన్ని పాలించింది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల కోటాను ఎత్తేయాలని ఆ పార్టీ అనుకుంటే ఆ పని ఎప్పుడో చేసి ఉండేది. పైగా ఆ పార్టీకి ఒకప్పుడు లోక్‌సభలో 400 కంటే ఎక్కువ స్థానాలే ఉన్నాయి. దేశానికి చౌకీదార్‌గా ఉంటానని చెప్పిన మోడీ... బ్యాంకులకు శఠగోపం పెట్టి కోట్లాది రూపాయల పన్ను చెల్లింపుదారుల సొమ్మును జేబులో వేసుకొని నీరవ్ మోడీ, మెహుల్ చోక్సీ, విజయ్ మాల్యా దేశం విడిచి విదేశాలకు పారిపోతుంటే ఏమీ చేయలేకపోయారు. ఇక ఎన్నికల బాండ్ల రూపంలో బీజేపీ కోట్లాది రూపాయల విరాళాన్ని జమ చేసుకుంది. మోడీ ప్రభుత్వం నుండి కాంట్రాక్టులు పొందిన బడా కంపెనీలు అందుకు ప్రతిఫలంగా క్విడ్ ప్రోకో రూపంలో విరాళాలు సమర్పించుకున్నాయి. మోడీ ప్రభుత్వం గుడ్డిగా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించి రిజర్వేషన్లను నీరుకార్చింది. అంతేకాక ప్రభుత్వంలోని 30 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయకుండా వదిలేసింది.

అది అసాధ్యం

కాంగ్రెస్ పార్టీ హిందువులను ద్వితీయ శ్రేణి పౌరులుగా మారుస్తుందని, అందుకే బీజేపీకి ఓటేయాలని మోడీ అభ్యర్థించారు. దేశ జనాభాలో 78 శాతం హిందువులే. వారి మద్దతు లేకుండా ఎన్నికల్లో విజయం సాధించడం అసాధ్యం. మెజారిటీ మతస్తుల విషయంలో వివక్ష ప్రదర్శించడమంటే ఆత్మహత్యాసదృశమే అవుతుంది. ఏ రాజకీయ పార్టీ అయినా ఆ పని చేయగలదా? అలాంటప్పుడు హిందువులు ద్వితీయ శ్రేణి పౌరులు ఎలా అవుతారు?

అయోధ్య రానంత మాత్రాన...

అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ట కార్యక్రమానికి ప్రతిపక్షాలు హాజరు కాలేదని, కాబట్టి బీజేపీకే ఓటు వేయాలని మోడీ కోరారు. ప్రార్థనలు చేయాలా వద్దా, ఎప్పుడు చేయాలి, ఎక్కడ చేయాలి అనేది వారి వారి అభీష్టాన్ని బట్టి ఉంటుంది. రాహుల్ గాంధీ కైలాస్ మానససరోవర యాత్ర చేపట్టినప్పుడు ఇతర రాజకీయ నాయకులు ఆ పని ఎందుకు చేయడం లేదని ఎవరైనా అడిగారా? లాలూ ప్రసాద్ యాదవ్ కుటుంబం ఛాత్ పూజ చేసినప్పుడు రాజకీయ నాయకులందరూ అందులో పాల్గొన్నారా? విశ్వాసం అనేది వ్యక్తిగతం. అయోధ్య ప్రాణప్రతిష్ట కార్యక్రమానికి శంకరాచార్య కూడా హాజరు కాలేదు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కూడా రాలేదు.

వారిపై చర్యలేవి?

సందేశ్‌ఖాలీలో మహిళలు ఇబ్బందులు పడ్డారని, పోలీసులు చర్యలు తీసుకోలేదని, అందుకే బీజేపీకి ఓటు వేయాలని మోడీ చెప్పారు. బీజేపీ భాగస్వామ్యపక్షమైన జేడీఎస్ నేత ప్రజ్వల్ రేవణ్ణ పలువురు మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారు.

మహిళా మల్లయోధులపై లైంగిక వేధింపులు జరిపిన బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ కుమారుడికి బీజేపీ టిక్కెట్ ఇచ్చింది. సందేశ్‌ఖాలీలో నిరసన ప్రదర్శనలు చేపట్టడంతో షాజహాన్ షేక్‌ను అరెస్ట్ చేశారు. కానీ మహిళా రెజ్లర్లు నిరసన తెలిపినప్పటికీ బ్రిజ్ భూషణ్‌ను ఎన్నికల ప్రచారం చేయకుండా బీజేపీ అడ్డుకోలేదు.

నేతను నిర్ణయించేది ఆహారమా?

బలమైన ప్రభుత్వం కోసం బీజేపీకి ఓటేయాలని మోడీ కోరారు. విదేశాలలో దేశానికి గుర్తింపు తెచ్చామని, అందుకే తమకు ఓటు ఇవ్వాలని కూడా ఆయన విజ్ఞప్తి చేశారు. అయితే ఈ వాదనల్లో ఏ మాత్రం నిజం లేదు. ప్రతిపక్ష నేతలు చేపలు తింటారని, మాంసం వండుకుంటారని, అందుకే తమకు ఓటు వేయాలని మోడీ వితండవాదం చేశారు. తీసుకునే ఆహారాన్ని బట్టి నాయకుడిని ఎంచుకుంటారా? ఎన్నికల్లో రాజకీయ పార్టీకి ఇది నిర్వచనమా? ప్రభుత్వ జవాబుదారీతనం, భవిష్యత్తులో అది చేయబోయే పనులను బేరీజు వేసుకొని ఎవరైనా ఓటు వేస్తారు కానీ ఆహారాన్ని బట్టి వేస్తారా?.

కిర్గిజ్‌లో మూకదాడులు

(మొదటిపేజీ తరువాయి)

ఒక వ్యక్తి కావాలనే ఘర్షణను కొనసాగించడానికి ప్రయత్నిస్తుండడంతో విదేశీ విద్యార్థులు అక్కడ నుండి పారిపోయారు. దాంతో ఆ గ్రూపు వారిని వెంటాడింది. హాస్టల్ భవనంలోకి ప్రవేశించి విదేశీ విద్యార్థుల వద్ద నుండి డబ్బును, వస్తువులను లాక్కున్నారు. ఈలోగా మరికొంతమంది హాస్టల్‌లోని గదుల తలుపులను కొట్టడం ఆరంభించారు. మహిళలు నివసిస్తున్న గదుల్లోకి వారు చొరబడడంతో కొంతమంది విదేశీవి ద్యార్థులు అడ్డుకుని ఆ వ్యక్తులతో ఘర్షణ పడ్డారని మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈలోగా హాస్టల్‌లోని విదేశీ విద్యార్థులందరూ బయటకు రావడంతో గొడవ పెద్దదైంది. దాంతో నలుగురు దుండగుల్లో ముగ్గురు అక్కడ నుండి పారిపోయారు. మిగిలిన వ్యక్తి గాయపడడంతో విద్యార్థులే అంబులెన్స్‌ను పిలిపించి ఆస్పత్రికి పంపారు. అక్కడ చికిత్స తీసుకుని ఆ వ్యక్తి వెళ్లిపోయాడు. ఇదంతా కూడా సెక్యూరిటీ కెమెరాల్లో రికార్డ్ అయింది. ఈ సంఘటనపై పోలీసులు క్రిమినల్ దర్యాప్తు చేపట్టారు. ఈ దర్యాప్తుకు సంబంధించి నలుగురు విదేశీయులను అదుపులోకి తీసుకున్నారు. ఆ దుండగులు ఫోన్లు, డబ్బులు లాక్కున్నారని ముగ్గురు విద్యార్థులు ఫిర్యాదు చేశారు. దాడికి పాల్పడిన వారిలో ఇద్దరిని పోలీసులు గుర్తించారు.

శుక్రవారం ఇందుకు సంబంధించిన వీడియో బయటకు రావడంతో ప్రజల్లో తీవ్ర ఆగ్రహావేశాలు పెల్లుబికాయి. యువతలో తీవ్ర అసంతృప్తి నెలకొంది. దాంతో స్థానికంగా అశాంతి పెచ్చరిల్లింది. నగరంలోని యువత అంతా ఒకచోట చేరి ఈ పరిణామాలను తీవ్రంగా నిరసించారు. బాధ్యులైన వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారని మంత్రిత్వ శాఖ తెలిపింది. అయితేఈ సంఘటనలో బాధితులకు సంబంధించి కొంత తప్పుడు సమాచారం కూడా వ్యాప్తి చేశారని తెలిపింది. ప్రస్తుతమైతే పరిస్థితులు చక్కబడ్డాయని పేర్కొంది. కిర్గిజ్ విదేశాంగ శాఖ జారీ చేసిన ప్రకటనను ఇండియన్ ఎంబసీ తన ఎక్స్‌లో పోస్టు చేసింది.అప్రమత్తంగా వుండాల్సిందిగా భారత్ అక్కడ నివసిస్తున్న భారతీయులకు, విద్యార్థులకు పలు సూచనలు జారీ చేసింది. బయటకు వెళ్లకుండా ఇళ్లల్లోనే వుండాల్సిందిగా కోరింది. అల్లరి మూక ఆగడాల వీడియోలు సోషల్ మీడియాలో రావడంతో అప్రమత్తమైన ఇండియన్ ఎంబసీ శనివారం ఉదయం ఆదేశాలు వెలువరించింది. భారత విద్యార్థులతో నిత్యం మాట్లాడుతున్నామని తెలిపింది. దాడికి పాల్పడుతున్నవారు, విదేశీయుల మధ్య చెలరేగిన హింసకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో బయటకు వచ్చిన నేపథ్యంలో శనివారం ఉదయం నిరసనలు మొదలయ్యాయి. భారత విదేశాంగ మంత్రి జై శంకర్ ట్వీట్ చేస్తూ, భారత విద్యార్థుల పరిస్థితులను ఎప్పటి కప్పుడు పర్యవేక్షిస్తున్నామన్నారు. నగరంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు కిర్గిజ్ అంతర్గత వ్యవహారాల శాఖ తెలిపింది. ప్రస్తుతం పరిస్థితులు నిలకడగా వున్నాయని, నగరంలోని అన్ని వీధుల్లో ట్రాఫిక్‌ను పునరుద్ధరించామని పేర్కొంది. ఒక నివేదిక ప్రకారం స్థానికులు, ఈజిప్ట్ విద్యార్థుల మధ్య ఘర్షణ చెలరేగినట్టు తెలుస్తోంది. ఈ హింసలో ముగ్గురు పాకిస్తానీ విద్యార్థులు మరణించినట్లు పాక్ అధికారి తెలిపారని పాక్ వార్తా వెబ్‌సైట్ తెలిపింది. అయితే ఆ వార్తలను పాక్ ఎంబసీ కొట్టేసింది. కిర్గిజ్ ఎంబసీతో తాము మాట్లాడుతునే వున్నామని పాక్ ప్రధాని ట్వీట్ చేశారు.

రేపు ఈసెట్ ఫలితాలు

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రాష్ట్రంలో బీటెక్, బీఈ, బీ ఫార్మసీ, బీఎస్సీ మ్యాథమెటిక్స్ కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ద్వితీయ సంవత్సరంలో లాటరల్ ఎంట్రీ ద్వారా ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో ఈనెల ఆరో తేదీన నిర్వహించిన ఈసెట్ రాతపరీక్ష ఫలితాలు సోమవారం విడుదల కానున్నాయి. ఈ మేరకు ఈసెట్ కన్వీనర్ పి చంద్రశేఖర్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి, ఓయూ వీసీ డి రవీందర్, ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్లు వి వెంకటరమణ, ఎస్‌కే మహమూద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్ సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు హైదరాబాద్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో ఈ ఫలితాలను విడుదల చేస్తారని తెలిపారు.

ఈసెట్‌కు 24,272 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, 23,330 (96.12 శాతం) మంది అభ్యర్థులు హాజరయ్యారు.

నేడు పుచ్చలపల్లి సుందరయ్య 39వ స్మారకోపన్యాసం

(మొదటిపేజీ తరువాయి)

ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని ట్రస్ట్ కార్యదర్శి ఎస్ వినయకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యం భావ ప్రకటనా స్వేచ్ఛ నేటి వాస్తవాలు' అనే అంశంపై స్మారకోపన్యాసం ఉంటుందని పేర్కొన్నారు. ఎస్వీకే ట్రస్ట్ చైర్మెన్ బీవీ రాఘవులు అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో ఒరిస్సా హైకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి, సుప్రీంకోర్టు సీనియర్ అడ్వకేట్ డాక్టర్ ఎస్ మురళీధర్ స్మారకోపన్యాసం చేస్తారని తెలిపారు. కార్యదర్శి నివేదికను వినయకుమార్ ప్రవేశపెడతారనీ, మేనేజింగ్ కమిటీ సభ్యులు జి బుచ్చిరెడ్డి స్వాగతం పలుకుతారని పేర్కొన్నారు. ప్రజాక్షేమమే పరమావధిగా, ఉద్యమమే ఊపిరిగా ప్రజాసేవకు అంకితమై ఆడంబరాలకు, ఆర్భాటాలకు దూరంగా ఉంటూ సుమారు ఆరు దశాబ్దాలకు పైగా రాజకీయ జీవితాన్ని గడిపిన మహోన్నత వ్యక్తి సుందరయ్య అని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతలలో ప్రముఖుడని తెలిపారు.

మామా అల్లుళ్ల అరెస్ట్

(మొదటిపేజీ తరువాయి)

చెలరేగింది. ఈ నేపథ్యంలో పోలీసులు వారిద్దరిని అరెస్టు చేసి పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలిం చారు. బీఆర్ఎస్ శ్రేణులు భారీగాపోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకు న్నారు. దాంతో పోలీస్ స్టేషన్ పరిసరాల్లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం కక్షతోనే మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డిని అరెస్టు చేయించిందని వారు ఆరోపించారు. వివరాల్లోకి వెళ్తే.. సుచిత్ర పరిధిలోని సర్వే నెంబర్ 82లో ఉన్న రెండున్నర ఎకరాల భూమి విషయమై మాజీ మంత్రి మల్లారెడ్డి, 15 మంది వ్యక్తుల మధ్య భూ వివాదం ఉంది. ప్రస్తుతం ఈ వివాదం కోర్టు పరిధిలో ఉంది.

అయితే, తమ స్థలాన్ని కొందరు ఆక్రమించుకుంటున్నారంటూ.. మాజీ మంత్రి మల్లారెడ్డి, ఆయన అల్లుడు రాజశేఖర్ రెడ్డి శనివారం ఉదయం వివాదాస్పద స్థలం వద్దకు చేరుకున్నారు. అక్కడే టెంట్లు వేసి క్యాంప్ ఏర్పాటు చేసిన ప్రత్యర్థులను చూసి కోపంతో.. స్థలంలో వేసిన బారికేడ్లను తొలగించాలని వారి అనుచరులను ఆదేశించారు. దీనిపై అవతలి వారు 15 మంది అభ్యంతరం వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకోగా.. వారితో మల్లారెడ్డి, రాజశేఖర్ రెడ్డి వాగ్వాదానికి దిగారు.

సర్వే నెంబర్ 82లో ఉన్న రెండున్నర ఎకరాల భూమి తనదేనంటూ మల్లారెడ్డి వాదించారు. అయితే అందులో 1.11 ఎకరాల భూమి తమదంటూ మరో 15 మంది వ్యక్తులు వాదనకు దిగారు. తాము ఒక్కొక్కరం 400 గజాల చొప్పున గతంలో భూమి కొనుగోలు చేశామని చెప్పారు. కోర్టు సైతం తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. కోర్టు ఆర్డర్ ఉన్నందున ఘటనా స్థలంలో ఎలాంటి గొడవలూ చేయొద్దని ఇరువురికీ పోలీసులు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. అయినా మల్లారెడ్డి వినిపించుకోకపోవడంతో ఆయనను, అల్లుడు రాజశేఖర్ రెడ్డిని అరెస్టు చేసి పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇదిలా ఉండగా, మల్లారెడ్డి అనుచరులు తమను భయపెడుతున్నారని సదరు 15 మంది వ్యక్తులు ఆరోపించారు.

మా జాగ కబ్జా చేసిన్రు : మల్లారెడ్డి

తన రెండెకరాల భూమిలో అర్ధరాత్రి కొందరు దౌర్జన్యంగా చొరబడి కబ్జా చేశారని మల్లారెడ్డి ఆరోపించారు. ఉన్న నిర్మాణాలు కూల్చి వేశారని, తన భూమిలో అక్రమంగా ఫెన్సింగ్ వేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో దౌర్జన్యం పెరిగిందన్నారు. కాంగ్రెస్ విప్ లక్ష్మణ్, శ్రీనివాస్ రెడ్డిపై ఆయన ఆరోపణలు చేశారు.

నోట్లు..డ్రగ్స్..ఆభరణాలతో వల

(మొదటిపేజీ తరువాయి)

సొత్తులో నగదు రూపేణా రూ.849.15 కోట్లు, మద్యం రూ.814.85 కోట్లు, మాదక ద్రవ్యాలు రూ.3,958 కోట్లు, బంగారం, వెండి వంటి ఆభరణాలు రూ.1,260.33 కోట్లు, ఇతర ఉచితాలు రూ.2006.59 కోట్లు ఉన్నట్లు ఈసీ తెలిపింది. మాదక ద్రవ్యాలు, సైకోట్రోపిక్ పదార్థాల స్వాధీనంపై ఈసారి ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొంది. గుజరాత్ ఏటీఎస్, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో, ఇండియన్ కోస్ట్ గార్డ్‌లు కలిసి చేపట్టిన ఆపరేషన్లలో కేవలం మూడు రోజుల్లోనే రూ.892 కోట్ల విలువైన డ్రగ్స్ పట్టుబడినట్టు వెల్లడించింది.



ఫైనల్లో సాత్విక్ జోడీ

- సెమీస్‌లో మెరుపు విజయం
- థాయ్‌లాండ్ ఓపెన్ 2024




బ్యాంకాక్ (థాయ్‌లాండ్) : థాయ్‌లాండ్ ఓపెన్‌లో భారత డబుల్స్ స్టార్స్ సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డి, చిరాగ్ శెట్టి జోరు కొనసాగుతుంది. వరుసగా ఏకపక్ష విజయాలు నమోదు చేసిన సాత్విక్, చిరాగ్‌లు థాయ్‌లాండ్ ఓపెన్ పురుషుల డబుల్స్ విభాగం ఫైనల్లోకి ప్రవేశించారు. గురువారం జరిగిన సెమీఫైనల్లో చైనీస్ తైపీ షట్లర్లు మింగ్ చె, టంగ్ వీలపై 21-11, 21-12లపై ఏకపక్ష విజయం నమోదు చేశారు. నేడు టైటిల్ పోరులో టాప్ సీడ్ సాత్విక్, చిరాగ్ జోడీతో వరల్డ్ నం.29 చైనా షట్లర్లు చెన్ బోయాంగ్, లీ యిలు పోటీపడనున్నారు. వరల్డ్ నం.3 సాత్విక్, చిరాగ్‌తో పోటీపడటం చైనా షట్లర్లకు ఇదే తొలిసారి కానుంది.

ఎదురులేదు : పురుషుల డబుల్స్‌లో ప్రపంచ నం.3 జోడీ సాత్విక్, చిరాగ్‌లకు ఎదురులేదు. వరుస గేముల్లో గెలుపొందిన టాప్ సీడ్ జోడీ 35 నిమిషాల్లోనే టైటిల్ పోరుకు చేరుకుంది. తొలి గేమ్‌లో చైనీస్ తైపీ జంట ఏమాత్రం పోటీ ఇవ్వలేదు. 4-3 నుంచి దూసుకెళ్లి సాత్విక్, చిరాగ్‌లు 11-7తో విరామ సమయానికి ముందంజ వేశారు. ద్వితీయార్థంలో వరుసగా పాయింట్లు సాధించి 21-11తో తొలి గేమ్ సొంతం చేసుకున్నారు. కీలక రెండో గేమ్‌లో సాత్విక్, చిరాగ్ కాస్త చెమటోడ్చారు. ఆరంభంలో చైనీస్ తైపీ షట్లర్లు గట్టి పోటీ ఇచ్చారు. 6-9తో వెనుకంజ వేసిన సాత్విక్, చిరాగ్ విరామ సమయానికి 11-10తో ఓ పాయింట్ ఆధిక్యం సాధించారు. వరుసగా తొమ్మిది పాయింట్లు సాధించి అదరగొట్టారు. 21-12తో ద్వితీయార్థంలో దుమ్మురేపే గేమ్‌తో సెమీఫైనల్లో ఘన విజయం సాధించారు. ఇక మహిళల డబుల్స్‌లో తనీశ క్రాస్టో, అశ్విని పొన్నప్పల పోరాటానికి తెరపడింది. గురువారం జరిగిన సెమీఫైనల్లో థాయ్‌లాండ్ జంట చేతిలో 12-21, 20-22తో పోరాడి ఓడారు.

బెంగళూర్ అడుగు

- చెన్నైపై విజయంతో ప్లే ఆఫ్స్‌కు ఆర్సీబీ
- ఛేదనలో సూపర్‌కింగ్స్ చతికిల
- బెంగళూర్ 218/5, చెన్నై 191/7

నవతెలంగాణ-బెంగళూర్



రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ సాధించింది. గ్రూప్ దశలో వరుసగా ఆరో విజయం సాధించి ఐపీఎల్ 17వ సీజన్ ప్లే ఆఫ్స్‌లోకి అడుగుపెట్టింది. శనివారం చిన్నస్వామి స్టేడియంలో చావోరేవో తేల్చుకోవాల్సిన మ్యాచ్‌లో చెన్నై సూపర్‌కింగ్స్‌పై 27 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. సూపర్‌కింగ్స్ నెట్‌రన్‌రేట్‌ను అధిగమించిన రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ టాప్-4లోకి అడుగుపెట్టింది. 219 పరుగుల ఛేదనలో చెన్నై సూపర్‌కింగ్స్ 191 పరుగులకే పరిమితమైంది. రచిన్ రవీంద్ర (61, 37 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సులు), రవీంద్ర జడేజా (42 నాటౌట్, 22 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సులు), ఎం.ఎస్ ధోని (25, 13 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) మెరిసినా.. 20 ఓవర్లలో ఏడు వికెట్లకు 191 పరుగులే చేసింది. అంతకుముందు, డుప్లెసిస్ (54, 39 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సులు), విరాట్ కోహ్లి (47, 29 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సులు), రజత్ పాటిదార్ (41, 23 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సులు), కామెరూన్ గ్రీన్ (38 నాటౌట్, 17 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సులు) సమిష్టిగా మెరవటంతో రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 218 పరుగుల భారీ స్కోరు సాధించింది.

కలిసికొట్టారు : ఓపెనర్లు విరాట్ కోహ్లి (47), డుప్లెసిస్ (54) బెంగళూర్‌కు అదిరే ఆరంభం అందించారు. 3 ఓవర్లలో 31/0తో ఉండగా వర్షం అంతరాయం కలిగించింది. వర్షం అనంతరం మ్యాచ్ మొదలైనా.. బంతి అనూహ్యంగా స్పందించింది. పవర్‌ప్లేలోనే స్పిన్నర్లను రంగంలోకి దించిన సూపర్‌కింగ్స్ ఆర్సీబీ ఓపెనర్లను ఇరకాటంలో పెట్టారు. పవర్‌ప్లేలో ఆర్సీబీ 42/0 పరుగులే చేసింది. పవర్‌ప్లే చివరి మూడు ఓవర్లలో ఆర్సీబీ 11 పరుగులే చేయటం గమనార్హం. ఫీల్డింగ్ పరిమితులు తొలగటంతో ఆర్సీబీ ఇక్కట్లు సైతం దూరమయ్యాయి. కోహ్లి, డుప్లెసిస్ ఎదురుదాడి చేశారు. డుప్లెసిస్ మూడు ఫోర్లు, మూడు సిక్సర్లతో 35 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించగా.. కోహ్లి సైతం నాలుగు సిక్సర్లు, మూడు ఫోర్లతో చెలరేగాడు. కోహ్లి నిష్క్రమణతో కెప్టెన్‌తో జతకట్టిన రజత్ పాటిదార్ (41) తనదైన జోరు చూపించాడు. నాలుగు సిక్సర్లు, రెండు ఫోర్లతో విరుచుకుపడ్డాడు. ఆ తర్వాత వచ్చిన కామెరూన్ గ్రీన్ (38 నాటౌట్) సైతం మూడేసి ఫోర్లు, సిక్సర్లతో దంచికొట్టాడు. దినేశ్ కార్తీక్ (14), గ్లెన్ మాక్స్‌వెల్ (16) వేగంగా ఆడేందుకు ప్రయత్నించి వికెట్ కోల్పోయారు. సూపర్‌కింగ్స్ స్పిన్నర్లు మహీశ్ తీక్షణ (0/25), మిచెల్ శాంట్నర్ (1/23) పొదుపుగా బంతులేయగా.. పేసర్లపై ఆర్సీబీ బ్యాటర్లు విశ్వరూపం చూపించారు.

క్వాలిఫయర్ 1పై కన్నేసి..!

- నేడు పంజాబ్‌తో హైదరాబాద్ ఢీ
- నైట్‌రైడర్స్‌తో రాయల్స్ అమీతుమీ

నవతెలంగాణ-హైదరాబాద్



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2024 ప్లే ఆఫ్స్ రేసు ఆఖరు వరకు ఉత్కంఠ రేపింది. ప్లే ఆఫ్స్ బెర్తులు ఖరారైనా.. టాప్-2లో నిలిచే మరో జట్టు ఎవరనేది ఇంకా తేలాల్సి ఉంది. కోల్‌కత నైట్‌రైడర్స్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానం కైవసం చేసుకోగా.. రెండో స్థానం రేసులో రాజస్థాన్ రాయల్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ ఉన్నాయి. రాజస్థాన్ రాయల్స్ 13 మ్యాచుల్లో 16 పాయింట్లు సాధించగా.. సన్‌రైజర్స్ హైదరాబాద్ 13 మ్యాచుల్లో 15 పాయింట్లు దక్కించుకుంది. చివరి మ్యాచ్‌లో విజయం సాధించి రెండో స్థానం సాధించాలని రాయల్స్, సన్‌రైజర్స్ ఎదురుచూస్తున్నాయి. నేడు గ్రూప్ దశ చివరి మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్‌తో సన్‌రైజర్స్ తలపడనుండగా.. కోల్‌కత నైట్‌రైడర్స్‌తో రాజస్థాన్ రాయల్స్ ఢీకొట్టనుంది.

మళ్లీ వర్షం ముప్పు? : హైదరాబాద్, పంజాబ్ మ్యాచ్‌కు వర్షం ముప్పు పొంచి ఉంది. గుజరాత్ టైటాన్స్‌తో గత మ్యాచ్ వర్షంతో రద్దుగా ముగిసింది. నేడు సాయంత్రం సమయంలో 30 శాతం వర్షం సూచనలు ఉన్నాయి. వర్షంతో మ్యాచ్ ఫలితం తేలకుంటే సన్‌రైజర్స్ మరో పాయింట్ సాధించనుంది. రాయల్స్ చివరి మ్యాచ్‌లో ఓడితే ఇరు జట్లు 16 పాయింట్లతో సమవుజ్జీలుగా నిలుస్తాయి. కానీ రాయల్స్ ఎనిమిది విజయాలు సాధించగా, సన్‌రైజర్స్ ఖాతాలో ఏడు విజయాలే ఉన్నాయి. దీంతో రెండో స్థానం రాజస్థాన్‌కు దక్కుతుంది. టాప్-2లో నిలిచి క్వాలిఫయర్ 1లో తలపడేందుకు సన్‌రైజర్స్ హైదరాబాద్ విజయమే లక్ష్యంగా బరిలోకి దిగుతుంది. ట్రావిశ్ హెడ్, అభిషేక్ శర్మ, హెన్రిచ్ క్లాసెన్, పాట్ కమిన్స్ సన్‌రైజర్స్‌కు కీలకం.

రాయల్స్ చేతిలోనే : టాప్-2లో నిలిచేందుకు రాజస్థాన్ రాయల్స్ ఎవరి మీద ఆధారపడి లేదు. కోల్‌కత నైట్‌రైడర్స్‌తో మ్యాచ్‌లో విజయం సాధిస్తే నేరుగా 18 పాయింట్లతో రెండో స్థానం సాధించనుంది. ఒకవేళ ఓడినా.. సన్‌రైజర్స్ హైదరాబాద్ మ్యాచ్‌లో ఫలితం తేలకుంటే ఎక్కువ విజయాలతో టాప్-2లో నిలువనుంది. యశస్వి జైస్వాల్, సంజు శాంసన్, రియాన్ పరాగ్ రాయల్స్‌కు కీలకం కానున్నారు.

హార్దిక్ పాండ్యపై వేటు

ఓ మ్యాచ్ సస్పెన్షన్ విధించిన రిఫరీ



ముంబయి : 2025 ఐపీఎల్ సీజన్‌కు ముందే ముంబయి ఇండియన్స్‌కు గట్టి షాక్ ఎదురైంది. పదో పరాజయంతో ఐపీఎల్ 2024 సీజన్‌ను చెత్తగా ముగించిన ముంబయి ఇండియన్స్.. వచ్చే సీజన్ తొలి మ్యాచ్‌లో కెప్టెన్ హార్దిక్ పాండ్య సేవలను కోల్పోనుంది. శుక్రవారం వాంఖడేలో లక్నో సూపర్‌జెయింట్స్‌తో మ్యాచ్‌లో ముంబయి ఇండియన్స్ 20 ఓవర్ల కోటా పూర్తి చేసేందుకు 120 నిమిషాల సమయం తీసుకుంది. రూల్స్ ప్రకారం 90 నిమిషాల్లో 20 ఓవర్లు ముగించాలి. స్లో ఓవర్ రేట్ కారణంగా మ్యాచ్ రిఫరీ ముంబయి ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యపై రూ.30 లక్షల జరిమానా విధించాడు. ముంబయి ఇండియన్స్ తుది జట్టులోని ఇతర ఆటగాళ్లపై మ్యాచ్ ఫీజులో 50 శాతం లేదా రూ.12 లక్షల జరిమానా పడింది. ఈ సీజన్లో ముంబయి ఇండియన్స్‌కు స్లో ఓవర్‌రేట్ పరంగా ఇది మూడో తప్పిదం కావటంతో కెప్టెన్‌పై ఓ మ్యాచ్ నిషేధం సైతం వేశాడు. దీంతో ఐపీఎల్ 2025 ముంబయి ఇండియన్స్ తొలి మ్యాచ్‌కు హార్దిక్ పాండ్య దూరం కానున్నాడు. ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ రిషబ్ పంత్ సైతం ఇటీవల రూ.30 లక్షల జరిమానా, ఓ మ్యాచ్ నిషేధం ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. మ్యాచ్ రిఫరీ నిర్ణయంపై ముంబయి ఇండియన్స్ అప్పీల్‌కు వెళ్లే అవకాశాలు ఉన్నాయి.

నిఖత్ పసిడి పంచ్

- మీనాక్షికి సైతం స్వర్ణం
- ఎలోర్డా కప్ టోర్నమెంట్

భారత స్టార్ బాక్సర్, తెలంగాణ సూపర్‌స్టార్ నిఖత్ జరీన్ ఎలోర్డా కప్‌లో పసిడి పంచ్ విసిరింది. పారిస్ ఒలింపిక్స్‌లో పసిడి పతకమే లక్ష్యంగా దూసుకెళ్తోన్న అగ్రశ్రేణి బాక్సర్ మహిళల 52 కేజీల విభాగం ఫైనల్లో ఏకపక్ష విజయం సాధించింది. ప్రతిష్టాత్మక విశ్వక్రీడల ముంగిట బంగారు పతకంతో ఆత్మవిశ్వాసం రెట్టింపు చేసుకుంది.



అస్తానా (కజకిస్థాన్) : ఎలోర్డా కప్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో భారత్ 12 పతకాలు సాధించింది. కజకిస్థాన్‌లోని అస్తానాలో జరిగిన టోర్నమెంట్‌లో భారత మెన్, ఉమెన్ బాక్సర్లు ఆకట్టుకున్నారు. రెండు సార్లు ప్రపంచ చాంపియన్ నిఖత్ జరీన్, మీనాక్షి పసిడి పతకాలు సాధించగా.. ఇతర బాక్సర్లు రజత, కాంస్య పతకాలతో సరిపెట్టుకున్నారు. మహిళల విభాగంలో అనామిక, మనీశలు సిల్వర్ మెడల్స్ దక్కించుకున్నారు. మెన్స్ విభాగంలో సింగ్ (48 కేజీలు), అభిషేక్ యాదవ్ (67 కేజీలు), విశాల్ (86 కేజీలు), గౌరవ్ చౌహాన్ (92 కేజీలు) కాంస్య పతకాలు సాధించారు. మహిళల విభాగంలో సోను (63 కేజీలు), మంజు (66 కేజీలు), సన్నావాల్ సింగ్ (70 కేజీలు), మోనిక (81 కేజీలు) కాంస్య పతకాలు సొంతం చేసుకున్నారు. ఎలోర్డా కప్ బాక్సింగ్ పోటీలు శనివారంతో ముగిశాయి.

నిఖత్ సూపర్ : మహిళల 52 కేజీల విభాగం ఫైనల్లో నిఖత్ జరీన్ అద్భుత ప్రదర్శన చేసింది. కజకిస్థాన్ బాక్సర్ జాజిరపై పిడి గుద్దుల వర్షం కురిపించింది. నిఖత్ జరీన్ ఎదురులేని పంచ్‌లతో ఐదుగురు న్యాయమూర్తులు మూడు రౌండ్లలోనూ నిఖత్ జరీన్‌ను విజేతగా తేల్చారు. మూడు రౌండ్ల అనంతరం నిఖత్ జరీన్ 5-0తో ఏకపక్ష విజయం నమోదు చేసింది. బంగారు పతకం సొంతం చేసుకుంది. మహిళల 48 కేజీల విభాగం ఫైనల్లోనూ మీనాక్షి మెప్పించింది. ఉజ్బెకిస్థాన్ బాక్సర్ రోహమోనోవపై 4-1తో విజయం సాధించింది. మూడు రౌండ్ల అనంతరం నలుగురు న్యాయమూర్తులు మీనాక్షికి అధిక పాయింట్లు ఇవ్వగా.. ఓ న్యాయమూర్తి ఉజ్బెకిస్థాన్ బాక్సర్‌కు ఎక్కువ పాయింట్లు ఇచ్చాడు. మహిళల 50 కేజీల విభాగంలో అనామిక నిరాశపరిచింది. 1-4తో చైనా బాక్సర్ యు వుకు పసిడి పతకం కోల్పోయింది. మహిళల 60 కేజీల విభాగం ఫైనల్లో మనీశ సైతం 0-5తో ఓటమి పాలైంది. కజకిస్థాన్ బాక్సర్ విక్టోరియ చేతిలో మనీశ చిత్తుగా ఓడింది.



నా ఉచ్ఛ్వాసం కవనం..

దిగ్గజ సినీ గీత రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రికి నివాళిగా రూపొందిన కార్యక్రమం 'నా ఉచ్ఛ్వాసం కవనం'. శృతిలయ ఫౌండేషన్ నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమానికి రామ్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించారు. సిరివెన్నెల పాటల అంతరంగాన్ని ఆవిష్కరించే ఈ కార్యక్రమం ఈటీవీలో ప్రతి ఆదివారం ఉదయం 9.30 గంటలకు ప్రసారం కానుంది. తాజాగా ఈ ప్రోగ్రాం కర్టెన్ రైజర్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో నిర్వహించారు. దర్శకుడు కృష్ణవంశీ ఈ వేడుకకు హాజరై టీజర్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రామ్ చెరువు మాట్లాడుతూ, 'విశ్వనాథ్‌తో విశ్వనాథామృతం అనే కార్యక్రమం చేస్తున్నప్పుడు 2011లో సిరివెన్నెల సీతారామశాస్త్రిని కలిశాం. ఆయన సాహిత్యపరంగా రాసిన ఎంతో విలువైన పాటలు, ఆ పాటల వెనక ఆయన చేసిన కృషి గురించి తెలుసుకున్న తర్వాత ఈ పాటలు మాకే కాదు అందరికీ తెలియాలనే ఆలోచన కలిగింది. సిరివెన్నెల అంతరంగం పేరుతో ప్రేక్షకులకు చేర్చాలి అనుకుంటున్నప్పుడు త్రివిక్రమ్ మాకు సపోర్ట్ చేశారు. ఈటీవీలో ప్రసారం గురించి బాపినీడు ఎంతో సపోర్ట్ చేశారు' అని తెలిపారు.

సిరివెన్నెల సీతారామశాస్త్రి సోదరుడు శ్రీరామ్ శాస్త్రి, సింగర్ పార్థసారథి, డాక్టర్ గురువారెడ్డి, దర్శకుడు కృష్ణవంశీ, సీనియర్ ఫిలిం జర్నలిస్ట్ ప్రభు తదితరులు సిరివెన్నెల పాట ప్రస్థానం గురించి తెలిపారు.

ఫీల్ గుడ్ లవ్‌స్టోరీ


సుమయా రెడ్డి

అనంతపురం నుంచి వచ్చిన తెలుగమ్మాయి సుమయా రెడ్డి నిర్మాతగా, హీరోయిన్‌గా, కథా రచయితగా 'డియర్ ఉమ' చిత్రంతో తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు.
సుమయా రెడ్డి, పృథ్వీ అంబర్ హీరో, హీరోయిన్లుగా సుమ చిత్ర ఆర్ట్స్ బ్యానర్ పై సుమయా రెడ్డి నిర్మించిన చిత్రం 'డియర్ ఉమ'. సాయి రాజేష్ మహాదేవ్ దర్శకుడు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదల చేసిన పోస్టర్, టీజర్, నవ్వుతుంటూనే.. అనే సాంగ్ అందరినీ ఆకట్టుకున్నాయి. నేడు (ఆదివారం) సుమయా రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఈ ఈ సినిమా నుంచి స్పెషల్ పోస్టర్, నీవెవ్వరో సాంగ్‌ను రిలీజ్ చేశారు. ఈ మెలోడీ సాంగ్ శ్రోతలను ఆకట్టుకునేలా ఉంది. మంచి ఫీల్ గుడ్ లవ్‌స్టోరీని చూడబోతున్నామనే హింట్‌ను చిత్రయూనిట్ ఇస్తోంది. నిర్మాతగా సుమయా రెడ్డికి ఇది మొదటి చిత్రమే అయినా ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా ఎంతో రిచ్‌గా, భారీ స్థాయిలో సినిమాను నిర్మించారు. ప్రస్తుతం ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది అని చిత్ర యూనిట్ తెలిపింది.

రొమాంటిక్ సిల్క్ శారీ


రీవా చౌదరి

వాసుదేవ్ రావు, రీవా చౌదరి, ప్రీతి గోస్వామి హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా 'సిల్క్ శారీ'. చాహత్ బ్యానర్ పై కమలేష్ కుమార్ నిర్మిస్తున్నారు. దీనికి టి. నాగేందర్ దర్శకుడు. ఈ సినిమా ఈ నెల 24న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు వస్తోంది. ఈ సందర్భంగా ప్రసాద్ ల్యాబ్స్‌లో సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మురళీ మోహన్, హీరో శ్రీకాంత్, శివాజీ రాజా, ఉత్తేజ్ తదితరులు అతిథులుగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నిర్మాత కమలేష్ కుమార్ మాట్లాడుతూ, 'ఒక మంచి మూవీతో టాలీవుడ్‌లోకి నిర్మాతగా అడుగు పెట్టడం సంతోషంగా ఉంది' అని తెలిపారు.'ఈ సినిమా టైటిల్ అనౌన్స్‌మెంట్ నుంచే అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఇదొక సరికొత్త రొమాంటిక్ లవ్ స్టోరీ. అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా రూపొందించాం. హీరో వాసుదేవ్ రావు కెరీర్‌లో గుర్తుండిపోయే మూవీ అవుతుంది. ప్రొడ్యూసర్ కమలేష్ ఎంతో సపోర్ట్ చేశారు' అని దర్శకుడు టి.నాగేందర్ చెప్పారు.'ఈ సినిమాతో హీరోయిన్‌గా మంచి పర్‌ఫార్మెన్స్‌కు స్కోప్ ఉన్న క్యారెక్టర్‌లో నటించడం చాలా ఆనందంగా ఉంది' అని హీరోయిన్ రీవా చౌదరి చెప్పారు.



ఇట్లు... మీ సినిమా

లిటిల్ బేబీస్ క్రియేషన్స్ పతాకంపై హరీష్ చావా దర్శకత్వంలో నోరి నాగ ప్రసాద్ నిర్మిస్తున్న చిత్రం 'ఇట్లు... మీ సినిమా'. అభిరామ్, వెన్నెల, మనోహర్, పవన్, కృష్ణ, మంజుల హీరో, హీరోయిన్లుగా, ఎఫ్2 ఫేమ్ ప్రదీప్, అమ్మ రమేష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు.
ఇటీవల దర్శకుడు కోదండరామి రెడ్డి ఈ చిత్ర పోస్టర్‌ను లాంచ్ చేశారు. తమకున్న ప్యాషన్‌తో సినిమా రంగానికి వచ్చిన నలుగురు యువకులు ఎదుర్కొన్న సవాళ్లు ఏంటి?, వాళ్ళు సినీ ఇండస్ట్రీలో సక్సెస్ అయ్యారా లేదా అనేది ఈ కథ. లవ్, రొమాన్స్, కామెడీ, సెంటిమెంట్ సమ్మేళనంగా ఈ సినిమా ఉంటుంది. ప్రతి సినిమా వ్యక్తి ఇది నా కథ అని ఫీలయ్యే లాగా ఉంటుంది. మీరావలి అద్భుతమైన సంగీతాన్ని అందించారు. ప్రస్తుతం ఈ చిత్రం సెన్సార్ జరుపుకుంటోందని దర్శక, నిర్మాతలు తెలిపారు. ఈ చిత్రానికి డాన్స్: తాజ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: బూస్సా బాలరాజు, నిర్మాత: నోరి నాగ ప్రసాద్, మాటలు, స్క్రీన్ ప్లే, దర్శకత్వం: హరీష్ చావా.

భావోద్వేగ ప్రయాణం



ప్రపంచవ్యాప్తంగా 'నీ దారే నీ కథ' సినిమా జూన్ 14న థియేటర్లలోకి వస్తోంది. అద్భుతమైన సంగీతం, ఎమోషన్స్‌తో నిండిన మరపురాని ప్రయాణంగా ఈ సినిమా ఉంటుందని మేకర్స్ అంటున్నారు. వంశీ జొన్నలగడ్డ దర్శకత్వం వహించిన ఈ సంగీత ఆధారిత కథ ఆకర్షణీ యమైన సినిమాటిక్ అనుభవాన్ని అందించనుంది. ఆకర్షణీయమైన కథాంశంతో మనసును కదిలించే సంగీతాన్ని మిళితం చేస్తుంది. ఈ చిత్రం అభిరుచి, స్నేహం, మన కలలను సాధించాలనే సంకల్పం, తండ్రీ కొడుకుల మధ్య ఉన్న బంధం వంటి అంశాలతో కలిగి ఉంది. ప్రేక్షకులు భావోద్వేగాల రోలర్‌కోస్టర్‌లా ఫీల్ అవుతారు. ప్రేక్షకులను అలరించేలా రూపొం దించిన స్క్రీన్‌ప్లే ఇది అని చిత్ర బృందం తెలిపింది. ప్రియతమ్ మంతిని, విజయ విక్రాంత్, అనంత పద్మశాల, అంజన బాలాజీ, వేద్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి నిర్మాతలు : వంశీ జొన్నలగడ్డ, తేజేష్ వీర, శైలజ జొన్నలగడ్డ, రచయితలు : మురళి కాంత్, వంశీ జొన్నలగడ్డ, సంగీతం : ఆల్బర్ట్లో గురియోలి, సినిమా టోగ్రాఫర్ : ఎలెక్స్ కావు, ఎడిటర్ : విపిన్ సామ్యూల్, దర్శకుడు : వంశీ జొన్నలగడ్డ.

నవచిత్రం

క్యూట్‌గా.. స్వీట్‌గా..



ఎన్ ఆర్ ఐ ఎంటర్టైన్మెంట్స్ (యు ఎస్ ఎ) సమర్పణలో న్యూ రీల్ ఇండియా ఎంటర్టైన్మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ పతాకం పై చైతన్య రావు, హెబ్బా పటేల్ హీరో, హీరోయిన్‌గా నటించిన చిత్రం 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్'. తనికెళ్ల భరణి, సుహాసిని ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి బాల రాజశేఖరుని రచయిత, దర్శకుడు. కళ్యాణి మాలిక్ సంగీతం అందించగా కెకెఆర్, బాల రాజ్ సంయుక్తంగా ఈ రొమాంటిక్ కామెడీని నిర్మించారు.
ఇప్పటికే ఈ చిత్రం నుంచి సంగీత దర్శకుడు కళ్యాణి మాలిక్ స్వరపరిచిన రెండు రొమాంటిక్ మెలోడీ పాటలు విడుదలై సోషల్‌మీడియాలో ట్రెండింగ్‌లో నిలిచాయి. తాజాగా ఈ చిత్రం నుంచి మూడో పాటను హీరో అడివి శేష్ రిలీజ్ చేశారు. దర్శకుడు బాల స్నేహితుడైన అడివిశేష్ గూఢచారి 2, డెకాయిట్ చిత్రాలతో బిజీగా ఉన్నప్పటికీ శనివారం అన్నపూర్ణ 7 ఎకరాల ప్రాంగణంలో ఈ చిత్రంలోని మూడో పాటను వీక్షించి, రిలీజ్ చేశారు.
అనంతరం ఆయన మాట్లాడుతూ, 'క్యూట్‌గా, స్వీట్‌గా పాట సాహిత్యం చాలా బాగుంది. పాట మాదిరిగానే చిత్రం మంచి విజయం సాధించాలి' అని అన్నారు.
దర్శకుడు బాల రాజశేఖరుని మాట్లాడుతూ, 'ఎంతో బిజీగా ఉన్నప్పటికీ క్యూట్‌గా స్వీట్‌గా అనే అందమైన పాటను విడుదల చేసిన అడివి శేష్‌కి నా కృతజ్ఞతలు. మా చిత్రం మంచి మ్యూజికల్ రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్. మా చిత్రంలోని ప్రతి పాట చాలా బాగుంటుంది. మంచి పాటలు స్వరపరిచిన కళ్యాణి మాలిక్‌కి థ్యాంక్స్. ఈ క్యూట్‌గా స్వీట్‌గా పాటకు కిట్టూ విస్సాప్రగడ లిరిక్స్ అందించగా బాహుబలి ఫేమ్ దీపు తన గాత్రంతో ప్రాణం పోశారు. త్వరలోనే ట్రైలర్‌ను విడుదల చేసి, చిత్రాన్ని ఈ సమ్మర్‌లో విడుదల చేయటానికి సిద్ధంగా ఉన్నాం' అని చెప్పారు.

సంతాన ప్రాప్తిరస్తు


చాందినీ చౌదరి, విక్రాంత్


విక్రాంత్, చాందినీ చౌదరి హీరో, హీరోయిన్లుగా 'సంతాన ప్రాప్తిరస్తు' సినిమా శనివారం హైదరాబాద్‌లో లాంఛనంగా ప్రారంభమైంది. ఈ సినిమాను మధుర ఎంటర్‌టైన్‌మెంట్, నిర్వి ఆర్ట్స్ బ్యానర్స్ పై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్నారు. సంజీవ్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు.
వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ రాజా, ఏక్ మినీ కథ లాంటి చిత్రాలకు స్క్రీన్ ప్లే అందించిన రచయిత షేక్ దావూద్ జి ఈ సినిమాకు స్క్రీన్‌ప్లే రాస్తున్నారు.
ఈ సినిమా ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత, వ్యాపార వేత్త అంబికా కృష్ణ కెమెరా స్విచ్చాన్ చేయగా, వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకట రామరాజు క్లాప్ ఇచ్చారు. మధుర శ్రీధర్ రెడ్డి ఫస్ట్ షాట్ డైరెక్షన్ చేశారు. నిర్మాతలిద్దరూ స్క్రిప్ట్‌ను దర్శకుడు సంజీవ్ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా దర్శకుడు సంజీవ్ రెడ్డి మాట్లాడుతూ, 'మ్యూజికల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రమిది. ఇవాళ ఫ్యామిలీ ఆడియెన్స్ థియేటర్స్‌కు రావడం లేదు. వాళ్లను రప్పించేలా ఈ మూవీ పిల్లల నుంచి పెద్దల వరకు అందరికీ నచ్చేలా ఉంటుంది. ఎంటర్‌టైన్‌మెంట్ ఉంటూనే ఒక కాంటెంపరరీ ఇష్యూని కథలో చూపిస్తున్నాం. వరంగల్ అమ్మాయి, హైదరాబాద్ అబ్బాయి మధ్య కథ జరుగుతుంది. కొత్తగా పెళ్లైన జంట ఎదుర్కొనే ఓ సమస్యను వినోదాత్మకంగా మూవీలో చూపిస్తున్నాం' అని తెలిపారు.
'ఇదొక మంచి మ్యూజికల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. సునీల్ కశ్యప్ మా చిత్రానికి సూపర్ హిట్ మ్యూజిక్ కంపోజ్ చేస్తున్నారు. వచ్చే నెల 8వ తేదీ నుంచి మా సినిమా రెగ్యులర్ షూటింగ్‌ని ప్రారంభిస్తాం. హైదరాబాద్, వరంగల్ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జరుపుతాం' అని నిర్మాతలు మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి అన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

ఏఐలో లక్ష మందికి ఇంటర్న్‌షిప్

- ఇంజినీరింగ్ విద్యార్థులకు మద్దతు
- ప్రతిభను వెలికి తీయడమే లక్ష్యం
- స్వేచ్ఛ వ్యవస్థాపకులు వై కిరణ్ చంద్ర వెల్లడి



నవతెలంగాణ- బిజినెస్ బ్యూరో

ఇంజనీరింగ్ విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడమే లక్ష్యంగా లక్ష మంది విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ)పై ఇంటర్న్‌షిప్ కల్పిస్తున్నట్లు స్వేచ్ఛ వ్యవస్థాపకుడు వై కిరణ్ చంద్ర తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని స్వేచ్ఛ కార్యాలయంలో సెక్రటరీ ప్రవీణ్ చంద్ర, ఒజోనెటెల్ కమ్యూనికేషన్ సిటిఒ చైతన్య చొక్కారెడ్డితో కలిసి కిరణ్ చంద్ర మీడియాతో మాట్లాడారు. ఈ ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని ఐఐఐటి హైదరాబాద్, ఓజోనెటెల్ కమ్యూనికేషన్స్, మెటా సహకారంతో చేపడుతున్నామన్నారు. స్వేచ్ఛ అనేది ఉచిత సాఫ్ట్‌వేర్, ఉచిత నాలెడ్జ్‌ను అందించే లాభాపేక్ష లేని సంస్థ అన్నారు. ఈ వేసవిలో విద్యార్థుల కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, 'సమ్మర్ ఆఫ్ ఏఐ'పై ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నామని చెప్పారు. తెలుగు భాషా కేంద్రీకృత లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ (ఎల్‌ఎల్‌ఎం) అభివృద్ధికి స్వేచ్ఛకు సహాయం చేస్తూనే.. ఎఐ నైపుణ్యాలతో సన్నద్ధం చేయనున్నామని తెలిపారు.ఈ ఇంటర్న్‌షిప్ తొలి బ్యాచ్ 10,000 మందితో ప్రారంభమయ్యిందన్నారు. భాషా సుసంపన్నమైన తెలుగు సంపదను ఈ ఇంటర్న్‌షిప్‌లో ఒక్కో విద్యార్థి కనీసం 50 మందిని కలిసి తమ ప్రాంతాలలో, వివిధ మాండలీకాలలో ఉన్న ఈ సంపదను డాక్యుమెంట్ చేసి, అలా రూపొందించన డేటా సెట్ల మీద ఎఐ ట్రైనింగ్ పొందనున్నారన్నారు. ఇది ప్రపంచంలోనే వినూత్నమైన ఒక విశిష్ట ప్రయోగమన్నారు. ఈ ఇంటర్న్‌షిప్‌లో పాల్గొనే విద్యార్థులకు ఏఐ నిపుణులు తర్ఫీదునిస్తారన్నారు. నెలరోజుల పాటు ఇంటర్న్‌షిప్‌ను పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్‌లను ఇవ్వనున్నామన్నారు."ఎఐ అంటే అందరికీ చాట్ జీపిటి గుర్తుకు వస్తుంది. ఇంగ్లీషు భాష మినహాయించి ఇతర భాషలలో ఈ టెక్నాలజీ అందుబాటుకి సంబంధించి పరిమితులున్నాయి. భారతీయ భాషల విషయానికి వస్తే మరీ అంతంత మాత్రమే. భారతీయ భాషలలో ఎఐ సొల్యూషన్లు అందుబాటులోకి తీసుకురావాలనే ఆకాంక్షతో స్వేచ్ఛ సంస్థ ఒక పరిపూర్ణమైన తెలుగు భాషలో ఒక లార్జ్ లాంగ్వేజ్ మోడల్ అంటే చాట్ జీపిటి వంటి పరిష్కారాన్ని తయారు చేసే ప్రక్రియను ప్రారంభించింది. దీని సాధనకై ఒక లక్ష మంది ఇంజనీరింగ్, సాంకేతిక,ఇతర విద్యార్థులను భాగస్వాములను చేస్తుంది." అని స్వేచ్ఛ సంస్థ పేర్కొంది.

ఫోటో క్యాప్షన్ : 'సమ్మర్ ఆఫ్ ఎఐ' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రవీణ్ చంద్ర, కిరణ్ చంద్ర, చైతన్య చొక్కారెడ్డి.

స్పెషల్ సెషన్‌లో సెన్సెక్స్‌కు లాభాలు

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లు శనివారం నిర్వహించిన స్పెషల్ సెషన్‌లో లాభాలను నమోదు చేశాయి. సెన్సెక్స్ 89 పాయింట్లు పెరిగి 74,006కు చేరగా.. ఎన్ఎస్ఇ నిఫ్టీ 36 పాయింట్ల లాభంతో 22,502 వద్ద ముగిసింది. మొత్తం రెండు సెషన్లలో ప్రత్యేక ట్రేడింగ్ నిర్వహించారు. సాధారణంగా శనివారం మార్కెట్లకు సెలవు. కానీ.. ప్రాథమిక సైట్‌లో ఏమైనా లోపాలు తలెత్తితే ఎదుర్కొనే సన్నద్ధతను పరీక్షించేందుకు ఈక్విటీ, ఈక్విటీ డెరివేటివ్ విభాగాల్లో ప్రత్యేక ట్రేడింగ్ సెషన్‌ను ఏర్పాటు చేశారు. మొదటి సెషన్ ఉదయం 9.15 గంటలకు ప్రారంభమై 10.15 గంటల వరకు నిర్వహించగా.. రెండో సెషన్ 11.30 - 12.30 గంటల మధ్య నిర్వహించారు.


రూ. కోటి విలువ నివాసాలకే డిమాండ్

- హైదరాబాద్ అమ్మకాల్లో 92 శాతం వృద్ధి
- నాలుగు నెలల్లో 26వేల యూనిట్ల విక్రయాలు



హైదరాబాద్ : ఎన్నికల సమయంలోనూ తెలంగాణ రాజధానిలో నివాస అమ్మకాలు జోరు మీద సాగాయి. హైదరాబాద్‌లో 2024 మొదటి నాలుగు నెలల్లో మొత్తంగా 26,000 నివాస విక్రయాలు జరిగాయని రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ సంస్థ నైట్ ఫ్రాంక్ ఇండియా విడుదల చేసిన రిపోర్ట్‌లో తెలిపింది. వీటి విలువ రూ.16,190 కోట్లుగా ఉందని వెల్లడించింది. గత ఏడాది ఇదే కాలం రిజిస్ట్రేషన్ల సంఖ్యలో 15 శాతం, విలువ పరంగా 40 శాతం వృద్ధి చోటు చేసుకుంది. హైదరాబాద్, మేడ్చల్- మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాలను పరిధిలోకి తీసుకుని నైట్ ఫ్రాంక్ ఈ రిపోర్ట్‌ను రూపొందించింది.ముఖ్యంగా రూ.1 కోటి, అంతకంటే ఎక్కువ ధర కలిగిన గృహాల విక్రయాలు ఏకంగా 92 శాతం పెరగడం విశేషం. 2023 జనవరి నుంచి ఏప్రిల్ కాలంలో 2,060 యూనిట్ల అమ్మకాలు జరగ్గా.. 2024 అదే సమయంలో 3,959 నివాస విక్రయాలు నమోదయ్యాయి. రూ.50 లక్షలు ఎగువన, రూ.1 కోటి దిగువన నివాసాల రిజిస్ట్రేషన్లలో 47 శాతం పెరుగుదల నమోదయ్యింది. స్థూలంగా అధిక విలువ కలిగిన ఇళ్లకు ఎక్కువ డిమాండ్ నెలకొంది. ప్రస్తుత ఏడాది ఏప్రిల్‌లో 46 శాతం వృద్ధితో 6,578 యూనిట్ల అమ్మకాలు జరిగాయి. వీటి విలువ రూ.4,260 కోట్లుగా ఉంది. " కరోనా అనంతరం నివాస ధరలు క్రమంగా పెరిగాయి. గృహ కొనుగోలుదారులు అధిక విలువైన ఆస్తులకు స్పష్టమైన ప్రాధాన్యతను చూపుతున్నారు". అని నైట్ ఫ్రాంక్ ఇండియా సిఎండి శిశిర్ బైజాల్ పేర్కొన్నారు.

ఐసీఐసీఐ బ్యాంక్ మాజీ సీఎండీ నారాయణన్ కన్నుమూత



చెన్నయ్ : ఐసిఐసిఐ బ్యాంక్ మాజీ ఛైర్మన్ నారాయణన్ వఘుల్ శనివారం మరణించారు. నారాయణన్ చెన్నయ్‌లో కన్ను మూశారని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. గురువారం ఇంట్లో పడిపోవడంతో అపస్మారక స్థితిలోకి జారిపోయిన అయన్ను అపోలో ఆస్పత్రిలో చేర్చారు. అప్పటి నుంచి వెంటిలేటర్ మద్దతుతో చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమించడంతో శనివారం మధ్యాహ్నం మృతి చెందారు. 88 ఏళ్ల వయసు కలిగిన వఘుల్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.ఐసిఐసిఐ బ్యాంక్ ప్రయివేటీకరణలో నారాయణన్ కీలక పాత్ర పోశించారు. ఆ బ్యాంక్‌కు 24 ఏళ్ల పాటు ఛైర్మన్‌గా, సిఇఒగా పని చేశారు. నారాయణన్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో తొలుత కెరీర్‌ను ప్రారంభించారు. ఆ తరువాత 44 ఏళ్ల వయసులో 1981లో బ్యాంక్ ఆఫ్ ఇండియా ఛైర్మన్‌గా నియమితులై ప్రభుత్వ రంగ బ్యాంక్‌కు అతి పిన్న వయస్కుడైన ఛైర్మన్‌గా గుర్తింపు పొందారు. 1984 వరకు ఆయన అదే హోదాలో ఉన్నారు. 1985లో అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీ ఐసిఐసిఐ లిమిటెడ్ సిఎండిగా నియమించారు. 1995లో ఆ బ్యాంక్ ప్రయివేటీకరణలో ప్రధాన పాత్ర పోశించడంతో పాటుగా 2009 పదవి విరమణ వరకు అందులోనే కొనసాగారు. వాణిజ్యం, పరిశ్రమలకు చేసిన సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం 2009లో పద్మభూషణ్‌తో సత్కరించింది.

పిట్టీ ఇంజీనీరింగ్‌కు రూ.40 కోట్ల లాభాలు

హైదరాబాద్ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికంలో 62 శాతం వృద్ధితో రూ.40.36 కోట్ల నికర లాభాలు సాధించినట్లు పిట్టీ ఇంజనీరింగ్ తెలిపింది. ఇంతక్రితం ఏడాది ఇదే క్యూ4లో రూ.24.84 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.247.50 కోట్లుగా ఉన్న రెవెన్యూ.. గడిచిన క్యూ4లో 32.48 శాతం పెరిగి రూ.327.88 కోట్లకు చేరింది. 2023-24లో మొత్తంగా కంపెనీ లాభాలు 53.32 శాతం వృద్ధితో రూ.90.20 కోట్లుగా.. రెవెన్యూ 9.22 శాతం పెరిగి రూ.1,201.60 కోట్లుగా నమోదయ్యింది.

నెలాఖరులోగా కొత్త వీసీలు

- త్వరలో సెర్చ్ కమిటీల భేటీ
- శ్రీనిధి, గురునానక్ వర్సిటీలపై కఠిన చర్యలు : విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఈనెలాఖరులోగా తొమ్మిది విశ్వవిద్యాలయాలకు కొత్త ఉపకులపతుల (వీసీ)లను నియమిస్తామని విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం చెప్పారు. శనివారం హైదరాబాద్‌లో తనను కలిసిన విలేకర్లతో ఆయన మాట్లాడుతూ సెర్చ్ కమిటీలను ఇప్పటికే నియమించామని అన్నారు. త్వరలోనే ఆ కమిటీలు భేటీ అవుతాయని వివరించారు. ఈనెల 21న ప్రస్తుతం ఉన్న వీసీల పదవీకాలం ముగుస్తుందన్నారు. కొత్త వీసీలు వచ్చే వరకు ఐఏఎస్ అధికారులకు ఇన్‌చార్జీ బాధ్యతలు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి దీనిపై నిర్ణయం తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో పది వర్సిటీలకు 320 మంది ప్రొఫెసర్లు 1,382 దరఖాస్తులను సమర్పించిన విషయం తెలిసిందే. అత్యధికంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం (బీఆర్ఏఓయూ)కు 208, ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ)కు 193, పాలమూరు విశ్వవిద్యాలయం (పీయూ)కు 159, శాతవాహన విశ్వవిద్యాలయం (ఎస్‌యూ)కు 158, మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం (ఎంజీయూ)కు 157, కాకతీయ విశ్వవిద్యాలయం (కేయూ)కు 149, తెలంగాణ విశ్వవిద్యాలయం (టీయూ)కు 135, జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్టీయూ) హైదరాబాద్ కు 106, పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీ (పీఎస్‌టీయూ) 66 దరఖాస్తులొచ్చాయి. అత్యల్పంగా జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం (జేఎన్ఏఎఫ్ఏయూ)కు 51 దరఖాస్తులను సమర్పించారు. కేయూ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఈసీ) గడువు ముగిసినందున సెర్చ్ కమిటీని నియమించలేదు. రెండు, మూడు రోజుల్లో కేయూకు ఈసీని నియమించి సెర్చ్ కమిటీని నియమించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలిసింది. ఒకేసారి పది వర్సిటీలకు కొత్త వీసీలను నియమించే అవకాశమున్నది.

శ్రీనిధి, గురునానక్ వర్సిటీలపై కఠిన చర్యలు

శ్రీనిధి, గురునానక్ ప్రయివేటు వర్సిటీలపై కఠిన చర్యలు తీసుకుంటామని బుర్రా వెంకటేశం చెప్పారు. ప్రయివేటు విశ్వవిద్యాలయాలకు అనుమతి రాకుండానే ప్రవేశాలు చేపట్టడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వారికి ఆయా కాలేజీలతోపాటు జేఎన్టీయూ, ఓయూలో ప్రవేశాలు కల్పించామని వివరించారు. అనుమతి రాకుండా అడ్మిషన్లను చేపట్టిన ఆయా యాజమాన్యాలపై పార్లమెంటు ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జేఎన్టీయూ, ఓయూ వీసీలతోపాటు ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్లు, ఇతర నిపుణులతో కమిటీ వేశామని ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి చెప్పారు. గుర్తింపు లేని విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులు ప్రవేశం పొందారని అన్నారు. ప్రభుత్వ ఆదేశాలతో వారికి అడ్మిషన్లు కల్పించామన్నారు. ఆ కాలేజీల్లో యాజమాన్య కోటా సీట్లను రద్దు చేశామని చెప్పారు. ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు.

నేడు విద్యాశాఖపై సీఎం సమీక్ష

విద్యాశాఖపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం మధ్యాహ్నం సమీక్షించనున్నారు. విద్యాశాఖ అధికారులతోపాటు విశ్వవిద్యాలయాల వీసీలు కూడా ఈ సమావేశానికి హాజరవుతారు. జూన్‌లో కొత్త విద్యాసంవత్సరం ప్రారంభం కానుంది. పాఠశాలలు, కాలేజీల్లో వసతులు, ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యలు, విద్యార్థులకు యూనిఫారాలు, పాఠ్యపుస్తకాలు అందజేయడం వంటి అంశాలపై చర్చించే అవకాశమున్నది. అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల పురోగతి కూడా చర్చకు రానుంది.

కేజ్రీవాల్ పీఏ అరెస్టు

- బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించిన ఢిల్లీ కోర్టు
- స్వాతి మలివాల్ కేసులో బిభవ్ కుమార్‌కు లభించని ఊరట



న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) రాజ్యసభ సభ్యురాలు స్వాతి మలివాల్‌పై దాడి కేసులో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ పీఏ బిభవ్ కుమార్‌ను ఢిల్లీ పోలీసులు శనివారం సాయంత్రం అరెస్టు చేశారు. ఈ కేసులో ఆయన దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ఢిల్లీ కోర్టు తిరస్కరించింది. ఈ కేసులో బిభవ్ కుమార్‌ను ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేయడానికి ముందుగానే ముందస్తు బెయిల్ కోసం ఢిల్లీ కోర్టును ఆయన ఆశ్రయించారు. ఈ నెల 13న కేజ్రీవాల్‌ను కలిసేందుకు స్వాతి మలివాల్‌కు ఎలాంటి అపాయింట్‌మెంట్ లేదని బిభవ్ కుమార్ తరపు సీనియర్ న్యాయవాది ఎన్ హరిహరన్ కోర్టుకు తెలిపారు. సీఎం కేజ్రీవాల్ భద్రతా ఉల్లంఘనకు ఆమె ప్రయత్నించారని చెప్పారు. స్వాతి మలివాల్‌పై దాడి ఆరోపణలు కల్పితమని బిభవ్ కుమార్ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. దీనికి సంబంధించి సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియోలను ఆయన సమర్పించారు. ఎవరి ఒత్తిడి వల్లనో ఈ నెల 16న పోలీసులకు ఆమె ఫిర్యాదు చేశారని తెలిపారు. బిభవ్ కుమార్‌కు ఎలాంటి నోటీసులు జారీ చేయకుండానే పోలీసులు ఆయనను అరెస్ట్ చేసినట్లు కోర్టుకు వివరించారు. మరోవైపు బిభవ్ కుమార్ ముందస్తు బెయిల్‌పై విచారణ జరుగుతుండగా శనివారం సాయంత్రం 4.15 గంటలకు ఆయనను పోలీసులు అరెస్టు చేసినట్లు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ అతుల్ కుమార్ శ్రీవాస్తవ కోర్టుకు తెలిపారు. దీంతో ముందస్తు బెయిల్ పిటిషన్‌ను నిరుపయోగంగా పరిగణించాలని కోరారు. ఈ నేపథ్యంలో బిభవ్ కుమార్ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ఢిల్లీ కోర్టు కొట్టివేసింది.

బిభవ్ కుమార్‌ని కేజ్రీవాల్ నివాసం నుంచే పోలీసు బృందం శనివారం మధ్యాహ్నం అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం పోలీస్ స్టేషన్‌కి తరలించినట్లు సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. ఈ కేసులో పూర్తి సహకారం అందిస్తామని అధికారులకు ఇ-మెయిల్ పంపినప్పటికీ తమకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని బిభవ్ తరపు న్యాయవాది కరణ్ శర్మ మీడియాకు తెలిపారు.

అగ్గిమంటలే..!

- వాయవ్య భారతంలో వచ్చే ఐదు రోజులూ వడగాడ్పులు, అధిక ఉష్ణోగ్రతలే వాతావరణ శాఖ వెల్లడి
- పశ్చిమ ఢిల్లీలో శుక్రవారం అత్యధికంగా 47.4 డిగ్రీల నమోదు



న్యూఢిల్లీ : వాయవ్య భారతంలోని పలు ప్రాంతాల్లో అధిక ఉష్ణోగ్రతలతో వడగాడ్పులు వీస్తున్నాయి. ఈ పరిస్థితులు మరో ఐదు రోజుల పాటు ఇలాగే కొనసాగుతాయని వాతావరణ శాఖ శనివారం పేర్కొంది. ఢిల్లీ, హర్యానా, పంజాబ్, రాజస్థాన్, యుపిల్లో గరిష్ట ప్రభావం వుంటుందని తెలిపింది. ఈ ప్రాంతాల ప్రజలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. వృద్ధులు, పిల్లలు అదనపు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపింది. శుక్రవారం ఉత్తర భారతం అధిక ఉష్ణోగ్రతలను చవి చూసింది. పశ్చిమ ఢిల్లీలోని నజఫ్‌ఘర్‌లో 47.4 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. హర్యానాలోని సిర్సాలో 47.1 డిగ్రీలు నమోదైంది. దేశంలో ఇప్పటివరకు ఈ సీజన్‌లో ఇదే అధికం. రాబోయే ఐదు రోజుల్లో మైదాన ప్రాంతాల్లో, వచ్చే మూడు రోజుల్లో తూర్పు, మధ్య ప్రాంతాల్లో వడగాలులు వీస్తాయని భారత వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. తూర్పు రాజస్థాన్, యూపీ, బీహార్‌ల్లో ఆరంజ్ అలర్ట్ జారీ చేశారు. మే 18 నుండి 21వ తేదీ మధ్య కనీసం ఒక రోజైనా దేశంలోని 54.3కోట్లమంది ప్రజలు అత్యధిక ఉష్ణోగ్రతలను అనుభవిస్తారని అమెరికా కేంద్రంగా పనిచేసే క్లైమేట్ సెంట్రల్ వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరించారు. మానవ చర్యల ఫలితంగా తలెత్తే వాతావరణ మార్పులే ఇందుకు ప్రధాన కారణమని క్లైమేట్ సెంట్రల్‌కి చెందిన ఆంరదూ పెర్షింగ్ వ్యాఖ్యానించారు. 1998-2017 మధ్య వడగాడ్పుల ఫలితంగా 1,66,000మందికి పైగా చనిపోయారని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. అధిక ఉష్ణోగ్రతల వల్ల కూడా ఆర్థిక వ్యవస్థలు ప్రభావితమవుతాయి. వేడిమి, ఉక్కపోతతో కూడిన వాతావరణంలో ప్రజలు ఎక్కువగా పనిచేయలేరు, పిల్లలు నేర్చుకోవడం కూడా ఇబ్బందుల్లో పడుతుంది. సాధారణంగా మైదాన ప్రాంతాల్లో 40, తీర ప్రాంతాల్లో 37, కొండ ప్రాంతాల్లో 30 డిగ్రీల ఉష్ణోగ్రత దాటితే అక్కడ అధికంగా నమోదైనట్లే భావిస్తారు. సాధారణ ఉష్ణోగ్రతల కన్నా 6.4డిగ్రీలు ఎక్కువైతే దాన్ని తీవ్ర వడగాడ్పుగా ప్రకటిస్తారు. అనేక ప్రాంతాల్లో ఏప్రిల్‌లోనే తీవ్రమైన ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

క్యాపిటల్ గూడ్స్ సూచీలు సానుకూలం

- ప్రభుదాస్ లిల్లాధర్ అంచనా

ముంబయి : ఎన్నికల ఫలితాలు ఎలా ఉన్నా కాపిటల్ గూడ్స్, ఎఫ్ఎంసిజి, ఆటో, హెల్త్‌కేర్, ప్రయివేటు బ్యాంక్‌ల సూచీలు మంచి పనితీరును కనబరిచే అవకాశాలున్నాయనిఆర్థిక సేవల సంస్థ ప్రభుదాస్ లిల్లాధర్ పేర్కొంది. ఏ ప్రభుత్వమైనా క్యాపిటల్ గూడ్స్ సానుకూలంగా ట్రేడింగ్ కావొచ్చన్నారు. ఎన్‌డిఎ తిరిగి అధికారంలోకి వస్తే ప్రస్తుత విధానాల కొనసాగింపుతో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, డిఫెన్స్, క్యాపిటల్ గూడ్స్, న్యూ ఎనర్జీ, టూరిజంకు సంబంధించిన సూచీలు పెరిగే అవకాశం ఉందన్నారు.

ఎఐలో హైదరాబాద్‌ను టాప్‌లో నిలుపుతాం

- టిఎఫ్ఎంసి మీటింగ్‌లో మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్ : ఐటి రంగంలో తెలంగాణ రెండో స్థానంలో ఉందని.. తాము దానిని నంబర్ స్థానంలోకి చూడాలనుకుంటున్నామని ఐటి శాఖ మంత్రి డి శ్రీధర్ బాబు అన్నారు. హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ ఫెసిలిటీ మేనేజర్స్ కౌన్సిల్ (టిఎఫ్ఎంసి) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటీ మేనేజర్ల సమ్మిట్‌కు మంత్రి హాజరై మాట్లాడారు. తెలంగాణకు మళ్లీ అత్యుత్తమ మేధావులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. హైదరాబాద్‌ను భారత ఎఐ రాజధానిగా ఉంచాలని తాము కోరుకుంటున్నామన్నారు. ఎఐ సిటీగా చూడాలన్నది తమ కోరికని.. ఇందుకోసం ప్రత్యేక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సిటీని ఏర్పాటు చేయాలని యోచిస్తున్నామన్నారు. ఎఐ రాజధానిగా మార్చడానికి ఇప్పటికే 200 ఎకరాల భూమిని కేటాయించామన్నారు.

టూరిస్ట్ బస్సులో మంటలు

- 9మంది మృతి, 14మందికి గాయాలు



గురుగ్రామ్ : హర్యానాలోని నుహ్ జిల్లాలో కుండ్లి-మనేసర్-పాల్వాల్ ఎక్స్‌ప్రెస్‌వేలో టూరిస్ట్ బస్సుకు మంటలు అంటుకోవడంతో అందులో ప్రయాణిస్తున్న వారిలో పదేళ్ల బాలికతో సహా 9మంది మరణించగా, 14మందికి తీవ్రంగా కాలిన గాయాలయ్యాయి. శనివారం తెల్లవారు జామున 2గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. ఆ సమయంలో బస్సులో 60మంది ప్రయాణికులు వున్నారు. యుపిలోని మథుర నుండి పంజాబ్‌లోని హోషియార్‌పూర్‌కు బస్సు వెళుతోంది. గాయపడినవారిని వెంటనే నల్హార్ మెడికల్ కాలేజీలో చేర్చగా వారందరూ ప్రమాదం నుండి బయటపడ్డారని పోలీసులు చెప్పారు. మంటలు చెలరేగిన తర్వాత బస్సుతలుపులు తెరుచుకోలేదని, దాంతో కిటికీల్లో నుండి దూకాల్సి వచ్చిందని గాయపడిన వారిలో ఒకరు మీడియాకు తెలిపారు. బస్సు అంతా పొగతో నిండిపోయిందని, ప్రతి ఒక్కరూ ప్రాణభయంతో పరుగులు తీయడం కనిపించిందని చెప్పారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వామ్మో..ఎన్ని కట్టలో...



ఆగ్రాలోని షూ వ్యాపారుల ప్రాంగణంలో ఈడీ సోదాల్లో పట్టుబడిన నగదు..

నిన్న అసోం..ఇపుడు రాజస్థాన్

- బీజేపీ పాలకులపై స్వపక్షీయులే ఆరోపణలు
- ప్రభుత్వ ప్రాజెక్టుతో రూ.1146 కోట్ల నష్టం
- రాజస్థాన్ సీఎంకి మంత్రి కిరోడి లాల్ మీన లేఖ

జైపూర్ : నిన్న అసోంలో బీజేపీలో మంత్రి, ఎమ్మెల్యే మధ్య మాటల యుద్ధం కాస్త సోషల్ మీడియాకెక్కితే..తాజాగా రాజస్థాన్ సర్కారు చేపడుతున్న ప్రాజెక్టు విషయంలో ఆ రాష్ట్ర మంత్రి ఆందోళన లేవనెత్తారు. ఈ ప్రాజెక్టుతో ప్రభుత్వ ఖజానాకు వెయ్యి కోట్ల రూపాయలకు పైగా నష్టం వచ్చే ప్రమాదమున్నదని హెచ్చరించారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి భజన్ లాల్ శర్మకు వ్యవసాయ శాఖ మంత్రి కిరోడి లాల్ మీన లేఖ రాశారు. గాంధీనగర్‌లోని బహుళ అంతస్తుల గృహనిర్మాణ ప్రాజెక్టు వల్ల ప్రభుత్వ ఖజానాకు రూ.1,146 కోట్ల నష్టం వాటిల్లుతుందని మంత్రి తన లేఖలో పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్‌లో పాత ఎంఆర్‌ఈసీ క్యాంపస్‌ని పునరాభివృద్ధి చేస్తారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో పలువురు సీనియర్ ప్రభుత్వ అధికారులు నివసిస్తున్నారు.వార్త కథనాల ప్రకారం.. ముఖ్యమంత్రి ఆధ్వర్యంలోని జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్.. ఈ ప్రదేశంలో ఆరు బహుళ అంతస్తుల భవనాలను నిర్మించటానికి ఒక ప్రణాళికను మంజూరు చేసింది. నాలుగు భవనాలు ప్రభుత్వ గృహాల కోసం ఉపయోగించబడతాయి. రెండు ప్రభుత్వ-ప్రయివేట్ భాగస్వామ్యంలో భాగంగా ప్రయివేట్ ప్లేయర్‌లకు విక్రయించబడతాయి. క్యాబినెట్ ఆమోదం లేకుండానే సాధారణ పరిపాలన శాఖ ప్రణాళికతో ముందుకు సాగుతోందని మే 14న ముఖ్యమంత్రికి రాసిన లేఖలో మీనా ఆరోపించారు. క్యాంపస్‌లోని ప్రభుత్వ ఇండ్ల తొలగింపునకు ఇప్పటికే నోటీసులు జారీ చేశామన్నారు. "మాస్టర్ ప్లాన్ ప్రకారం, ఇక్కడ 18-19 అంతస్తుల భవనాలు ఏవీ లేవు. నిబంధనల ప్రకారం ఇక్కడ వాణిజ్యపరమైన ఉపయోగానికి కూడా అనుమతించబడదు. అయితే, ఈ ప్రాజెక్ట్ జరగడానికి అక్రమ మార్గాలను ఉపయోగించారు. పాత ఎంఆర్‌ఈసీ క్యాంపస్‌లో ఐదేండ్ల క్రితం విలువ రూ.277 కోట్లు కాగా, కొత్త అంచనా ప్రకారం రూ.218 కోట్లుగా నిర్ణయించారు" అని మంత్రి.. సీఎం దృష్టికి దృష్టికి తెచ్చారు. రిజర్వ్ ధర(ఆర్థిక సంస్థ నిర్ణయించిన కనీస ధర) ప్రస్తుత ధర రూ. 25,000కి.. చదరపు అడుగుకి రూ. 8,000 తక్కువగా అంచనా వేయబడిందని మంత్రి వివరించారు. దీనితో చదరపు అడుగుకు దాదాపు రూ.17,000 నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. దాదాపు 33 శాతం ఫ్లాట్లను ప్రయివేట్‌కు విక్రయించాలని ప్రభుత్వం భావిస్తున్నందున.. నష్టాలు రూ.1,146 కోట్లకు చేరుకుంటాయని మంత్రి తన లేఖలో వివరించారు.

ఎంసెట్ ఫలితాల్లో స్ఫూర్తికి 369 వ ర్యాంక్

- బీసీ గురుకుల విద్యార్థుల విజయఢంకా

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎంసెట్ 2024 ఫలితాల్లో మహాత్మా జ్యోతి బా ఫూలే బీసీ గురుకుల విద్యార్థులు అత్యధిక ర్యాంకులు సాధించి విజయఢంకా మోగించారు. అగ్రికల్చర్ విభాగంలో స్ఫూర్తి అనే విద్యార్థిని 369వ ర్యాంక్ సాధించింది. ఇంజనీరింగ్, మెడికల్, అగ్రికల్చర్ కోర్సుల ప్రవేశానికి నిర్వహించే ఎంసెట్ పరీక్షలో అగ్రికల్చర్ విభాగంలో అత్యధిక మంది విద్యార్థులు ర్యాంక్‌లు సాధించారు. అగ్రికల్చర్ విభాగంలో మొత్తం 145 మంది బాలికలు పరీక్ష రాయగా వారిలో 114 మంది అర్హత సాధించారు. స్ఫూర్తి 369 ర్యాంక్ సాధించి బీసీ గురుకుల బాలికల ప్రతిభను నిరూపించింది. 12 మంది ఐదువేల లోపు ర్యాంకులను, 29 మంది బాలికలు పదివేల లోపు ర్యాంక్‌లు సాధించారు. అగ్రికల్చర్ విభాగంలో 25 మంది బాలురు పరీక్ష రాయగా వారిలో నలుగురు బాలురు మంచి ర్యాంక్‌లను సాధించారు. ఇంజనీరింగ్ విభాగంలో 276 మంది బాలికలు పరీక్ష రాయగా వారిలో ఇద్దరు పదివేల లోపు ర్యాంక్ సాధించారు.191 మంది అర్హత సాధించారు. 135 మంది బాలురు పరీక్ష రాయగా వారిలో ఐదుగురు పదివేల లోపు ర్యాంక్‌లు సాధించారు. 107 మంది క్వాలిఫై అయ్యారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి విద్యార్థులు మరిన్ని ర్యాంక్ లు సాధించేలా ఉన్నత నాణ్యతా ప్రమాణాలతో విద్యను అందించాలనీ, విద్యార్థులు మరింత కష్టపడి మంచి ర్యాంక్‌లు సాధించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు. బీసీ విద్యార్థులకు ఉన్నత విద్యను అందించే లక్ష్యంతో గురుకులాలు పనిచేస్తున్నాయని ఆ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం తెలిపారు. 369ర్యాంక్‌లు సాధించిన స్ఫూర్తిని, ఇతర విద్యార్థులను, బోధనా సిబ్బందిని మహాత్మా జ్యోతి బా ఫూలే బీసీ గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి బడుగు సైదులు ఈ సందర్భంగా అభినందించారు.

పశ్చిమ బెంగాల్ రాజ్‌భవన్‌లో ముగ్గురు ఉద్యోగులపై ఎఫ్ఐఆర్

పశ్చిమ బెంగాల్: పశ్చిమ బెంగాల్ గవర్నర్ సివి ఆనంద్ బోస్‌పై లైంగిక వేధింపుల ఫిర్యాదు ఇచ్చేందుకు ప్రయత్నించిన మహిళా ఉద్యోగిని అడ్డుకున్న కేసులో రాజ్‌భవన్‌కు చెందిన ముగ్గురు ఉద్యోగులపై శనివారం కోల్‌కతా పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... ఈ నెల 2న రాజ్‌భవన్‌లో కాంట్రాక్టు ఉద్యోగం చేస్తున్న మహిళ ఫిర్యాదు ఇచ్చేందుకు ప్రయత్నించింది. ఆమెను ఒఎస్‌డి ఎస్ఎస్ రాజ్‌పుత్, ప్యూన్ సంత్ లాల్, కుసుమ్ ఛత్రీ అడ్డుకున్నారు. నిందితులపై ఐపిసి సెక్షన్ 341, 166 కింద కేసు నమోదు చేశారు. సెక్షన్ 164 కింద మేజిస్ట్రేట్ ముందు బాధితురాలి వాంగ్మూలాన్ని రికార్డు చేశారు.

భారత్ కంటే శక్తివంతమైన ప్రజాస్వామ్య దేశం లేదు

- పొగడ్తల్లో ముంచిన అమెరికా

వాషింగ్టన్ : భారత్ కంటే శక్తివంతమైన ప్రజాస్వామ్య దేశాలు ప్రపంచంలో లేవని వైట్‌హౌస్ శుక్రవారం వ్యాఖ్యానించింది. ఓటు హక్కు వినియోగించుకున్న భారతీయులను అభినందించింది. భవిష్యత్తులో ఏర్పడే ప్రభుత్వంలో ప్రజల వాణిని వినిపించేలా వారు ఓటు హక్కును వినియోగించుకున్నారని వైట్‌హౌస్ జాతీయ భద్రతా కమ్యూనికేషన్స్ సలహాదారు జాన్ కిర్బీ పత్రికా సమావేశంలో విలేకర్లతో మాట్లాడుతూ వ్యాఖ్యానించారు. భారత్‌లో ప్రస్తుతం సాగుతున్న ఎన్నికల ప్రక్రియపై అడిగిన ప్రశ్నకు ఆయన పైరీతిన స్పందించారు. ప్రధాని మోడీ హయాంలో ముఖ్యంగా గత మూడు సంవత్సరాల బైడెన్ ప్రభుత్వ కాలంలో భారత్, అమెరికా మధ్య సంబంధాలు మరింత బలోపేతమయ్యాయని పేర్కొన్నారు. భారత్‌తో తమ సంబంధాలు రాన్రాను మరింత పటిష్టపడుతున్నాయని చెప్పారు. "మోడీ గత అధికార పర్యటనలో చూసినట్లైతే, అనేక రకాల చొరవలను మేం ప్రారంభించాం. కొత్తగా ఆవిర్భవిస్తున్న సాంకేతికతలను ఒక్క తాటిపైకి తీసుకురావడంపై పనిచేస్తున్నాం, ఇండో-పసిఫిక్, క్వాడ్‌లను మరింత విస్తరిస్తూ, వాటిని ప్రస్తుత పరిస్థితులు, అవసరాలకు తగినట్లుగా బలోపేతం చేస్తున్నాం." అని చెప్పారు. అలాగే ప్రజల మధ్య, సైన్యాల మధ్య సంబంధాలు పెంపొందేలా చేస్తున్నామని, ఈ మొత్తం ప్రక్రియలో భారత్ భాగస్వామి అని కిర్బీ పేర్కొన్నారు. 'ఈ భాగస్వామ్యం చాలా శక్తివంతమైనది, చురుకైనది. ఇందుకు ప్రధాని మోడీ నాయకత్వానికి కృతజ్ఞతలు చెప్పాలి." అని పేర్కొన్నారు.

క్వాడ్ కూటమి స్థానే స్క్వాడ్

- పేరులోనే మార్పు లక్ష్యం అదే
- చైనాకు వ్యతిరేకంగా అమెరికా సరికొత్త తంత్రం

వాషింగ్టన్: చైనాకు వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన సైనిక సహకార కూటమి క్వాడ్ పేరును స్క్వాడ్‌గా అమెరికా మార్పు చేసి తిరిగి ప్రారంభించింది. అయితే, చైనాను కట్టడి చేయాలన్న దాని లక్ష్యంలో ఎలాంటి మార్పు లేదు. ఆస్ట్రేలియా, జపాన్, ఫిలిప్పీన్స్, అమెరికా ఈ నాలుగు దేశాలు కొత్త కూటమి స్క్వాడ్‌లో భాగస్వాములుగా ఉన్నాయి. ఇవి గత నెల ప్రారంభంలో దక్షిణ చైనా సముద్రంలో సంయుక్త నావికా విన్యాసాలు నిర్వహించాయి. ఆస్ట్రేలియాకు చెందిన వారముంగా, జపాన్‌కు చెందిన అకెబోనో, ఫిలిప్పీన్స్‌కు చెందిన ఆంటోనియో లూనా, అమెరికాకు చెందిన మొబైల్ కంపెనీల నౌకలు కలసికట్టుగా పని చేస్తూ ఈ సముద్ర జలాల్లో తమ ఉమ్మడి నావికా సామర్థ్యాన్ని బలోపేతం చేసుకోవాలని నిర్ణయించినట్లు ఉమ్మడి ప్రకటనలో పేర్కొన్నాయి. దక్షిణ చైనా సముద్ర దీవుల్లో స్వేచ్ఛగా తిరుగాడే హక్కును అంతర్జాతీయ చట్టం తమకు కల్పించిందని స్క్వాడ్ కూటమి పేర్కొంది. కొన్ని వారాల తరువాత అంటే ఏప్రిల్ 22, మే 8 మధ్య బాలికాటన్-2024 పేరుతో ఫిలిప్పీన్స్, అమెరికా, ఆస్ట్రేలియా నుండి వచ్చిన ఓడలు ఫ్రెంచ్ నావికాదళాలతో కలసి విన్యాసాలు నిర్వహించాయి. వీటిలో 16వేల మందికిపైగా సైనికులు ఫిలిప్పీన్స్ ప్రాదేశిక జలాల వెలుప ఉన్న దక్షిణ చైనా సముద్ర ప్రాంతంలో పాల్గొన్నారు. ఈ దేశాల నౌకాదళాలతోబాటు ఫిలిప్పీన్స్ కోస్ట్ గార్డ్ కూడా పాల్గొంది.

చట్ట ప్రకారం చర్యలు తీసుకోండి

- మనవడు ప్రజ్వల్‌పై మాజీ పధాని దేవెగౌడ

బెంగళూరు : మాజీ ప్రధాని దేవెగౌడ తన మనవడు ప్రజ్వల్ రేవణ్ణ కేసుకు సంబంధించి తొలిసారి స్పందించారు. శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. 'ప్రజ్వల్ రేవణ్ణపై నేరం రుజువైతే అతనిపై చట్టపరంగా చర్యలు తీసుకోండి. దేశంలో చట్టప్రకారం న్యాయం జరగాలి. ప్రజ్వల్ రేవణ్ణపై ప్రభుత్వం న్యాయపరమైన మార్గాలను అనుసరించాలి. ఈ కేసులో ప్రమేయం ఉన్న వారికి న్యాయం జరిగేలా సమగ్ర దర్యాప్తు జరగాలి. చట్టపరమైన విధానాలకు కట్టుబడి ఉండాలి. నా కుమారుడు హెచ్‌డి రేవణ్ణపై లైంగిక దాడి, కిడ్నాప్ కేసులు కావాలని బనాయించినవే. ఈ కేసులో చాలామంది ప్రమేయం ఉంది. బాధిత మహిళలందరికీ న్యాయం జరుగుతుంది. హెచ్‌డి రేవణ్ణకు సంబంధించిన కేసు కోర్టులో ఉంది. అందుకే దీనిపై నేను ఎక్కువగా మాట్లాడదల్చుకోలేదు.' అని అన్నారు. హసన్ ఎంపి ప్రజ్వల్ రేవణ్ణ లైంగిక దాడికి పాల్పడిన వీడియాలు సోషల్ మీడియాలో వైరల్ అయిన సంగతి తెలిసిందే.

కేయూ వీసీ ప్రొ.రమేష్‌పై విజిలెన్స్ విచారణకు ఆదేశం

- అకుట్ ఫిర్యాదుపై స్పందించిన ప్రభుత్వం

నవతెలంగాణ-వరంగల్

కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ తాటికొండ రమేష్‌పై విజిలెన్స్ విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. మూడేండ్లలో రమేష్ అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యునివర్సిటీ టీచర్ల సంఘం జనవరి 14, జనవరి 24న ముఖ్యమంత్రికి, విద్యాశాఖ కార్యదర్శికి ఫిర్యాదు చేసింది. దీనిపై స్పందించిన ప్రభుత్వం.. ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం విజిలెన్స్ విచారణ కోసం శనివారం ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జనరల్ సెక్రటరీ డాక్టర్ మామిడాల ఇస్తారి మాట్లాడుతూ.. మూడేండ్లలో వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్ టీచర్లు, విద్యార్థులపై వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ అనేక అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. అనేకసార్లు గతంలో కేయూ పాలక మండలికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, చివరకు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆశ్రయించాల్సి వచ్చిందని అన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులను ధిక్కరిస్తూ యూనివర్సిటీ చట్టానికి వ్యతిరేకంగా, యూజీసీ నిబంధనలను తుంగలో తొక్కి.. 16 మంది రిటైర్డ్ ఫ్యాకల్టీని అడ్జంట్ ఫ్యాకల్టీగా నియమించి నెలకు రూ.8 లక్షలు ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టారని తెలిపారు. కేయూ ఏఆర్‌గా పనిచేస్తూ అక్రమంగా కేయూ సర్వే నెంబర్ 229ను 235గా మార్చుకొని ఇండ్లు కట్టుకున్న పెండ్లి అశోక్ బాబును ల్యాండ్ కమిటీ తొలగించినా ఇప్పటి వరకు చర్యలు తీసుకోకపోవడంతో ఫిర్యాదు చేయాల్సి వచ్చిందని చెప్పారు. ఉద్యోగ విరమణకు ఒక రోజు ముందు అర్ధరాత్రి దొంగ చాటుగా వీసీ రమేష్, అప్పటి రిజిస్ట్రార్ శ్రీనివాస్ అక్రమంగా సీనియర్ ప్రొఫెసర్‌గా ప్రమోషన్లు తీసుకున్నారని, వారి ప్రమోషన్ కొరకు వారే నోటిఫికేషన్ ఇచ్చుకున్నారని విమర్శించారు.

మోడీ నిజస్వరూపం బయటపడింది : టీపీసీసీ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మహిళలను వ్యతిరేకించే బీజేపీ నిజస్వరూపం మోడీ వ్యాఖ్యలతో మరో సారి బయటపడిందని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు జి నిరంజన్ విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలే కర్లతో మాట్లాడారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంతో మెట్రో నష్టపో తుందంటూ మోడీ అనడం మహిళలను అగౌరవ పరచడమేనన్నారు. తెలంగాణలో మహిళలు సంతోషపడుతుంటే మోడీకి కంటగింపుగా ఉందని ఎద్దేవా చేశారు. కార్పొరేట్ సంస్థల రుణాలు మాఫీ చేసినప్పుడు ఎందుకు ఈ విధంగా ఆలోచించలేదని ప్రధానిని ఆయన ప్రశ్నించారు.

న్యాయవాదులందరికీ గ్రూప్ ఇన్సూరెన్స్ పాలసీని వర్తింపజేయాలి

- ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఈ నెల చివరి నాటికి కాలపరిమితి తీరబోతున్న అడ్వకేట్స్ గ్రూప్ ఇన్సూరెన్స్ పాలసీని 2019 సంవత్సరం తర్వాత వృత్తిలోకొచ్చిన యువ న్యాయవాదులకు కూడా వర్తింప చేసి హెల్త్ కార్డులు జారీ చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఏఐఎల్‌యు) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్ ప్రతినిధులు శనివారం న్యాయ శాఖ కార్యదర్శి ఆర్.తిరుపతి ని రాష్ట్ర సచివాలయంలోని ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. 2024-2025 సంవత్సరానికి కొత్త గ్రూప్ ఇన్సూరెన్స్ పాలసీకి న్యాయవాదుల జాబితాను సరిచేయాలనీ, చనిపోయిన వారి పేర్లను తొలగించాలనీ, ప్రస్తుత జాబితాలో లేని యువ న్యాయవాదుల పేర్లు చేర్చాలని ఈ సందర్భంగా వారు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ బార్ కౌన్సిల్ నుంచి మొత్తం సమాచారాన్ని తెప్పించుకుని, బార్ అసోసియేషన్ల సమన్వయంతో జాబితా తయారు చేయాలని కోరారు. వయో పరిమితి విధించకుండా న్యాయవాదులందరికీ బీమా సౌకర్యం వర్తింప చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్ర న్యాయవాదుల సంక్షేమ ట్రస్ట్ నుంచి న్యాయవాదులకు, వారి కుటుంబ సభ్యులకు, వైద్య ఖర్చుల నిమిత్తం జారీ చేస్తున్న గ్రూప్ ఇన్సూరెన్స్ పాలసీని రూ. రెండు లక్షల నుంచి రూ. ఐదు లక్షలకు పెంచాలని కోరారు. వివిధ ప్రాంతాల న్యాయవాదులు తక్షణ నగదు రహిత చికిత్సను పొందేందుకు సహాయపడే నెట్‌వర్క్ ఆస్పత్రుల జాబితాలో అన్ని జిల్లా హెడ్ క్వార్టర్లలో ఉన్న మరికొన్ని ఆస్పత్రులను జోడించాలని విజ్ఞప్తి చేశారు. న్యాయవాదుల తల్లిదండ్రులకు కూడా బీమా కవరేజీని విస్తరింప చేయాలని కోరారు. ప్రసూతి ఖర్చులు కూడా పాలసీలో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. ప్రతినిధి బందంలో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఏఐఎల్‌యు) రాష్ట్ర గౌరవాధ్యక్షులు జి.విద్యాసాగర్, అధ్యక్షులు కొల్లి సత్యనారాయణ, కోశాధికారి ఇ. వేణుగోపాల్, ఉపాధ్యక్షురాలు చందాల శైలజ, రాష్ట్ర కమిటీ సభ్యులు ఏడునూతల శ్రీనివాసరావు, మీసాల వెంకటేశ్వర్లు, రమేష్ కుమార్ మక్కడ్, పి. కిషన్ రావు, ఎం. శంకరయ్య వై.మంజులత ఉన్నారు.

జూన్ రెండో వారంలో ధరణి స్పెషల్ డ్రైవ్

- మొక్కుబడిగా కమిటీ సమావేశం
- మొత్తం దరఖాస్తులు 2.45 లక్షలు : రెండు విడతల్లో లక్షా 20 వేల ఫైళ్ల పరిశీలన
- పోర్టల్‌లో ఇంకా నమోదు కాని సవరణలు
- క్షేత్ర స్థాయిలోఎక్కడి సమస్యలు అక్కడే

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎన్నికల కోడ్ వల్ల ఆగిపోయిన ధరణి రెండో విడత స్పెషల్ డ్రైవ్‌ను జూన్ రెండో వారంలో నిర్వహించాలని ధరణి కమిటీ నిర్ణయించింది. శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో జరిగిన కమిటీ సమావేశంలో పలు అంశాలపై చర్చించినప్పటికీ విధాన పరంగా ఎలాంటి కీలక నిర్ణయం తీసుకోలేదని తెలిసింది. ఎన్నికల కోడ్ అడ్డు రావడంతో తూతూ మంత్రంగా సమావేశం జరిపారు. గత సమావేశాల మాదిరిగానే మొక్కుబడిగా అది సాగింది.

రెవెన్యూ అధికారుల లెక్కల ప్రకారం ధరణి పోర్టల్‌లో 1 నుంచి 33 వరకున్న టెక్నికల్ మాడ్యూల్స్‌లో 2.45 లక్షల దరఖాస్తులు పేరుకుపోయాయి. కొత్తగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి సమస్యల పరిష్కారం కోసం సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ నేతృత్వంతో కమిటీని నియమించింది. అదే సందర్భంలో చిన్న చిన్న సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్, సీసీఎల్ఏ వద్ద ఉన్న ధరణి అధికారాలను తహశీల్దార్లు, ఆర్డీవోలు, అదనపు కలెక్టర్లకు బదలాయిస్తూ ఏప్రిల్ 1 నుంచి 9 వరకు మొదటి విడత, అనంతరం 11 నుంచి 30 వరకు రెండో విడత స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. ఎన్నికల షెడ్యూల్ రావడంతో రెండవ విడత స్పెషల్ డ్రైవ్ నిలిచి పోయింది. శనివారం జరిగిన సమావేశంలో నిలిచిన ఆ స్పెషల్ డ్రైవ్‌ను తిరిగి చేపట్టాలని నిర్ణయిం చారు. ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత రెండో వారంలో ప్రారంభించాలని సూచన ప్రాయంగా నిర్ణయించినట్టు సమాచారం.

అప్‌డేట్ కాని సవరణలు

రెండు సార్లు జరిగిన స్పెషల్ డ్రైవ్‌లో ఆధార్‌లో తప్పులు, ఆధార్ లేకపోవడం, పాస్‌బుక్‌లో పేర్ల సవరణ మొదలగు చిన్న చిన్న సమస్యలకు సంబంధించి 1.20 లక్షలకుపైగా సమస్యలను పరిష్కరించి నట్టు సర్కార్ ప్రకటించింది. అయితే ఇప్పటి వరకు వాటికి సంబంధించి ఎలాంటి సవరణలు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదు. పోర్టల్‌లోని 33 మాడ్యూల్స్‌కు సంబంధించిన సమస్యల పరిష్కారానికి సంబంధించి లాగిన్‌లు సీసీఎల్ వద్ద మాత్రమే ఉన్నాయి. సమస్యలను పరిష్కరించిన తర్వాత సంబంధిత వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేసే అధీకృత లాగిన్లు ఎంఆర్వో, ఆర్డీవో, అదనపు కలెక్టర్ల వద్ద లేవు. దాంతో ఇప్పటి వరకు ఒక్క దరఖాస్తును కూడా పోర్టల్‌లో అప్‌డేట్ చేయలేదు. ఈ నేపథ్యంలో కాగితాల్లోనే సమస్యలు పరిష్కరించినట్టుగా చూపెడుతున్నారే తప్ప క్షేత్ర స్థాయిలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

'ఎరుపు' పాలనలో 'హవేలీ' ఆదర్శం

- నేడు సత్తెనపల్లి రామకృష్ణ భవన్ ప్రారంభోత్సవం
- ప్రారంభకులు కేరళ ఆరోగ్యశాఖ మాజీ మంత్రి కెకె శైలజా టీచర్ : పాల్గొననున్న సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం
- రెడ్ షర్ట్ వాలంటీర్లతో కవాతు - ప్రదర్శన- బహిరంగ సభ
- ఖమ్మం హవేలీ అభివృద్ధిలో సీపీఐ(ఎం) కీలకపాత్ర



నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ఖమ్మం ఖానాపురం హవేలీ ప్రాంతం అభివృద్ధిలో సీపీఐ(ఎం) కీలక భూమిక పోషించింది. ఖమ్మం కార్పొరేషన్‌లో విలీనానికి ముందు దాదాపు 40 ఏండ్లపాటు హవేలీ సర్పంచ్, ఎంపీటీసి పాలనా బాధ్యతలను నిర్వహించిన సీపీఐ(ఎం) హయాంలో ఆ ప్రాంతం ప్రగతి పథంలో ముందుకు నడిచింది. ఆ ప్రాంతానికి చెందిన విద్యుత్ పోరాట యోధుడు సత్తెనపల్లి రామకృష్ణ పేరుతో స్థానిక ఇందిరానగర్ సెంటర్లో నిర్మించిన సీపీఐ(ఎం) ఖానాపురం హవేలీ కమిటీ నూతన కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించనున్నారు. సాయంత్రం 6 గంటలకు ఈ భవనాన్ని కేరళ రాష్ట్ర శాసనసభ్యులు, ఆ రాష్ట్ర ఆరోగ్యశాఖ మాజీ మంత్రి, సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు కేకే శైలజ టీచర్ ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమానికి సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు హాజరవుతున్నారు. ఆఫీస్ పక్కనే ఉన్న వినియోగ దారుల ఫోరం స్థలంలో బహిరంగ సభకు ఏర్పాట్లు చేశారు.

సీపీఐ(ఎం) కృషితో మారిన రూపురేఖలు

సీపీఐ(ఎం) హయాంలో కార్పొరేషన్‌కు దీటుగా ఖానాపురం హవేలీ ప్రాంతం అభివృద్ధి చెందింది. పార్టీ ప్రస్తుత జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బుగ్గవీటి సరళ ఆనాడు సర్పంచ్‌గా ఈ ప్రాంత అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లారు. పార్టీ పోరాటాల ఫలితంగానే ఈ ప్రాంత పేదలకు ఇండ్ల స్థలాలు సమకూరాయి. ఫ్లోరైడ్ రహిత మంచినీటి సరఫరా ప్రారంభమైంది. రస్తోగినగర్, వేణుగోపాల్ నగర్- 1, 2లో పేదలకు ఇండ్ల స్థలాలు పంపిణీ చేశారు. వైఎస్సార్ నగర్‌లో 2000 మందికి స్థలాలు కూడా సీపీఐ(ఎం) చేసిన పోరాట ఫలితంగానే సిద్ధించాయి. హవేలీ ప్రాంతంలో ఇందిరమ్మ ఇండ్ల కాలనీలు కూడా ఏర్పడ్డాయి. ఈ పోరులో భాగంగా 250 మందికిపైగా సీపీఐ(ఎం) కార్యకర్తలు అరెస్టై జైలు పాలయ్యారు. ఖమ్మం నగరానికి తలమానికంగా ఉన్న అపార్ట్‌మెంట్ నిర్మాణాలు, వర్తక వాణిజ్యమాల్స్ కూడా హవేలీ ప్రాంతం నుంచే అభివృద్ధి చెందాయి. సీసీ రోడ్లు, లింకు రోడ్‌లు ఇలా అనేకం హవేలీ ప్రాంతంలో ఏర్పడ్డాయి. సురక్షిత ప్రాంతంగా హవేలీ అభివృద్ధి చెందడంతో గ్రామీణ ప్రాంత పేద, మధ్యతరగతి ప్రజానీకం తరలివచ్చి ఇక్కడ నివాసముంటూ పిల్లలను చదివించుకుంటున్నారు. ఇప్పుడు ఈ ప్రాంతం ఎడ్యుకేషన్ హబ్‌గానూ ఘనతకెక్కింది. ఖమ్మం నగరానికి తలమానికంగా హవేలీ ప్రాంతం అభివృద్ధి చెందిందంటే అది సీపీఐ(ఎం) కృషి ఫలితమేనని స్థానిక ప్రజానీకం చర్చించుకుంటున్నారు.

అకడమిక్ గ్రంథాలయం... వైద్య శిబిరం

సీపీఐ(ఎం) హవేలీ కార్యాలయం కేవలం పార్టీ కార్యకలాపాలకే కాకుండా అకడమిక్ గ్రంథాలయంతో పాటు ప్రతినెలా ఓ వైద్య శిబిరం ఏర్పాటు చేస్తారు. ఇప్పటికే సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో జిల్లాలో ఆరు మెడికల్ క్యాంపులు నడుస్తున్నాయి. ఏడో క్యాంపు హవేలీ కార్యాలయంలో ప్రారంభమవు తుందని పార్టీ హవేలీ కార్యదర్శి దొంగల తిరుపతిరావు వెల్లడించారు. ఈ వైద్య శిబిరంలో భాగంగా దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించిన రూ.3000 విలువచేసే మందులను రూ.100కు అందిస్తారు. సత్తెనపల్లి భవన్ నిర్మాణానికి కృషి చేసిన, సహకరించిన ప్రతి ఒక్కరికీ సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

పంట డబ్బులు వెంటనే చెల్లించాలి

- పోస్టాఫీసు ఎదుట రైతుల నిరసన
- మూడు నెలలైనా ఖాతాలో జమకాకపోవడంతో ఆందోళన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తమ పంట డబ్బులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ రైతులు పోస్టాఫీసు ఎదుట నిరసన తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రధాన పోస్టాఫీసు ఎదుట శనివారం పురుగులమందు డబ్బాలు చేతపట్టుకొని ఆందోళనకు దిగారు. మూడు నెలల కిందట రైతులను నమ్మించి పోస్టల్ ఖాతాలో ఉన్న పత్తి విక్రయించిన డబ్బులను ఆదిలాబాద్ పోస్టాఫీస్ పేమెంట్ బ్యాంక్ మేనేజర్ తన ఖాతాల్లోకి మళ్లించుకొని మాయం చేశారు. ఖాతాల్లో డబ్బులు జమ కాకపోవడంతో అనుమానం వచ్చిన రైతులు పోస్టాఫీస్‌కు వెళ్లి నిలదీయగా.. మేనేజర్ కాజేసిన విషయం బహిర్గతమైంది. ఈ విషయమై కేసు నమోదు చేసిన పోలీసులు సదరు మేనేజర్‌ను అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు.

మూడు నెలలైనా తమ డబ్బులు ఇంకా ఖాతాల్లో జమ కాకపోవడంతో రైతులు ఆందోళన బాటపట్టారు. పురుగులమందు డబ్బాలు తీసుకొని పోస్టాఫీసుకు వచ్చారు. విషయం తెలుసుకున్న పోస్ట్ ఆఫీసు సిబ్బంది జీఎం జనార్ధన్‌తో ఫోన్లో మాట్లాడించారు

ఈ నెలాఖరులోగా లేదా వచ్చే నెలలో డబ్బులు ఖాతాల్లో జమ అవుతాయని ఆయన భరోసా ఇచ్చారు. అది నమ్మని రైతులు నిరసన కొనసాగించారు. పోలీసులు అక్కడికి చేరుకొని రైతులను సముదాయించడంతో ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ.. పత్తి అమ్మిన డబ్బులను పోస్టాఫీసు మేనేజర్ కాజేసి నాలుగు నెలలు గడుస్తోందని, ఇప్పటి వరకు వాటిని రికవరీ చేసి తమకు అందజేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 79 మందిమి మోసపోయామని, త్వరలోనే తమ డబ్బులు ఇప్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆర్‌బీఐ ఎదుట ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.

ఉచిత బస్సు సౌకర్యంపై మోడీ వ్యాఖ్యలు సరికావు

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడం సరైందికాదంటూ ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యలను ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఖండించారు. ఏ ఉద్దేశంలో ప్రధాని ఉచిత బస్సు ప్రయాణాన్ని వ్యతిరేకిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు.

శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికల నియమావళిని గౌరవించాల్సిన ప్రధాని వాటిని యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రామాలయాన్ని బుల్డోజర్‌తో కూల్చేస్తారంటూ ప్రచారం చేయడం దుర్మార్గమన్నారు. ఇది మత విశ్వాసాలను రెచ్చగొట్టడమేనన్నారు. మోడీ తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయోధ్యలో రామ మందిర నిర్మాణానికి న్యాయస్థానం తీర్పే కీలకమని గుర్తు చేశారు. అందులో భాగంగానే గుడి నిర్మాణం జరిగిందని తెలిపారు. లౌకికవాదమంటే అన్ని మతాల భావాలను గౌరవించడమేనని వివరించారు.

లారీల కోసం రైతుల రాస్తారోకో

- లోడింగ్ అన్ లోడింగ్‌లో తీవ్ర జాప్యం జరుగుతోందని ఆవేదన



నవతెలంగాణ- కొల్చారం

లారీల కొరతతో ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్‌లో తీవ్ర జాప్యం జరుగుతున్నదని.. వెంటనే అవసరమైన లారీలను తెప్పించాలని రైతులు డిమాండ్ చేశారు. మెదక్ జిల్లా కొల్చారం మండలంలోని దుంపలకుంట చౌరస్తాలో ఎనగండ్ల గ్రామ రైతులు శనివారం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొన్ని రోజులుగా కోనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని తూకం వేసినా.. సకాలంలో లారీలు రాక, అన్ లోడింగ్ కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. వర్షం పడుతుం డటంతో కొన్నిచోట్ల ధాన్యం మొలక వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు స్పందించి సకాలంలో లారీలను పంపాలని డిమాండ్ చేశారు. రాస్తారోకో విషయం తెలుసుకున్న తహసీల్దార్ గఫ్ఫార్, ఎస్ఐ మహ్మద్ గౌస్, ఆర్ఐ ప్రభాకర్ అక్కడికి వచ్చారు. లారీల సమస్యను సాధ్యమైనంత త్వరలో రైస్ మిల్లర్లతో మాట్లాడి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దాంతో రైతులు ఆందోళన విరమించారు.



ధాన్యం కొనుగోలు సమస్యలు పరిష్కరించండి

- రూ.500 బోనస్ ఇవ్వాలి
- సీఎం రేవంత్‌రెడ్డికి బీజేపీ ఎమ్మెల్యేల వినతి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల సమస్యల్ని తక్షణం పరిష్కరించాలని బీజేపీ నేతలు ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆపార్టీ శాసనసభాపక్షనేత ఏ మహేశ్వర్‌రెడ్డి నేతృత్వంలో ఎమ్మెల్యేలు పైడి రాకేష్‌రెడ్డి, రామారావు పటేల్ ప్రతినిధుల బృందం సచివాలయంలో సీఎంను కలిసి వినతిపత్రం సమర్పించారు. లారీలు, హమాలీలు, గన్నీ బ్యాగుల కొరత, నెల గడుస్తున్నా కాంటా కాకపోవడం, అకాల వర్షాలతో కల్లాల్లోనే తడిసిన ధాన్యం, తూకం వేయకపోవడం, తరుగు పేరుతో కోత వంటి అనేక సమస్యలు రైతులు ఎదుర్కొంటున్నారని వారు సీఎం దృష్టికి తెచ్చారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం క్వింటాలు వరికి రూ.500 బోనస్‌ను ఇవ్వాలని కోరారు. రైతులు, కౌలు రైతులకు ఎకరాకు రూ.15వేలు, రైతు కూలీలకు ఏటా రూ.12వేలు వెంటనే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఆగస్టు 15లోపు రూ.2లక్షల రుణమాఫీ అమలు చేసి, మాట నిలబెట్టుకోవాలని కోరారు.

డీజీపీని కలిసిన రఘునందన్‌రావు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఫోన్ ట్యాపింగ్ కేసులోబీఆర్ఎస్ ఎమ్మెల్సీ వెంకట్ రామిరెడ్డిని ఇప్పటి వరకు పోలీసులు ఎందుకు అరెస్ట్ చేయలేదని బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందనరావు ప్రశ్నించారు. ఈ మేరకు శనివారం డీజీపీ రవిగుప్తాను కలిసి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. డబ్బుల రవాణ కోసం ఎస్పై సారా సాయి కిరణ్‌ను వెంకట్ రామిరెడ్డి నియమించినట్టు 2024 మార్చి 29న రాధాకిషన్ రావు విచారణలో చెప్పారనీ, ఆయన ఆదేశాల మేరకు డబ్బు తరలించినట్టు ఎస్పై సాయి కిరణ్ చెప్పారని తెలిపారు. ఆధారాలు ఉన్నా వెంకటరామిరెడ్డి అరెస్టును జాప్యం చేయడంలో ఉద్దేశ్యం ఏమిటని ఆయన తన వినతిపత్రంలో డీజీపీని ప్రశ్నించారు. దీనికి సంబంధించిన ఆధారాలన్నీ డీజీపీకి ఇచ్చానని తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి వెంకట్ రామిరెడ్డి వియ్యంకుడు అయినందునే అరెస్ట్ చేయట్లేదా అని అడిగారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. ఆయనపై తక్షణం చర్యలు తీసుకోకుంటే న్యాయపోరాటం చేస్తానన్నారు. తన ఫిర్యాదుపై డీజీపీ సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు.

రసాయనాలతో మాగపెట్టిన మామిడి పండ్ల లారీల పట్టివేత



నవతెలంగాణ-తలమడుగు

కృత్రిమంగా.. రసాయనాలతో మాగపెట్టిన మామిడి పండ్ల లారీలను రాష్ట్ర వినియోగదారుల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామగిరి హరిబాబు ఆధ్వర్యంలో పట్టుకున్నారు. హైదరాబాద్ నుంచి మహారాష్ట్ర వైపు వెళ్తున్న ఆరు లారీలను శనివారం ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని ఎన్‌హెచ్ 44 జాతీయ రహదారిపై దేవాపూర్ చెక్‌పోస్ట్ వద్ద అడ్డుకున్నారు. మామిడి కాయలను పండ్లుగా మార్చడం కోసం రసాయనాలు వినియోగించడం వల్ల అనేక రకాల అనారోగ్య సమస్యలు వస్తాయని వారు తెలిపారు. ముఖ్యంగా క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందన్నారు. మామిడి పండ్లను రవాణా చేస్తున్న లారీలను ఆపి సోదాలు జరిపి వివరాలు సేకరించి పట్టుకున్నట్టు తెలిపారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణ జాతీయ సంఘం నుంచి ఆదేశాల మేరకు వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శివ, జిల్లా అధ్యక్షులు దోమటి కిరణ్ కుమార్, జిల్లా కార్యదర్శి షేక్ ఇర్ఫాన్, ఫుడ్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ మహమ్మద్ షకీల్ పాల్గొన్నారు.

గుజ్జ ప్రేమేందర్ రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించాలి

- కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి



నవతెలంగాణ - భువనగిరి

పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటును ఉమ్మడి నల్లగొండ- వరంగల్ - మెదక్ జిల్లాల బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జ ప్రేమేందర్‌రెడ్డికి వేసి గెలిపించాలని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని స్థానిక వివేరా హోటల్‌లో ఎమ్మెల్సీ ఉపఎన్నిక సన్నాహక సమావేశం బీజేపీ జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండుటెండలను సైతం లెక్కచేయకుండా కార్యకర్తలు సమిష్టి కృషితో భువనగిరి పార్లమెంటు అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ గెలుపునకు బాటలు వేశారని ప్రశంసించారు. అదే స్ఫూర్తితో రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో ప్రతి కార్యకర్తా అభ్యర్థిగా భావించి ఓటర్లను కలిసి వారి మొదటి ప్రాధాన్యత ఓటును గుజ్జ ప్రేమెందర్‌రెడ్డికి వేసేలా చైతన్యవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జ ప్రేమేందర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సంకినేని వెంకటేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్సీలు రామచందర్‌రావు, జనార్ధన్‌రెడ్డి, భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్య గౌడ్, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు వెంకటేష్ నేత, గంగిడి మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిఎఎ కింద పౌరసత్వం కోసం పాక్ హిందువుల ప్రయత్నాలు

- ఇంటర్వ్యూల కోసం ఎదురుచూపులు



న్యూఢిల్లీ : పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ) కింద పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకున్న పాకిస్తానీ హిందువులు శనివారం సెంట్రల్ ఢిల్లీలోని ఇంద్రప్రస్థ పోస్టాఫీస్‌లో తమ వంతు ఇంటర్వ్యూ కోసం వేచి చూస్తున్నారు. రైల్వే, పోస్టల్ శాఖ అధికారులతో కూడిన కమిటీ ముందు వారు హాజరు కావాల్సి వుంటుంది. 2014 జూన్‌లో భార్యాపిల్లలతో పర్యాటక వీసాపై భారత్‌కు వచ్చిన కన్వర్‌లాల్ సిఎఎ కింద దరఖాస్తు చేసుకోవడంతో శనివారం ఇంటర్వ్యూకు రావాల్సిందిగా సందేశం రావడంతో వచ్చారు. దాదాపు 40నిముషాల పాటు ఇంటర్వ్యూ జరిగిందని, శరణార్థుల కాలనీ సమీపంలో గల పూజారి జారీ చేసిన అర్హతా సర్టిఫికెట్‌తో సహా అన్ని పత్రాలను తీసుకువచ్చానని, అయినా నోటరీతో అటెస్ట్ చేయించాల్సిన అఫిడవిట్ లేదనే కారణంతో తన దరఖాస్తును తిరస్కరించారని లాల్ తెలిపారు. గతంలో ఇలాంటి ప్రయత్నాలకు పూర్తి చేయాల్సిన డాక్యుమెంట్లు చాలా వుండేవని, తాజాగా సిఎఎ వచ్చిన తర్వాత తమ పని సులభమైందని అమర్‌నాథ్ అద్వానీ వ్యాఖ్యానించారు. ఇప్పటివరకు ఏళ్ల తరబడి పెండింగ్‌లో వున్న తమ డిమాండ్ ఇప్పుడు నెరవేరే అవకాశం వచ్చిందన్నారు. దేశంలో కింది స్థాయిల్లో పోస్టల్‌కార్యాలయాలు, రైల్వేలు వున్నందున సిఎఎ అమలుకు ఆ మౌలిక సదుపాయాలను ఉపయోగించుకోవాలని నిర్ణయించినట్లు ప్రభుత్వ సీనియర్ అధికారి తెలిపారు.

భారతదేశ చరిత్ర - సాంస్కృతిక వారసత్వం

తెలంగాణ చరిత్ర - సంస్కృతి - వారసత్వ సంపద

ప్రశ్న 1. తెలంగాణ ప్రాంత చరిత్ర పూర్వయుగానికి సంబంధించి ఈ క్రింది వాటిలో సరికాని వ్యాఖ్యలను గుర్తించండి.
1. ఏలేశ్వరం, ఆసిఫాబాద్, బాసర ప్రాంతాలలో మధ్య శిలాయుగానికి చెందిన కృత్రిమ గృహ ఆనవాళ్ళు లభ్యమయ్యాయి.
2. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రాంతంలో జంతు రూపంతో చేసిన అస్థికల కుండ (సార్కోఫాగస్)లు లభించాయి.
3. మెదక్ జిల్లా రిమ్మనగూడెం ప్రాంతంలో తామ్రశిలాయుగంకు చెందిన రాగి ఖడ్గాలు బయల్పడ్డాయి.
4. నవీన శిలాయుగం పని ముట్లు ఐజా(గద్వాల), కదంబాపూర్(పెద్దపల్లి), చిన్న మారూరు(నాగర్‌కర్నూల్) ప్రాంతాలలో లభించాయి.

ఎ. 1,2 మాత్రమే బి. 1 మాత్రమే
సి. 2 మాత్రమే డి. 2,4 మాత్రమే

ప్రశ్న 2. నాగార్జున కొండలో బయటపడిన సంస్కృతికి సంబంధించి ఈ క్రింది వాటిలో సరికాని వ్యాఖ్యలను గుర్తించండి.
1. బుద్ధుని ధాతువును నిక్షిప్తం చేసిన మహాచైత్యవిహారం బయటపడింది.
2. అష్టభుజస్వామి అనబడే వైష్ణవ దేవాలయం నిర్మించబడింది.
3. రాజు పట్టాభిషేక మహోత్సవ శిల్పం లభించింది.
4. నాగార్జున కొండ ప్రాంతానికి శ్రీ పర్వతం అనే పేరు కూడా ఉంది.

ఎ. 1 మాత్రమే బి. 2 మాత్రమే
సి. 3 మాత్రమే డి. 4 మాత్రమే

ప్రశ్న 3. ఈ క్రింది వాటిలో సరైనవి గుర్తించండి.
1. అస్మక రాజ్యం షోడషమహాజనపదాలకు సంబంధించి దక్షిణాపథంలో ఉన్న ఏకైక రాజ్యం
2. ప్రస్తుత దక్షిణ కర్ణాటక, వాయువ్య తమిళనాడు ప్రాంతాలు అస్మక రాజ్యంలో అంతర్భాగాలు
3. అస్మక రాజ్యం గోదావరి, మంజీర నదీ పరివాహక ప్రాంతాల్లో విలసిల్లింది.
4. బౌద్ధ గ్రంథం అయిన అంగుత్తరనికయలో అస్మక రాజ్యం గురించిన ప్రస్తావన ఉంది.

ఎ. 1,2 మాత్రమే బి. 2,3,4 మాత్రమే
సి.1,3,4 మాత్రమే డి. 1,2,4 మాత్రమే

ప్రశ్న 4. శాతవాహనుల శాసనాల్లో ప్రస్తావించిన వివిధ వృత్తుల వారిని, వారు చేసిన పనులను జతపరచండి.

ఎ.కోలిక	1. నూనె గానుగ ఆడించువాడు
బి.కులారి	2. వ్యవసాయదారుడు
సి.తిల పిష్టక	3. కుమ్మరివాడు
డి.హాలిక	4. నేతపనివాడు

ఎ.ఎ-3, బి-4, సి-2, డి-1 బి. ఎ-4, బి-3, సి-1, డి-2
సి.ఎ-1, బి-3, సి-4, డి-2 డి. ఎ-3, బి-2, సి-4, డి-1

ప్రశ్న 5 ఆలంపూర్‌లో బయటపడిన ప్రాచీన దేవాలయాలకు సంబంధించిన ఈ క్రింది వ్యాఖ్యలలో సరైనవి గుర్తించండి.
1. మొదటి విక్రమాదిత్యుని రాణి శాసనం గరుడ బ్రహ్మేశ్వరాయలంలో లభించింది.
2. ముఖ్యమైన ఆలయాలన్నీ బాదామి చాళుక్యుల కాలంలో నిర్మించబడ్డాయి.
3. ఆలంపూర్ పాశుపతశైవానికి చెందిన పుణ్యక్షేత్రం
4. రాష్ట్ర కూటుల కాలంలో నరసింహ, సూర్యనారాయణ స్వామి ఆలయాలు నిర్మించారు.

ఎ. 1,2,3 మాత్రమే బి. 2,4 మాత్రమే
సి. 3,4 మాత్రమే డి. 1,2,3,4

ప్రశ్న 6. ఈ క్రింద పేర్కొన్న వాటిలో గౌతమ బుద్ధుడు బోధించిన దు:ఖానికి హేతువులను గుర్తించండి.
1. మానవులు అనంతమైన కోరికలు కలిగి ఉండడం
2. మానవులు స్వభావరీత్యా దు:ఖజీవులు
3. మానవులు మనోనిగ్రహం లేకపోవడం

ఎ.1 మాత్రమే బి.2,3 మాత్రమే సి.1,2,3 డి.ఏదీకాదు

ప్రశ్న 7. ఈ క్రింది వాటిని జతపర్చండి.

ఎ.పంపన	1.కుర్క్యాల శాసనం
బి.జనవల్లభుడు	2. కవి జనాశ్రయం
సి. రేచర్ల రుద్రుడు	3. ఆది పురాణం
డి. మల్లియ రేచన	4. రామప్ప దేవాలయం

ఎ.ఎ-4, బి-2, సి-1, డి-3 బి.ఎ-3, బి-1, సి-4, డి-2
సి.ఎ-3, బి-1, సి-4, డి-2 డి.ఎ-2, బి-3, సి-4, డి-1

ప్రశ్న 8. మధ్యయుగ కాలంలో భారతదేశంలోకి విదేశీయుల ద్వారా ప్రవేశపెట్ట బడిన ఆహార పదార్థాలను గుర్తించండి.

1.బంగాళదుంప 2.మిరపకాయలు 3.వేరుశనగ
4.టమాట 5.మొక్కజొన్న

ఎ. 1,2,3 మాత్రమే బి.2,4,5 మాత్రమే
సి.1,2,3,4 మాత్రమే డి.1,2,3,4,5

ప్రశ్న 9. ఢిల్లీ సుల్తానుల కాలానికి సంబంధించి ఈ క్రింది పరిపాలనా విభాగాలను పరిశీలించండి.

1.దివాన్-ఇ-అరిజ్ - సైనికశాఖ
2.దివాన్-ఇ-ఖైరత్ - దేవాదాయ, ధర్మాదాయశాఖ
3.దివాన్-ఇ-రియాసత్ - వ్యాపార, వాణిజ్యాల శాఖ
4.దివాన్-ఇ-ముస్తఖరజ్ - పన్ను చెల్లింపుల శాఖ

పై వాటిలో ఏవేవి సరిగ్గా జత పర్చబడ్డాయి?

ఎ.1 మాత్రమే బి. 1,2,3,4
సి.1,2,3 మాత్రమే డి.2,4 మాత్రమే

ప్రశ్న 10. ఈ క్రింది వ్యాఖ్యలను పరిశీలించి సరికానివి గుర్తించండి.
1. కాకతీయుల తొలి రాజచిహ్నం గరుడ లాంఛనం
2. క్రీడాభిరామం తెలుగులో రాసిన తొలి నాటకం
3. పల్నాటి యుద్ధంలో నలగామ రాజుకు సహాయపడ్డ కాకతీయ రాజు ప్రతాపరుద్రుడు
4. కాకతీయుల కాలంలో నాయంకర విధానాన్ని ప్రవేశపెట్టినది రుద్రమదేవి

ఎ. 1,2 మాత్రమే బి.3,4 మాత్రమే
సి.4 మాత్రమే డి.3 మాత్రమే

ప్రశ్న 11. కాకతీయుల ఆర్థిక వ్యవస్థకు సంబంధించి ఈ క్రింది వ్యాఖ్యలలో సరైనవి గుర్తించండి.
1. వ్యాపార సంఘాలను శ్రేణి లేదా సమయము అని పిలిచేవారు
2. చెరువులను సప్త సంతానాలలో భాగంగా గుర్తించేవారు
3. భూమిశిస్తును ధాన్య రూపంలో చెల్లిస్తే 'పుట్టి కుంచం' అని, ధన రూపంలో చెల్లిస్తే 'పుట్టి మాడలు' అని పిలిచేవారు.
4. చైనా, మధ్య ఆసియా, ఆగ్నేయ ఆసియా, బర్మా, శ్రీలంక దేశాలతో విదేశీ వాణిజ్యం చేసేవారు.

ఎ.1,2,3,4 బి.2,3,4 మాత్రమే
సి.1,3,4 మాత్రమే డి.1,2,4 మాత్రమే

ప్రశ్న 12. క్రింద పేర్కొన్న కడపటి మొగలులను వారి, వారి పాలనా కాలాలను అనుసరించి సరైన వరుస క్రమంలో రాయండి.

1.మొదటి షా ఆలమ్ 2.జహందర్ షా
3.ఫరుక్‌సియార్ 4.మహమ్మద్ షా రంగీలా

ఎ.1,2,3,4 బి.4,3,2,1
సి.3,1,2,4 డి.2,1,4,3

ప్రశ్న 13. ఈ క్రింద పేర్కొన్న వాటిలో విజయనగర సామ్రాజ్యానికి, బహమనీ సుల్తానులకు జరిగిన యుద్ధాలకు గల ప్రధాన కారణాలను గుర్తించండి.
1. కృష్ణా-గోదావరి పరివాహక ప్రాంతాలపై ఆధిపత్యం కోసం
2. కృష్ణా-తుంగభద్ర నదుల మధ్య ప్రాంతాలపై ఆధిపత్యం కోసం
3. మరాఠా ప్రాంతంలోని కొంకణ తీరంపై పట్టుకోసం
4. హిందూ-ముస్లింల మధ్య ఉండే సహజసిద్ధ ఘర్షణలు

ఎ.1,2 మాత్రమే బి.1,2,3 మాత్రమే
సి.2,4 మాత్రమే డి.4 మాత్రమే

ప్రశ్న 14. ఈ క్రింది వాటిని జత పర్చండి

ఎ.కుతుబ్-ఉల్-ముల్క్	1.హైదరాబాద్ నగర ప్రధాన వాస్తుశిల్పి
బి.మహమ్మద్ కులీకుతుబ్‌షా	2.కుతుబ్‌షాహీల వంశమూల పురుషుడు
సి.అబుల్ హసన్ తానీషా	3.హైదరాబాద్ రాజ్యంలో డచ్, ఆంగ్లేయుల స్థావరాల ఏర్పాటు
డి.మీర్‌మొహమ్మద్ మోమీన్ అస్త్రాబాది	4. మొగలు సామ్రాజ్యంలో గోల్కొండ విలీనం

ఎ.ఎ-2, బి-3, సి-4, డి-1 బి.ఎ-1, బి-2, సి-3, డి-4
సి.ఎ-4, బి-2, సి-3, డి-1 డి.ఎ-3, బి-4, సి-2, డి-1

ప్రశ్న 15. ఈ క్రింది వ్యాఖ్యలలో సరికాని దానిని గుర్తించండి
1. హైదరాబాద్ కంటింజెంట్ మిలటరీ దళాల పోషణ కోసం నిజాం ప్రభుత్వం బేరార్ ప్రాంతాన్ని బ్రిటిషు వారికి అప్పగించింది.
2. హైదరాబాద్ రాష్ట్రంలో పర్షియన్ స్థానంలో ఉర్దూ అధికార భాషగా ప్రవేశపెట్టిన సంవత్సరం 1884
3. హైదరాబాద్ స్వదేశీలీగ్‌ను స్థాపించినది సరోజినినాయుడు
4. నిజాంకాలేజ్ పూర్వనామం జాగిర్దార్ కాలేజ్

ఎ.1,2 మాత్రమే బి.1,3 మాత్రమే
సి.2,4 మాత్రమే బి.3,4 మాత్రమే

ప్రశ్న:16. సహాయ నిరాకరణ ఉద్యమం(1920)కి సంబంధించి ఈ క్రింది వాటిలో సరికాని వ్యాఖ్యలను గుర్తించండి.
1. జలియన్‌వాలాబాగ్ ఉదంతం తర్వాత గాంధీ తన కైసర్-ఎ-హింద్ బిరుదును వదులుకున్నాడు
2. జామియా మిలియా, కాశీ విద్యాపీఠం వంటి జాతీయ విద్యా సంస్థలు స్థాపించబడ్డాయి.
3. మహమ్మద్ ఆలీ జిన్నా, సురేంద్రనాథ్ బెనర్జీ వంటి అనేక మంది న్యాయవాదులు వారి, వారి వృత్తులను త్యజించారు.
4. భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ తోట పరిశ్రమ యాజమాన్య సంఘాలకు మద్దతు తెలిపిన కారణంగా తోట పరిశ్రమల కార్మికులు ఉద్యమంలో పాల్గొన లేదు.

ఎ.1,2 మాత్రమే బి.2,3 మాత్రమే
సి.3,4 మాత్రమే డి.2,4 మాత్రమే

ప్రశ్న 17. భారత జాతీయ కాంగ్రెస్ 1931వ సంవత్సరం కరాచీలో నిర్వహించిన సమావేశానికి సంబంధించి సరైన వ్యాఖ్యలను గుర్తించండి.

1.సమావేశానికి సర్దార్ వల్లభాయ్ పటేల్ అధ్యక్షత వహించారు.
2.జాతీయ ఆర్థిక ప్రణాళిక, ప్రాథమిక హక్కులు అనే రెండు కీలక అంశాలపై తీర్మానాలు చేసారు.

ఎ.1 మాత్రమే బి. 2 మాత్రమే
సి.1,2 మాత్రమే డి. రెండూ సరైనవి కావు

ప్రశ్న 18. భారతదేశంలో నెలకొన్న పరిశ్రమలకు సంబంధించి ఈ క్రింద పేర్కొన్న వ్యాఖ్యలలో సరైన దానిని గుర్తించండి.
1. మొదటి చక్కెర పరిశ్రమ 1903 సం॥లో బెంగాల్‌లోని రిష్రా ప్రాంతంలో నెలకొల్పారు.
2. మొదటి నూలు పరిశ్రమ 1854 సం॥లో కోవాస్‌జీ నానాభాయ్ దబేర్ ద్వారా బొంబాయిలో నెలకొల్పబడింది.
3. రెండవ ప్రపంచయుద్ధ ప్రారంభం నాటికి జె.ఎన్.టాటా స్థాపించిన TISCO బ్రిటిష్ సామ్రాజ్యంలో అతిపెద్ద స్టీల్ పరిశ్రమగా అభివృద్ధి చెందింది.

ఎ.1,2 మాత్రమే బి.2,3 మాత్రమే
సి.1,3 మాత్రమే డి.1,2,3 మాత్రమే

ప్రశ్న 19. ఇల్బర్ట్ బిల్ వివాదానికి సంబంధించి ఈక్రింది వ్యాఖ్యలలో సరైన దానిని గుర్తించండి.
1. లార్డ్ రిపన్ కాలంలో వైస్రాయ్ కౌన్సిల్‌లోని లామెంబర్ అయిన సర్ సి.పి.ఇల్బర్ట్ ఈ బిల్‌ను ప్రవేశపెట్టాడు.
2. ఈ అంశంపై లార్డ్ రిపన్‌కు బ్రిటిష్ మహరాణి మద్దతు లభించింది.
3. బిల్‌కు చేసిన సవరణ ప్రకారం భారతీయ జడ్జిలు యూరోపియన్‌లను విచారించాలంటే 50శాతం యూరోపియన్ జ్యూరీ సభ్యుల మద్దతు అవసరం

ఎ.1,3 మాత్రమే సి.1 మాత్రమే
సి.1,2,3 మాత్రమే డి.1,2 మాత్రమే

ప్రశ్న 20.భారత జాతీయ ఉద్యమానికి సంబంధించి ఈ క్రింది వ్యాఖ్యలలో సరైన దానిని గుర్తించండి.
1. దేశంలో ప్రజాస్వామ్య విలువలు, వ్యవస్థలకు జాతీయ ఉద్యమం ప్రాచుర్యం కల్పించింది.
2. ప్రజాస్వామ్య సిద్ధాంతాల భూమికగా నిర్మితమైన పార్లమెంటరీ తరహా విధానాలను భారత జాతీయ కాంగ్రెస్ సమర్థించింది.
3. జాతీయ ఉద్యమం కేవలం స్వాతంత్ర్యం కోసమే కాకుండా ఆర్థిక అభివృద్ధి కోసం కూడా జరిగిన ఉద్యమం
4. విభిన్న రాజకీయ సిద్ధాంతాలు కలిగిన వారి హక్కులకై పోరాడడంలో జాతీయ ఉద్యమం విఫలమైంది.

ఎ.1,2,3,4 బి.1,2,4 మాత్రమే
సి.1,3,4 మాత్రమే డి.1,2,3 మాత్రమే

21.తెలంగాణ సాయుధ పోరాటానికి సంబంధించి ఈక్రింది వ్యాఖ్యలలో సరైనవి గుర్తించండి.
1. 'నిజాం రాజ్యం ప్రజల బంధిఖానా' అని వ్యాఖ్యానించింది మఖ్దూం మొహియిద్దీన్
2. 'మా నిజాం రాజు తరతరాల బూజు' అని దాశరథి కృష్ణమాచార్యులు నినదించారు
3. 'బండెనక బండి కట్టి' పాట రచయిత బండి యాదగిరి
4. 'తెలంగాణ' అనే ఉర్దూ కవిత రాసిన వ్యక్తి నవాబ్ తురబ్ యార్ జింగ్

ఎ.1,2 మాత్రమే బి.1,2,3 మాత్రమే
సి.3 మాత్రమే డి.3,4 మాత్రమే

ప్రశ్న:22. ఈక్రింది వాటిలో సరికాని వ్యాఖ్యలను గుర్తించండి
1. నిజాం రాజ్యంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరిపేందుకు జవహర్‌లాల్ నెహ్రూ స్వయంగా త్రివర్ణ పతకాన్ని రావినారాయణరెడ్డికి అందజేశారు.
2. భారత ప్రభుత్వం నిజాం ప్రభువును రాజ్‌ప్రముఖ్ పదవితో సత్కరించింది.
3. భూదాన ఉద్యమాన్ని వినోబాభావే ప్రారంభించారు.
4. ఆంగ్లేయులు భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు మద్దతునిచ్చారు.

ఎ.1,4 మాత్రమే బి.2,3 మాత్రమే
సి.1,2 మాత్రమే డి.2,4 మాత్రమే

ప్రశ్న:23. ఈక్రింది వాటిని జతపర్చండి

ఎ.కొండపల్లి సీతారామయ్య	1.పిలుపు పత్రిక
బి.సురవరం ప్రతాపరెడ్డి	2.హైదరాబాద్ పత్రిక
సి.పెండ్యాల వరవరరావు	3.గోల్కొండ పత్రిక
డి.మాడపాటి రామచంద్రరావు	4.సృజన పత్రిక

ఎ.ఎ-4, బి-3, సి-2, డి-1 బి.ఎ-1, బి-3, సి-4, డి-2
సి.ఎ-1, బి-2, సి-3, డి-4 డి.ఎ-4, బి-3, సి-2, డి-1

ప్రశ్న:24. తెలంగాణ సంస్కృతికి సంబంధించి ఈ క్రింది వ్యాఖ్యలలో సరైనవి గుర్తించండి
1. బతుకమ్మ పండుగను ఆషాడ మాసంలో జరుపుకుంటారు.
2. తుల్జా భవాని జాతరను ప్రధానంగా గోండులు జరుపుకుంటారు.
3. స్త్రీలు చేసే పేరిణి నృత్యాన్ని 'లాస్యం' అంటారు.
4.'యక్షగానం' అనేది ఒక సంగీత వాయిద్యం

ఎ.1 మాత్రమే బి.2 మాత్రమే సి. 3 మాత్రమే డి. 4 మాత్రమే

ప్రశ్న:25. తెలంగాణ ఉద్యమానికి సంబంధించి ఈ క్రింద పేర్కొన్న ఘటనలు, సంస్థల ఏర్పాటును కాలానుక్రమ పద్ధతిలో పేర్చండి

1. KTPS ఆందోళన 2.తెలంగాణ రాష్ట్ర సమితి ఏర్పాటు
3. 'ఓ.యు.ఫోరం ఫర్ తెలంగాణ' ఆవిర్భావం
4. 'తెలంగాణ జన సభ' ఏర్పాటు 5. 'తెలంగాణ ముక్తి మోర్చ' ఏర్పాటు

ఎ.1,2,3,4,5 బి.1,4,3,2,5
సి.5,4,3,2,1 డి.1,4,3,5,2




జి.రామ్‌ధన్
9949122100
అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ హిస్టరి
తెలంగాణ సారస్వత పరిషత్ ఓరియంటల్ కళాశాల

సమాధానాలు

1.సి	2.సి	3.సి	4.బి	5.డి
6.ఎ	7.బి	8.డి	9.బి	10.డి
11.ఎ	12.ఎ	13.బి	14.ఎ	15.డి
16.సి	17.సి	18.బి	19.ఎ	20.డి
21.బి	22.ఎ	23.బి	24.సి	25.డి

రెండవ ప్రపంచ యుద్ధంలో జపాన్ ఓటమితో, ఆయన మార్గం సుగమమైంది. అదే సమయంలో ఉత్తర ప్రాంతం వియత్నాంను గెరిల్లా సైన్యంతో హస్తగతం చేసుకుని హోచిమిన్ "డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ వియత్నాం" గా ప్రకటించాడు. అయితే ఫ్రెంచ్ తన వలస పాలనను వదులుకోవడానికి సిద్ధంగా లేదు. సుమారు ఎనిమిదేండ్ల సుదీర్ఘ పోరాటం చేసి ఉత్తర ప్రాంతం మీద మాత్రమే పూర్తి పట్టు సాధించగలిగాడు. అదే సమయంలో దక్షిణ వియత్నాంలో అమెరికా సహకారంతో నడుస్తున్న ప్రభుత్వంపై అక్కడ ప్రాంత ప్రజలు తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. దానికి హోచిమిన్ పూర్తి నాయకత్వం వహించి సహాయ సహకారలందించాడు. ఆయన స్ఫూర్తితో పనిచేసిన నేతలు అమెరికా సామ్రాజ్యవాదాన్ని కూకటివేళ్లతో పెకలించి "ఐక్య వియత్నాం" అనగా నేటి ఆధునిక వియత్నాం ఆవిర్భావాన్ని 1975లో సాధించారు


ఆధునిక వియత్నాం విప్లవ నిర్మాత 'హోచిమిన్'



ఐ.ప్రసాదరావు
6305682733

చిన్న దేశమైన వియత్నాం, ప్రపంచ అగ్ర దేశాన్ని అమెరికాను గడగడలాడించిన వైనం సుమారు ఐదు దశాబ్దాలైనా నేటికీ అందరూ మరువలేకపోవడం వెనుక ఆ దేశ సైద్ధాంతిక నిబద్ధత, నాయకుని ప్రతిభాపాటవాలే.ఆ నాయకుడే హోచిమిన్. నేడు ఆయన జయంతి సందర్భంగా వియత్నం కోసం చేసిన పోరాటాన్ని స్మరించుకుందాం. హోచిమిన్ అనగా ప్రకాశవంతమైనవాడు అని అర్థం. నిజంగా ఈరోజు వియత్నాం అన్ని విధాలుగా ప్రకాశిస్తూ ఉండటానికి కారణం హోచిమిన్ దార్శనికతే...1890, మే 19న జన్మించిన హోచిమిన్ వ్యక్తిగత జీవితంకంటే విప్లవ జీవితాన్నే కోరుకున్న యోధుడు. 16వ శతాబ్దంవరకూ ఒక వెలుగు వెలిగిన వియత్నాం దేశం, ఆతర్వాత కాలంలో అంతర్యుద్ధాలు, రాజకీయ అస్థిరత్వంతో కాలం వెలిబుచ్చుతూ, చివరికి 1894 నాటికి ఫ్రెంచ్ వలస ప్రాంతంగా మారింది. తరుపరి మూడు ముక్కలు చేసారు. వీరి పాలనలో విసుగు చెందిన వియత్నామీలు అసంతృప్తితో వ్యతిరేక ఉద్యమాలు ఫ్రెంచ్ పాలకులపై సంధించారు. మొదటి ప్రపంచ యుద్ధానంతరం హోచిమిన్ ఫ్రెంచ్ కమ్యూనిస్టు పార్టీ స్థాపనలో పాలు పంచుకున్నాడు. అప్పటికే లెనిన్ భావజాలం అందిపుచ్చుకున్న హోచిమిన్ తన సొంత దేశంలో ఫ్రెంచ్, జపాన్ పాలనకు చరమగీతం పాడాలని నిర్ణయించుకుని, తగిన సమయం కోసం ఎదురు చూడసాగాడు.

రెండవ ప్రపంచ యుద్ధంలో జపాన్ ఓటమితో, ఆయన మార్గం సుగమమైంది. అదే సమయంలో ఉత్తర ప్రాంతం వియత్నాంను గెరిల్లా సైన్యంతో హస్తగతం చేసుకుని హోచిమిన్ "డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ వియత్నాం" గా ప్రకటించాడు. అయితే ఫ్రెంచ్ తన వలస పాలనను వదులుకోవడానికి సిద్ధంగా లేదు. సుమారు ఎనిమిదేండ్ల సుదీర్ఘ పోరాటం చేసి ఉత్తర ప్రాంతం మీద మాత్రమే పూర్తి పట్టు సాధించగలిగాడు. అదే సమయంలో దక్షిణ వియత్నాంలో అమెరికా సహకారంతో నడుస్తున్న ప్రభుత్వంపై అక్కడ ప్రాంత ప్రజలు తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. దానికి హోచిమిన్ పూర్తి నాయకత్వం వహించి సహాయ సహకారలందించాడు. ఆయన స్ఫూర్తితో పనిచేసిన నేతలు అమెరికా సామ్రాజ్యవాదాన్ని కూకటివేళ్లతో పెకలించి "ఐక్య వియత్నాం" అనగా నేటి ఆధునిక వియత్నాం ఆవిర్భావాన్ని 1975లో



సాధించారు. నేడు అనేక రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ, సోషలిజానికి మారుపేరుగా ఈ అవనిలో నేడు ప్రకాశిస్తూ అందరూ ఆశ్చర్యపోయేలా అడుగులు ముందుకు వేస్తుంది ఆ దేశం. కరోనా కాలంలో అమెరికాతో సహా పలు అభివృద్ధి చెందిన దేశాలు అతలాకుతలమై, ప్రాణనష్టంతోపాటు ఆర్థిక నష్టం చవిచూడగా, గణాంకాల ప్రకారం ఒక్క కరోనా మరణం సంభవించకుండా ప్రపంచపటంలో ప్రకాశించడానికి కారణం హోచిమిన్ అందించిన సోషలిస్టు సైద్ధాంతిక పాలన. ఆయన దృష్టిలో సోషలిజం అనగా "ప్రజలతో మమేకం కావడం, ప్రజల అభిప్రాయాలను గౌరవించడం, ప్రజలకు ప్రభుత్వంపై నమ్మకం కలిగించడం".... ఇటువంటి భరోసా ఇచ్చే దేశాలను చేతివేళ్లతో లెక్కించవచ్చు... అవికూడా ఈ సిద్ధాంతం ఆధారంగా నడిచే దేశాలే..

చదువుకున్న సమయం నుంచి మార్క్సిస్ట్ భావాలను మస్తిష్కంలో ముద్రించుకున్న హోచిమిన్ తన జీవితాంతం ఆ ఆశయం సాధనకై పరితపించాడు. ఏజెంట్ ఆరెంజ్ విషప్రయోగం చేస్తూ వియత్నాం పోరాట యోధులను ఏరిపారేద్దామనుకున్న అమెరికా సామ్రాజ్యవాద విస్తరణను, అమెరికాలో తన సొంత దేశంలోనే ఆనాటి ప్రభుత్వంపై విమర్శలు ఎదుర్కొనేటట్లు చేసాడు. చివరికి తన దేశాన్ని పరాయిపాలన నుంచి 1975లో పూర్తిగా విముక్తి కలిగించాడు. ఆ పోరాటం వెనుక హోచిమిన్ దార్శనికత ఉన్నదనేది వాస్తవం... అయితే ఈనాటికీ అభివృద్ధి చెందుతున్న దేశాలపై, అభివృద్ధి చెందిన దేశాలు అనేకరకాల అణచివేతలను, ఆంక్షలు విధిస్తూ వారి చెప్పుచేతల్లో ఉంచుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. స్వతంత్ర దేశమైన పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధానికి అన్ని విధాలా సహకరిస్తున్నది అమెరికాయేనని జగమెరిగిన సత్యం. ఉక్రెయిన్-రష్యా పోరులో కూడా అమెరికా నాటోతో కుట్ర చేస్తున్నది. దానికి అడ్డుకట్ట వేసేందుకు ప్రజలు ఉద్యమాలు చేయాలి. అయితే ప్రపంచంలో మతసామరస్యాన్ని పెంపొందించడంతో పాటు ఆ దేశాల హక్కులు, సార్వభౌమాధికారాన్ని అందరూ గౌరవించాలి. ఐక్యరాజ్యసమితి కూడా అందరి ఎడల సమభావం కలిగి, తన స్వయం ప్రతిపత్తి కాపాడుకోవాలి. ఏ ఉద్దేశంతో ఐక్యరాజ్యసమితి ఏర్పడిందో ఆ ఆశయాలు సాధనలో ముందుకు సాగాలి. అందరి మన్ననలు పొందాలి. అమెరికా యుద్ధతంత్రాన్ని నిలువరించాలి. అమెరికాపై అలు పెరగని పోరాటం చేసిన విప్లవకారుడు హోచిమిన్. సోషలిస్టు భావాలతో తన జీవిత ప్రయాణం నేటి ప్రజానికానికి ఎంతో స్ఫూర్తిదాయకం.

(నేడు హోచిమిన్ 134వ జయంతి)

దేశ సంస్కృతికి భాండాగారాలు.. మ్యూజియాలు...



డి. జనక మోహన రావు
8247045230

నిర్దిష్ట కాల వ్యవధిలో దేశం సంస్కృతి, వారసత్వ అభివృద్ధికి మ్యూజియాలు రుజువులుగా ఉంటాయి. ఇవి ఒక దేశ సంస్కృతికి భాండాగారం లాంటివి. అసలు మ్యూజియమంటే ముందు తెలుసుకోవాలి. 24 ఆగస్టు 2022న హేగ్ నగరంలో ఉన్న అంతర్జాతీయ మ్యూజియం కౌన్సిల్ (ఐకాం - ఐసిఒయం) సాధారణ సభ 92.41శాతంతో కొత్త మ్యూజియం నిర్వచనాన్ని తెలిపింది. సమాజ సేవలో పరిశోధిస్తూ, సేకరిస్తూ, పరిరక్షిస్తూ, అర్థం చేసుకుంటూ ప్రత్యక్షమైన కనిపించని వారసత్వాన్ని ప్రదర్శించే లాభాపేక్ష లేని శాశ్వత సంస్థను మ్యూజియం అంటారు. 1946లో స్థాపించబడిన ఐకాం తన అంతర్జాతీయ ప్రజాసేవా కార్యక్రమాలను నిర్వహించడానికి ప్రపంచ మేధో సంపత్తి సంస్థ, ఇంటర్‌పోల్, ప్రపంచ కస్టమ్స్ సంస్థ వంటి సంస్థలతో సంబంధాలున్నాయి. ఇందులో సాంస్కృతిక వస్తువులు, అక్రమ రవాణాపై పోరాటం, సహజ లేదా మానవ నిర్మిత విపత్తుల సందర్భంలో ప్రపంచ సాంస్కృతిక వారసత్వాన్ని రక్షించడం, ప్రమాద నిర్వహణ అత్యవసర సంసిద్ధతను ప్రోత్సహించడం లాంటివి ఉన్నాయి. ఐకాం సాంస్కృతిక మార్పిడి, అభివృద్ధిలో మ్యూజియంల పాత్రను ప్రోత్సహించడానికి ప్రపంచ వేదికగా పనిచేస్తుంది. ఇది మ్యూజియాలకు అంకితం చేయబడిన ఒక ప్రభుత్వేతర సంస్థ. యునెస్కోతో అధికారిక సంబంధాలను కొనసాగిస్తుంది. యునైటెడ్ నేషన్స్ ఎకనామిక్ అండ్ సోషల్ కౌన్సిల్‌తో సంప్రదింపుల హోదాను కలిగి ఉంది.



అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం

అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం ఐకాం ద్వారా స్థాపించబడింది. ప్రతి ఏడాది మే 18న దీనిని జరుపుకుంటారు. సమాజంలో మ్యూజియంల పాత్రను ప్రోత్సహించడానికి ఐకాం 1977లో ఈ దినోత్సవాన్ని ఏర్పాటు చేసింది. మ్యూజియంలు సమాజానికి ఎలా దోహదపడతాయనే దానిపై అవగాహన కల్పించడం, సాంస్కృతిక మార్పిడి, వైవిధ్యం, సమగ్రతను ప్రోత్సహించడం అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవాన్ని జరుపుకోవడం దీని ఉద్దేశ్యం. విద్య, ఆనందం, జ్ఞాన భాగస్వామ్యం కోసం నైతికంగా, వృత్తిపరంగా విభిన్న అనుభవాలను అందిస్తూ సమాజం భాగస్వామ్యంతో పనిచేస్తాయి.సంస్కృతి మార్పిడికి, సంస్కృతుల సుసంపన్నతకు, ప్రజల మధ్య పరస్పర అవగాహన, సహకారం, శాంతిని పెంపొందించడానికి మ్యూజియాలు ఒక ముఖ్యమైన సాధనం. ఈ అంశాలపై అవగాహన పెంచడమే అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం లక్ష్యం. 2024 థీమ్ "మ్యూజియమ్స్ ఫర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ - విద్య, పరిశోధనల కోసం మ్యూజియంలు". అంతర్జాతీయంగా మ్యూజియాలు ఎదుర్కొంటున్న సంబంధిత థీమ్ లేదా సమస్యను ప్రతిబింబించేలా ప్రతి ఏడాది మారుతున్న నిర్దిష్ట థీమ్‌ను ఈవెంట్ హైలైట్ చేస్తుంది. ఈ రోజున మ్యూజియం నిపుణులు ప్రజలను కలుసుకోవడానికి, మ్యూజియంలు ఎదుర్కొనే సవాళ్ల గురించి వారిని అప్రమత్తం చేయడానికి, సమాజ అభివృద్ధిలో మ్యూజియంలు పోషించే పాత్రపై ప్రజలకు అవగాహన కల్పించడానికి అవకాశాన్ని కల్పిస్తుంది.

అంతర్జాతీయంగా మ్యూజియాలు ఎదుర్కొంటున్న సంబంధిత థీమ్ లేదా సమస్యను ప్రతిబింబించేలా ప్రతి ఏడాది మారుతున్న నిర్దిష్ట థీమ్‌ను ఈవెంట్ హైలైట్ చేస్తుంది. ఈ రోజున మ్యూజియం నిపుణులు ప్రజలను కలుసుకోవడానికి, మ్యూజియంలు ఎదుర్కొనే సవాళ్ల గురించి వారిని అప్రమత్తం చేయడానికి, సమాజ అభివృద్ధిలో మ్యూజియంలు పోషించే పాత్రపై ప్రజలకు అవగాహన కల్పించడానికి అవకాశాన్ని కల్పిస్తుంది.

ప్రపంచవ్యాప్తంగా అంచనా వేసిన మొత్తం మ్యూజియంల సంఖ్య దాదాపు 1,04,000. కాపిటోలిన్ మ్యూజియం బహుశా ప్రపంచంలోని పురాతన మ్యూజియం. ఇది క్రీ.పూ1471 లో ఇటలీలో స్థాపించబడింది. మ్యూజియంలు శాస్త్రీయ చారిత్రక ప్రాముఖ్యత కలిగిన ముఖ్యమైన వస్తువులను కలిగి ఉంటాయి. గతాన్ని అధ్యయనం చేయడానికి ముఖ్యమైన మూలాధారాలుగా పనిచేస్తాయి.ఇండియాలో మన గతాన్ని మనం తెలుసుకునేలా చేయడం ద్వారా మన సమాజ అభివృద్ధిలో మ్యూజియంలు గణనీయమైన పాత్ర పోషిస్తాయనేది అందరికీ తెలిసిన విషయమే. భారతదేశం ఈ కోణంలో దాదాపు 5వేల ఏండ్ల చరిత్రలో దాదాపుగా విడదీయని సాంస్కృతిక సంప్రదాయాన్ని కలిగి ఉండటం ఎంతో గొప్ప విషయం. కోల్‌కతాలోని ఇండియన్ మ్యూజియం భారతదేశంలోని పురాతన, అతిపెద్ద మ్యూజియం. ఇది 1814లో స్థాపించబడింది. ఇది భారతదేశంలోని పశ్చిమ బెంగాల్‌లో ఉంది. ఇది శిలాజాలు, ఆభరణాలు, పురాతన వస్తువులు, కవచం, పెయింటింగ్‌ల సేకరణను కలిగి ఉంది. ఇది ఆర్ట్, ఆర్కియాలజీ, ఆంత్రోపాలజీ, జియాలజీ, జువాలజీ, ఎకనామిక్ బోటనీ అనే ఆరు విభాగాలను కలిగి ఉంటుంది. ఏప్రిల్ 20, 2024 నాటికి భారతదేశంలో మొత్తం 14201 మ్యూజియంలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 32,తెలంగాణలో 36 మ్యూజియంలు ఉన్నాయి. వీటిలో కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలోని మ్యూజియంలు, జిల్లా స్థాయి మ్యూజియంలు, విశ్వవిద్యాలయాల పరిధిలోని మ్యూజియంలు అలాగే అనేక ప్రయివేటు మ్యూజియంలు కూడా ఉన్నాయి. భారతదేశంలోని పశ్చిమ బెంగాల్‌లోని సెంట్రల్ కోల్‌కతాలో ఒక భారీ మ్యూజియం. స్వాతంత్ర్యానికి ముందు ఇంపీరియల్ మ్యూజియం ఆఫ్ కలకత్తా అని పిలిచేవారు. ఇది ప్రపంచంలోని తొమ్మిదవ పురాతన మ్యూజియం. అంతేకాక సేకరణ పరిమాణం ప్రకారం భారతదేశం, ఆసియాలో పురాతన అతిపెద్ద మ్యూజియం.

సాంస్కృతిక శాఖ - మ్యూజియంలు

సంస్కృతి మంత్రిత్వ శాఖ ముఖ్యమైన లక్ష్యాలలో ఒకటి దేశంలోని మ్యూజియంల అభివృద్ధి,అప్‌గ్రేడేషన్. దేశంలోని మ్యూజియంలను బలోపేతం చేయడం సాంస్కృతిక మంత్రిత్వ శాఖ పరిధిలోని ఒక ముఖ్యమైన కార్యకలాపం. నేషనల్ మ్యూజియం-న్యూఢిల్లీ, ఇండియన్ మ్యూజియం, విక్టోరియా మెమోరియల్ హాల్-కోల్‌కతా, సాలార్ జంగ్ మ్యూజియం- హైదరాబాద్, అలహాబాద్ మ్యూజియం, ఇందిరా గాంధీ రాష్ట్రీయ మానవ్ సంగ్రహాలయ్ భోపాల్, మూడు నేషనల్ గ్యాలరీస్ ఆఫ్ మోడరన్ వంటివి భారతదేశంలోని కొన్ని ముఖ్యమైన మ్యూజియంలు. న్యూఢిల్లీ, ముంబై, బెంగళూరులోనివి వివిధ హోదాల్లో సాంస్కృతిక మంత్రిత్వ శాఖ నియంత్రణలో పనిచేస్తాయి.ఇవే కాకుండా, పురావస్తు సర్వే ఆఫ్ ఇండియా దేశంలోని ముఖ్యమైన పురావస్తు ప్రదేశాలకు సమీపంలో 44 ప్రదేశాలలో సైట్ మ్యూజియంలను కలిగి ఉంది.

మ్యూజియం సేకరణల డిజిటలైజేషన్

మ్యూజియం నిర్వహణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకోవడం, ఈ మ్యూజియంల సేకరణలను ప్రజలకు మరింత చేరువ చేయడం ద్వారా వాటిని అందుబాటులో ఉంచాలి. సాంస్కృతిక మంత్రిత్వ శాఖ తన ఆధ్వర్యంలోని మ్యూజియంల సేకరణల డిజిటలైజేషన్ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను ప్రారంభించింది. ఇంటర్నెట్ ద్వారా ఆన్‌లైన్ వీక్షణ కొరకు "జతన్" అనే సాఫ్ట్‌వేర్‌ను తయారుచేసింది.మొదటి దశలో నేషనల్ మ్యూజియం, న్యూఢిల్లీ ఇండియన్ మ్యూజియం, కోల్‌కతా విక్టోరియా మెమోరియల్ హాల్ కోల్‌కతా, నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడరన్ ఆర్ట్ న్యూఢిల్లీ, నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడరన్ ఆర్ట్ ముంబై, నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడరన్ ఆర్ట్ బెంగళూరు, మ్యూజియం అలహాబాద్, సాలార్ జంగ్ మ్యూజియం హైదరాబాద్, నాగార్జునకొండ మ్యూజియం, గోవా మ్యూజియంలు ఉన్నాయి. పౌరులు డిజిటల్ రిపోజిటరీ ద్వారా సమాచారాన్ని యాక్సెస్ చేయవచ్చు. మ్యూజియం గురించి వివరణ కళాఖండాల కాలక్రమం విజువలైజేషన్ ప్రదర్శనల వర్చువల్ గ్యాలరీ కొరకు మ్యూజియమ్స్ ఆఫ్ ఇండియా మొబైల్ యాప్ అందుబాటులో ఉంటుంది.